
రాబందుల రాజ్యం
అడపా చిరంజీవి

# రాబందుల రాజ్యం

రచన
**అడపా చిరంజీవి**
9989043117

రచయిత చిరునామా:
**అడపా చిరంజీవి**
302, శ్రీసాయి నివాస్, ప్లాట్ నెం. 4,
ఎల్.ఐ.సి. కాలనీ, శ్రీనగర్ కాలనీ పోస్ట్,
హైద్రాబాద్-73.

మొదటి ముద్రణ: **అక్టోబర్, 1988**
e-book (kinige.com): July, 2014

© సర్వహక్కులు రచయితవి

కవర్ డిజైన్: **యం. స్వామినాథ్**, 9246565264

బుక్ వర్క్: **ముమ్మడి హరి ప్రసాద్**

వెల: **75/-**



**శ్రీకృష్ణదేవరాయ పబ్లికేషన్స్,**
302, శ్రీసాయి నివాస్, ప్లాట్ నెం. 4,
ఎల్.ఐ.సి. కాలనీ, శ్రీనగర్ కాలనీ పోస్ట్,
హైద్రాబాద్-73.

# అడపా చిరంజీవి - రచనలు

1. **గాలబంగ్లా**

   (జ్యోతిచిత్ర వారపత్రిక సినిమా నవలల పోటీలో ఉత్తమ ద్వితీయ బహుమతి రూ. 2,500/- గెలుపొందిన రచన)

2. **ట్రంప్ కార్డ్**

3. **మృత్యుసింహాసనం**

   (ఆంధ్రభూమి వారపత్రిక నవలల పోటీలో కన్సోలేషన్ బహుమతి రూ. 2,500/- గెలుపొందిన అడ్వెంచరస్ థ్రిల్లర్ నవల)

4. **హవేలి**

   (ప్రియదత్త వారపత్రిక సీరియల్)

5. **మృతసంజీవిని**

   (ఉదయం దినపత్రిక సీరియల్)

6. **యమడేంజర్**

   (ఆంధ్రభూమి దినపత్రిక సీరియల్)

7. **ఆఖరి క్షణం**

   (ఆంధ్రభూమి దినపత్రిక సీరియల్)

8. **మరణ ముహూర్తం**

   (ఆంధ్రభూమి దినపత్రిక సీరియల్)

9. **ప్రేమపోరాటం**

   (ఆంధ్రభూమి దినపత్రిక సీరియల్)

10. **నిశాచరుడు**

11. రాబందుల రాజ్యం
12. సహస్రాక్షుడు
13. మరణ సరిహద్దు
14. దోషి
15. క్షణమొక యుగం
16. చీకటి కళ్ళు
17. యమధర్మం
18. కింజోలి
19. యమపాశం
20. ది జంగిల్
21. ప్రవరాఖ్యుడు
22. మేరానామ్ జోకర్
    (హాస్యకథా మణిహారం)
23. వనరాణితో రేరాజు
    (శృంగార కథామంజరి)
24. ఈకథకు ముగింపు లేదు
    (కరుణ రస కథామాలిక)
25. దెయ్యాలతో దెబ్బలాట
    (భయానక రస కథాజగత్తు)
26. కపాలదుర్గం
    (చిన్నారిలోకం మాసపత్రిక సీరియల్)
27. వజ్రాల దీవి

# రాబందుల రాజ్యం

## ఆరంభం

దూరదర్శన్,

హైద్రాబాద్ కేంద్రం.

వార్తల సమయం: గం॥ 7-30

నేటి వార్తలలోని ముఖ్యాంశాలు.

దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంఘం (సార్క్) శిఖరాగ్ర సమావేశాల్లో భారత ప్రధాని శ్రీ రాజీవ్‌గాంధీ ప్రముఖంగా చెప్పిన కొన్ని కీలకమైన అంశాలు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలనీ, మహిళల పట్ల వివక్ష చూపరాదనీ, వారి అభ్యుదయానికి అవసరమైన చర్యలు తీసుకోవాలనీ, సార్క్ ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దాలని ప్రధాని పిలుపునిచ్చారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా దక్షిణాసియా ప్రాంతంలోని ప్రధాన సమస్యలలో ఒకటనీ, 1989వ సంవత్సరాన్ని మాదక ద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టే సంవత్సరంగా పరిగణించనున్నట్లు శ్రీ రాజీవ్‌గాంధీ అన్నారు. దీనికి సార్క్ సభ్యదేశాలైన ఇండియా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, భూటాన్, నేపాల్, మాల్దీవులు ఒక ఒప్పందానికి వచ్చాయి.

ఇదిలా ఉండగా మన రాష్ట్ర హెూం మంత్రి శ్రీరాజరాజ నరేంద్రుడు నిన్నటి రాత్రి అత్యంత సాహసంతో ఒక మాఫియా ముఠా నాయకుణ్ణి పట్టుకొని గణుతికెక్కారు. హెూంమంత్రి నిన్న రాత్రి తన ఎస్టేట్ నుంచి తిరిగి వస్తుండగా సరిగ్గా రాత్రి ఎనిమిది గంటల సమయంలో సిటీ లిమిట్స్‌లో అడ్డదోవల్లో పొలాలకు అడ్డంపడివచ్చిన ఒక లారీ మెయిన్‌రోడ్ ఎక్కి హెూంమంత్రి రోల్స్‌రాయిస్ కారును దాటుకుని పోయింది. ఆ సమయంలో లారీ నుంచి పడిన ఓ పేకెట్ హెూంమంత్రి దృష్టిని ఆకర్షించింది. అనుమాన నివృత్తి కోసం కారు దిగిన హెూంమంత్రి ఆ పేకెట్ పరిశీలించగా ఆ పాలిథీన్ పేక్‌లోంచి 'గంజాయి మొక్క' పూలు, ఆకులు, కొమ్మలు, ఇతర భాగాలు బయటపడ్డాయి.

వెను వెంటనే హెూంమంత్రి పబ్లిక్ టెలీఫోను బూత్ ద్వారా పోలీస్ డిపార్టుమెంటుని సమాయత్తం చేసి, ఆ లారీ నెంబర్ చెప్పి, దాన్ని పట్టుకోమని, మరికొందర్ని తానున్న ప్రదేశానికి రమ్మని తానే స్వయంగా ఆ అడ్డదోవల్లో పొలాలకు అడ్డంపడి వెళ్లి 'గంజాయి' పండించే పొలాన్ని పరిశోధించి గూఢచారిలా అత్యంత సాహసంతో తెలుసుకున్నారు శ్రీ రాజరాజ నరేంద్రుడు.

ఈలోగా పోలీసులు అక్కడికి రావడం, ఏభై ఎకరాల్లో రహస్యంగా పండిస్తున్న పదికోట్ల రూపాయల విలువ చేసే గంజాయి పంటను ఎక్సైజు అధికారుల స్వాధీనం చేయడం జరిగింది. గంజాయి పంట రహస్యంగా పండిస్తూ అస్సాం రాష్ట్ర ముఖ్యపట్టణమైన 'డిస్పూర్'కి చెందిన ఓ మాఫియా గాంగ్‌కి ఎగుమతి చేస్తున్న ఆ పొలం భూస్వామి అయిన మాఫియా నాయకుడు 'మహంకాళి'ని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకి పంపారు. మహంకాళి తన నేరాలను అంగీకరించి పోలీసు ఉన్నతాధికారులకు స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

నేటి యువతను పట్టి పీడిస్తున్న మాదక ద్రవ్యాలపై యుద్ధం ప్రకటించి అత్యంత సాహసంతో ఒక మాఫియా నాయకుణ్ణి పట్టిచ్చిన దేశ సేవకుడు, సత్పురుషుడు అయిన హెూంమంత్రి శ్రీ రాజరాజ నరేంద్రుడికి పోలీసు ఉన్నతాధికారులు, ఎక్సైజ్ అధికారులు అభినందనలు అందజేశారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు హోంమంత్రిని కలుసుకుని ఆయన సేవాతత్పరతకు ప్రత్యేక అభినందనలు తెలియజేసారు. ఆఖరికి ప్రతిపక్ష నాయకులు, సభ్యులు, ఇతర రాష్ట్ర మంత్రులు, భారత ప్రధాని, రాష్ట్రపతి కూడా ఆయన సేవను కొనియాడారు.

ఒక మాఫియా చీడను కాలరాసిన రాజరాజ నరేంద్రుడి సేవను దేశంలోని ప్రతి ఒక్క పౌరుడు గుర్తుంచుకుని దానినే ఇన్‌స్పిరేషనుగా తీసుకుని 'యువత' ప్రతిస్పందించాలని భారత ప్రధాని తమ ప్రత్యేక సందేశాన్ని దేశ ప్రజలకు అందించారు.

దేశం నలుమూలల నుంచి ఉన్నత ప్రభుత్వాధికారులు, రాజకీయ నాయకులు, పారిశ్రామిక వేత్తలు, కొందరు ప్రజలు టెలిఫోన్సు ద్వారా, టెలిగ్రామ్స్ ద్వారా, శ్రీ రాజరాజ నరేంద్రుడికి తమ అభినందనల పరంపరను అందజేసినట్లు తెలిసింది.

మాఫియా లీడరుతో తలపడటంతో కొద్దిగా గాయపడిన శ్రీ రాజరాజ నరేంద్రుడు రాజకీయ చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చెయ్యలేని సాహసం చేసారు. హోం మంత్రి పేరు గిన్నీస్ బుక్ ఆఫ్ ది వరల్ట్ రికార్డులోకి చేరినా ఆశ్చర్యపోనవసరం లేదని పలువురు ప్రముఖులు ప్రసంశించారు. అదే నిజమవుతుందని కొన్ని పత్రికలు ఘంటాపథంగా ప్రకటించాయి.

గంజాయి పండించి మాఫియా వ్యవహారాలు సాగించిన మహంకాళిని మూడు రోజుల్లో కోర్టులో హాజరు పరుస్తామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ వెల్లడించారు. మహంకాళి సెంట్రల్ జైల్లో పోలీసు కస్టడీలో వున్నాడు.

ప్రస్తుతం ఆరోగ్యంగానే వున్న రాజరాజ నరేంద్రుడు తమ స్వగృహంలోనే కోలుకుంటున్నారు.

ఈ వార్తలు ఇంతటితో సమాప్తం. నమస్కారం.

పకపకా విరగబడి నవ్వుతున్నాడు. రిమోట్ కంట్రోల్ ద్వారా టివి ఆఫ్ చేసిన హోంమంత్రి శ్రీరాజరాజ నరేంద్రుడు. రెండు నిముషాల వరకు అలా

నవ్వుతూనే ఉన్నాడు.

అతడి కుడిచేతికి చిన్న బాండేజీ, తలకి చిన్న కట్టు వున్నాయి. మహంకాళితో తలపడటంతో అయిన గాయాలవి.

టీపాయ్‌మీద వున్న దినపత్రికలన్నీ ఆ రోజు అతడి గురించి రాసిన వార్తలే, అతడి గురించి వ్రాసిన ప్రశంసలే, ఆ రోజు పేజీల నిండా అతడి వార్తలు తప్ప మరో వార్తలేదు. మరికొద్ది రోజుల వరకు దినపత్రికలన్నీ అతడి సాహసాన్ని సీరియల్ నవలలా వేసి కాష్ చేసుకుంటాయనడంలో సంశయం ఏమాత్రం లేదు.

నవ్వాపి టీపాయ్‌మీదున్న ఓ దినపత్రిక అందుకుని చివరి పేజీలో వున్న ఓ బాక్స్ ఐటమ్‌ని ఐదోసారి చదవసాగాడు రాజరాజ నరేంద్రుడు.

జనవరి, 3: మాఫియా లీడర్ మహంకాళిని పోలీసు డిపార్టుమెంట్‌కి పట్టిచ్చిన శ్రీ రాజరాజ నరేంద్రుడి ఉదంతం పాఠకులకు విదితమే! మహంకాళి తన నేరాలన్నీ అంగీకరించాడు. అయితే అతణ్ణి ఎంత బెదిరించినా గంజాయి దిగుమతి చేసుకున్న వాళ్ళ వివరాలు చెప్ప నిరాకరిస్తున్నాడనీ, తనకు ఆ వివరాలేవీ తెలియవని బుకాయించి తప్పించుకోజూస్తున్నాడని, అయినాసరే అతడి నుంచి పూర్తి నిజాలు కక్కించి కోర్టులో హాజరు పరచడమే కాకుండా 'గంజాయి' దిగుమతి చేసుకున్న ముఠాని కూడా త్వరలోనే పట్టుకుంటామనీ డి.జి.పి. విలేఖరుల సమావేశంలో వెల్లడించారు. శ్రీ రాజరాజ నరేంద్రుడి సేవలను ఆయన కొనియాడారు. (మా ప్రత్యేక ప్రతినిధి)

ఆ వార్త చదివి, కాలుమీద కాలువేసుకుని సోఫాచైర్‌లో జారబడిన శ్రీరాజరాజ నరేంద్రుడు దీర్ఘాలోచనలో మునిగినట్లు టీపాయ్‌మీద వున్న పేపర్ వెయిట్ తిప్పసాగాడు బొంగరంలా!

అదే సమయంలో కాలింగ్‌బెల్ ప్రెస్ చేసాడు సెక్యూరిటీ ఆఫీసర్.

"కమిన్"

లోనికి వచ్చాడు ఆఫీసర్ "వాళ్ళు వచ్చారు సార్"

"పంపించు" ముక్తసరిగా అన్నాడు తన ఆలోచనలను కొనసాగిస్తూ.

* * *

ఒక నిముషం గడిచింది.

ఒకరి వెనుక ఒకరుగా ఆరుగురు వ్యక్తులు ఆ గదిలో ప్రవేశించారు. ఆ వెనుకే తలుపులు మూసుకున్నాయి. ఆ ఆరుగురిలో ఇద్దరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్స్, ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ ఖాకీదుస్తుల్లో వున్న ఆ పోలీసు అధికారులు చాలా ఒబీడియంట్‌గా అణకువ కలిగి వరుసగా నిలబడ్డారు. అది హోం మంత్రి సీటుకి, అతడి హోదాకి ఇచ్చిన గౌరవం.

హోం మంత్రి సైగచేసాడు కూర్చోమన్నట్లుగా,

కానీ వాళ్ళు కూర్చోలేదు.

ఓ సి.ఐ. అన్నాడు "ఫర్వాలేదుసార్" యిబ్బంది పడుతూ.

"ప్లీజ్ సిడౌన్" రాజరాజ నరేంద్రుడి మాట గంభీరంగా వినిపించేసరికి తడబడుతూ తమ వెనుకవున్న ఆరు సీట్లలో కూర్చున్నారు వాళ్ళు. సోఫాచైర్స్ చాలా మెత్తగా వున్నా – వాళ్ళు ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చున్నారు.

తమవంటి అతిచిన్న అధికారుల్ని హోం మంత్రి అంతటివాడు పిలిపించాడంటే ఆశ్చర్యమే. ఏదో చాలా ముఖ్యమైన పనే ఉండి వుంటుందని తెలుసు. కానీ అదేమిటో తెలీదు. తెలిసేలోగా ఆ ఇబ్బంది వాళ్ళకి తప్పదు.

"మీకంటే ఎంతో సాహసవంతులు, అనుభవజ్ఞులు, సీనియర్ అధికారులు వుండగా మిమ్మల్నే ప్రత్యేకంగా గుర్తించి ఎందుకు పిలిపించానో తెలుసా?" ఉపోద్ఘాతంలా అన్నాడు రాజరాజ నరేంద్రుడు.

"తెలియదు సార్" సిఐ జవాబు.

"మీ సీనియర్ అధికారులు కూడా ఒకప్పుడు మీ పొజిషన్స్‌లో వున్నవాళ్ళే నాలాంటి వాళ్ళు చెప్పిన పనుల్ని మారు మాట్లాడకుండా చిటికెల్లో చేసి ఈనాడు ఈ స్థితికి వచ్చారు. పై స్థాయిలో వున్నవాళ్ళని ఇంకా పైకి తీసుకువెళ్ళడం

గొప్పకాదు. కింది స్థాయిలో వున్నవాళ్ళని పైకి తీసుకు వెళ్ళడం గొప్ప. అది నా అభిలాష కూడా. అందుకే మీలాంటి వాళ్ళను పైస్థాయికి తీసుకు వెళ్ళాలనే నా కోరిక. మిమ్మల్ని ప్రత్యేకంగా రప్పించడానికి కారణం అదే?"

"చెప్పండి సార్" ఇద్దరు సి.ఐ.లూ అన్నారు.

"మీరో ముఖ్యమైన పనిచెయ్యాలి"

"ఆజ్ఞాపించండి" ఆరుగురు పోలీసు అధికార్లూ ఒకేసారి ఠక్కున అన్నారు.

"వెరీగుడ్. స్పిరిట్ అంటే ఇలా వుండాలి. ముందు ఆ విస్కీ సేవించండి" వాళ్ళ ఎదురుగా వున్న టేబుల్ వైపు చేయిచాచి చూపించాడు. అతడి చేతి ఉంగరపు వేలికి తళుక్కున మెరిసింది. వజ్రాల్లా ధగధగమెరిసే పొళ్ళ ఉంగరం. దానివైపు ఓ సి.ఐ. కళ్ళు ఆశగా చూశాయి. ఆ కళ్లను పనికట్టాయి రాజరాజ నరేంద్రుడి నేత్రాలు.

"వద్దు సార్"

"ఏమిటి వద్దు"

ఉంగరంవైపు చూసి సి.ఐ. తడబడ్డాడు. "ఉంగరం" అనేయబోయి, మాట మింగేసి "విస్కీ" అన్నాడు.

"మొహమాటం వద్దు. తీసుకోండి" తనో కప్పు అందుకున్నాడు రాజరాజ నరేంద్రుడు.

ఇబ్బంది పడుతూనే విస్కీ తాగారు వాళ్ళు ఓ సి.ఐ. తప్ప అతడు ఆల్కహాల్ సేవించడు. ఉంగరంవైపు ఆశగా చూసినవాడే అతడు. థమ్స్ అప్ తాగాడా సి.ఐ.

ఆ తర్వాత చెప్పాడు హోం మంత్రి "మీ ప్రమోషన్సు సంగతి కొద్ది నెలల్లో చూస్తాను. ప్రస్తుతం నేను చెప్పినపని చేసినందుకు మీకు..." తన కాళ్ళ దగ్గర వున్న బ్రీఫ్‌కేస్ టీపాయ్‌మీద వుంచి వాళ్ళవైపు తిప్పి తెరిచాడు. తళుక్కున మెరిసాయి. ఇండియన్ కరెన్సీ కట్టలు. వందరూపాయల నోట్ల కట్టలు. కట్టకు వంద నోట్లు పదివేలు, అలాంటివి ముప్పై కట్టలు, అంటే....

మూడు లక్షలు!

ఆ నలుగురు పోలీసు అధికారుల కళ్ళు ఒక్కసారిగా తిరిగాయి డబ్బు చుట్టూ లోకం తిరుగుతున్నప్పుడు కళ్ళు తిరగడం సహజం!

"ఈ డబ్బు వద్దు సార్"

"కోయంబత్తూర్ కరెన్సీ కాదు"

"అదికాదు సార్. మీ నుంచి ప్రతిఫలం ఆశించడం దారుణం. మమ్మల్ని ఆజ్ఞాపించి పని చేయించుకునే అధికారం మీకుంది. మేం నీతికి, న్యాయానికి కట్టుబడే మనుషులం సార్. దేశం కోసం, దేశ నాయకుల కోసం, దేశ సౌభాగ్యం కోసం మా ప్రాణాలు త్యాగం చెయ్యటానికి కూడా మేం వెనుకాడం సార్" అనేసి, 'కొంచెం ఓవర్ యాక్షన్ చేశానా!' అనుకున్నాడా సి.ఐ. హెూం మినిస్టర్ తమని పరీక్షించడానికే అలా డబ్బాశ చూపిస్తున్నాడని అతడి నమ్మకం.

"నవలలు రాసేది నువ్వేనా?" ప్రశ్నించాడు రాజరాజ నరేంద్రుడు. దేశభక్తి డైలాగులు చెప్పిన సి.ఐ.ని

కంగారుగా అన్నాడు సి.ఐ. "నేను కాదు సార్, నా పెళ్ళాం"

"నీ పెళ్ళాం నవలలు బాగా తలకెక్కినట్లున్నాయ్. అందుకే దేశభక్తి డైలాగులు జపిస్తున్నావ్. ఐదేళ్ళ క్రితం వైజాగ్ పరిసరాల్లో వున్న గ్రామ ప్రాంతాల్లో ముగ్గురు గిరిజన యువతుల్ని రేప్ చేసి, ఎదురు తిరిగిన వాళ్ళని బెదిరించి, ఒక యువతిని చంపేసి, మిగిలిన ఇద్దరికి భయం పుట్టించి, వాళ్ళని మన్నుతిన్న పాముల్ని చేసి, కోడెత్రాచులా చెలరేగిన ఒకప్పటి ఎస్సై జోగారావు నువ్వేకదూ?" రాజరాజ నరేంద్రుడి నోటి వెంట తన జీవిత చరిత్రలో ఓ ప్రధానఘట్టం జలపాతంలా జాలువారేసరికి ఆ హెూరుకి గతుక్కుమని, నిజాలకి నీళ్ళు నములుతూ దిగ్గున లేచి నిలబడి చేతులు కట్టుకున్నాడు.

రాజరాజ నరేంద్రుడి చేసైగ చూసి ఇబ్బందిగా కూర్చుని చేతులు నలుపుకోసాగాడు జోగారావు... యమయాతన మొహంలో ప్రతిఫలింపచేస్తూ.

"నీ జీవిత చరిత్రలో మరికొన్ని ప్రధాన ఘట్టాలు చెప్పమంటావా

జోగారావ్?"

"వద్దు సార్ వద్దు. ఇప్పుడు మీరు చెప్పిన ఘట్టాలే ఆణిముత్యాల్లాంటివి. మరొకొన్ని చెప్పారంటే, అవి నా పెళ్ళాం చెవుల్లో పడ్డాయంటే... అదే రాసేస్తుంది నా జీవిత చరిత్రని ఓ సీరియల్ నవలలా. దయచేసి ఇంకేదయినా మాట్లాడండి సార్"

మిగిలిన ఐదుగురి వంక చూస్తూ అన్నాడు రాజరాజ నరేంద్రుడు "మీ సంగతి ఏమిటి, మీ జీవితాల్లో ప్రధాన ఘట్టాలు కూడా చెప్పాలా?"

అంతా ఒకేసారి అన్నారు "అయ్యబాబోయ్. అవసరం లేదు సార్"

"వెరీగుడ్, నా స్థానంలో మరెవరున్నా మీ చేత పనిచేయించుకుని మీకు ప్రతిఫలం చూపించేవారు కాదేమో! కానీ నా పద్ధతి అలాకాదు. చేయించుకున్న పనికి తగ్గ ప్రతిఫలం ముట్టచెప్పటం నా ఆచారం. నా దృష్టిలో ప్రతిఫలం లేని కాంట్రాక్టు చెల్లదు అందువల్ల మీరీ డబ్బును సమానంగా పంచుకోండి"

"మా ప్రమోషన్స్ సంగతి చూస్తే చాలు సార్"

"డోంట్ వర్రీ. దేనిదారి దానిదే ప్రమోషన్ సంగతి తర్వాత. ముందు ఈ డబ్బు తీసుకోండి"

ఆనందంతో పొంగిపోయారు వాళ్ళు.

బ్రీఫ్‌కేస్ మూసి కానిస్టేబుల్ చేతికిచ్చాడు జోగారావు.

మూడు లక్షలు!

'సూర్యుడు' తనచుట్టూ తాను తిరుగుతూ పాలపుంత చుట్టూ తిరుగుతున్నాడు. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుడి చుట్టూ తిరుగుతోంది.

అలాగే...

'డబ్బు' తన చుట్టూ తాను తిరుగుతూ లోకం చుట్టూ తిరుగుతోంది. మనిషి తన చుట్టూ తాను తిరుగుతూ డబ్బుచుట్టూ తిరుగుతున్నాడు.

అంటే... ఇక్కడ కవి హృదయం 'సూర్యుడి'కి ఉన్నంతశక్తి 'డబ్బు'కి ఉందన్నమాట! మనిషి స్వార్థచిత్తుడై తన చుట్టూ తాను తిరుగుతూ డబ్బు

చుట్టూ తిరుగుతాడు.

"మీరు చెప్పాలనుకున్నది ఏమిటో చెప్పండి సార్. మీ కోసం మా ప్రాణాలయినా ఇస్తాం" నమ్మినబంటులా అణకువగా అన్నాడు జోగారావ్.

"మీ ప్రాణాలు ఇవ్వనవసరం లేదు. ఓ ప్రాణం తీస్తే చాలు" చాలా యథాలాపంగా చెప్పాడు రాజరాజ నరేంద్రుడు.

ఊహించనిమాట వినిపించడం వల్ల అదిరిపాటుతో బ్రీఫ్ కేస్ వదిలేశాడు కానిస్టేబుల్.

అది ఓపెన్ అయి నోట్లకట్టలన్నీ కిందపడ్డాయి. "సారీ సార్" అంటూ నోట్లకట్టలు ఏరి బ్రీఫ్ కేసులో సర్ది లాక్ చేశాడా కానిస్టేబుల్.

"చెప్పండిసార్" అన్నాడు జోగారావు. ఈలోపులో మిగిలినవాళ్ళు ఎలర్ట్ అయ్యారు.

"మహంకాళి తెలుసుకదూ!" అన్నాడు రాజరాజ నరేంద్రుడు.

"తెలుసు సార్!... అతణ్ణి సెంట్రల్ జైల్లో బంధించినట్టు మేం పబ్లిక్‌కి అబద్ధపు స్టేట్‌మెంటు ఇచ్చాం. అతడి ఉనికి ఎవరికీ తెలియకూడదని మాపై అధికార్ల ఆదేశం. అందుకే మహంకాళిని ఓ ప్రైవేట్ బంగ్లాలో పారిపోడానికి వీలు లేని పటిష్ఠమైన చర్యలన్నీ తీసుకుని పకడ్బందీగా బంధించాం సార్" హుషారుగా చెప్పాడు జోగారావు.

"తెలుసు"

నీరసంగా అన్నాడు "తెలుసా! సార్"

"ఒక 'ఈగ' లోపలికి వెళ్లలేదు. ఒక 'చీమ' బయటికి రాలేని ఏర్పాట్లు సార్ అవి" మరో సి.ఐ. అన్నాడు.

"ఆ ఏర్పాట్లన్నీ నేనే చేయించాను."

మరింత నీరసంగా అన్నాడు జోగారావు "మీరే చేయించారా!"

భావగర్భితంగా నవ్వాడు రాజరాజ నరేంద్రుడు. "ఆ 'బంగ్లా'కి కాపలాగా మీ ఆరుగుర్ని మాత్రమే నియమించమని మీ పై అధికారులకు చెప్పి మిమ్మల్ని

నియమించిందీ నేనే"

"అర్థమైంది సార్"

"ఏం అర్థమైంది"

తొందర పడి నీళ్ళు నమిలేశాడు జోగారావు.

మరోసారి నవ్వాడు రాజరాజ నరేంద్రుడు. అతడి నవ్వు వాళ్ళ వెన్నులో దడ పుట్టించేలా వుంది.

ఆ వెంటనే గంభీరంగా మారిపోయింది అతడి గొంతు "మహంకాళి లాంటి దేశద్రోహిని ఉప్పు పాతరవేయాలి. ముక్కలు ముక్కలుగా నరికి పోగులెట్టినా పాపం లేదు. అంతటి దుర్మార్గుడు వాడు. వాణ్ణి రక్షించి తీసుకు పోవటానికి కొన్ని మాఫియా ముఠాలు ప్రయత్నిస్తున్నాయి. అందుకే ఆ ప్రజాకంటకుణ్ణి తప్పించుకోనివ్వకుండా ఈ లోకంనుంచి తప్పించేయడానికే నిర్ణయించుకున్నాను. రేపు వాడికి కోర్టులో పడేది ఉరిశిక్షే! కాని వాడి నేరాలు నిరూపించబడి, శిక్ష అమలు జరిగేలోగా మాఫియా ముఠాలు వాణ్ణి ఎత్తుకు పోతాయి. అలా జరగడం నాకిష్టం లేదు. ఈ నిజాలు తెలిసిన ఏ ఒక్క పౌరుడికి ఇష్టం వుండదు. అందుకే ఆ నీచుడిని మీ ద్వారా చంపించడానికే నిర్ణయించు కున్నాను. మహంకాళిని చంపడమంటే మీరు దేశానికి గొప్పసేవ చేసినట్లే లెక్క. ఆ చీడపురుగుని మూడోరోజు రాత్రి... అంటే... కోర్టుకి వెళ్లే ముందు రోజు రాత్రి చంపేయండి. మహంకాళి కోర్టు ముఖం కూడా చూడకూడదు. కిల్ హిమ్ దట్ క్రూక్... కాని 'ఆత్మహత్య'గా నిరూపించడం మాత్రం మరచిపోకండి? అది ముఖ్యం"

"యస్సార్" తలలు ఊపారా ఆరుగురు పోలీసు అధికార్లు. దేశభక్తి పరాయణుల్లా పోజులు పెట్టి.

"మీరిక వెళ్ళొచ్చు" వాళ్ళటు వెళ్లగానే విరగబడి నవ్వసాగాడు రాజరాజ నరేంద్రుడు. అతడికో చిత్రమైన అలవాటుంది. ఏ పనయినా పురమాయించి నప్పుడు ఆ పనికి సంబంధించిన నిజాలని స్వగతంగా తనలో తనే బయటికి

మాట్లాడుకోవడం అతడి అలవాటు!

నవ్వాపి స్వగతంగా మాట్లాడుకోసాగాడు రాజరాజ నరేంద్రుడు. "గుడ్డిలోకం, నేనేం చెబితే అదే నిజం. దానికి తిరుగులేదు, నేను చెప్పేవన్నీ అబద్ధాలేనని లోకానికి తెలీదు. దీనికి తిరుగులేదు. భారతదేశంలో మాదక ద్రవ్యాల చీకటి సామ్రాజ్యానికి ఛత్రాధిపత్యం వహించే మకుటం లేని మహారాజుని నేనేనని ఈ లోకానికి తెలుసా? తెలీదు, ఆ విషయం నేను చచ్చినా చెప్పను. దేశంలోని అతి చిన్న చిన్న మాఫియా ముఠాలు నా అడుగులకి మడుగులొత్తుతాయని తెలసా? తెలీదు, నేను చెప్పను. ముడిసరుకు కావాల్సిన వాళ్ళకి గంజాయి మొక్కలు ఎగుమతి చేసి, డ్రగ్స్ కావాల్సిన వాళ్ళకి మాదకద్రవ్యాలు ఉత్పత్తిచేసి, సప్లయిచేసే మాఫియా రాకెట్‌కి రారాజుని నేనేనని తెలుసా? తెలీదు, నేను చచ్చినా చెప్పను.

నాకున్న ఎంతోమంది అనుచరుల్లో మహంకాళి ఒకడనీ, నాకున్న ఎన్నో గంజాయి పంటల్లో, మహంకాళి పండించే పంట ఒకటనీ, నా పంటను నేనే పట్టించిన ఘరానా దొంగనని తెలుసా? తెలీదు, నేను చెప్పను. నేనంటే ప్రజల్లో మంచి అభిప్రాయం వున్నా, రాజకీయంగా పేరు ప్రఖ్యాతులు లేని వాళ్ళల్లో నేను ప్రధముడినని గ్రహించిన వెనువెంటనే, మినిస్ట్రీలో వుండి కూడా ప్రఖ్యాతి చెందకపోతే అదే తన భవిష్యత్తుకి భవిష్యతులో గొడ్డలిపెట్టు అవుతుందనీ, సి.ఎం. దృష్టిలో తను వుండననీ, అక్కడితో తన రాజకీయ జీవితం అంతమవుతుందనీ, వీటన్నిటికంటే ముఖ్యంగా తన ఖ్యాతి ఒక్కసారిగా నలుదిక్కులకు వ్యాపింపచేయాలనే ఒక గొప్ప యాంబిషన్... అదేనండీ అభిలాష కలిగిందనీ, ఆ వెంటనే ఓ మాస్టర్ ఆలోచన వచ్చి అది మహంకాళితో చెప్పి అరెస్టు చేయించిన నాలుగోరోజుకే అతణ్ని విడిపిస్తానని వాగ్దానం చేసి... వాణ్ణి ఒప్పించి మహంకాళిని నాటకంలో పాత్రధారిని చేసి, వైకుంఠపాళిలో పావుని చేసి మింగడానికి సిద్ధంగా వున్న (తన నాటకం సంగతి లోకానికి తెలియకూడదు కనుక) త్రాచుపాముని నేనేనని తెలుసా? తెలీదు, నేను చచ్చినా

చెప్పను. ఈ లోకం కళ్ళు కప్పి ఎంతటి ఘరానా పనయినా చెయ్యగల మాయల మరాఠీని... ఐంద్రజాలికుణ్ణి నేనే!" పగలబడి నవ్వసాగాడు రాజరాజ నరేంద్రుడు – సంతృప్తితో కూడిన మహదానందంతో.

* * *

రాజరాజ నరేంద్రుడి గదికి పక్కగా వున్న వెనుక వైపు వరండా కిటికీలోంచి అతడి ప్రతి కదలికను రెండు కళ్ళు గమనించాయి. క్లోజుగా ఆ విశాల నేత్రాల తాలూకు చెవులు రాజరాజ నరేంద్రుడి స్టేట్‌మెంటుని మెదడుకి వినిపించాయి. ఆ కళ్ళు, చెవుల తాలూకు 'శాల్తీ' మనసులో అనుకుంది 'తస్సాదియ్యా... నీ వెనక ఫ్లాష్‌బాక్ స్టోరీ సీరియల్ నవలలా ఇంత పెద్దది వుందా.. రాజరాజ నరేంద్రుడూ! నీ నాటకాల రంగంతా నాకు తెలిసిపోయిందీ! కానీ నేను కూడా చచ్చినా చెప్పను. తస్సాదియ్య.... ఆలోచించి చూస్తాను!'

ఆ గదిలో జరిగిన సంభాషణని మరో రెండు చెవులు వినేశాయి. ఆ చెవులు ఒక అందమైన అమ్మాయివి. బ్రహ్మదేవుడు మంచి హుషారులో ఉన్నప్పుడు ప్రావీణ్యులయిన పదిమంది శిల్పుల చేత ఓ అందమైన ప్రతిమను అపురూపంగా, అద్భుతంగా చెక్కించి జీవంపోస్తే బహుశా ఆ రూపం ఆమెలా ఉంటుంది. ఆమె పేరు మేఘన, ఆమె రాజరాజ నరేంద్రుడి సెక్రటరీ!

* * *

హెూం మినిస్టర్‌కి అభినందనలు తెలుపుతూ వచ్చిన టెలిగ్రామ్స్ కట్టని ఫైల్ చేసి, ఆ మర్నాటి నుంచి అమలు జరిగే రాజరాజ నరేంద్రుడి ఎంగేజ్‌మెంట్స్ డైరీని ఒకసారి వెరిఫై చెయ్యసాగింది మేఘన.

ఎంగేజ్‌మెంట్స్‌ని దీక్షగా చదువుతూ టేబుల్‌మీద పెన్నుకోసం తడిమింది ఆ తడమటంలో ఆమె చెయ్యి పొరపాటున ఇంటర్‌కమ్‌ని ఆన్ చేసింది.

ఆ సమయంలో రాజరాజ నరేంద్రుడి గదిలో జరుగుతున్న సంభాషణ

ఆసక్తికరంగా వినిపించేసరికి ఆఫ్ చెయ్యడం మానేసి, క్యాజువల్‌గా వినసాగింది మేఘన. అలా చాటుగా తను సంభాషణ వినటం సభ్యత కాదనీ తెలుసు, ఆ విషయం హెూం మినిస్టర్‌కి తెలిస్తే తన ఉద్యోగం ఊడిపోతుందనీ తెలుసు కానీ, జరుగుతున్న ఆసక్తికరమైన సంభాషణ ఆమెని ఏమీ ఆలోచించనివ్వలేదు.

"మీరు చెప్పాలనుకున్న పనేమిటో చెప్పండి సార్. మీ కోసం మా ప్రాణాలయినా ఇస్తాం"

"మీ ప్రాణాలు ఇవ్వనవసరం లేదు. ఓ ప్రాణం తీస్తే చాలు"

"ప్రాణాలు తీయడం" అనే మాట ఇంటర్‌కమ్‌లో వినిపించేసరికి అదిరిపడింది మేఘన. ఆమె చేతిలోని డైరీ కిందపడింది. ఆమె మరో చెయ్యి ఇంకు బాటిల్‌కి తగిలి బాటిల్లోని రెడ్ ఇంకు చెల్లాచెదురుగా ఫైల్స్‌మీద, కిందపడి రక్తపుటేరులా మడుగు కట్టింది.

ఆమె చేతులు వణుకుతున్నాయి. సగం సంభాషణ వినేసరికి సగం కథ అర్థమైంది.

"మహంకాళి తెలుసుకదూ!" తిరిగి ప్రారంభమైన సంభాషణ మహంకాళి మీదకి వెళ్లేసరికి ఆమెకి మరికాస్త అర్థమైంది.

ఆ సంభాషణ వింటూనే చెల్లాచెదురుగా పడిన వస్తువులు ఎక్కడివక్కడ సర్దేసి, డైరీమీద, ఫైల్స్ మీద పడిన ఇంకుని తుడిచి, వాటిని టేబిల్ సొరుగులో లాక్ చేసి, నేలమీద టేబుల్‌మీద మడుగు కట్టిన ఇంకుని శుభ్రంగా తుడిచేసి, వాష్‌బేసిన్‌లో చేతులు కడుక్కుని తన రివాల్వింగ్ చైరులో కూర్చునే సమయానికి జోగారావ్ బృందం మేడ దిగి వెళ్ళిపోయింది. ఆమె రూం మేడకింద వుంది.

ఇంటర్‌కమ్‌లో సడెన్‌గా రాజరాజ నరేంద్రుడి నవ్వు ప్రారంభమయ్యేసరికి తృళ్ళిపడింది మేఘన. అతడి స్వగత సంభాషణ వింటూన్న కొద్దీ ఆమెలో అవయవాల కంపనవేగం హెచ్చుతోంది. ఉండి వుండి ఆమె ఒళ్ళు జలదరిస్తోంది. వెన్నులో చలి పుడుతోంది.

ఇప్పటి వరకు రాజరాజ నరేంద్రుణ్ణి ఒక మహామనిషిగా, ఒక మహెూన్నత

వ్యక్తిగా, మహాత్ముని వారసునిగా భావించిన ఆమెకు ఒక్కసారిగా నిజం బట్టబయలై అతడు గోముఖ వ్యాఘ్రమనీ, స్వకార్యం నెరవేర్చుకోటానికి ఎంతటి దుర్మార్గమైన పనైనా చేసే కర్కోటకుడనీ, దేశ సేవకునిలా కన్పిస్తూ కాలసర్పంలా అతి రహస్యంగా కాటువేసే దేశ ద్రోహి అని తెలిసేసరికి చలిజ్వరం వచ్చినట్టు ఆమె చిగురుటాకులా వణికిపోయింది.

ఆమె మొహంనిండా చెమట్లు పట్టేశాయి. అతడి మాటలు పూర్తయ్యేసరికి ఇంటర్‌కమ్ ఆఫ్ చేసి వెనక్కి జారబడి వణుకుతున్న అరచేతితో మొహం తుడుచుకుంది.

అక్కడామెకి ఒక్కక్షణం కూడా ఉండబుద్ధి కావడం లేదు. వెనువెంటనే ఆ పరిసరాలకు దూరంగా పారిపోవాలని వుంది.

తనిక అతడి దగ్గర ఉద్యోగం చెయ్యలేదు. ఆత్మవంచన చేసుకుని జీవించడం తనకి చేతకాదు. మేకవన్నెపులుల అకృత్యాలు చూస్తూ తను సహించలేదు. కనుక వారం రోజులు శెలవు తీసుకుని, రాజీనామా పంపేయటం ఉత్తమమైన పని.

అదే క్షణంలో ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ సిగ్నల్ వచ్చే బల్బ్ వెలగగానే ఉలిక్కిపడి ఇంటర్ కమ్ ఆన్ చేసింది మేఘన.

"మేఘన... ఆ ఫైల్ రెడీ చేసావా?"

"యస్ సార్"

"తీసుకురా"

ఇంటర్ కమ్ ఆఫ్ చేసి ఫైల్స్ రేక్‌లో ఓ ఫైల్ తీసి గది బయటకొచ్చి మేడమెట్లు ఎక్కసాగింది. గడియారం చేసే శబ్దంలా ఆమె గుండెల్లో దడదడ. వెన్నులో ఒణుకు.

అతడి రూం అల్లంత దూరంలో వుండగానే అదో మృత్యుగహ్వారంలా కనిపిస్తోందామెకు. రూంలోకి అడుగు పెట్టగానే అదో నరమాంస భక్షకుడి గుహ అన్నట్టు, ఎముకలపోగుల మధ్యన రాజరాజ నరేంద్రుడు నరమాంసం

భక్షకుడి గెటప్‌లో ఓ శవాన్ని పీక్కు తింటున్నట్టు ఊహించుకుంది. ఆ శవం మొహంలో తన పోలికలు కనిపించేసరికి కెవ్వున అరవబోయి, హోం మంత్రి గొంతువిని ఈ లోకంలోపడి డోర్‌తోసి రూంలోకి అడుగు పెడుతూ తనను తాను కంట్రోల్ చేసుకుని ఫైల్‌ని రాజరాజ నరేంద్రుడికి ఇచ్చింది.

అతడి కళ్ళల్లో చెలరేగుతున్న కామవాంఛని మొట్టమొదటిసారిగా గమనించేసరికి ఆమె భయం రెట్టింపు అయింది.

రాజరాజ నరేంద్రుడు అందరిలాంటి వాడు కాదు. అతడో ప్రత్యేక తరహా మనిషి. అతడి దృష్టిలో పడిన అమ్మాయిల్ని వలవేసి లోబరుచుకునే మెంటాలిటీ అతడిది, కాని ఇష్టం లేకుండా బలవంతంచేసే మనస్తత్వంకాదు. మూడేళ్లుగా అతడి వద్ద ఉద్యోగం చేస్తున్న ఆమె మీద వల వేయాలని ఈ మధ్యనే అనుకున్నాడు. వలవేస్తే పడిపోడానికి ఆమె సీతాకోక చిలుకలా రంగులుమార్చే ఆడది కాదు. రాజహంసలాంటి పవిత్రమైన మనసున్న స్త్రీ ఆమె అవసరమైతే అపర రుద్రకాళిలా... ప్రాణాల భైరవిలా మారగల ఝాన్సీ రాణి వారసురాలామె!

ఫైల్ చూసి, అది భద్రపరచమని ఆమెకే ఇచ్చి "రేపటి నుంచి నా ఎంగేజ్‌మెంట్స్ వివరాలు చెప్పు" అడిగాడు రాజరాజ నరేంద్రుడు తన వాంఛని కంట్రోల్ చేసుకుని. అతడి అదృష్టం బావుందనే చెప్పాలి!

"రేపు ఉదయం పదిగంటలకి ప్రెస్ కాన్ఫరెన్స్... 11:30కి ఇంటెలిజెన్స్ ఆఫీసర్స్ మీటింగ్... ఐదుగంటలకి స్టార్ హోటల్ 'త్రీ కాజిల్స్' ఓపెనింగ్. ఎల్లుండి ఉదయం అసెంబ్లీ మీటింగ్... సాయంత్రం 6:30కి సి.ఎం.ని కలుసుకోవాలి" టకటకా చెప్పుకుపోతున్న ఆమెని మధ్యలో ఆపేశాడు.

"నాకు వారం రోజులు శెలవు కావాలి సార్" కొన్ని క్షణాలాగి అడిగింది.

"వారం రోజులా!"

తల వూపింది "ఒంట్లో బాగోలేదు. డాక్టర్ రెస్టు తీసుకోమని చెప్పాడు"

ఆమె చెప్పింది నిజమని నమ్మేసి శెలవు గ్రాంట్ చేశాడు రాజరాజ నరేంద్రుడు.

పులి గుహలోంచి బయటపడింది మేఘన.

* * *

మంచం మీద పడుకుందన్న మాటే గాని ఆమెకి నిద్ర పట్టడం లేదు.

"కోర్టుకి వెళ్లేముందు రోజు రాత్రి చంపేయండి. మహంకాళి కోర్టు ముఖం కూడా చూడకూడదు. కిల్‌హిమ్ దట్ క్రూక్... కానీ ఆత్మహత్యగా నిరూపించడం మాత్రం మరచిపోకండి, అదీ ముఖ్యం" ఆ మాటలు పదేపదే ఆమె చెవుల్లో ఢంకానాదాల్లా ప్రతిధ్వనిస్తున్నాయి.

ఏం చెయ్యాలి? తనిప్పుడేం చెయ్యాలి? తన కర్తవ్యం ఏమిటి?... మహంకాళిని చంపేసినా తనకేం పట్టనట్టు మిన్నకుండిపోవాలా?... నో... అది తనకు అసాధ్యం ఒక నిండు ప్రాణాన్ని హత్య చేస్తూంటే పిరికి తనంతో చూస్తూ కూర్చునే మనస్తత్వం కాదు తనది. అతడెవరైనా కానీయ్... గంజాయి పంటను పండించినవాడు కానీయ్... దేశద్రోహితో చేతులు కలిపిన వాడు కానీయ్... చివరికి హంతకుడే కానీయ్... వక్రమార్గంలో హత్య గావింప బడబోతున్న అతణ్ణి తను రక్షించడానికి మహంకాళికి వున్న ఒకే ఒక్క అర్హత... 'అతడు మనిషి!...' అతణ్ణి రక్షించడానికి తనకున్న అధికారం.... 'తను మనిషి!'... జంతువులు జంతువులు పోట్లాడుకున్నట్టు మనుషులు మారణ హోమం చేస్తూ తోటి మనిషిని బలిపశువులా చంపబోతుంటే... అది తెలిసి మృగయా వినోదం చూడటానికి తను జంతువు కాదు. మనిషి! మనసున్న మనిషి!! ధైర్యసాహసాలున్న స్త్రీ!!!

అవును మానవత్వం వున్న మనిషిగా మహంకాళిని తను రక్షించాలి. కాని ఎలా? అతణ్నెలా రక్షించాలి?!

రాజరాజ నరేంద్రుణ్ణి బయట పెట్టాలంటే అది చాలా కష్టసాధ్యం! అతడి గుట్టుపట్టి అతడి నిజస్వరూపాన్ని ప్రజలకు చూపించాలంటే ముప్పై రోజులు కూడా చాలకపోవచ్చు. కాని మూడు రోజులే టైముంది. మూడే మూడు రోజుల్లో

మహంకాళిని రక్షించాలి. అందువల్ల ఆ జాదూగర్‌ను బయటపెట్టే ఆలోచనను వాయిదా వెయ్యాలి.

సరిగ్గా అదే సమయంలో మెరుపులా ఆమెకో మంచి ఆలోచన తట్టింది.

సీటీ కమీషనర్ భట్టాచార్య చాలా మంచి మనిషి అనీ, సిన్సియర్ ఆఫీసర్ అని చాలా మంది చెప్పుకోగా విన్నది. తప్పు చేసిన వాడు ఎంతటి పెద్ద ఆఫీసర్ అయినా, అతడు ఎటువంటి పొజిషన్‌లో వున్నా సరే చర్య తీసుకోకుండా వదలని స్ట్రిక్ట్ ఆఫీసర్ భట్టాచార్య అని విన్నది. ఆ మర్నాడే అతణ్ణి కలుసుకోవాలని నిర్ణయించుకుంది.

'ఇక కళ్ళు మూసుకుని నిశ్చింతగా పడుకుందాం' అనుకునే సమయానికి తెలతెలవారింది!

* * *

ఆమె సరాసరి పోలీసు కమీషనర్ నివాసగృహానికి వెళ్ళింది.

అంత పెందరాడే తన కోసం వచ్చిన ఆ అమ్మాయిని నిశితంగా పరిశీలించాడు పోలీస్ కమీషనర్ భట్టాచార్య.

"మీతో ఓ ముఖ్యమైన విషయం మాట్లాడాలి సార్" అంది మేఘన.

"ఏ విషయం?" గంభీరంగా అడిగాడు పోలీస్ కమిషనర్.

"అది మీతో చెప్పడానికి నాకు జంకుగా వుంది"

అప్పుడు అతడి స్వరం అతిసౌమ్యంగా మారిపోయింది. "ఎటువంటి భయాలు పెట్టుకోకమ్మా... నేను మీ తండ్రిలాంటి వాడిని, నిర్భయంగా చెప్పు"

"అది చాలా భయంకరమైన నగ్నసత్యం" ఆమె ఎందుకో వణికింది.

"వినటానికి నాకు భయం లేదు. చెప్పు" నవ్వాడు భట్టాచార్య.

ధైర్యం కూడగట్టుకుని జోగారావ్ గ్రూప్‌తో రాజరాజ నరేంద్రుడి సంభాషణ యావత్తూ చెప్పేసింది. కానీ హోం మంత్రి స్వగతంగా పైకి అనుకున్న మాటలు మాత్రం చెప్పలేదు. అదో మంచిపని చేసిందనే చెప్పాలి!

ఆమె చెప్పిందంతా భట్టాచార్య గుడ్లప్పగించి విన్నాడు “నువ్వు చెప్పిందంతా నిజమేనా!”

“నిజమే సార్... మీరెలాగైనా మహంకాళిని రక్షించాలి”

“నీ మాటలెలా నమ్మడం”

“నమ్మాలిసార్. ఎందుకంటే నేను హెూం మంత్రి సెక్రటరీని. అదీగాక అంతటి మనిషి మీద అభాండం వేయడానికి నాకెన్ని వేల గుండెలు వుండాలి”

“అవును, నిన్నెక్కడ చూశానా అనుకుంటున్నాను. గుర్తొచ్చావ్! హెూం మంత్రితో నిన్ను రెండు మూడుసార్లు చూశాను”

“ప్రస్తుతం నేను హెూం మంత్రి సెక్రటరీని కాను, ఆ జాబ్‌కి ఈ రోజే రాజీనామా ఇచ్చినట్లే...”

“అలాగా! ఒక్క నిముషం కూర్చో అమ్మా, ఇప్పుడే వస్తాను” లేచి లోనికి వెళ్ళాడు భట్టాచార్య.

నిముషం గడిచింది.

అప్పుడే మొదలైంది ఆమెలో టెన్షన్.

నిముషంలో వస్తానని లోనికి వెళ్లిన పెద్దమనిషి రెండు నిమిషాలు గడిచినా రావడం లేదు.

వెన్నులో జుమ్మని ఏదో పాకినట్టు అయ్యేసరికి ఆమెలో మొదటిసారిగా చిన్న అనుమానం పొడచూపింది.

ఇంకేం ఆలోచించదలచుకోలేదామె. దిగ్గున లేచి భట్టాచార్య వెళ్ళిన వైపుగా చకచకా అడుగులు వేసింది.

కారిడార్ పక్కగా వున్న ఓ రూమ్‌లోంచి గ్లాస్ డోర్ గుండా చక్కగా కనిపిస్తున్నాడు పోలీస్ కమిషనర్ భట్టాచార్య ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతూ!

మెరుపులా పక్కకి దూకింది మేఘన. కిటికీ చాటుకి చేరి కిటికీ రెక్కను కొద్దిగా తెరిచింది అతి మెల్లగా, ఆ రూంలో జరుగుతున్న టెలిఫోన్ సంభాషణ వినిపించసాగింది. అవతలి వ్యక్తి మాటలు మాత్రం వినిపించక పోయినా

అతడెవరై వుంటారో క్షణంలో ఊహించేసిందామె భట్టాచార్య మాటల్ని బట్టి.

"మహంకాళిని చంపించే మాస్టర్ ప్లాన్ విషయం నాకు తెలియకపోతే పోయింది. కనీసం డి.ఐ.జి.గారికన్నా తెలుసా సార్!"

"నాన్‌సెన్స్! ఎవరికీ తెలియాల్సిన అవసరం లేదు. అందుకే రహస్యంగా వుంచాను"

"వాణ్ణి కోర్టు శిక్షిస్తుంది కద్సార్"

"అంతకంటే ముందుగా వాణ్ణి మాఫియా గాంగ్స్ రక్షిస్తాయి. అందువల్ల ఆ చీడపురుగుని చంపించడమే మంచిది. 'చీడపురుగు చేరు చెట్టు చెరచు' అన్నారు. కల్పవృక్షంలాంటి భారతదేశాన్ని బ్రతికించుకోవాలనుకుంటే ఇలాంటి చీడపురుగుల్ని ఏరి పారేయాలి. దేరీజ్ నో ఎనదర్ వే"

అందులో ఏదో మిస్టరీ వుందని భట్టాచార్య గ్రహించాడు. తను హోం మినిష్టర్‌కి నమ్మినబంటు అయినప్పటికీ అతడా మిస్టరీ చెప్పటం లేదంటే అది మామూలు విషయం కాదని తెలుసు. నమ్మినట్టు నటించాడు గానీ హోం మంత్రి చెప్పిన కాక్ అండ్ బుల్ స్టోరీస్ అతడు నమ్మలేదు. నమ్మినట్టు నటించడం సభ్యత కాదని కాదు సభ్యసమాజంలో తనను బ్రతకనివ్వకుండా చేస్తాడనే భయంతో!

ఒక చేత్తో చేసే పని రెండో చేతికి తెలియనివ్వడం రాజరాజ నరేంద్రుడికి నచ్చని విషయాలలో ముఖ్యమైనది.

"ఆ అమ్మాయి ఇంకేం చెప్పింది" హోం మంత్రి గొంతు కఠినంగా మారింది.

"ఇంకేం చెప్పలేదు సార్"

మేఘన శరీరంలో కంపన ప్రారంభమైంది. వణుకుతున్న చేతుల్ని కంట్రోల్ చెయ్యడానికి శతవిధాల ప్రయత్నిస్తోంది.

"కరెక్టుగా గుర్తుందా?"

"యస్సార్"

స్వగతంగా అనుకున్న మాటలు కూడా ఆమె విన్నదేమోనని హెూం మంత్రి అనుమానం. విన్నా, ఆమె తననేమీ చెయ్యలేదని అతడికి తెలుసు. తలుచుకుంటే తనే ఆమెనేమైనా చెయ్యగలడు.

భట్టాచార్య కూడా గోముఖ వ్యాఘ్రమేనన్నమాట, తెలియక అతణ్ణి నమ్మింది తను. తనకతడి విషయాలన్నీ తెలిసిపోయాయని గ్రహించలేనంతటి మూర్ఖుడు కాదు హెూం మంత్రి. ఆవలిస్తే పేగులు లెక్కపెట్టగల నరరూప రాక్షసుడు అతడు.

'ఇక రాజరాజ నరేంద్రుడు వేటగాళ్ళను నియమించి అడవిలో లేడిని వేటాడినట్టు తనను వేటాడవచ్చు' అనుకుంటోంది మేఘన.

సరిగ్గా అదే సమయంలో రాజరాజ నరేంద్రుడి గొంతు భట్టాచార్యకి గంభీరంగా వినిపించింది "కిల్ హర్ యిమ్మీడియేట్లీ..."

"ఆమెని చంపేయమంటారా?" భట్టాచార్య మాట విని అదిరిపడింది మేఘన. ఆ అదిరిపాటులో ఆమె చెయ్యి తగిలి పక్కనే ఎత్తుపీట మీద వున్న కంచు ఫ్లవర్ వాజ్ కింద పడి ఖంగున పెద్దశబ్దం సృష్టించింది.

"ఏమిటా శబ్దం" హెూం మంత్రి అడిగాడు.

ఆ శబ్దం వినిపించినప్పుడే వెనక్కి తిరిగిన భట్టాచార్య ఆమెను చూసేశాడు. "ఆమె పారిపోతుంది" ఫోన్‌లో అరిచేశాడు.

తిరిగి హెూం మంత్రి అరిచేశాడు "డోంట్ లీవ్ హర్. రన్ ఫాస్ట్ అండ్ క్యాచ్ హర్ క్విక్"

అంత టెన్షన్‌లో కూడా మేఘన మెదడు సరైన రీతిలో ఆలోచిస్తోందంటే చాలా ఆశ్చర్యం.

మెరుపులా ముందుకి దూకి భట్టాచార్య వున్న గది తలుపు బయట గెడ పెట్టేసింది.

రిసీవర్ వదిలేసి అతడు తలుపుతో కుస్తీ పట్టసాగాడు మహారౌద్రంగా.

మెల్లగా బయటపడి సెక్యూరిటీగార్డుల్ని దాటే వరకూ మామూలుగా నడిచి,

అక్కడినుంచి మెరుపులా పరుగందుకుంది మేఘన.

ఇలా లాభం లేదని కుర్చీ ఎత్తి గ్లాస్ డోర్ పగలగొట్టి గెడ తీసుకుని బయటకి పరుగెత్తుకుని వచ్చాడు భట్టాచార్య.

గేటు బయటవున్న సెక్యూరిటీ గార్డ్‌ల సెల్యూట్స్ స్వీకరించి ప్రశ్నించాడు "ఆ అమ్మాయి ఎటు పోయింది"

"ఇటు పోయింది సార్"

"కనబడితే అరెస్ట్ చేసి లాక్కురండి. గో ఫాస్ట్" అరిచినంత పని చేశాడు.

ఆ వెంటనే పరుగు తీశారు వాళ్ళు. పదినిముషాల తర్వాత మొహాలు వేలాడేసుకుని వచ్చి రిపోర్ట్ చేశారు.

"ఎక్కడా కనబడలేదు సార్"

తిరిగి హోం మినిష్టర్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పాడు. రాజరాజ నరేంద్రుడు ఫోన్‌లో గాడిదలా ఓండ్ర పెట్టసాగాడు "బుల్‌షిట్!... ఆ డెవిల్‌కి స్నేహితులెవరూ వున్నట్టు నాకు తెలీదు. దానికి కోఠీ సెంటర్‌లో వున్న ఆంధ్రా బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్స్ వున్నాయి. అక్కడికీ, అది అద్దెకుండే ఇంటికీ పోలీసు బలగాల్ని అర్జంటుగా పంపు. నేను కూడా నా మనుషుల్ని పంపిస్తాను. 24 గంటల్లోగా దాన్ని నాముందు హాజరు పరచాలి?"

"12 గంటల్లో హాజరు పరుస్తాను" అన్నాడు భట్టాచార్య.

"ప్రగల్భాలు వద్దు. పని కావాలి"

ఫోన్ డిస్కనెక్టు అయింది.

రెండు నెలల క్రితమే ఓ స్నేహితురాలికి 'ఇండ్లస్థలం' కొనుక్కోవడం విషయంలో అత్యవసరంగా ముప్పయివేల రూపాయలు  అవసరమైతే తను పొదుపు చేసి దాచుకున్న ఫిక్స్‌డ్ డిపాజిట్స్ అన్నీ కాన్సిల్ చేసి ఇచ్చేసిందన్న సంగతి వాళ్ళకి తెలీదు. ఆ నిజం భట్టాచార్యకి తెలిసేసరికి తను ఉండే అద్దె ఇంటిలో వున్న మేఘన కంగారుగా ఓ సూట్ కేసులో బట్టలు సర్దుకుంటోంది.

అప్పటికే జింకను వేటాడే పులులు జింకకి చేరువగా వచ్చేశాయి.

* * *

టెన్షన్‌లో ఆమె చేతులు ఆమెకి సహకరించడం లేదు. ఏ వస్తువులు తీసుకోవాలో, ఏ బట్టలు సర్దుకోవాలో కూడా తెలియని అయోమయ పరిస్థితిలో తన రూమునంతా చిందరవందర చేసేసి చివరికి చేతికందిన తన బట్టల్ని మాత్రం వణుకుతున్న చేతులతో సూట్‌కేస్‌లో కుక్కేసింది. ఆ కంగారులో ఆమెకి సూట్‌కేస్‌ని లాక్ చెయ్యడానికి పది నిముషాలు పట్టింది.

మంచం మీద వున్న పాంటు, షర్టుల్ని ధరించాలని ఆమెకి కోరికగా ఉండేది. మన హిందూ సాంప్రదాయం అలాంటి కోరికల్ని తీర్చుకోనివ్వదు కదా! మగరాయుడిలా అలాంటి బట్టలు ధరించి రోడ్డుమీదకి వెళ్లడం ఆమెకి సుతరామూ నచ్చదు. కేవలం తన ఇంట్లో గదిలో తలుపులు బంధించి మగాళ్ళ దుస్తులు ధరించి ఆ దుస్తుల్లో తనెలా వుండేదీ చూసుకోవాలనే అభిలాష ఆమెది. మొత్తానికి ఆ అభిలాషను ఆరు నెలల క్రితం తీర్చేసుకుంది. మేఘన. తనకు నచ్చే బ్లాక్ కలర్ ఫాంటు, పింక్ కలర్ షర్టు కుట్టించుకుని రాత్రి సమయాల్లో తలుపులు వేసేసుకుని ఆ దుస్తుల్ని రెండు మూడుసార్లు ధరించేసి తన కోరిక తీర్చేసుకుందామె. ఆ దుస్తులు ధరిస్తే ఆమెకి కొత్తగా... భలే థ్రిల్‌గా అనిపించేది. తను ఎడ్వంచర్స్ చేసే లేడీ జేమ్స్ బాండ్‌గానో, తిరుగులేని లేడీ ఫైటరుగానో, సాహసరాణి ఝాన్సీరాణీగానో ఊహాల్లోకాల్లో తెలిపోతూ మరింత థ్రిల్ అనుభవించేది. తనుండే హైదరాబాద్ మహానగరంలో స్త్రీలు అనేకమంది అలాంటి దుస్తులు ధరించడం సాధారణమైన విషయం అని తెలిసి కూడా ఆ దుస్తుల్ని ధరించి బయటకి వెళ్లటానికి ఆమె ఇష్టపడేది కాదు. తన కోరిక తీరిన వెంటనే ఆ దుస్తుల్ని మడతపెట్టి సూట్‌కేస్‌లో పారేసింది.

ప్రస్తుతం తనున్న పరిస్థితిలో అలాంటి దుస్తులు ధరించడం తప్ప మరో మార్గం లేదు. పోలీసు డిపార్టుమెంటు నుంచీ, హోం మంత్రి నుంచి తప్పించుకుని తన ప్రాణాల్ని రక్షించుకునే ప్రయత్నంలో 'తెలుగింటి

ఆడపడుచు'లా చీరకట్టుతో వెడితే మానం, ప్రాణం ఏకంగా పోయే చాన్సెస్ ఎక్కువ! అందుకే ఈ దుస్తులు ధరించక తప్పదు.

ఈ ఆరు నెలల్లో తను లావెక్కలేదు కనుక తనకి సరిపోవచ్చు.

ఈ దుస్తులు ధరించినంత మాత్రాన తను రక్షించబడుతుందన్న గ్యారంటీ లేదు. కాకపోతే మాన, ప్రాణ రక్షణలో తన శక్తి వున్నంతవరకు ప్రతిఘటించాలంటే ఇలాంటి దుస్తులు తప్పనిసరిగా ధరించాలి.

గబగబా తన దుస్తులు విప్పేసి పాంటులోకి షర్టు టక్ చేసి బెల్టు పెట్టింది. పాము చర్మంతో చేసిన బలమైన బ్లాక్ కలర్ పాయింట్ షూస్ తొడుక్కుంది దుస్తులు సరిగ్గా సరిపోయాయి. ప్రస్తుతం తన వద్ద వున్న పన్నెండు వందల రూపాయల నోట్లని షర్టులోంచి బాడీలో దాచింది. జుట్టును మడిచి నెత్తిమీద కేప్ ధరించింది.

సూట్‌కేస్ అందుకుని తలుపులు తెరిచిందంతే!

ఎదురుగా హేండ్‌కప్స్‌తో నిలుచున్న ఇద్దరు సి.ఐ.ల వెనుక పోలీస్ కమిషనర్ భట్టాచార్య! అప్పటికే ఆ ఇంటిని నిశ్శబ్దంగా చుట్టుముట్టేసి ఉందో పోలీసు బలగం!!

"మిస్ మేఘన... యు ఆర్ అండర్ అరెస్ట్" అన్నాడు భట్టాచార్య.

"ఏ నేరం మీద, ఏ సెక్షన్ననుసరించి నన్ను అరెస్టు చేస్తున్నారు?" ధైర్యంగా అడిగింది ఆమె క్షణంలో తేరుకుని.

లోపలికి వెళ్లటమంటూ జరిగితే ఇక బయటికి రావడం జరగదని ఆమెకు తెలుసు. అంతటితో తన చాప్టర్ క్లోజ్. కాని ఇంతమంది పోలీసు బలగాన్ని ఎదిరించడం మూర్ఖత్వం. లొంగిపోయి సమయం కోసం వేచి చూడడం వివేకమైనపని.

"ఆ ప్రశ్నలు హెూం మంత్రిని అడగండి. మనం వెళ్లేది అక్కడికే"

"సరే, పదండి" ఆమె జవాబు విని నిర్ఘాంత పోయింది పోలీసు బలగమంతా. ఎదిరిస్తుందని ఎదురుచూసిన భట్టాచార్య ఆమె ధైర్యానికి

మనసులోనే జోహార్లు అర్పించాడు.

కొందరు పోలీసులు గదంతా చిందర వందర చేసేసి వెదికేసి వచ్చారు. ఆమె సూట్‌కేస్‌ని ఓపెన్ చేసి బట్టలన్నీ బయటికి లాగేసి ఏమీ లేకపోయేసరికి ఆమె అపార్ట్‌మెంట్‌లోనికి విసిరేసి దానికి సీలు వేసేశారు.

"బేడీలు అవసరం లేదు. మీరు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను, పదండి" బేడీలు వెయ్యబోయిన సి.ఐ.తో అంది.

ఆమెను రౌండప్ చేసి మృత్యువలయంలా చుట్టుముట్టి వుంది పోలీసు బలగం.

ఒకసారి చుట్టూ చూసింది మేఘన.

తమ చుట్టూ వున్న ఇళ్ళ కిటికీలలోంచి, మేడ వరండాలలోంచి చాటు మాటుగా, బాహాటంగా చూస్తున్న మరియు రోడ్ల మీద పోతూ తమ పనులు మరిచిపోయి గుంపులు కట్టేసిన చైతన్యవంతులైన వీధి జనం తననో వింత జంతువులా చూస్తున్నారు. 'ఆమెనెందుకు అరెస్టు చేస్తున్నారని' పోలీసుల్ని ప్రశ్నించే దమ్ము వాళ్ళల్లో ఒక్కడికి కూడా లేదని ఆమెకి తెలుసు.

వాళ్ళే మగాళ్ళు!

మగతనం గుర్తురాని మగాళ్ళు!!

మనకెందుకు లెమ్మని వూరుకునే మగాళ్ళు!!!

'ఈ రోజు నడిరోడ్డుమీద, పోలీసుల మధ్య తనను తదేక దీక్షగా చూస్తున్న ఎన్ని వందల కళ్ళు రేపటి దినం తన మీద ఎన్ని వందల పుకార్లను సృష్టిస్తాయో!' అనే ఆలోచన వచ్చేసరికి మేఘన చిరునవ్వు నవ్వుకుంది.

పోలీసులతో కదిలి వేన్ ఎక్కిందామె.

వేన్‌తో పాటు రెండు జీపులూ కదిలాయి.

ఆ క్షణంలోనే జనచైతన్యంలో గుసగుసలు, వాదనలు, విమర్శలు, చర్చా సమావేశాలు సంచలనంగా ప్రారంభమయ్యాయి.

అదేనండీ జన చైతన్యం!

తిరుగులేని చైతన్యం!!

పుకార్ల ఫిక్షన్‌ని సృష్టించడానికి ఎదురు లేని నవ చైతన్యం!!!

* * *

ఆమె వైపు నిశితంగా చూశాడు హెూం మంత్రి రాజరాజ నరేంద్రుడు. అతడి కళ్ళల్లో కదలాడిన రౌద్రానికి ప్రతిరూపంగా నిలచిన ఎర్రజీరలు క్షణకాలం నిలిచి మాయమయ్యాయి. నవ్వుతూ ఫీలింగ్స్ మార్చేశాడు. "ఫర్వాలేదే! వీరనారీమణిలా మగదుస్తులు ధరించి సాహసాలు కూడా చేస్తున్నావన్నమాట. ఈ డ్రెస్‌లో నువ్వు చాలా బావున్నావు. నా మాటవిని యిక ముందు నువ్వు చీరలు కట్టడం మానేసి ఇలాంటి దుస్తులే ధరించు..."

ఆ బంగ్లా బయట పోలీసు బందోబస్తు వుంది. లోపల మాత్రం ఓ ప్రత్యేకమైన హాలులో వున్న వాళ్ళు ముగ్గురే... రాజరాజ నరేంద్రుడు, భట్టాచార్య, మేఘన.

"నన్నెందుకు అరెస్ట్ చేయించారో చెబుతారా సార్?" ధీమాగా ప్రశ్నించింది మేఘన.

"తప్పకుండా... నేను ఐరన్ సేఫ్‌లో దాచిన హెూం డిపార్ట్‌మెంట్‌కి చెందిన కొన్ని కీలకమైన పత్రాలున్న 'గ్రీన్ ఫైల్'ని దొంగిలించిన నేరానికి నిన్ను అరెస్టు చేయించాను" నవ్వాడు హెూం మంత్రి వ్యంగ్యంగా.

"ఇలాంటిదేదో వుంటుందని నేను ముందే ఊహించాను. కాని ఇంతకంటే బలమైన కేసులో ఇరికిస్తారనుకున్నాను" కాస్త కదలబోయింది.

"డోంట్‌మూవ్" పిస్టల్ తీసి ఆమెకు గురిపెడుతూ అన్నాడు భట్టాచార్య.

"ఎలాంటి కేసు?"

"మాఫియా" ఆమె నోటి వెంట ఆ మాట విని బుసలు కొట్టే విషనాగులా చూశాడు రాజరాజ నరేంద్రుడు. అయితే దీనికి తన గురించి అంతా తెలిసిపోయిందని తను ఊహించింది నిజమేనన్నమాట అనుకున్నాడు అతడు.

అవకాశం కోసం ఎదురు చూస్తోంది మేఘన.

"నిన్నెక్కడికి చేర్చాలో అక్కడికే చేరుస్తాను" స్వగతంగా అన్నాడు రాజరాజ నరేంద్రుడు.

అదే సమయంలో కాస్త పక్కకి చూశాడు భట్టాచార్య. ఆ చిన్న అవకాశాన్ని వదులుకోవడం ఆమెకిష్టం లేదు. ఇంకేమీ ఆలోచించదలచుకోలేదు.

మెరుపువేగంతో పిడుగుపాటులా కుడికాలు విసిరింది మేఘన. ఆ కాలు పోయి సరాసరి భట్టాచార్య రెండు కాళ్ళ మధ్య టెస్టికల్స్‌ని తాకింది. బలమైన పాయింట్ షూ కావడం వల్ల, ఆమె వేగానికి ఆ దెబ్బ అతణ్ణి చాలా ఘోరంగా తాకింది.

నలభై ఐదేళ్ళ భట్టాచార్యకి కూడా ఆ సమయంలో మేఘనలాంటి మరో స్త్రీ అయిన తన 'అమ్మ' జ్ఞాపకానికి వచ్చింది.

"అమ్మా" అంటూ కెవ్వున అరచి పిస్టల్ వదిలేసి కాళ్ళ మధ్య పట్టుకుని కింద కూలబడిపోయి మెలికలు తిరగసాగాడు అతడు.

కింద పడిన పిస్టల్ తను అందుకుని దిగ్భ్రాంతిగా చూస్తున్న రాజరాజ నరేంద్రుడు కళ్ళ ముందు పిస్టల్ ఆడించి ఒక్కొక్క అడుగు వెనక్కి వెనక్కివేసి బంగ్లా వెనుక తలుపు తెరిచి బయటికి అడుగు పెట్టబోయింది. ఆమె నెత్తిన పిడుగుపాటులా పిస్టల్ పిడి తగిలింది అంతే... పట్టపగలు నక్షత్ర మండలాన్ని చూస్తూ స్పృహ కోల్పోయింది మేఘన.

గుమ్మం బయటి నుంచి వెకిలినవ్వు నవ్వుతూ లోనికి వచ్చిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోగారావ్ పిస్టల్‌ని హోల్‌స్టర్‌లోకి తోసి హోం మంత్రికి సెల్యూట్ చేశాడు. "మీరు కబురంపించారని తెలిసి వచ్చేసరికి లోపల ఆమె మిమ్మల్ని బెదిరించడం చూసి లోపలి వరండాలోంచి గదుల్లో దూరి ఫ్రెంచ్ విండోలోంచి తోటలోపడి ఇలా వచ్చాను."

"వెరీగుడ్... సమయానికి వచ్చావ్ మిష్టర్ జోగారావ్. ఆ డర్టీబిచ్‌ని బాగా దెబ్బతీశావ్. టేక్‌హర్ ఇన్ టు మై కస్టడీ.... కమాన్, మూవ్" అంటూ ముందుకి

కదిలాడు రాజరాజ నరేంద్రుడు.

ఆమెని భుజం మీద వేసుకుని అతణ్ని అనుసరిస్తూ అనుకున్నాడు జోగారావ్ 'దీని సామిరంగా! శవంలా ఎంత బరువుందో... ఛ కానిస్టేబుల్ కంటే అధ్వాన్నంగా ఈ మోతలు మాత్రం తప్పటం లేదు. పోలీసాఫీసరుద్యోగం కంటే కాటికాపరి జాబ్ నయం'

ముప్పయ్యేడు సంవత్సరల జోగారావ్ మంచి ఆరోగ్యంగా, బలంగా వుంటాడు. చిత్రం ఏమిటంటే పోలీసు డిపార్టుమెంట్‌లో వుండికూడ అతడికి చెడు వ్యసనాలేమీ లేవు.

కానీ డబ్బు వ్యామోహం మాత్రం కావాల్సినంత వుంది. 'ధనలక్ష్మి' ఏ రూపంలో వచ్చినా సరే అతడికి అభ్యంతరం లేదు. 'ఆమె' కోసం అతడి యింటి తలుపులు ఎప్పుడూ తెరిచే వుంటాయి.

ఆమెని ఓ గదిలో డబుల్‌కాట్ మంచం మీద మెత్తటి ఫోంబెడ్ మీద పడుకోబెట్టాడు జోగారావ్.

ఆమెని కాంక్షగా చూస్తూ మనసులో అనుకున్నాడు రాజరాజ నరేంద్రుడు 'ఇది ఏ విధంగానూ లొంగేరకం కాదు. దీన్ని ఈ రాత్రికే బలవంతంగా అనుభవించాలి. ఆ వెంటనే పైలోకానికి పాస్‌పోర్టు యిచ్చేయటమే!'

జీవ పరిణామ సిద్ధాంతం ప్రకారం ఆలోచిస్తే జంతురూపు నుంచి క్రమ క్రమంగా పరిణామం చెంది భౌతికంగా మార్పులు పొంది మానవ రూపుకొచ్చిన మనిషిని జంతు స్వాభావికమైన లక్షణాలు, వాటి వాసనలు వదలవు. తరతరాల వరకు అవి మనిషిని శాతాను శక్తుల్లా వెంటాడుతూనే వుంటాయి. అందుకేనేమో జీవశాస్త్ర వేత్త అయిన అరిస్టాటిల్ 'నరుడు మానవమృగం' అంటాడు. జంతువుకి, మనిషికి తేడా ఒక్కటే. జంతువు ఆలోచించలేదు. మనిషి ఆలోచించగలడు.

మృగంలో లేని విచక్షణాజ్ఞానం మనిషిలో వుంది కనుకే అతడో శక్తిగా మారాడు.

ఆలోచించే శక్తే కనుక మృగానికున్నట్టయితే మనిషి మనుగడ

ఈనాడింతగా వుండేదికాదేమో! విచక్షణారహితంగా ఆలోచించే వాళ్ళని మానవత్వం వున్న మనుషులు అనరు. విచక్షణారహితంగా ఆలోచించి వక్రమార్గాల్లో రాక్షస ప్రవృత్తి పెంపొందించుకునే రాజరాజ నరేంద్రుడు లాంటివాళ్ళని మానవ మృగాలు అనాలి!

"డోర్ లాక్ చేసి రా" అంటూ బయటికి నడిచాడు రాజరాజ నరేంద్రుడు.

అతడి వెనుకే నడవబోతూ కాజువల్‌గా ఆమె వైపు చూసిన జోగారావ్‌కి మేఘన మెడలో మెరుస్తూ కనిపించింది ఒంటిపేట బంగారు గొలుసు. అతడి కళ్ళు మెరిశాయి.

ఇంకేమీ ఆలోచించకుండా ఆమెను చేరి మేఘన మెడలోని గొలుసు విప్పుతూ అన్నాడు జోగారావ్. "నువ్వు హాయిగా రెస్టు తీసుకో తల్లీ... నిన్నస్సలు డిస్టర్బ్ చేయను. ఈ గొలుసు నేను తీసుకుంటున్నాను సుమా! లేచిన తర్వాత గొలుసు పోయిందనుకుంటావని ముందే చెపుతున్నాను"

గొలుసుతో బయటికి నడుస్తూ ఓ పాట అందుకున్నాడు జోగారావ్. "ఛల్ మోహనాంగీ... నీకు, నాకు జోడి కుదిరెను పదవే....ఓ గోల్డ్ లక్ష్మీ... ఓ బంగారు లక్ష్మీ..."

ఆమె వున్న బంగ్లా హోం మినిస్టరు విలాసాలకు ఉపయోగపడే గెస్ట్‌హౌస్.

* * *

స్పృహలోకొచ్చేసరికి తలంతా దిమ్ముగా అనిపించింది. మత్తు యివ్వకుండా తలకు శస్త్ర చికిత్స చేస్తున్నట్లుగా వుంది. ఎప్పుడూ అంత బాధ భరించలేదామె. కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

ఎవరో వస్తున్న అడుగుల చప్పుడు విని ఆమె గుండెల్లో జెట్‌లు పరుగెత్తసాగాయి. ఆ సమయంలో ప్రత్యర్థులతో తలపడే శక్తి తనకి లేదని ఆమెకి తెలుసు.

ప్రత్యర్థి యేం చేసినా చూస్తూ వూరుకోవాలా? శీలం దోచుకున్నా, ప్రాణం

తీసినా జీవచ్ఛవంలా చూస్తూ వూరుకోవాలా? ఛ...తన ధైర్యసాహసాల్ని తన మెదడు అమానుషంగా అణచివేస్తోందేమిటీ? నో....అలా జరగడానికి వీల్లేదు. తను ప్రతిఘటించాలి. ప్రాణదీపం కడగంటేవరకు ప్రత్యర్థితో పోరాడాలి.

ఒకసారి కళ్ళు మూసి తెరిచి, మంచంమీంచి మెల్లగా లేచి కూర్చుంది.

అడుగుల చప్పుడు మరీ దగ్గరైంది.

చిరుచీకట్లు అప్పుడే ముసురుకుంటున్నాయి.

చుట్టూ చూసింది మేఘన. ఆమెకి అందుబాటులో ఏ చిన్న ఆయుధం కనిపించలేదు. తలమీద ఓ బండరాయి పెట్టినట్లుంది.

మనసుని తన అదుపులోకి తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ డోర్ వైపు చూడసాగింది మేఘన.

అదే సమయంలో భళ్ళున తెరుచుకుందా డోర్. గుమ్మంలో ప్రత్యక్షమై రూంలోకి అడుగుపెట్టిన ఆ పద్దెనిమిదేళ్ళ పరువాల బొమ్మని చూసి విభ్రమంగా ప్రశ్నించింది "శ్రీలేఖా! మీరా?"

"ఆ ... నేనే. త్వరగా మొహంకడుక్కో. మత్తంతా దిగుతుంది. మనం త్వరగా బయలుదేరాలి" అంది శ్రీలేఖ.

"ఎక్కడికి?"

"ఆ....ఏట్లోకి! లేకపోతే ఏమిటా పిచ్చి ప్రశ్న. ఇక్కడే సెటిలైపోదామని వుందా!"

"ఊహూ" తల అడ్డంగా ఊపింది.

"మరైతే తొందరగా తెములు మరి"

గబగబా ఎటాచ్డ్ బాత్రూమ్‌లో దూరింది మేఘన.

శ్రీలేఖ ఎవరోకాదు. స్వయానా హోం మంత్రి శ్రీ రాజరాజ నరేంద్రుడి పుత్రికారత్నం. రత్నం అని ఎందుకన్నానంటే ఆమె నిజంగా రత్నమే. తండ్రి ఎంత దుర్మార్గుడో కూతురు అంత మంచి మనిషి. ఆమె చాలా సున్నితమైన మనస్కురాలు. తనకు నచ్చని అంశం చూడడం గానీ, వినటం గానీ జరిగితే

అది భరించలేదామె. తన తండ్రి చేసిన పాపపు పనులన్నీ ఆమెకు తెలుస్తూనే వున్నాయి. తండ్రి చేసిన పాపాలు ఒక్కొక్కటి తెలిసినప్పుడల్లా ఆమె మనసు అగ్నిగుండం అయిపోతుంది. ఆ సమయంలో ఆమె ఏడుస్తుంది. గుండె పగిలేలా మూగగా రోదిస్తుంది. ఆమె మనసులో అగ్నిజ్వాలలు రేగి ఆమె హృదయంలో దావానలం జ్వలిస్తుంది. 'తండ్రి చేసే పాప కార్యాలు తనకు తెలియకూడదు భగవంతుడా!' అని ఆ కనిపించని దేవుణ్ణి ప్రార్థిస్తుంది కానీ అదేం చిత్రమో ఆ పాపాలన్నీ ఆమెకి ఎవరి ద్వారానో, కాకతాళీయంగానో, తండ్రి స్వగతం ద్వారానో తెలుస్తూనే వుంటాయి. చేసిన పాపం కంటే విన్న పాపం బ్రహ్మహత్యా పాతకమైనా, కాకపోయినా మానవత్వం వున్న మనుషులెవరూ పాప కార్యాలను విని సహించలేరనేది నిర్వివాదాంశం.

మొదట్లో ఆమె తండ్రి చేసిన పాపాలు వింటూ మానసికంగా బాధపడుతూ మానసిక రుగ్మతకు లోనయ్యేది. పోనుపోను ఆ రుగ్మత ఎక్కువవుతుండేసరికి సైకాలజిస్ట్ చెప్పిన సలహాలు పాటించలేక రుగ్మతను ఎక్కువ చేసుకొని, నివారణోపాయాల గురించి మార్గాలు వెదుకుతుండగా ఆమెకి ఓ అద్భుతమైన మార్గం దొరికింది.

అద్భుతమైన ఆ సులభ మార్గం పేరే మార్ఫిన్!

అది తీసుకున్నప్పుడు ఆమెకి హాయిగా అనిపించేది.

బాధనంతా క్షణాల్లో మరిచిపోయి వూహాలోకాల్లో విహరించేది. ఏ మానసిక రుగ్మతా ఆమె దరిచేరేది కాదు.

ఎప్పుడయినా అనుకోకుండా తండ్రిచేయబోయే దుర్మార్గాలు ముందుగా తెలిస్తే ఆ దుర్మార్గాలు జరగనిచ్చేది కాదు. తన తెలివితో తండ్రి చేతుల్లో యిరుక్కున్నవాళ్ళని రక్షించేది. అలా రక్షించగలిగినప్పుడు ఆమె చాలా సంతోషంగా వుండేది. ఆ సమయాల్లో ఆమెకు మార్ఫిన్ అవసరమయ్యేదికాదు.

మేఘనకి శ్రీలేఖతో పెద్ద చనువుగానీ, స్నేహం గాని లేవు. ఆమె తన బాస్ కూతురని తెలుసుగాని ఆమె తనతో ఎప్పుడు సరిగా మాట్లాడకపోవడంతో

ఆమెకి గర్వమనుకుని తనే ఆమెను తప్పుగా అర్థం చేసుకుంది.

ఇప్పుడా అనుమానాలన్నీ పటాపంచలు అయిపోయాయి.

తన తండ్రి, భట్టాచార్య మేఘనని ట్రాప్ చేయడం కోసం మాట్లాడుకోవడం వింది శ్రీలేఖ. సమయం చూసుకొని ఆమెను విడిపించడానికి అక్కడికి వచ్చింది.

బాత్రూంలోంచి వచ్చిన మేఘనకి టవల్ అందించింది ఆమె. మొహం తుడుచుకుని తలమీద కేప్ పెట్టుకుంది మేఘన.

సరిగ్గా అదే సమయంలో రాజరాజ నరేంద్రుడు పూలరంగడిలా తయారై కారులో ఆగమేఘాల మీద వచ్చేస్తున్నాడు గెస్ట్ హౌస్‌కి.

వేనిటీ బాగ్‌లోంచి చిన్న సైజు పౌడర్ టిన్ను సైజులో వున్న "విస్కీ ఫ్లాస్క్" తీసింది శ్రీలేఖ. "మందు కొట్టకూడదూ?"

ఉలిక్కిపడింది మేఘన. "ఛ... నాకు అలవాటు లేదు."

"అంత అసహ్యంగా వుండదు. బాగుంటుంది"

"ఛ ఛ... బావుండటానికి అదేమన్నా అమృతమా ఏమన్నానా?"

"అవుననకో, చేదుగానే వుంటుంది వేపరసంలా. కాని నువ్వున్న పరిస్థితిలో ఇది నీకు అమృతమే. ఆ సి.ఐ. జోగారావ్ గాడు కొట్టిన దెబ్బ బాధ తగ్గాలంటే ఇదే మందు."

"నన్ను కొట్టింది జోగారావా?"

"అవును. నేను చూశాను. కాని ఆ సమయంలో నిన్ను రక్షించడానికి అవకాశం లేకుండా జోగారావ్‌గాడు వచ్చాడు. అందువల్ల సాయంత్రం వరకు ఆగాల్సి వచ్చింది"

ఆమెవైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసింది మేఘన. "నీ మేలు మరిచిపోను శ్రీలేఖా!"

"ఇలాంటి కబుర్లు మానేయ్. మా రాక్షసతండ్రి అన్యాయానికి బలికాకుండా నిన్ను రక్షించుకోగలిగినందుకు నాకు బ్రహ్మానందంగా వుంది. ఇంతకీ మందు కొడతావా కొట్టవా?" ఫ్లాస్క్‌ని ఎత్తి చూపించింది.

"వద్దు, ఆల్కహాల్ తాగను. నాకు బాగానేవుంది. పద పోదాం" అంటూ వేనిటీబాగ్‌లోంచి దొర్లుకుంటూ వచ్చి మంచం మీద పడిన చిన్న సైజ్ మెడిసిన్ బాటిల్‌ని చూపించి అదేమిటని అడిగింది మేఘన.

"వెనకటికి నీలాంటి వాడే ఒకడు ఓ ఊబిలో కూరుకుపోతూ తనకు ఎదురుపడ్డ ఓ మనిషిని తనను రక్షించమని అడగడం పోయి, పొడుపు కథలు వేస్తాను విప్పుతావా? అన్నాడట...అలావుంది నీ వ్యవహారం. నీకు 'ఫ్లాష్ బాక్' స్టోరీ చెబుతూ కూర్చుంటే ఈ లోపులో మా బాబు వచ్చేసి నన్నో లెంపకాయ్‌కొట్టి బయటికి తోసేసి నిన్ను నాశనం చేసే ప్రోగ్రామ్‌లోకి దిగుతాడు. వెళుతూ మాట్లాడుకుందాం" ఆ విస్కీ ఫ్లాస్క్‌నీ, చిన్నసైజ్ మెడిసిన్ బాటిలునీ వేనిటీబేగ్‌లో పెట్టుకుంది. ఇద్దరూ మేడ దిగారు.

"మనం వెళ్ళేది అటుకాదు. బంగ్లాముందు మా నాన్న నలుగురు యమకింకరుల్ని కాపలా పెట్టాడు. మనకు వెనకదారి దివ్యంగా వుంటుంది. బంగ్లా ముందునుంచి వెనకవైపుకి సగం వరకు మాత్రమే ప్రహారీ గోడ వుంటుంది. అక్కడి నుంచి వెనక వైపంతా గుబురుపొదలే ప్రహారీలా లేచిపోయాయి. అదే మనకు సీక్రెట్ వే..." చెప్పింది శ్రీలేఖ.

చుట్టూ ఒకసారి చూసి నిశ్శబ్దంగా తోటలోకి అడుగుపెట్టారు ఆ ఇద్దరూ. చెట్ల మధ్యగా నడుస్తూ మహా జాగ్రత్తగా వెళ్లారు పొదల దగ్గరికి.

అక్కడంతా పొదలమయం. అల్లిబిల్లిగా, వంకర టింకర్లుగా పదడుగుల ఎత్తున పెరిగాయి పొదలు.

ఓ పొద మధ్య నుంచి ఆమెను తీసుకు వెళ్లింది శ్రీలేఖ. అక్కడినుంచి కాస్త వంకర టింకర్ల దారి అడ్డదిడ్డంగా వున్నా ఒక మనిషి నడిచే వీలున్న సన్నటిదారి స్పష్టంగానేవుంది. అక్కడి నుంచి ఒకరి వెనుక ఒకరు నడవసాగారు.

చిరుచీకట్లు ముసురుకుంటున్నా, దారి చూసుకుంటూ నడవడం వాళ్ళకి కష్టం కాలేదు.

రెండు నిముషాల తర్వాత పొదలు ఎండ్ అయ్యాయి. అక్కడ మేఘన

కళ్ళకు రెడ్ కలర్ మారుతీకారు కనిపించింది.

"కారు డ్రైవింగ్ వచ్చు కదూ!" అడిగింది శ్రీలేఖ. తలవూపింది మేఘన.

"అయితే నువ్వు డ్రైవ్ చెయ్. నేను వెనుక సీట్లో కూర్చుంటాను" డోర్‌లాగి వెనుక సీట్లోకూర్చుంది శ్రీలేఖ "ఎలా వెళ్లాలో తెలుసా?"

"నన్ను వేన్‌లో తీసుకువచ్చినప్పుడు ఈ దారి గుర్తుపెట్టుకున్నాను" డ్రైవింగ్ సీట్లో కూర్చుని కారు స్టార్ట్ చేసింది మేఘన.

వేనిటీ బేగ్‌లోంచి మెడిసిన్ బాటిల్ తీసింది శ్రీలేఖ "ఈ బాటిల్ ఏమిటని అడిగావు కదూ! ఈ బాటిల్‌లో వున్నది మార్ఫిన్"

"ఆ... " అదిరిపాటుగా సడెన్ బ్రేక్ వేసింది మేఘన. "నీకు మార్ఫిన్ అలవాటుందా?"

"ఎందుకా కంగారు?"

"మార్ఫిన్ లాంటి మాదకద్రవ్యాలు ప్రాణాలు తీస్తాయి" తిరిగి కారు స్టార్ట్ చేస్తూ అందామె.

"ప్రాణం పోతేనే బావుంటుంది" శ్రీలేఖ కళ్ళల్లో వైరాగ్యాన్ని చూడలేక పోయింది మేఘన "ఎందుకా నిరాశ"

"నిరాశ కాదు. ఈ జనారణ్యంలో మనుషులు మానవత్వం మరిచిపోయి దానవుల్లా పోట్లాడుకుని మారణహోమాలు సృష్టిస్తున్నారు. అమాయకుల్ని బలి పశువులుగా చేసి క్రూరమృగాల్లా క్షుద్రయజ్ఞాలు చేస్తున్నారు. అంతం లేని ఆ మారణహోమాల మహారణ్యంలో జీవించడం బదులు మరణించడమే మేలు"

"నువ్వు మాట్లాడేది నీ తండ్రిలాంటి వాళ్ళని ఉద్దేశించే కదూ!"

అదే సమయంలో వాళ్ళకి ఎదురుపడ్డ ఓ చెవర్లెట్ కారు వేగంగా దూసుకుపోయింది. ఆ కారులో వున్న రాజరాజ నరేంద్రుడూ వీళ్ళని చూడలేదు, వీళ్లూ అతడిని చూడలేదు.

"అవును. నా తండ్రిలాంటి నీచుల గురించే నేను మాట్లాడేది. నా తండ్రి చేస్తున్న మారణహోమాలు విని భరించలేక నేనెన్ని నిద్రలేని రాత్రులు గడిపానో

నీకు తెలీదు" ఆమె గొంతులో జీర, హృదయంలో బాధ, మనసులో ఆవేదన తొంగిచూస్తున్నాయి. "మానసిక రుగ్మతతో నేనెంత నరకాన్ని అనుభవించానో నీకు తెలీదు. సైక్రియాటిస్ట్‌ని కలిస్తే 'నీది సున్నితమైన మనసు. అన్యాయాలు విని భరించలేవు. నీ తండ్రి చేసే అమానుష కార్యాలు విననట్టే ఊరుకో. నెగెటివ్‌గా ఎప్పుడూ ఆలోచించకు. బి హేపీ' అన్నాడా డాక్టర్. కాని అతడు చెప్పింది ఏదీ పాటించలేకపోయాను. అమానుష కార్యాలు విని, విననట్టు ఆలోచించకుండా ఎలా ఉండగలను. అక్కడినుంచి దూరంగా పారిపోవాలి. ఎక్కడికి పారిపోవాలి. పారిపోయినా ఆ రుగ్మత నన్ను వదులుతుందా? ఆత్మహత్య చేసుకునే ఆలోచన నాకు నచ్చలేదు. ఆలోచించగా చివరికి ఈ మార్గం తట్టింది. నేను రాత్రులందు మానసిక రుగ్మతతో పిచ్చిపిచ్చిగా ఆలోచించకుండా సుఖంగా నిద్రపోవాలంటే ఈ మార్ఫినే మందు.

నా తల్లి నా చిన్నతనంలోనే పోయింది. అన్నావదినలు స్టేట్స్‌లో ఓ యాక్సిడెంట్‌లో చనిపోయారు. పేరుకి ఆ తండ్రి కూతుర్ని, అంతేకాని తండ్రి ప్రేమకి నోచుకోలేదు నేను. నాపై ప్రేమానురాగాలు, మమతానురాగాలు చూపించలేని నా తండ్రి నాకు ప్రసాదించిన వరం ఈ మానసిక రుగ్మత, దానికి మందు ఈ మార్ఫిన్" బాగ్‌లోంచి సిరెంజి తీసి సిరెంజికున్న సూదిని బాటిల్‌కున్న రబ్బరు బిరడాలోకి గుచ్చింది శ్రీలేఖ.

ఆమెమీద జాలితో మేఘన హృదయం ద్రవించుకుపోయింది. అలాంటి శిక్ష పగవాళ్ళకి కూడా వుండకూడదనుకుంది.

గెస్ట్ హౌస్‌లో ఆమె లేకపోయేసరికి బయట కాపలా వున్న యమకింకరుల్ని నోటికి వచ్చినట్టు తిట్టి వెదకమని రాజరాజ నరేంద్రుడు వాళ్ళని పంపాడనిగాని, ఆ నలుగురు యమకింకరులు అంబాసిడర్ కారులో తమ వెనక వస్తున్నారని గాని ఆ అమ్మాయిలకు తెలీదు.

శ్రీలేఖ బాటిల్‌లోని మెడిసిన్‌ని కొంత సిరెంజిలోకి లాగడం మిర్రర్‌లోంచి చూసిన మేఘన అడిగింది "సంతోషంగా వున్నప్పుడు డ్రగ్ అవసరం లేదన్నావు.

మరిప్పుడెందుకు తీసుకోబోతున్నావు"

"నిజమే. కానీ ఈ రోజెందుకో మరి డ్రగ్ తీసుకోవాలనిపిస్తుంది"

"అలా అనిపించడమే డ్రగ్‌కి బానిస కావడానికి నాంది. ఐ థింక్ యు ఆర్ గోయింగ్ యిన్ టు డ్రగ్ ట్రాప్"

"ఐ డోంట్ థింక్ సో... ఎందుకంటే... నేను తీసుకునే మార్ఫిన్ మోతాదు 0.0015 గ్రాములు మాత్రమే. అది ప్రాణహాని కలిగించదు. గాఢమైన నిద్రను ప్రసాదిస్తుంది"

మార్ఫిన్ నల్లమందు నుంచి తీస్తారు. నల్లమందులో 3 నుంచి 23 శాతం మార్ఫిన్ వుంటుంది. మార్ఫిన్ మత్తు కలిగించడానికి 0.005 గ్రాముల మోతాదు చాలు. 0.0015 నుంచి 0.0030 గ్రా॥ మార్ఫిన్ తీసుకుంటే ఒళ్ళు తెలియనంతగా నిద్రపడుతుంది. 0.02 గ్రాములు మార్ఫిన్ ప్రాణహానికి దారితీస్తుంది. ఓపియమ్‌కు కొన్ని రసాయనాలు కలిపి మార్ఫిన్‌గా మార్చవచ్చు. దీనికి వాసన వుండదు గాని రుచికి చేదుగా వుంటుంది. ఇది టాబ్లెట్లు, క్రిస్టల్స్ (తెల్లటివి), యింజెక్షనుల రూపంలో దొరుకుతుంది. ఈ డ్రగ్ తీసుకున్న వాళ్ళని బాధను ఓర్చుకునే శక్తి వుంటుంది.

తమకు నిత్యం తటస్థించే సామాజిక, కుటుంబ సమస్యల నుంచి తప్పించుకోలేనివాళ్ళు, హీనమనస్కులు డ్రగ్స్‌కి అలవాటుపడి చివరికి అవి లేకపోతే బ్రతకలేనంతగా మాదకద్రవ్యాలకి బానిసలౌతారని మానసిక శాస్త్రవేత్తలు చెబుతారు.

"మెదడులో జీవకణాలు చచ్చిపోతూ క్రమక్రమంగా శరీరంలోని జీవన వ్యాపారాలకు అంతరాయం కలిగించి ఇలాంటి డ్రగ్స్ ఎప్పుడో ఒకప్పుడు ప్రాణాంతకమౌతాయి. ప్లీజ్... నా మాట విని ఈ దురలవాటుకి స్వస్తి చెప్పు"

"నో... ఈ డ్రగ్ వుంది కాబట్టే నా మానసిక రుగ్మతని అణచివేస్తూ నేనింకా ఇలా బ్రతకగలుగుతున్నాను. లేకపోతే ఎప్పుడో మానసిక రుగ్మతతో సంఘర్షణ అనుభవించి 'బ్రెయిన్ హెమరేజ్'తో చనిపోయే దాన్ని. లేక

పిచ్చెక్కిపోయి నగరవీధుల్లో బిచ్చగత్తెలా తిరిగేదాన్ని. ఐ లైక్ మార్ఫీన్... ఐ లవ్ మార్ఫీన్" సూదిని చేతిమీద నరానికి గుచ్చుకుని, కళ్ళు మూసుకుని యింజెక్ట్ చేసుకుని నవ్వుతూ అంది శ్రీలేఖ. "మార్ఫీన్ ఈజ్ ది సీక్రెట్ ఆఫ్ మై ఎనర్జీ" సిరెంజిని బేగ్‌లో వేసి, బేగ్‌ని సీటుకిందకి వదిలేసింది. వెనుక ముంచుకు వస్తున్న ప్రమాదం ఆమెకి తెలియదుగా మరి. తెలిస్తే ఆ సమయంలో మార్ఫీన్ ఆలోచనను వాయిదా వేసేది.

"శ్రీలేఖా మరి నిన్నెక్కడ దింపాలి?"

"నువ్వెక్కడ దిగితే అక్కడే నా కారుతో పాటు నన్ను వదిలెయ్" నవ్వింది. మాటలు మగతగా వస్తున్నాయి.

"అదెంత ప్రమాదం"

"ప్రమాదం గ్రిమాదం జాన్‌తానై... హోం మినిస్టరు కూతురుకి... ప్రమాదం... ఏమి... ఏమి" ఆపై పూర్తిగా మత్తులోకి జారిపోయి సీటుమీదకి జారిపోయింది శ్రీలేఖ.

"శ్రీలేఖా.. శ్రీ లేఖా..." మేఘన ఎంత పిలిచినా ఆమె పలకలేదు. ఎలా పలుకుతుంది. శ్రీలేఖ స్వర్గానికి బెత్తెడు దూరంలో వుంది.

రంగుల కల కంటోందామె.

ఊహాల్లోకాల్లో విహరిస్తోంది!

సుందర స్వప్నంలో తేలియాడుతోంది!!

ఆ సమయంలో ఆమెకి తండ్రిగాని, తండ్రి చేసే కిరాతక కార్యాలు గాని, మేఘన గాని, ఆమెను తరుముతున్న యమకింకరులు గాని, తనుగాని, తన పేరుగాని, తన ఉనికి గాని ఆమెకు ఏమీ గుర్తులేవు.

జనారణ్యంలో మానవ మృగాలు చేసే మారణ హోమాలకి దూరంగా ఆమె విహరిస్తోంది.

మానసిక రుగ్మతలు తెచ్చే సమస్యల వలయానికి దూరంగా ఆమె పయనిస్తోంది!!

రంగుల కలలాంటి సుందర స్వప్నంలో స్వేచ్ఛావిహంగంలా తేలియాడుతోంది!!

అదో స్వర్గం!

తనో వీనస్!

అదే ఆమెకు గుర్తు!!

'శ్రీలేఖని ఆమె తండ్రికీ, ఆమె తండ్రివున్న పరిసరాలకి దూరంగా 'ఇన్‌టెన్సివ్ కేర్'లో వుంచి ఒక మంచి డాక్టర్ చేత శస్త్ర చికిత్స చేయిస్తే గాని ఆమె మాదక ద్రవ్యాల అలవాటుని మానదు' అనుకుంటూ రియర్ వ్యూ మిర్రర్‌లోకి చూసి ఉలిక్కిపడింది మేఘన.

తనకారుని ఓవర్‌టేక్ చెయ్యాలని ప్రయత్నిస్తూన్న అంబాసిడర్ కారు, ఆ కారులోని నలుగురు యమకింకరుల్ని చూసేసరికి తనున్న పరిస్థితి అర్థమై క్షణకాలం ఏం చెయ్యాలో తోచలేదు.

మరుక్షణం గేర్ మార్చి యాక్సిలేటర్‌ని అడుగుకంటా తొక్కింది మేఘన. సన్నని శబ్దం సృష్టిస్తూ వేగం పెరిగి రివ్వున రాకెట్‌లా దూసుకుపోతోంది మారుతి.

వెనుకనున్న అంబాసిడర్ తమ మారుతీని డేష్ కొడితే తీర్థంలో బొమ్మ కారులా తమ కారు ఈజీగా తిరగబడి కారుతో పాటు తామిద్దరూ అప్పడాల్లా నలిగిపోవడం ఖాయమని ఆమెకు తెలుసు. ఆ జి ఎన్.టి. రోడ్‌లో అంత వేగంగా కారు నడపడమంటే ప్రాణాలతో చెలగాటమనీ తెలుసు. కాని అక్కడ అంతకంటే మరో మార్గం లేదు కనుక ఆ యమకింకరుల్ని దాటిపోవాలనే ఆమె అభిలాష ఆమె ప్రాణాలతో చెలగాటమాడేలా చేస్తోంది!

వెనుక యమకింకరులు కూడ తమ కారు వేగం పెంచి ఆ మారుతీని డాష్ కొట్టి కారునీ కారులో మనుషుల్ని అప్పడాల్లా నలిపేయాలని ఉవ్విళ్ళూరి పోతున్నారు గాని ఆ కారుని అందుకోలేకపోతున్నారు. ఆ కారు తమ యజమాని కూతురు తెచ్చిందని గాని, ఆ కారులో ఆమె ఉందనిగాని వాళ్ళకి తెలీదు.

అంత వేగంలో కూడ ఎదురు వచ్చే జెయింట్ సైజ్ ట్రాన్స్‌పోర్ట్ లారీలనీ,

బస్సుల్నీ తప్పించుకుంటూ తమ ముందున్న హెవీ పెట్రోల్ వెహికల్స్‌ని షార్ప్‌గా ఓవర్ టేక్ చేస్తూ "ఇంటర్ నేషనల్ కార్ రేసింగ్"లా మారుతీని డ్రైవ్ చేస్తోంది మేఘన.

హోం మినిస్టర్ దగ్గర సెక్రటరీగా పనిచేసేటప్పుడు కారు డ్రైవింగు తప్పని సరిగా తెలిసి వుండాలనడంతో నేర్చుకుందామె. అదే ఆమెకిప్పుడు బాగా ఉపయోగపడుతుంది. అంత వేగంగా కారు డ్రైవ్ చేసే సాహసం శ్రీలేఖకి లేదు, ఆమె ప్రస్తుతం భూలోకంలోనూ లేదు!

తనింత వేగంగా డ్రైవ్ చేయగలుగుతోందంటే ఆమెకే ఆశ్చర్యంగా వుంది. ఇది నమ్మశక్యంగా లేదు. కానీ నమ్మితీరాలి.

ప్రాణాలు తీయడం వాళ్ళ లక్ష్యం!

ప్రాణాలు కాపాడుకోవడం తన లక్ష్యం!ఈ లక్ష్యసాధనలో ప్రాణాలకు తెగించడం సహజం!!

అదే లక్ష్యం తన సాహసానికి జీవం పోస్తోంది.

ఇదో డెత్ గేమ్. ఈ డెత్ గేమ్‌లో తను లక్ష్యాన్ని ఛేదించగలుగుతుందో లేక తనే లక్ష్యం (టార్గెట్) అవుతుందో వేచి చూడాలి.

కారు మలుపులు తిరిగినప్పుడల్లా టైర్లు కీచుగా అరుస్తున్నాయి. మలుపు తిప్పినప్పుడల్లా స్టీరింగ్ మీద ఆమె చేతులు ఉడుం పట్టులా బిగుసు కుంటున్నాయి. మలుపులు తిప్పినప్పుడు మిగిలిన కొన్ని కారుల్లా మారుతీ స్టీరింగ్ విష్ణు చక్రంలా ఎక్కువ తిప్పనవసరం లేదు. జస్ట్... కొద్దిగా తిప్పితే చాలు. అదీగాక ఆ వేగంలో మారుతి టర్నింగ్స్‌లో అదుపుతప్పి ఇరుపక్కల లోయల్లా వున్న పెద్దపల్లపు ప్రాంతాల్లోకి జారిపోతుందేమోనని ఆమె భయం. మరో కారణం ఏమంటే ఆమె మారుతీని గతంలో రెండు మూడుసార్లు మాత్రమే డ్రైవ్ చేసింది. అందుకే ఆమె చేతులు స్టీరింగ్ మీద బిగుసుకున్నాయి.

తన సాహసం తన లక్ష్యాన్ని అధిగమించడానికి సరిహద్దు చాలా చిన్నది. కాని ప్రాణాంతకమైనది. అది తన పాలిట మరణ సరిహద్దే కావచ్చు!

సమయం గడిచేకొద్దీ టెన్షన్ పెరిగిపోయి యమకింకరులు కోపోద్రిక్తులై పోసాగారు. ఈ రోజు అటో ఇటో తేల్చుకోవాలనే నిశ్చయానికి వచ్చేశారు.

ఆ రెండు కార్లు పోటీపడి పరుగులు తీస్తున్నాయి. ఆ డెత్ గేమ్ టెన్షన్‌గా అలా కొనసాగుతూనే వుంది.

సరిగ్గా అదే సమయంలో రోడ్డుని పూర్తిగా కవర్ చేస్తూ తమ మారుతి ముందు బ్రహ్మరాక్షసుడి తాతలా దూసుకువెడుతున్న పార్శిల్ సర్వీస్ చేసే జెయింట్ సైజు వేన్ ఒకటి అడ్డుగోడలా నిలిచేసరికి మేఘనకి ఏం చెయ్యాలో తోచలేదు.

సైడ్ ఇవ్వమని సిగ్నల్ ఇచ్చింది. హారన్ మోగించింది. కాని ప్రయోజనం కనబడలేదు.

ఓవర్‌టేక్ చెయ్యడానికి ఎక్కువ గేప్ లేదు. ఆ గేప్‌లోంచి దాటుకు పోవాలంటే కారుని ఓ పక్కకి ఒరిగిపోయేలా ఫీట్ చెయ్యాలి. ఆ ఫీట్లు జేమ్సుబాండ్‌లకి మాత్రమే సాధ్యం. నేలవిడిచి సాము గారిడీ చెయ్యటానికి తను లేడీ జేమ్సుబాండ్ కాదు.

ఏ కాస్త సమయం ఆలస్యమైనా వెనుకనున్న యమకింకరులకి చిక్కి పోవడం ఖాయం. క్షణక్షణం తమ కార్ల మధ్యనున్న మధ్య దూరం తరిగిపోతోంది.

అదే క్షణంలో వేన్ వెనుకడోర్ కిందకి వాలిపోయింది వేన్‌లోంచి చక్రాలున్న ఓ పెద్ద ఉక్కు నిచ్చెన రొడ్డుమీదకి జారింది. నిచ్చెన అడుగునున్న చిన్నసైజు రబ్బరు చక్రాలు వేగంగా దొర్లసాగాయి. నిచ్చెన చివరి అంచు నేలను... తారు రోడ్డును తాకీ తాకనట్లుగా వుంది. అంటే... ఉక్కు నిచ్చెన వేన్‌కి రోడ్డుకి మధ్య వారధిలా ఉందన్నమాట.

విచిత్రంగా చూస్తున్న మేఘనకి వేన్ కేబిన్‌లోంచి టార్చి వెలుగులో గాలిలో ఊగుతున్న తెల్ల జేబురుమాలు కనిపించింది.

మరో ఆలోచనకు తావివ్వకుండా వేన్‌లోని సిగ్నల్‌ని అర్థం చేసుకుని తమ మారుతీని వేన్‌లోకి ఎక్కించేయడానికే నిశ్చయించుకుందామె. దేరీజ్ నో

ఎనదర్ వే టు ఎస్కేప్ ఫ్రమ్ యమకింకరులు.

వేగంగా పరుగెడుతున్న వేన్‌లోకి మారుతీని ఎక్కిచడం అంత సులభమేమీ కాదని ఆమెకి తెలుసు. స్థిరంగా వున్న వాలుబల్లల మీంచి సర్కస్ వాళ్ళు జీప్‌ని జంప్ చేయించడం తను 'గ్రేట్ రేమాన్', 'జెమినీ' సర్కసుల్లో చూసింది. కాని ఇది అలాంటి ఫీట్ కాదు.

ఉక్కుకి (ఉక్కునిచ్చెన) స్థితి స్థాపకశక్తి, మెత్తని గుణం వున్నాయి. కాని దాని స్థానం స్థిరంగా లేదు. ఒక నిర్ణీత వేగంతో అది స్థాన భ్రంశం చెందుతోంది. మార్గం నేరుగా వుంటే ప్రయాణం చేసిన దూరం (రోడ్డుమీద) స్థానభ్రంశం సమానంగా ఉంటాయి. అలాంటి స్థితిలో సగటు వేగము, సగటు దూరం సంఖ్యాత్మకంగా సమానంగా ఉంటాయి. స్థానభ్రంశం కంటే దూరం ఎక్కువైతే సగటు దూరం విలువ సగటు వేగం విలువకంటే ఎక్కుగా ఉంటుంది.

అందువల్ల సర్కస్ వాళ్ళ సాహసం కంటే ఇది పెద్ద ఫీట్. వేన్ ఉన్న ఎత్తును బట్టి, వేన్‌లోకి వున్న దూరాన్ని బట్టి, మారుతీని ఎంత వేగంతో నడపాలో ఆమె అంచనా వేయాలి. అంచనా సరిగా వేయగలిగితే ఫర్వాలేదు. వేయలేకపోతేనే ప్రమాదం.

మారుతీ పల్టీలు కొట్టవచ్చు, ప్రాణాలు పోవచ్చు

ఏమైతే అది అయింది లెమ్మని అంచనా వేసింది మేఘన. ఆ వెంటనే గేర్ మార్చి యాక్సిలేటర్‌ని పూర్తిగా తొక్కేసింది.

రివ్వున ముందుకి దూకింది ఆ మారుతి. ఉక్కు నిచ్చెన మీదకి ఎక్కడానికి ప్రయత్నిస్తోంది.

కొన్ని క్షణాలకి విమానం టేకాఫ్ తీసుకోడానికి లేచినట్లు పక్షిలా రివ్వున లేచింది మారుతి. సర్రున దూకింది వేన్‌లోకి. ఆ వెంటనే సడెన్ బ్రేక్ నొక్కింది మేఘన. ఆ అదుటికి తూలి విండ్ షీల్డ్‌కి కొట్టుకోబోయి కాస్తలో తప్పి తిరిగి సీట్లో పడిందామె. మారుతి వేన్‌లోకి ఎక్కిన వెంటనే ఉక్కునిచ్చెన పైకి లేచింది. వెనుక డోర్ క్లోజ్ అయింది.

ఇదంతా మలుపులో జరగడం వల్ల ఆ మలుపులోకి ఇంకారాని యమకింకరులకి క్షణాల్లో జరిగిపోయిన ఆ ఇంద్రజాలం సంగతి తెలీదు.

ఆ మలుపులోకి వచ్చే సరికి మారుతి కనబడకపోయేసరికి తలలు గోక్కుని, జుట్టులు పీక్కుని, డిప్పల మీద కొట్టుకుని, బుర్రలు బ్రద్ధలయ్యేలా ఆలోచించసాగారా మందబుద్ధులు నలుగురు.

"ఇంత ఆలోచన దేనికి...వేన్‌ని ఓవర్ టేక్ చేసి వుంటారు" వాళ్ళలో ఓ తెలివైనవాడు అన్నాడు.

"అదే జరిగివుండాలి. మనం ఓవర్ టేక్ చెయ్యాలి. కమాన్ క్విక్" మరొకడు తొందరచేశాడు.

వేన్ డ్రైవర్ వాళ్ళని ఏడిపించాలనే ఉద్దేశంతో సిగ్నల్ ఇచ్చినా సైడ్ ఇవ్వలేదు. హారన్ కొట్టి కొట్టీ విసిగిపోయే టైమ్‌కి సైడిచ్చాడు. ఆ వెంటనే వేన్‌ని దాటుకుపోయింది అంబాసిడర్.

వేన్ కాబిన్ వెనుక తలుపు తెరుచుకుని వచ్చిన శ్రీలేఖ వయసున్న ఓ అందమైన అమ్మాయిని చూసి మారుతి దిగింది మేఘన.

"ఐ థింక్ యు ఆర్ మిస్ మేఘన" అడిగిందామె. టాప్‌లైట్ వెలుగులో ఆమె పలువరుస తళుక్కున మెరిసింది.

"యస్... ఐ యామ్" అంది మేఘన.

"ప్లీజ్ టు మీట్ యు. ఐ యామ్ 'ఇందువదన'. శ్రీలేఖ నా స్నేహితురాలు" పరిచయాలయ్యాయి.

"థాంక్స్ ఎలాట్ సమయానికి వచ్చి రక్షించారు."

"మెన్షన్ నాట్. నాకు ఎడ్వంచర్స్ అంటే మహాసరదా అప్పుడప్పుడూ శ్రీలేఖ నన్ను ఇలాంటి ఎడ్వెంచర్స్‌లోకి లాగి మంచి పనులు చేయిస్తుంది. సాహసం లేని జీవితం దుర్భరం. ఇలాంటి ఎడ్వంచర్స్ నేను ఛాలెంజ్‌గా తీసుకుంటాను. ఈ 'మారుతి' నాదే. నాకు ప్లాన్ చెప్పింది శ్రీలేఖ. ఆ ప్రకారం ఇక్కడ హైవే మీద కాచుకున్నాను. బైనాక్యులర్స్‌లో నా మారుతీని, దాన్ని

తరుముతున్న అంబాసిడర్‌ని చూశాను. ఆ వెంటనే ప్లాన్ నెంబర్ టు అమలు పరిచాను. మారుతీని శ్రీలేఖ డ్రైవ్ చేస్తోందనుకున్నాను. ఇంతకి ఆ డెవిల్ ఏది?" నవ్వింది ఇందువదన.

"కారులో వుంది" బాక్‌సీట్లోకి చూసి తృళ్ళిపడింది మేఘన. సీట్లో వుండాల్సిన శ్రీలేఖ లేదు.

గభాలున బాక్‌డోర్ తెరిచి టాప్ లైట్ వేసిందామె. ఆ వెలుతురులో సీటుకింద పడివుండి కూడా గాఢ నిద్రపోతున్న శ్రీలేఖ వాళ్ళకి కనిపించింది. ఆమె మొహం అమాయకంగా వుంది.

కొన్ని క్షణాలు ఆమెవైపు జాలిగా చూసింది మేఘన.

ఆమె మారుతీని వేన్‌లోకి ఎక్కించి సడెన్ బ్రేక్ వేసిన టైములో సీటుకింద పడిపోయింది శ్రీలేఖ.

"ఇలాంటిదేదో జరిగే వుంటుందని నేనుకుంటూనే వున్నాను. సంతోషంగా వున్నప్పుడు డ్రగ్ అవసరం లేదని మాటయిచ్చి ఎలా తప్పిందో చూడండి. మళ్ళీ అమాయకంగా ఆ ఫోజు చూడండి. ఈ నిద్ర మొహం దాన్ని ఆ మార్ఫిన్ అలవాటు నుంచి ఎలా బయటికి లాగాలో నాకర్థం కావడం లేదు" పైకి నవ్వుతూ మాట్లాడుతున్న శ్రీలేఖ వ్యసనానికి ఆమె స్నేహితురాలు ఇందువదన గుండెల్లో కదలాడుతున్న బాధను గుర్తించింది మేఘన.

"వాతావరణం మార్చి శస్త్రచికిత్స చేస్తే ఆమెలో మార్పు వస్తుంది" సలహా చెప్పింది మేఘన.

"చెప్పిన మాట వినేరకం కాదండీ బాబూ. అంత బుద్ధిగా వినే రకమైతే నాకీ తిప్పలెందుకు చెప్పండి. దీన్నిప్పుడు మా బంగ్లాకి తీసుకుపోయి 'మీ కూతురు నాదగ్గర క్షేమంగా వుంది. ఈ రాత్రి ఇక్కడే పడుకుంటుందట' అని వాళ్ళ నాన్నకో ఫోన్ కొట్టాలి. దీన్ని ఫోన్లోకి పిలవమంటే కాకమ్మ కథలు చెప్పలేక చస్తున్నాననుకోండి. ఆ తిప్పలేవో నేను పడతానుగాని మిమ్మల్నెక్కడ దింపాలో చెప్పండి"

ఆమె మాటలకి రిలీఫ్‌గా నవ్వేసింది మేఘన. కాని ఇప్పుడెక్కడికి వెళ్లాలో ఆమెకి తోచటం లేదు. తను డబ్బు ఇచ్చిన తన స్నేహితురాలు 'సౌమిత్రి' తనంటే ప్రాణం ఇస్తుంది. అది సెక్రెటేరియెట్‌లో ఓ గుమస్తా. బంజారాహిల్స్‌లో ఓ రెండు గదుల అద్దె పోర్షన్‌లో ఉంటూ తను కొన్న స్థలంలో సొంత ఇల్లు కట్టించుకుంటోంది. సౌమిత్రి ఎంతో పిరికిది. అయినా తన ప్రాణాలకు తెగించి తనకు ఆశ్రయం ఇస్తుంది. కాని, దాన్ని ప్రాణాపాయంలో పెట్టడం తనకి ఇష్టం లేదు. కాని ఈ రాత్రికి మాత్రం దాని దగ్గర తలదాచుకోవడం తప్ప మరో మార్గం లేదు. ఎందుకంటే పోలీసులు తన అద్దెయింటికి సీలువేశారు కదా!

"మీకు అభ్యంతరం లేకపోతే నన్ను బంజారాహిల్స్ దగ్గర దింపండి."

"నో అభ్యంతరం. ఎయిర్ పోర్ట్ టెర్రెస్ మీదగాని దింపమంటారేమోనని భయపడ్డాను" చమత్కారం చేసింది ఇందువదన.

ఇద్దరూ నవ్వేశారు.

తనకోసం వేటాడుతున్న మృగాలు తనను చేరబోతున్నాయని ఆమెకు తెలీదు!

శ్రీలేఖ లేచిన తర్వాత అడిగానని చెప్పి కృతజ్ఞతలు అందజేయమని గుడ్‌నైట్ చెప్పి, ఇందువదన దగ్గర శెలవు తీసుకుంది మేఘన.

బంజారాహిల్స్‌లో ఆమె నడుస్తోంది. వందగజాలు కూడ నడవకముందే ఎదురుపడ్డ అంబాసిడర్ కారుని కార్పొరేషన్ లైట్లకాంతిలో ఆమె గుర్తించి మెరుపులా వెనుదిరిగి పరుగందుకుంది.

కారులో యమకింకరులు ఆమెని గుర్తించి అంబాసిడర్‌ని ముందుకి దూకించారు.

సినిమాల్లో హీరోయిన్స్‌లా తను కారు కంటే వేగంగా పరుగెత్తలేదు కనుక ఇరుకుగా వున్న ఇళ్ళ మధ్య సందుల్ని ఎంచుకుని ఒక సందులోంచి మరో సందులోకి, అక్కడి నుంచి మరో మలుపులోకి సాధ్యమైనంత వేగంగా

పరుగెత్తసాగింది మేఘన.

ఆ సందుల మధ్య కారు పోదు గనుక అంబాసిడర్‌ని రోడ్‌మీదే వదిలేసి ఆమెను తిట్టుకుంటూ సందుల్లో పడ్డారా యమకింకరులు.

వాళ్ళని కన్‌ఫ్యూజ్ చేస్తూ పరుగులెత్తి జూబ్లీహిల్స్‌లో పడింది మేఘన. అప్పటికే ఆమెతో విసిగి వేసారిపోయిన యమకింకరుల్లో ఒకడు రివాల్వర్ బయటికి తీశాడు.

సమయం రాత్రి ఎనిమిది గంటలు కావస్తూంది.

రివాల్వర్ ఫైరింగ్ శబ్దాలు విన్న ఏ భవనాల్లోని మనుషులు బయటికి రారని వాళ్ళకి తెలుసు. కాని కదులుతున్న టార్గెట్‌ని కదులుతూ కొట్టడం ఏమంత సులభం కాదనీ తెలుసు. అయినా సరే ఫైరింగ్ ఓపెన్ చేశాడా యమకింకరుడు.

మూడు తూటాలు ఫైర్ చేశాడు వాడు. ఆ తూటాల శబ్దాలు ఆ ప్రదేశంలో గుభిల్లు.. గుభిల్లు... మని ప్రతిధ్వనించాయి.

మూడో తూటా సూటిగాపోయి ఆమె వెన్నుని చీల్చేది! కాని మేఘన అదృష్టం బావుండి కాస్తలో తప్పి పోయింది.

జర్నలిస్ట్ కాలనీలో పడిందామె.

ఆమె కాళ్ళు గాలిలో తేలిపోతున్నాయి.

మగదుస్తులు ధరించబట్టి కనీసం ఆ వేగంతోనయినా పరుగెత్తగలుగుతోంది.

ఆఖరి ప్రయత్నం చెయ్యాలని నిశ్చయించుకుని పరుగుల రాణి పి.టి. ఉషను జ్ఞాపకం తెచ్చుకుని వేగం పెంచి ఇళ్లమధ్య సందుల్లోకి దూరింది.

సరిగ్గా ఆ సమయంలోనే యమకింకరులు కన్‌ఫ్యూజ్ అయిపోయారు. ఏ సందులోంచి ఏ వైపు తిరిగిందో అర్థం కాక గందరగోళంగా వెదుక్కోసాగారు.

మూడు నిముషాలు ఎక్కడా ఆగకుండా ఏకబిగిన పరుగెత్తిందామె. తన పరుగు వేగానికి తనే ఆశ్చర్యపడింది. మూడు నిమిషాలు పరుగు పూర్తయ్యాక

మరొక్క అడుగు కూడా వెయ్యలేకపోయింది. అక్కడితో ఆమె శక్తి హరించుకు పోయింది. ఆయాసం ఎగదన్నుకువస్తోంది. కాలినరాలు తిమ్మిరి ఎక్కినట్టు జివ్వుమని లాగేస్తున్నాయి. ఒంటినిండా చెమట్లు, షర్ట్ పూర్తిగా తడిచిపోయింది. కళ్ళు బైర్లు కమ్మేటట్లున్నాయి.

ఆగినచోట కుడివైపు, ఎడమవైపు వరుసగా చాలా భవనాలున్నాయి. కాని తన కాళ్ళ దగ్గరగా వున్న బంగ్లా గేటు తీసి లోనికి దూరి గేటు క్లోజ్ చేసి, బంగ్లా లోపలికి కుంటినడక నడిచి పోర్టికో పక్కగా వున్న మెట్లెక్కి కాలింగ్‌బెల్ నొక్కింది మేఘన. ఈ పనంతా అయ్యేసరికి ఒక నిమిషం గడిచింది.

వెనక వాళ్ళు వచ్చేస్తారేమోనని ఒకవైపు ఆందోళన చెందుతూ గేటు బయటికి చూసింది. ఆయాసంతో ఆమె గుండెలు ఎక్స్‌ప్రెస్ వేగంతో కొట్టుకో సాగాయి.

అరనిముషానికి తలుపు తెరుచుకుంది. తలుపు తెరిచింది ఎవరని కూడ చూడకుండా గభాలున లోనికి దూరి తలుపు గెడ పెట్టేసింది ఆమె.

తలుపు తెరిచిన వ్యక్తికి ఇరవై ఏడేళ్ళ వయస్సు వుంటుంది. అందగాడే! మంచి పర్సనాలిటీ. అతడిలో నాయకుడి లక్షణాల కంటే హాస్యగాడి లక్షణాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

'అతడు మాట్లాడితే చాలు నవ్వు పుట్టుకొస్తుంది' అనిపించేలా వున్నాడు.

మాటా మంతీ లేకుండా లోనికి జొరబడి తలుపు గెడ పెట్టేసిన ఆమె వైపు నోరు తెరిచేసి దిగ్భ్రాంతిగా చూస్తూ క్షణంలో తేరుకుని ఎత్తి పట్టుకున్న లుంగీని గభాలున కిందకి వదిలేశాడు. అతడు ధరించిన బనీయన్ ఛాతీ కట్స్‌ని క్లియర్‌గా చూపిస్తోంది.

"ఎవరండీ బాబూ మీరు? అలా చెప్పాపెట్టకుండా ఏకంగా లోపలికే జొరబడ్డారు" కంగారుపడిపోతూ అడిగాడతడు.

"క్షమించండి. నేనో ఆపదలో వున్నాను" అంది మేఘన ఆయాసం తీర్చుకుంటూ.

"అలాగా! అయితే మీ ఆపదకి సంబంధించిన ఫ్లాష్ బ్యాక్ కథ నాకు చెప్పేయండి. ఆ కథని నేను మా దినపత్రిక మొదటిపేజీలో 'ఆపదలో అబల' అనే పేరుమీద ప్రచురింపజేస్తాను... మీ ఆపద తీరేలా అయితే"

"మీరు ఎడిటరా?"

"సారీ! నేనెవరో మీకు చెప్పలేదు కదూ! ఐయామ్ ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిస్ట్. మా పత్రిక పేరు 'సమరశంఖం' నా పేరు అభి... 'అభిశాంత్' ఈజ్ మై నేమ్" స్టయిల్‌గా చెప్పాడు అతడు.

"నా పేరు మేఘన"

"చాలా మంచిపేరు. ఆ.. ఇంతకీ మీరు లోపలికి రావడం ఎవరయినా చూశారా?"

అతడిలో కంగారు చూసి ప్రశ్నించింది మేఘన "ఏ.... ఎందుకలా అడిగారు"

"అలా మెల్లిగా అడుగుతారేమిటండీ బాబూ. 'మనల్ని శత్రువులుగా చూసేదెవరబ్బా' అని బుర్రలు బద్దలు కొట్టుకుని తీవ్రంగా ఆలోచించనవసరం లేదు. మన పక్కింటినో, వెనకింటినో చూపిస్తే సరిపోతుంది. కానీ... నేను మాత్రం నా ఎదురింటిని చూపిస్తే సరిపోతుంది. ఆ కథంతా ఇప్పుడు చెప్పే తీరిక లేదుగానీ, మిమ్మల్నెవరయినా చూశారా?"

"వాళ్ళు మాత్రం చూడలేదనే అనుకుంటాను"

"ఎవరు వాళ్ళు?"

"యమకింకరులు"

తృళ్ళిపడ్డాడు ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అభిశాంత్.

"అమ్మమ్మ... ఎంతమాట. ఎంత పొరపాటు చేశారు. యముడంటే ఎవరు? దేవుడితో సమానుడు యముడు. యమకింకరులంటే ఎవరు? యముడి అనుయాయులు... యముడి ప్రతి రూపాలు. అలాంటి యమకింకరుల నుంచి తప్పించుకు పారిపోవడం తప్పు కదూ!" ఆమెనో పిచ్చిదానిగా అంచనా కట్టిన

అభిశాంత్ ఆమె పిచ్చాసుపత్రి 'డాక్టర్'ని 'యముడనీ', 'మేల్ నర్సుల్ని' 'యమ కింకరులనీ' సంబోధిస్తుందనే అభిప్రాయంతో అలా రూట్ మార్చాడు.

"యమకింకరులంటే యముడి అనుచరులు కాదండీ బాబూ! వీళ్ళు దుండగులు. నన్నుచంపడానికి తరుముతుంటే పారిపోయి వచ్చాను"

ఆమె పిచ్చిది కాదని గ్రహించిన అభిశాంత్ దుండగులనేసరికి కంగారు పడ్డాడు. "అమ్మో... సినిమా లెవల్లో కండలు పెంచేసి దున్నపోతుల్లా బలంగా ఉంటారు వాళ్ళేనా!"

"వాళ్ళే"

"చచ్చాను పొండి. 'చిరంజీవి'లా నాకు కరాటే ఫైటింగ్స్ రావు. శరణు కోరి వచ్చిన మీకు అభయహస్తం ఇస్తే 'ఆ హస్తమే' విరిచేసే యమకింకరులు వస్తే నేనేం చెయ్యగలను చెప్పండి" అతడి గొంతు వణికింది.

"మీదీ బలమైన దేహమేగా! వాళ్ళని తిరిగి కొట్టలేరూ!"

"దేహం బలమైనదే అయినా గుండె బలహీనం. అందుకే ఈ భయం"

"ఒక ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిస్టు అయివుండీ దేశంలో జరుగుతున్న అన్యాయాల్ని, అక్రమాల్ని ఏకిపారేయాల్సిన మీరు ఇంత పిరికితనంగా మాట్లాడుతుంటే నాకే సిగ్గుగా వుంది"

"నాకూ అలాగే వుంది. కాని ఏం చెయ్యను చెప్పండి"

"మీరేం చెయ్యనవసరం లేదు. మీలాంటివారిని ప్రమాదంలో పెట్టే కుసంస్కారం నాకు లేదులెండి. గుడ్ నైట్" అంటూ వెనుతిరిగింది మేఘన.

"మిస్... ఒక్కక్షణం ఆగండి. మీరిప్పుడు బయటికి వెడితే మీరు చెప్పిన ఆ దుండగులు ఎదురుపడితే ప్రమాదం"

"ఫర్వాలేదు. నాగుండెకి ధైర్యం ఉందిలెండి. వాళ్ళనుంచి ప్రాణాలతో తప్పించుకోగలననే ఆత్మ విశ్వాసంతో వెడుతున్నాను" భుజం మీదుగా చూసి చెప్పింది.

ఆమె ఆత్మ విశ్వాసానికి స్టన్ అయి దిష్టిబొమ్మలా నిలబడిపోయాడు అతడు.

"ఆత్మ విశ్వాసాన్ని మించిన మహాశక్తి ఈ ప్రపంచంలో మరేదీ లేదని నేను ఛాలెంజ్ చేసి చెప్పగలను"

"ప్లీజ్ వెయిట్... మీకున్న ఆత్మవిశ్వాసంలో పదో వంతుకూడ నాకు లేదని సిగ్గులేకుండా చెప్పగలను. మీకు రక్షణ ఇవ్వాలనివున్నా ముందు నేను భయపడిన మాట నిజమే. కానీ, మీ ఆత్మవిశ్వాసం చూసి షాక్ తిన్న నాలో చలనం కలిగింది. ఏ మూలో అణగివున్న కాస్త ధైర్యం నాలో సంచలనం రేపింది. నేను మగాణ్ణని చెప్పుకోవడానికి నాకే సిగ్గుగా వుంది, క్షమించండి. మీరీ రాత్రికి ఇక్కడే ఉండవచ్చు, నేను మీకు అభయం ఇస్తున్నాను. ఆ యమకింకరులు వస్తే వాళ్ళ చేతుల్లో నేను తన్నులు తినయినా సరే మిమ్మల్ని తప్పిస్తాను. ఈ ఒక్క రాత్రేకాదు. వాళ్ళనుంచి మీకు ప్రమాదం తప్పే వరకు మీరిక్కడే వుండవచ్చు. నేను చెయ్యగల సహాయం తప్పక చేస్తాను"

అతడివైపు ఆశ్చర్యంగా చూసి, ఆమె అంది "మీరు సహాయం చేస్తానన్నందుకు కృతజ్ఞతలు. కాని మిమ్మల్ని ఇబ్బందుల్లో పెట్టడం నాకిష్టం లేదు. వస్తాను."

ఆమె దారికి అడ్డుగా వచ్చాడు అభిశాంత్ "ప్లీజ్... మీరిక్కడ ఉండితీరాలి. నాకే విధమైన ఇబ్బందీ లేదు. ఉన్న భయంలో సగం భయం మీ ధైర్యం చూశాక ఎగిరిపోయింది. అసలు ప్రాణాలు తీసే ఆ యమకింకరులకి వ్యతిరేకంగా నేనింత ధైర్యంగా మాట్లాడుతున్నానంటే నాకే ఆశ్చర్యంగా వుంది. మీరిక్కడే వుంటే మీ ఆత్మస్థయిర్యం చూసి చూసి నాలో మిగిలివున్న సగం పిరికితనం పోతుందని నా నమ్మకం. ఐయామ్ ష్యూర్... మీ ప్రాణాలకి నా ప్రాణం అడ్డువేస్తాను. ప్లీజ్ బిలీవ్ మి"

కొన్ని క్షణాలు ఆలోచించి అంగీకారసూచనగా చెప్పిందామె. "నేను మిమ్మల్ని నమ్ముతున్నాను. నా ప్రాణాలకి మీ ప్రాణం అడ్డువెయ్యనవసరం లేదు. నా ప్రాణం కాపాడుకోడానికి మీరు నన్నిక్కడ ఉండనిస్తే చాలు"

"మీకిష్టమైనంత కాలం నిరభ్యంతరంగా వుండవచ్చు. ఐ హేవ్ నాట్

ఎనీ అబ్జక్షన్"

అదే క్షణంలో ఆ నిశీధి సమయంలో బూట్ల చప్పుళ్ళు కరకరమంటూ వినిపించసాగాయి.

మెరుపుల్లా ఆ ఇరువురు చెరో కిటికీ చాటుకి గెంతారు.

తన చేతిలోకి అందుబాటులో వున్న లైట్ స్విచ్ ఆఫ్ చేసాడు అభిశాంత్.

ఆ హాలులో చీకటి ఆవరించింది.

బయట కార్పొరేషన్ దీపాలకాంతిలో రోడ్డుమీద తచ్చాడుతున్న ఆ నలుగురు యమకింకరుల్ని చూశారు ఆ ఇద్దరూ. అప్పటికే వాళ్ళు ఆ చుట్టు పక్కలంతా గాలించి వచ్చారని వాళ్ళ వాలకాలే చెబుతున్నాయి. కసిగా అరచేతుల్లో పిడికిళ్ళు బిగించి కొట్టుకుంటున్నారు. వాళ్ళ కళ్ళు అక్కడున్న ప్రతి బంగ్లాని అన్వేషించసాగాయి.

వాళ్ళ కళ్ళు తన బంగ్లావైపు తిరిగేసరికి అభిశాంత్ శరీరం సన్నగా జలదరించింది. తిరిగి క్షణంలో ధైర్యం తెచ్చుకున్నాడు.

"దాని అంతు తేల్చుకునేవరకు ఈ రాత్రి నిద్రపోకూడదురా" అన్నాడో యమకింకరుడు.

"అయితే మన నిద్రలు పోతాయిగాని అదిమాత్రం దొరకదు" మరొకడు అన్నాడు.

"ఏ... ఎలా చెప్పగలవు?" మూడోవాడి ప్రశ్న,

"అనుభవాన్ని బట్టి" నాలుగోవాడి జవాబు.

"కరక్ట్. ఉడికిన అన్నం చూడటానికి ఓ మెతుకు పడితేచాలు" అన్నాడు రెండోవాడు.

"కాని దాని అంతు చూడకపోతే బాస్ మన అంతు చూస్తాడు" మొదటి వాడు అన్నాడు.

"ఏదోలా బాస్‌కి నచ్చచెబుదాం. వినకపోతే శిక్ష అనుభవిద్దాం, పదండి పోదాం" చెప్పాడు రెండోవాడు. ఆ ఆలోచన మిగిలిన ముగ్గురికీ నచ్చింది. ఆ

వెంటనే వాళ్ళు అక్కడి నుంచి కదిలారు.

ప్రస్తుతానికి ప్రమాదం తప్పినందుకు కాస్త రిలీఫ్‌గా ఫీలయ్యింది మేఘన.

ఐదు నిముషాలు ఆగి లైటు వేస్తూ అన్నాడు అభిశాంత్ "రండి భోంచేద్దాం"

"థాంక్స్, ఆ మాట ఎప్పుడు అంటారా అని ఎదురు చూస్తున్నాను. ఈ రోజంతా భోజనం లేదు. ఒకటే టెన్షన్. ఒకటే పరుగుపందెం. కడుపులో ఎలుకలు ఇంటర్‌నేషన్ లెవెల్ రన్నర్స్‌లా పరుగెడుతున్నాయ్"

"ఓ హెూ! సారీ... కమాన్" డైనింగ్ హాల్ వైపు కదిలాడు అతడు.

"ఆకలి వేస్తున్నా చిరాకు వల్ల స్నానం చెయ్యాలనిపిస్తుంది. క్షణంలో స్నానం చేసి వస్తాను. బాత్రూం ఎక్కడ?"

బాత్రూం చూపించాడు అభిశాంత్.

భోజనాలు అయ్యాక వచ్చి హాలులో సోఫాల్లో ఎదురెదురుగా కూర్చున్నారు వాళ్ళు.

"మీ యింట్లో ఎంతకాలం వుంటే అంతవరకు అయిన ఖర్చులన్నీ ఇచ్చేస్తాను" అంది మేఘన.

"అలాంటి మాటలు మాట్లాడకండి. నా పిరికితనం పోవాలనే స్వార్థంతోనే కదా మిమ్మల్ని వుండమన్నది. అదీగాక ఈ తక్కువ సమయంలోనే మనం మిత్రులం అయిపోయాం"

"మీకు గుర్తుందో లేదో మనం చిన్ననాటి మిత్రులం" అందామె నింపాదిగా.

"ఆ... నిజమా?"

"అవును. నేను మిమ్మల్ని చూసిన వెంటనే గుర్తు పట్టాను. మీ పేరు విన్న తర్వాత మీరేనని నిశ్చయించుకున్నాను."

"మరి అప్పుడే ఎందుకు చెప్పలేదా విషయం."

"స్నేహితురాలినని రక్షించవచ్చు. అది నాకు నచ్చదు. ఆపదలో వున్న అమ్మాయిని రక్షిస్తారో లేదో చూడాలనిపించింది. అందుకే చెప్పలేదు"

"అయితే నేనప్పుడు ఆపకపోతే నిజంగా వెళ్లిపోయే వారు అన్నమాట"

"అవును. ఓ అబలను రక్షించలేని మిత్రుడి రక్షణలో వుండటం కంటే ఆపదలోకి వెళ్ళడమే మేలు"

నిస్వార్థమైన ఆమె ఆలోచనకి ఆశ్చర్యపోతూ అతడన్నాడు "మీరు చెప్పిన తర్వాత మిమ్మల్నెక్కడో చూసినట్టు అనిపిస్తోందిగాని గుర్తు రావడం లేదు"

తాము చదువుకున్న స్కూలు, స్కూలు వెనుక కొబ్బరితోట, తోటనానుకుని ప్రవహించే కాలవగట్టు, అక్కడి వాతావరణం చెప్పి, తమ చిన్నతనంలో జరిగినకొన్ని సంఘటనలు (పాఠం అప్పగించకపోతే తెలుగు మేష్టారు తరుచుగా పేక బెత్తంతో అభిశాంత్ చేతిమీద కొడుతూండటం, గుంజీలు తీయించడం, బెంచీ మీద నిలబెట్టడం, వంగోపెట్టి వీపు వాయించడం) చెప్పింది. తన చిన్న తనం అతడికి అప్పుడు గుర్తొచ్చింది. మేఘన, ఆమె చిన్నతనపు మొహం, ఆమె తెలివితేటలూ గుర్తొచ్చాయి.

"మేఘనా! నువ్వేనా... చిన్నప్పుడు నీ పేరు తిరగక 'మేగీ' అని పిలిచేవాణ్ణి గుర్తుందా?"

"గుర్తుంది. కాని ఇప్పుడు మాత్రం అలా పిలవకు" ఇద్దరూ నవ్వుకున్నారు. కొంతసేపు చిన్నతనపు ముచ్చట్లు చెప్పుకుని నవ్వుకున్నారు.

"అది సరే... ఇంతకీ ఆ యమకింకరులు నిన్నెందుకు తరుముతున్నారు?"

జరిగినదంతా పూసగుచ్చినట్టు వివరించి చెప్పింది మేఘన. ఆమె చెప్తున్న కొద్దీ అతడిలో టెన్షన్ పెరిగిపోయి సోఫాను బిగించి పట్టుకున్నాడు. గుండెల్లో ఎక్స్‌ప్రెస్‌లు పరుగెత్తసాగాయి. ఆమె చెప్పడం పూర్తి చేశాక రిలీఫ్‌గా ఊపిరి పీల్చుకున్నాడు. "చాలా పెద్ద సాహసం చేశావ్, నువ్విలాంటి సాహసం చేశావంటే నాకే ఆశ్చర్యంగా వుంది. అయితే నీ ప్రాణాలిప్పుడు పూర్తిగా ప్రమాదంలో వున్నాయి. ఇప్పటినుంచే నువ్వు ఇల్లు దాటి బయటికి వెళ్ళకూడదు"

"బావుంది. బయటికి వెళ్లకుండా మహంకాళిని ఎలా రక్షించడం?"

"నీకు మతిపోయినట్టుంది. మహంకాళిని రక్షిస్తావా! అసలు నువ్వెలాంటి

ప్రమాదంలో ఇరుక్కున్నావో తెలుసా! హోం మినిస్టర్‌తో తలపడటమంటే మాటలా! రాజరాజ నరేంద్రుడో రాక్షసుడు, మేకవన్నె పులి అని తెలుస్తూనే వుంది. కొండను ఢీకొన్న పొట్టేలు కథ నేర్పిన నీతిపాఠాన్ని మర్చిపోకూడదు"

"అపాయంలో ఉపాయంతో సింహాన్ని చంపిన కుందేలు కథ నేర్పిన నీతి పాఠాన్ని కూడా నేను మరచిపోలేదు. ప్రజాస్వామ్యాన్ని వెన్నుపోటు పొడుస్తూ కుతంత్ర రాజకీయాలను నడివీధిలో నగ్నంగా నర్తింపచేసే రాజరాజ నరేంద్రుడిలాంటి ఇంద్రజాలికుడు గాంధీ మహాత్మునిలాంటి వాళ్ళు తెచ్చిన స్వరాజ్యాన్ని భస్మం చేసి గాంధీ పుట్టిన దేశాన్ని స్మశానం చేస్తారు. ఇలాంటి దేశ ద్రోహులు బ్రతకడానికి కూడా అనర్హులు. అలాంటి వాడితో తలపడటంలో తప్పేముంది" ఆవేశంగా చెప్పింది మేఘన.

"నువ్వు చెప్పిందంతా నిజమే. నీ దేశభక్తి మెచ్చుకోతగిందే. కాని రాజరాజ నరేంద్రుడితో ఎలా తలపడతావు" ఆమె ఆలోచనలు అతణ్ని భయకంపితుణ్ణి చేస్తున్నాయి.

"సత్యాగ్రహం" ఒక్కమాటే అందామె.

"సత్యాగ్రహమా!"

"అవును. సత్యాగ్రహమే! మంచి రైతు అనేవాడు పంటకు ఎరువు వేసి, నీరు పెట్టి సంతృప్తి చెందడు. ఎప్పటికప్పుడు కలుపు మొక్కలు పీకి పారేస్తాడు. కలుపు తీస్తేగాని మంచి పంట రాదు కదా! అదే విధంగా మానవ సమాజమనే క్షేత్రంలో మంచిని ప్రోత్సహించినంత మాత్రాన సరిపోదు. కలుపు మొక్కలు పీకినట్టు చెడును నిరోధించాలి. అదే సత్యాగ్రహం.."

"ఆత్మత్యాగం ద్వారా ప్రత్యర్థిని ఒప్పించడమే సత్యాగ్రహమని నెహ్రూ కూడా అన్నారు"

"అవును. అవసరమైతే ఆత్మత్యాగం కూడా చేస్తాను. 'దేశభక్తి అంటే కేవలం మాతృదేశాన్ని ప్రేమించడం మాత్రమే కాదు. తోటి మానవునికి సేవ చేయడ'మనే ధర్మోపదేశాన్ని చెప్పాడు స్వామి వివేకానంద. మార్ఫిన్ అలవాటులో

పడిపోతూ కూడ నాలాంటి వాళ్ళను తన తండ్రి విషపు కుచ్చుల నుంచి రక్షించాలనే శ్రీలేఖ మానవత్వపు తాపత్రయం చూశాక నాలో విస్తృతమైన ఆలోచనలు చోటుచేసుకున్నాయి. ఆ ఆలోచనలకు ఓ రూపు యిచ్చాను. ఆ రూపం తయారు చేసిన పకడ్బందీ ప్రణాళికను నా మనో ఫలకం మీద ముద్రించుకున్నాను. ఇప్పుడా ప్రణాలికను అమలు పరచాలి.

ఇంతకు ముందయితే కేవలం మహంకాళిని మాత్రమే రక్షించాలను కున్నాను. ఇప్పుడలా కాదు. మహంకాళిని రక్షించి, జరిగిన యదార్థమంతా అతడికి చెప్పి, అతడి ద్వారా రాజరాజ నరేంద్రుడితో నేను ధర్మయుద్ధం చేస్తాను. నే చేసిన సత్యాగ్రహంలో నేను ఆత్మత్యాగం చేసయినా సరే రాజరాజ నరేంద్రుడి దేశద్రోహాన్ని కోర్టులో బట్టబయలు చేస్తాను. మాదక ద్రవ్యాల బ్రహ్మరాక్షసిని సమూలంగా కూకటివేళ్ళతో పెకలించి భస్మం చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నాను. మాదక ద్రవ్యాల బానిసల్ని మార్చడం కూడా నా ఆశయంలో భాగమే. నా ఆశయం నీకు నచ్చితే నా ధ్యేయం నెరవేరడానికి నా ఆశయ సాధనలో పాలుపంచుకో. లేకపోతే లేదు. అంతే కాని నాకు పిరికిమందు మాత్రం యింజెక్టు చెయ్యకు, మార్ఫిన్ లాంటి పిరికి మందు నాకు రుచించదు"

స్వార్థరహితమైన ఆమె ఆశయ సాధనల ప్రణాళికను విని అతడు విభ్రమంగా ఒక మహాశక్తిని చూస్తున్నట్లు చూస్తూ ఉండిపోయాడు. ఆ క్షణంలో ఆమె ఎదిగిపోయిన ఎత్తుకి ఎన్ని జన్మలయినా తను చేరుకోలేడనే సత్యం అతడికి తెలుసు. ఆమె ఆదర్శంలో నూరోవంతు కూడా తనకు లేదనీ తెలుసు. కారణం ఆమెది విశాలహృదయం. ఆ హృదయం నిండా నిండిన దేశభక్తి. తనకీ వుంది దేశభక్తి. కానీ ఆమె చెప్పినట్టు దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం మాత్రమే కాదు గదా!

"నీ ప్రణాళిక మంచిదే. కానీ నీ ప్రణాళిక మొదలయ్యేలోగా నిన్ను చంపడానికి ప్రణాళికలు రూపొందిస్తాడు రాజరాజ నరేంద్రుడు" చెప్పాడు అభిశాంత్.

"తెలుసు. నా ప్రాణాలు రక్షించుకుంటూనే నా ప్రణాళిక విజయవంతం కావడానికి రాజరాజ నరేంద్రుడికి నేను ప్రత్యర్థినౌతాను" దృఢసంకల్పంతో స్థిరంగా చెప్పింది మేఘన.

కొంత సమయం తీవ్రంగా ఆలోచించాడు అతడు. అతడికి ధైర్యం చాలటం లేదు. చివరికో నిశ్చయానికి వచ్చి చెప్పాడు అభిశాంత్ "నీ ధ్యేయం అభినందించదగ్గది. కనీసం నీ ఆశయసాధనలో సహాయపడకపోతే నా మానవత్వం మంటగలపడానికి కూడా పనికి రాదు. నా చేతనైన సహాయం నేను తప్పక చేస్తాను"

"థాంక్స్ ఎలాట్" అతడివైపు కృతజ్ఞతా పూర్వకంగా చూసిందామె.

"నో థాంక్స్! నాలో మార్ఫీన్‌లాంటి పిరికి మందుని కరిగించేస్తూ ధైర్యాన్ని ఇంజెక్ట్ చేస్తున్నందుకు నీకే నేను థాంక్స్ చెప్పాలి" నిజాయితీగా అతనన్నాడు.

గుడ్‌నైట్ చెప్పి తనకు కేటాయించిన గదిలోకి పోయి పడుకుందామె.

అభిశాంత్ ఒంటరివాడు. అతడి తల్లిదండ్రులు పోయి రెండేళ్ళయింది. 'నా' అనే వాళ్ళు మరెవరూలేరతడికి. నిస్సారమైన ఒంటరి జీవితం రుచించకే అతడు జర్నలిస్టుగా స్థిరపడ్డాడు. ఇప్పుడు తన చిన్ననాటి స్నేహితురాలు మేఘన తనకి ఆత్మీయురాలిగా వుందనేసరికి గొప్ప థ్రిల్లింగ్‌గా వుంది. తనిక ఒంటరి కాదు. తనకిక వెయ్యిమంది బంధుమిత్రులున్నారు. వాళ్ళందర్నీ ఆమెలో చూసుకోవచ్చు.

మేఘనలోని ఆత్మవిశ్వాసం అతడిలో అణగారిపోతున్న కాస్త ధైర్యానికి జీవం పోస్తోంది.

ఆమె చెయ్యబోయే యజ్ఞంలో పాలుపంచుకోబోతున్నందుకు అతడికి చాలా ఆనందంగా వుంది.

కాని అదెంత ప్రాణాంతకమో ఆ యిద్దరికీ తెలీదు.

అతడు తన రూంలో పడుకోబోయేముందు ఏమీ రాయని కొత్త డైరీలో రెండే రెండు వాక్యాలు రాసి పడుకున్నాడు.

"చిన్ననాటి నేస్తం 'మేఘన' తన జీవిత భాగస్వామి అయితే ఆమె తన జీవితానికి ఆలంబన కాగలదు. ఆదే గనుక జరిగితే అది తన అదృష్టం."

మరే వాక్యం ఆ డైరీలో రాయదలుచుకోలేదతడు. ఆ డైరీని అలాగే ఉంచేయాలనుకున్నాడు.

ఆ రాత్రి మేఘనకి సుఖనిద్ర పట్టింది. బాగా అలసిన మనసు సేద తీరింది.

అక్కడినుంచే మొదలైంది అసలు కథ.

* * *

# రెండవ అధ్యాయం

తన అనుచరులమీద భీకరంగా ఘర్జించి తిట్టిపోశాడు రాజరాజ నరేంద్రుడు. "బ్లడీఫూల్స్... ఇడియట్స్! ఎక్కడికిపోతుందది. అక్కడే వుంటుంది. ఒక ఆడదాన్ని వెదికి పట్టుకోలేని దద్దమ్మలు, ఎందుకొచ్చిన శరీరాలవి కాల్చి బూడిద చెయ్యడానికి కాకపోతే" అనేసరికి హడలిపోయి వణికిపోయారు.

"ఆ మాత్రం జ్ఞానం లేదూ? ఆ డెవిల్ అక్కడే ఏ ఇంట్లోనో దూరి ఉంటుంది"

"క్షమించండి బాస్... అక్కడెక్కడా ఏ ఇంట్లోకీ దూరిన సూచనలు కనిపించలేదు" వెళ్లిపోదామని సలహా చెప్పిన వాడన్నాడు.

"మరెలా మాయమైంది? ఉన్నపళంగా అదృశ్యం కావడానికి అదేమైనా మంత్రగత్తా ఏమన్నానా?"

"మహా మాయలాడి బాస్" మరొకడు అన్నాడు.

"షటప్. మీలాంటి మట్టిబుర్రలకి అంతా మాయగానే కనిపిస్తుంది"

"నాదో ఆలోచన చెప్పనా బాస్"

"ఏమిటది?"

"బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌ల్లో మాకు అనుమానం వచ్చిన కొన్ని ఇళ్ల గేట్ల మీద సుద్దముక్కతో కొండగుర్తులు పెట్టుకుని ఆ ఇళ్ళమీద కళ్లు వేస్తే ఆమె జాడ తెలుస్తుందేమో!"

"ఫూల్! నీది మట్టిబుర్ర అనడానికి నీ ఆలోచన సాక్ష్యం..." క్షణమాగి చెప్పాడు. "అది దొరికేవరకు మీరా చుట్టుపక్కల ప్రాంతాల్లో వెదుకుతూనే

వుండండి. మీకిక అదే డ్యూటీ. అది కనిపిస్తే కాల్చి పారేయండి. ఈ లోగా నా ప్రయత్నాలు నేను చేస్తాను"

బ్రతుకు జీవుడా అనుకున్నారా నలుగురు యమకింకరులూ.

ఆ రాత్రికి రాత్రే హైదరాబాద్ నగరంలోని పోలీస్ డిపార్టుమెంటుని సమాయత్తం చేసి ఓ మీటింగ్ ఏర్పాటు చేశాడు రాజరాజ నరేంద్రుడు.

నగరంలోని ఉన్నత పోలీసు అధికారులంతా ఆ మీటింగ్‌లోనే ఉన్నారు.

ఓ గంటకల్లా మీటింగ్ ముగిసింది.

ఆ రాత్రికి రాత్రే ఓ న్యూస్ ఐటమ్ అన్ని ప్రముఖ దినపత్రికాఫీసులకు చేరిపోయి, కంపోజు అయి, ప్రింటింగ్ మొదలయింది!

* * *

"నేను అంకుల్. ఇందువదనని" టెలిఫోన్‌లో రాజరాజ నరేంద్రుడి గొంతు విని అంది.

"శ్రీలేఖ అక్కడ వుందా అమ్మా"

"ఉందంకుల్. ఈ రాత్రికి నాదగ్గరే పడుకుంటుందట" లోకంతో నిమిత్తం లేనట్టు మంచంమీద దీర్ఘనిద్రతీస్తున్న శ్రీలేఖని చూస్తూ అందామె.

"ఓసారి దాన్ని ఫోన్లోకి పిలమ్మా"

"సారీ అంకుల్. దాని 'పరాకాయ ప్రవేశం' ప్రాక్టీస్ ఇంకా సక్సెస్ కాలేదు"

"యూ నాటీ"

'యూ క్రిమినల్' మనుసులో అనుకుందామె. అతడి సంగతంతా ఆమెకు తెలుసు.

ఉదయం నుంచీ జ్ఞాపకం రాని శ్రీలేఖ అతడు పడుకోబోయే ముందు జ్ఞప్తికి వచ్చి ఆమెకోసం ఇంట్లో చూసి ఆమె నిద్రపోతూంటే ప్రేమగా చూసి తన బెడ్‌రూంకి పోతాడు. మళ్లీ మర్నాడు ఉదయం నుంచి ఆమె గొడవే లేదు. కూతురు మీద ప్రేమాభిమానాలు మనసులో వుంటే సరిపోతుందా? ఆమె

విషయంలో శ్రద్ధ తీసుకుంటూ ఆమెకోసం రోజుకి కనీసం కాస్త సమయమైనా వెచ్చించి ప్రేమగా మాట్లాడి తల్లిలేని లోటును తీర్చవద్దా? ఆయాలు, పని వాళ్ళు ఎంతమంది వుండి ఏం ప్రయోజనం, ఉన్న తండ్రి ప్రేమాభిమానాలు కరువైన తరువాత, కనీసం ఆ ఉన్న తండ్రి ఒక్కడికి ఆదర్శం లేకపోయినా ఎవరికీ అపకారం తలపెట్టని 'మంచి మనసు' ఉన్నా సరిపోయేది. అదీ లేదు.

అతడి మనసు దెయ్యం పురుగులకు నిలయం. అతడో డెవిల్ మాన్... మానవ రూపంలో వున్న దెయ్యం మనిషి.

అందుకే... అందుకే శ్రీలేఖకి ఇందువదన అంటే ఎంతో ప్రేమ. మరోరకంగా చెప్పాలంటే ఆమెకి తనంటే ప్రాణం. తనకంటే ఆత్మీయులు ఆమెకి మరెవరూ లేరని ఇందువదనకి తెలుసు.

"ఏవిటమ్మా మాట్లాడవ్"

ఉలిక్కిపడి "ఏవిటంకుల్" అంది ఇందువదన.

"శ్రీలేఖ ఏం చేస్తోంది?"

'హాయిగా గుర్రుకొట్టి నిద్రపోతోందంకుల్, లేపమంటారా?"

"వద్దు పడుకోనివ్వు. యింతకీ మీ ఫాదర్ ఏం చేస్తున్నారు?"

"నాన్నగారి సంగతి మీకు తెలియందేముంది అంకుల్. తన రీడింగ్ రూంలో కూర్చుని, ఇండియన్ పీనల్ కోడ్‌కి సంబంధించిన పుస్తకాలన్నీ ముందేసుకుని ఏదో కేసు విషయమై తీవ్రంగా ఆలోచిస్తున్నారు"

ఇందువదన తండ్రి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి. చట్టాన్ని దైవంగా భావించే మంచి మనిషి. నిగర్వి. నిరాండంబరుడు. అతడి పేరు 'యజ్ఞ నారాయణ'

"ఉదయం మీ నాన్నగార్ని అడిగానని చెప్పమ్మా"

"అలాగే అంకుల్. వుంటాను. గుడ్‌నైట్" ఫోన్ పెట్టేసింది ఇందువదన.

* * *

ఉదయం టిఫిన్ చేయబోయిన అభిశాంత్‌ని ఆపేసి తనే టిఫిన్ తయారు చేసింది మేఘన.

ఇద్దరూ టిఫిన్ చేసి, టీ తాగారు.

సరిగ్గా అదే సమయంలో తలుపు చప్పుడైంది.

తృళ్ళి పడ్డారు అభిశాంత్ "వాడే అయివుంటాడు"

"ఎవడు వాడు!" అడిగిందామె.

"అదే... రాత్రి చెప్పానే... నా ఎదురింటి యముడు. నా మొగుడు. వాడి పేరు 'ధర్మ'. ఒట్టి అనుమానప్పొరుగు వాడికున్న అవలక్షణాలలో కనీసం ఒక్కటయినా నాకుంటే బావుండునని శతకోటి దేవుళ్ళకు మొక్కుకునే నైజం కలవాడు. వాడు కూడా నిజానికి మా పత్రికాఫీసులో జర్నలిస్టే. అయినా ఇన్‌వెస్టిగేషన్ పేరు మీద నా మీదే రిసెర్చి చేస్తుంటాడు. వాడికో పెళ్ళాం వుంది. ఆమె పేరు 'అమృతం' భర్తమీద ప్రేమానురాగాలు ఎక్కువ. మంచిని పొగిడి, చెడుని ఖండించే మంచితత్వం గల స్త్రీ. ఆమెను భార్యగా పొందడం వాడి పూర్వజన్మ సుకృతం" గబగబా చెప్పేసి, మళ్ళీ తలుపు చప్పుడయ్యేసరికి ఆమెను కంగారు పెట్టేశాడు. "పద పద నిన్నిక్కడ చూస్తే వాడు సవాలక్ష అనుమానాలతో అడ్డమైన ప్రశ్నలూ వేస్తాడు. వాడికిది రీసెర్చి పాయింట్ అవడం నా కిష్టం లేదు" ఆమెని ఆమె రూంలో నుంచి, గంట వరకు బయటికి రావద్దని చెప్పి, మేడ దిగి వచ్చేశాడు అతడు.

తలుపు చప్పుడు ఆగి, కాలింగ్‌బెల్ మోత వినిపించింది.

"వస్తున్నారా వెధవా" అంటూ లుంగీని పైకిలాగి వేగంగా వెళ్లి తలుపు తెరిచాడు అభిశాంత్.

గుమ్మం బయట రివటలా నిలబడి వున్న 'ధర్మం' అడిగాడు. "తలుపు తియ్యడానికి ఇంత ఆలస్యమా! లోపల అంత బిజీవర్క్ ఏం వుంది గురూ!"

"నా బొంద వుంది" లుంగీని వదిలేస్తూ సీరియస్‌గా అన్నాడు.

"ఆ.." అంటూ లోనికి వచ్చాడు.

"లేకపోతే ఏమిటా వెధవ అనుమానాలూ నువ్వూనూ. టిఫిన్ చేస్తున్నాను"

"ఎవరో గెస్ట్ వచ్చినట్టున్నారు. ఎవరు గురూ! ఆడా, మగా! నాకు పరిచయం చెయ్యవా"

గతుక్కుమన్నాడు అభిశాంత్, మొహాన్ని పరమ వికారంగా పెట్టేసి "గెస్టా, గెస్ట్ ఎవరు?" అన్నాడు.

"నేను చూశాన్లే"

"కొంపతీసి ఈ వెధవ నిజంగానే చూశాడా ఏమిటి ఖర్మ" అని మనసులో అనుకుని, పైకి మాత్రం "నీ మొహం. కళ్ళజోడు వేయించుకో" అన్నాడు.

"అవసరం లేదు గురూ... బైనాక్యులర్స్ కూడ లేకుండా నా కళ్ళు సుదూరాన్ని కూడా చాలా స్పష్టంగా చూడగలవు"

"ఆ మాట మాత్రం నిజమే. నీ కళ్ళు దొంగకళ్ళు"

"కాదు, దొరకళ్ళు. ఇంతకీ ఈ రెండో ప్లేట్లో టిఫిన్ ఎవరు తిన్నారు" టీపాయ్ మీదున్న ఖాళీ ప్లేట్స్ చూపించాడు ధర్మం.

తృళ్ళిపడి కాస్త తడబడ్డాడు అభిశాంత్ "ఈ రోజు ఏమిటోగాని మహా ఆకలిగా వుండేసరికి ఆ రెండు ప్లేట్ల టిఫిను నేనే లాగించేశాను"

"అలాగా! మరి ఆ రెండు కప్పుల మాటేమిటి?" కింద వున్న టీ కప్పులు చూపించాడు.

వాడి తలమీద కోపంగా కొట్టినట్టు నటించాడు అభిశాంత్. ధర్మం చూడబోయేసరికి ఇబ్బందిగా నవ్వుతూ చూస్తూ చెయ్యి దించేశాడు.

"దాహమేసి రెండు టీలు తాగేశావా?"

"కాదు, ఇవాళెందుకో ఒక టీ డోస్ చాలలేదు. రెండో టీ కూడా లాగించేశాను"

"ఏమిటి టిఫిన్" హాలు చుట్టూ ఉన్న పరిసరాలు గమనిస్తూ అడిగాడు ధర్మం. అతడు ఇల్లు పరిశీలిస్తుంటే అభిశాంత్‌కి ధర్మం మీద కోపంగా వుంది. ఒక వైపు కంగారుగాను వుంది. కాని కంగారు లేనట్టు నటిస్తున్నాడు.

"ఇడ్లీ"

"ఇడ్లీ అంటే నాకిష్టం. ఓ ప్లేట్ ఇడ్లీ పట్రా గురూ. నేనిక్కడే కూర్చుంటాను" కిచెన్ రూంలోకి వెళ్లబోతూ ఆగాడు అభిశాంత్.

తనను వంటగదిలోకి పంపించి, వీడు ఇల్లంతా గాలించినా గాలిస్తాడు అనుకుని "నువ్వు కూడా రా" అన్నాడు.

"వంటగదిలోకి నేనెందుకు గురూ!"

"వంట చెయ్యడానికి. ఛ... నోర్మూసుకుని రా" అంటూ అతన్ని కిచెన్‌రూంలోకి లాక్కుపోయి, ఓ ప్లేట్లో నాలుగు ఇడ్లీలు పెట్టి, కొబ్బరి చట్నీ వేసి ఇచ్చాడు.

హాలులో సోఫాలో కూర్చుని టిఫిన్ తింటూ అడిగాడు ధర్మం "ఇడ్లీలు ఎవరు చేశారు గురూ... ఇంత బావున్నాయి"

హుషారు వచ్చేసి "మే..." అనేసి గతుక్కుమన్నాడు అభిశాంత్.

తృళ్ళిపడ్డాడు ధర్మం "మేకలా మే అని అరుస్తున్నావేంటి! కొంపతీసి మేకగాని కరిచిందా ఏమిటి?!"

"నీ మొహం నే అనే మాట నీకు మేలా వినిపించింది. ఆ ఇడ్లీలు నేనే చేసాను"

"నువ్వే చేశావా! అహో, నువ్వు చేసిన ఇడ్లీలు ఇంత బావుండవే. పిండి పిండిలా సరిగా ఉడకని ఇడ్లీలు, ఉప్పో, కారమో ఎక్కువైన చెట్నీ, నువ్వు బాగా తయారు చెయ్యగలవని నాకు తెలుసు. ఈ టిఫిన్ నువ్వు చేసావంటే నమ్మను"

"నమ్మకపోతే పో, నీ అనుమానం బుద్ధి పోనిచ్చుకున్నావు కాదు"

"అనుమానం కాదు. ఇన్‌వెస్టిగేషన్"

"నీ తలకాయ్"

"సర్లే. ఇడ్లీలు నువ్వే చేశావని నమ్మానుగాని, నాకు టీ కావాలి"

"కిచెన్‌లోకి రా. కబుర్లు చెబుతూ వుండు. నేను క్షణంలో టీ కాస్తాను"

అని, చెయ్యి కాల్చుకున్నాడు అభిశాంత్. కొన్ని క్షణాలు అదేపనిగా చెయ్యి ఊపుకుంటూ వూదుకున్నాడు. మొత్తానికి కాచి, కప్పులో పోసి అతడికి అందించాడు.

టీ తాగి, సిగరెట్ ముట్టించి అతడికో సిగరెట్ ఆఫర్ చేసాడు.

"నో థాంక్స్..."

మేడ గదిలో వున్న మేఘనకి వాళ్ళ మాటలు వినిపిస్తూనే వున్నాయి. కిటికీలోంచి అభిశాంత్ ఇబ్బంది ప్రవర్తనా, ధర్మంగాడి వింత ప్రవృత్తి చూసి ఆమె నవ్వుకుంటూనే వుంది.

"నా మాటవిని ఈపాటికి పెళ్ళి చేసుకుని వుంటే చేతివేళ్ళు, కాలిగోళ్ళు కాల్చుకునే ఖర్మ తప్పేది కదా!... పోనీ నన్నో సంబంధం చూడమంటావేమిటి? ఓ తెలిసిన సంబంధం వుంది" అడిగాడు ధర్మం కాలుమీద కాలువేసుకుని సోఫాలో రిలాక్స్‌గా కూర్చుని సిగరెట్ కాలుస్తూ.

"ఎక్కడ?" ఏదో ఒకటి మాట్లాడాలి కనుక అడిగాడు.

"ఇక్కడే. చాలా మంచి సంబంధం. సాంప్రదాయమైన కుటుంబం. అందులో తిరుగులేదు. కోటీశ్వరుని కుమార్తె. చక్కనిచుక్క" పొగ వదులుతూ హుషారుగా చెప్పాడు ధర్మం.

"వంట చేయడం తెలుసా?"

"బ్రహ్మాండంగా తెలుసు. వంటచేయడం తను చెబుతూపోతుంటే నువ్వు చేసుకుంటూ పోవడమే!"

"చ ఛ... పెళ్ళి చేసుకుని కూడా వంట చేయవలసివస్తే ఇక పెళ్లెందుకు చేసుకోవడం"

"పనిమనిషి చేత వండించుకోవచ్చు"

"పనిమనిషి చేతివంట తినడానికి పెళ్లి అవసరం లేదు. వండటం తెలిసినప్పుడు వంట చెయ్యడానికేం..."

చావు కబుర్లు చల్లగా చెప్పాడు "పాపం ఆమెకి కళ్ళు కనిపించవ్ గురూ!"

"నీ మొహంమండ. నాకో గుడ్డిదాన్ని కట్టబెట్టేద్దామనా... నీ ప్లాను"

"వాళ్ళబాబు లక్షలు ఇస్తాడు గురూ!"

"చ ఛ. ఇక చెప్పకు"

"పోనీ మా బంధువుల సంబంధం ఇంకోటుంది చూడు. అమ్మాయి గుణవతి, శీలవతి, రూపవతి, వంట అద్భుతంగా చేస్తుంది. తండ్రి లక్షల కట్నం ఇస్తాడు"

"కట్నం అవసరం లేదు."

"నీ ఆదర్శానికి జోహార్. కట్నం వద్దంటే ఏదో లోపం వుందనుకుంటుంది లోకం... జాగ్రత్త"

"ఇంతకీ ఆ అమ్మాయికే లోపం లేదుకదా?"

"కాస్త కూడా లేదు. ఓ కాలు కొంచెం కుంటి అంతే"

"ఛీఛీ... నీ కుంటి సంబంధాలు, గుడ్డి సంబంధాలు నాకొద్దు... నువ్వే సంబంధాలు చూడొద్దు. నేను ప్రేమించి పెళ్ళాడతాను"

"ఎవర్నయినా ప్రేమించావా?"

"ప్రేమించాను"

"ఎవరా అమ్మాయి. అందంగా వుంటుందా!"

"ఆ నువ్వు చెప్పిన వాళ్ళకున్నట్లు ఏ అవయవలోపం వుండదు"

"ఆమె ఎవరో చెప్పవా?"

"చెప్పను"

"ప్లీజ్"

"సమయం వచ్చాక చెబుతాను"

"సరే...ఈ శుభసందర్భంలో మందు కొడదామా?"

"నేను తాగనని నీకు తెలుసు కదా!"

"నీ కోసం తాగు"

"తాగను."

"పోనీ, నా కోసం తాగు. ఈ రోజు నా పుట్టినరోజు"

"నీ పుట్టినరోజు మొన్నే అయిపోయిందని తెలుసు. నీ భార్య పాయసం, గారెలు పంపింది"

"పుట్టిన రోజు చేసుకోవడానికేముంది... ఎన్నిసార్లయినా చేసుకోవచ్చు"

"ధర్మం... నీకిదేమైనా ధర్మంగా వుందా చెప్పు" అభిశాంత్ ఫీలింగ్స్ అదోలా మారిపోయాయి. మాటల మధ్యలో పళ్ళు గిట్టకరుస్తూ, దవడ కండరం బిగిస్తూ, అతడు చూస్తే బలవంతపు నవ్వు నవ్వేస్తూ చెప్పాడు. "శుక్రాచార్యుని శిష్యుడిలా నన్నెందుకు పీడించుకు తింటావ్? నాకు లేని అలవాట్లు అలవాటు చెయ్యాలని నీకెందుకా తాపత్రయం"

"క్షమించు గురూ... ఏం చెయ్యమంటావ్ చెప్పు. నాకున్న అలవాట్లలో నీకు ఒక్క అలవాటు కూడా లేదే! అనే బాధ నన్ను క్షణం క్షణం పీడించుకు తింటోందనుకో. అందువలన నీకు కనీసం ఒక్క అలవాటయినా అలవాటు చెయ్యాలనే తపన నాలో రోజురోజుకీ పెరిగిపోతోంది. అన్ని అలవాట్లు నాకే వుండేసరికి నా ఆత్మన్యూనతాభావంతో చింతిస్తోంది. నీకు కనీసం ఒక్క మందు తాగడం అలవడితే తప్ప నా ఆత్మకు సంతృప్తి లభించదు. నా ఆత్మకు నిష్కృతీ లేదు. ఒక్క అలవాటులోనయినా మనం ఒక జాతిపక్షులం అనిపంచుకోవాలని నా అభిలాష. నా కోరిక తీరక నిన్ను స్నేహితునిగా భావించలేకపోతున్నాను"

"నిజాన్ని నిజాయితీగా చెప్పినందుకు సంతోషం. నీ భార్య పిలుస్తున్నట్టు ఉంది చూడు"

ఆమె గొంతువిని బయటికి నడిచాడు ధర్మం. ఆ వెంటనే వీధి తలుపు గెడ పెట్టేశాడు అభిశాంత్. "హమ్మయ్య... వెధవ చంపుకు తినేశాడు"

మేడ మెట్లు దిగుతూ అంది మేఘన "ఈ ధర్మం ఎవరో జోకర్‌లా వున్నాడే"

"జోకర్ కాదు, యమకింకర్, మెదళ్ళు మేసేయటంలో స్పెషలిస్టు"

"కోడి మెదళ్ళా, మేక మెదళ్ళా?"

"మనిషి మెదళ్ళు"

"ఆ..."

"మరేమిటనుకున్నావ్. నా మెదడంతా వీడే తినేశాడు. నీకోసారి వాణ్ణి పరిచయం చేస్తానుండు"

"నీ ప్రేయసిని మాత్రం పరిచయం చెయ్యనంటావ్?" ఆ క్షణంలో ఏం చెప్పాలో తెలియక అతడు తడబడ్డాడు. "తప్పక పరిచయం చేస్తాను"

"ఎప్పుడు?"

"ఇప్పుడే. ఆమె నీకు తెలిసిన అమ్మాయే!"

"నాకు తెలిసిన అమ్మాయా?"

"అవును. పేరు మేఘన"

తన పేరు విని కొన్ని క్షణాల వరకు మాట్లాడకుండా నిలబడిపోయింది ఆమె.

"అవును మేఘన. ఐ లవ్ యు"

"నన్ను నిజంగా ప్రేమిస్తున్నావా?"

"నిజాయితీగా ప్రేమిస్తున్నాను"

"నా కోసం నీ ప్రాణాలు ఇవ్వగలవా?"

"అమ్మో... ప్రాణాలే! ఏదో మనీపర్స్ అడిగినంత తేలిగ్గా అడిగావు. ప్రాణాలు ఇవ్వటమంటే అంత తేలికా?"

"తేలికకాదు గనుకే అడిగాను. ప్రాణప్రదంగా ప్రేమించినవాళ్ళు మాత్రమే ప్రాణాలు ఇవ్వగలరు. నువ్వు నన్ను ప్రేమించలేదు"

"లేదు. ప్రేమించాను. లవ్ ఎట్ ఫస్ట్ సైట్.... నీతో పరిచయం అయిన వెంటనే నాలో రేగిన సంచలనానికి కారణం అదే"

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్" ఒకో అక్షరం ఒత్తి ఒత్తి పలికి నవ్వుతూ పేపర్ వెయిట్ గిర్రున తిప్పింది మేఘన. "ఆ పేరుమీద కొంత ఎనలైజేషన్ సృష్టించి తెలివయిన కొందరు రచయిత్రి(త)లు పాఠకుల్ని చేస్తున్న మోసం అది. అసలు 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్' అనే మాట హంబక్! 'మొదటి చూపులో ప్రేమ' అనేదే

నిజమైతే ఈ రోజు ఇన్ని వరకట్నాల పెళ్ళిళ్ళు, వరకట్నాల సమస్యలు, వరకట్నం చావులు ఉండనే ఉండవు. మొదటి చూపులోనే పెళ్ళిళ్ళు జరిగిపోతాయి. ఆ మాటే నిజమైతే మన సమాజం వసుధైక కుటుంబం అవుతుందనేది సత్యం! లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనేమాట పచ్చి అబద్ధం. మొదటి చూపులో ఆకర్షణ వుంటుంది తప్ప ప్రేమ కాదు. అమ్మాయి, అబ్బాయిల మధ్య ఆ ఆకర్షణ పెరిగీ పెరిగీ కొంతకాలం తర్వాత ఎప్పుడో ఒకప్పుడు ప్రేమ జనించవచ్చు! ఆకర్షణ ఉన్నప్పటికీ కూడా ప్రేమ జనించకపోవచ్చు! ప్రేమ జనించిందా, లేదా అని చెప్పడానికి ఆ స్త్రీ పురుషుల మధ్య వుండే ఆకర్షణశక్తి మీద ఆధారపడి వుంటుంది. ఆకర్షణ పెరిగి ప్రేమ జనించి, అది స్థిరపడితే... ఆ ప్రేమలో స్వార్థం వుండదు. త్యాగం వుంటుంది. అలాంటి ప్రేమ నిజమైన ప్రేమ. అందులో నిజాయితీ వుంటుంది. ప్రేమంటే సరైన అవగాహనలేని నేటి యువతీ యువకులకి 'ప్రేమ' గురించి ఎడ్యుకేట్ చేసే ఏదైనా గ్రంథాన్ని ఎవరైనా రాస్తే బావుణ్ణు!"

ఆమె ఆలోచనాపటిమకు కొంతసేపటివరకు మాట రాక అలాగే నిలబడి పోయాడు అభిశాంత్. ఎవరివరకో ఎందుకు, ఆ గ్రంథాన్ని మేఘనే రాయగలదు అనుకున్నాడు.

"నన్ను క్షమించు అభి! మనసులో అనుకున్నది, నిర్మొహమాటంగా చెప్పడం నాకు అలవాటు"

"అదే మంచిది. రాజకీయ నాయకుల్లా మన మధ్య లౌక్యం వద్దు"

"నువ్వు నన్ను ప్రేమించలేదు అభి. నీది ఆకర్షణ మాత్రమే. నన్ను పెళ్ళాడితే బావుణ్ణు అనిపించవచ్చు"

"ప్రేమ గురించి నీ విశ్లేషణ నాకు నచ్చింది. మేఘనా, నువ్వు చెప్పింది నిజం. నాది కేవలం ఆకర్షణ అని నీ విశ్లేషణ వినేవరకు గ్రహించలేకపోయాను" ఆమె వైపు వింతగా చూశాడతడు. "నీలో ఇంత తెలివి, చాతుర్యం వున్నాయని నేననుకోలేదు సుమా!"

"పొగడ్తలంటే నాకు కిట్టవు"

"సరే! ఈ సమయంలో నాదో చిన్న విశ్లేషణ వదుల్తాను విను. తన ప్రేయసిని మరెవరికో ఇచ్చి పెళ్ళి చేస్తుంటే చూసి భరించలేక ఆత్మహత్య చేసుకోవడం ప్రేమకాదు, ఆజన్మాంతం త్యాగనిరతితో మరో పెళ్ళి చేసుకోకుండా బ్రహ్మచర్యం పాఠించడమే నిజమైన ప్రేమ. నా ఎనలైజేషన్ రైటే కదూ!"

"కరెక్ట్"

పొంగిపోతూ అన్నాడు అభిశాంత్ "అయ్యబాబోయ్ నాకూ ఎనలైజేషన్ చెయ్యడం వచ్చేస్తోంది. ఎంతైనా జర్నలిస్టుని కదా!"

"కానీ" అది మేఘన.

"మళ్ళీ ఇదోటా!"

"బ్రహ్మచర్యం పాటించడమనేది స్త్రీ వైపునుంచి కూడా వుండాలి"

"పాపం స్త్రీ అంటే సమాజంలో ఓ ఖైదీ కదా! ఆమె ఎవర్నో ప్రేమిస్తోందని తెలిస్తే ఆమె బ్రహ్మచర్యం పాటిస్తుందని తెలిస్తే ఆమె చుట్టూ వల వేసేసి బలవంతపు పెళ్ళి చేసేస్తారు కదా! సమాజంలో ఆమెకున్న ప్రతిష్ఠ గొప్పది గదా! సనాతనమైన మన ఆచారాలు, వ్యవహారాలు, హిందూ ధర్మశాస్త్రం ఆమెను గడప దాటనివ్వకుండా చేసేస్తాయి గదా!" మెల్లగా చెప్పాడు.

"అలాంటప్పుడు అర్థం లేని వ్యర్థమైన ఈ ఆకర్షణలెందుకు, ప్రేమ ముసుగులో మోసాల గోదాలోకి దిగడమెందుకు, చపలత్వం ప్రకోపించగా నైతిక విలువలు కోల్పోయి శారీరక కోరికలు తీర్చుకుని కడుపులు తెచ్చుకోవడ మెందుకు, చేతులు కాల్చుకుని తీరిగ్గా భోరున విలపించడమెందుకు, ఆత్మవంచన లెందుకు, అబార్షన్‌లెందుకు, ఆత్మ సమర్థనలెందుకు, మరో మగాణ్ని మోసగించి పెళ్ళెందుకు, లేచిపోవటాలెందుకు, ఆపై ఆత్మహత్యలెందుకు, తల్లిదండ్రులకు కడుపుకోతలెందుకు, ఆకర్షణా వ్యామోహంలో పెళ్ళాడిన మొగుడు వదిలేస్తే ఖర్మకాలి ఏడ్వటమెందుకు, సనాతనమైన మన హిందూ ధర్మశాస్త్రం మీద భక్తి ప్రవత్తులు, ప్రేమాభిమానాలు వున్న స్త్రీలే అయితే ఇంత గొడవ దేనికి. వ్యర్థమైన

ఆకర్షణలకు లొంగనే లొంగరు. పతివ్రతా శిరోమణులు అనిపించుకున్న స్త్రీలలా తల్లిదండ్రులు, పెద్దలు చేసిన పెళ్ళిళ్ళే సంతోషంగా చేసుకుంటారు. ప్రేమ పెళ్ళిళ్ళలో కలకాలం నిలిచే పెళ్ళిళ్ళు చాలా అరుదుగా వుంటాయి. పోల్చిచూస్తే కలకాలం నిలిచేవి తల్లిదండ్రులు, పెద్దలు చేసిన పెళ్ళిళ్ళే. అత్యధిక శాతం పెద్దలు చేసిన పెళ్ళిళ్ళే సక్సెస్ అవుతున్నాయనేది నిర్వివాదాంశం"

"అంటే కష్టపడి 'ఆకర్షణ'లో పడి ముప్పతిప్పలు పడి ప్రేమలో పడి, మూడు చెరువుల నీరు తాగి పెళ్ళాడడం కంటే సుఖంగా పెద్దలు చేసిన పెళ్ళి చేసుకుని, ప్రేమించుకోవడం బెటరంటావ్"

"అంతేనంటాను"

"మన హిందూ ధర్మశాస్త్రాన్ని ఆరాధించే స్త్రీలలో నువ్వూ ఒకదాని వంటాను"

"అవునంటాను"

"లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అనే అబద్ధపు మాటని ఈ క్షణంలోనే కేన్సిల్ చేసేస్తున్నాను. ఆకర్షణ ఎట్ ఫస్ట్ సైట్...మొదటి చూపులోనే ఆకర్షించిన నిన్ను అగ్ని సాక్షిగా పెళ్ళాడతానంటాను"

"సరేనంటాను" అని నాలుక్కరుచుకుంది మేఘన. ఆ వెంటనే సిగ్గుల మొగ్గలా ముడుచుకుపోయింది. స్త్రీకి సిగ్గే సింగారం.

"నీ ఇష్ట ప్రకారం మనం పెళ్లాడి ప్రేమించుకుందాం" అన్నాడు అభిశాంత్.

కాస్త సమయం తర్వాత స్త్రీ సహజమైన సిగ్గుని విడిచిపెట్టేసిందామె. "అభీ... మగవాడిలో స్త్రీ యిష్టపడని అలవాట్లు నీకు లేనందుకు నాకు సంతోషంగా వుంది. కాని నీకు ఏ కట్న కానుకలూ ఇచ్చుకోలేను"

"నీ మనసే నాకు కట్నం" అతని కళ్ళల్లో ఆకర్షణ స్పష్టంగా తెలుస్తోంది.

అభిశాంత్‌ని ఆరాధనా భావంతో చూసిందామె. అది ప్రేమకాదు. దేవుణ్ణి చూస్తే భక్తుడికి కలిగే ఒక ఆధ్యాత్మిక భావన అది.

పెద్దలు, నిశ్చయ తాంబూలాలు, వేద మంత్రాలు లేకుండానే వాళ్ళ పెళ్ళి

ఆ క్షణంలోనే నిశ్చయమైంది.

తన జీవితం ఒక్కరోజులో ఇన్ని చిత్ర విచిత్రమైన మలుపులు తిరగడం, క్షణాల్లో తన చిన్ననాటి నేస్తంతో తన పెళ్ళి సెటిల్ కావడం తనకో అందమైన కలలా వుంది తప్ప నిజం అనిపించడం లేదు. అదే చిత్రం.

అమరశిల్పి దేవుడు చెక్కిన శిల్పం (మనిషి) జీవితం చిత్రం!

ఆ జనారణ్యంలో తన కోసం వేటాడే క్రూర మృగాలు పన్నిన విషవలయంకి సంబంధించిన ఓ నిజం ఆమెకి ఆ శుభ సందర్భంలోనే తెలిసి ఖిన్నురాలైంది!

కిటికీలోంచి పేపర్ బాయ్ పారేసిన 'సమరశంఖం' దినపత్రిక అందుకుని, మొదటి పేజీలో ఫోటోలతో సహా ప్రచురింపబడిన ఓ ప్రముఖ వార్తను దిగ్భ్రాంతిగా చదివి, ఆ పత్రికను మేఘనకి అందించాడు అభిశాంత్.

తనను అరెస్టు చేయబోయినప్పుడు, వేన్ ఎక్కిస్తున్నప్పుడు ఎవరో జర్నలిస్టు రహస్యంగా తీసిన ఫోటోలు ఆ పత్రికలో ప్రముఖంగా ప్రచురింపబడ్డాయి. దానికింద హెూం మంత్రి ఫోటో, మహంకాళి ఫోటో కూడా ప్రచురితమయ్యాయి. ఆ కిందవున్న వార్తను చదివిందామె.

'మాఫియా మాయలాడి మేఘన అదృశ్యం!'

ప్రముఖ వార్త! హెూం మంత్రి శ్రీ రాజరాజ నరేంద్రుడి దగ్గర సెక్రటరీగా పనిచేస్తున్న మేఘన అనే అమ్మాయి నిన్నటి రోజున హెూం డిపార్టుమెంట్‌కి సంబంధించిన కీలకమైన పత్రాలున్న 'గ్రీన్ ఫైల్'ని దొంగిలించింది. ఆ వెంటనే నిజం గ్రహించిన హెూం మంత్రి పోలీసుల్ని అప్రమత్తం చేసి ఆమెను అరెస్టు చేయించారు. కాని అరెస్టు చేసిన కొన్ని గంటలకే పోలీసులకి మస్కా కొట్టి తప్పించుకు పారిపోయిందా వీరవనిత. ఆమెకు మాఫియా ముఠాలతో సంబంధ బాంధవ్యాలున్నాయని వెల్లడయిందనీ, చాలా తక్కువ సమయంలో పోలీసు డిపార్టుమెంట్ ఆ నిజాలను పరిశోధించిందనీ, మాఫియా నాయకుడు దేశద్రోహి అయిన మహంకాళిని పోలీస్ కస్టడీలోంచి తప్పించడానికి మేఘన పన్నాగాలు

పన్నుతోందని హోం మంత్రి చెప్పారు. ఆమె ఎన్నో కేసుల్లో ముద్దాయి అనీ, గుండెలు తీసిన బంటు అనీ, కనుక ప్రజలు అప్రమత్తంగా వుండాలని హెచ్చరించారు. మాఫియా రాణి మేఘనని పట్టించిన వారికి హోం డిపార్టుమెంట్ లక్షరూపాయలు బహుమానం ప్రకటించింది (మా ప్రత్యేక ప్రతినిధి).

మూడో పేజీలో ప్రచురింపబడ్డ వార్త చదివిన ఆమె వెన్ను కొన్ని క్షణాల వరకు జలదరిస్తూనే వుంది.

'వాంటెడ్ డెడ్ ఆర్ ఎలైవ్!'

ప్రముఖ వార్త! "హోం మంత్రి శ్రీ రాజరాజ నరేంద్రుడు మాఫియా గాంగ్ లీడర్ మహంకాళిని పట్టించిన వార్త మా పాఠకులకు విధితమే. అలాంటి దేశ ద్రోహిని రక్షించాలని చూస్తున్న మాఫియా మాయలాడి మేఘన మీద హోం డిపార్టుమెంట్ 'వాంటెడ్ డెడ్ ఆర్ ఎలైవ్' అనే ప్రకటన ఇచ్చింది. ఆమెను పట్టుకున్న సాధారణ ప్రజలకి అయితే ప్రభుత్వం లక్ష రూపాయలు బహుమతి ఇస్తుంది. అదే పోలీసు డిపార్టుమెంట్‌కి అయితే రెండు లక్షల రూపాయలు బహుమతి ఇస్తుంది.

రాజరాజ నరేంద్రుడు పరోక్షంగా తన డెత్ వారెంటుని ప్రకటించాడని ఆమె గ్రహించింది.!

పది నిముషాల వరకు ఇద్దరూ మాట్లాడలేదు.

అభిశాంత్ స్వతహాగా భయస్తుడు కావటంవల్ల ఆ వార్తలు అతణ్ణి భయ విహ్వాలంలో ముంచెత్తాయి. అది గమనించిన మేఘన అంది "నాతో పాటు అనవసరంగా నిన్ను కూడా ప్రమాదంలోకి ఇరికిస్తున్నానేమోనని ఫీలింగ్‌గా వుంది అభి"

"నో నో... అలా ఎప్పుడు అనుకోకు మేఘన. నీ ఆశయ సాధనలో నేనో పాత్రధారిని కావాలని నా అభిలాష. కారణం పవిత్రమైన నీ ఆశయాన్ని నేను ప్రేమిస్తున్నాను" చెప్పి, అతడన్నాడు "ప్రస్తుతం నేనాలోచించేది... నా

గురించి కాదు, నీ గురించి, నీ చుట్టూ వున్న విషవలయం గురించి. ఆ వలయం నుంచి నిన్నెలా బయటికి లాగాలనే దాని గురించి. ఇప్పటికే నీ చుట్టూ వలలు బిగుసుకుని వుంటాయి"

"అవును. ఆ వలల్ని ఛేదించడం గురించే నేనాలోచిస్తున్నాను" సాలోచనగా అందామె.

"అంత ప్రమాదంలో వుండి కూడా నువ్వింత ధీమాగా నిర్భయంగా ఎలా మాట్లాడగలుగుతున్నావు మేఘన!"

"చావు తప్పదని తెలిసినప్పుడు భీరుపుతనాన్ని వదలి పెట్టి ఆఖరి ప్రయత్నంగా మృత్యువుతో పోరాడి గెలుపో ఓటమో తేల్చుకోవడం ఉత్తమ లక్షణం. మనవాళ్ళు నిండా మునిగినవాడికి చలేమిటంటారు. అలాంటి పరిస్థితిలో వున్న – నాలోని అధైర్యం పారిపోయి మొండి ధైర్యం చోటు చేసుకుని వుండొచ్చు. ఇప్పుడు నా స్వశక్తిమీద నాకు పూర్తి నమ్మకం ఏర్పడింది. ఆ మృగవలయాన్ని ఛేదించుకుని వెళ్లి మహంకాళిని రక్షించాలి. ఆ తర్వాత గాంధేయ మార్గంలో రాజరాజ నరేంద్రుడి మీద సత్యాగ్రహం ప్రకటిస్తాను"

ఆమెకు సడెన్‌గా ఓ విషయం జ్ఞాపకమొచ్చింది. లెక్క ప్రకారం అయితే మహంకాళి మీద హత్యాప్రయత్నం రేపు రాత్రి జరుగుతుంది. కాని.. కాని... ఆమె మనసులో సూది మొనలాంటి చిన్న అనుమానం ప్రవేశించింది..క్షణాల్లోనే పెరిగి పెద్దదయింది.

యస్... నో డౌట్... మహంకాళిని పోలీసుల కస్టడీ నుంచి తను తప్పిస్తుందనే ప్రకటనలు ఇచ్చిన హెూం మంత్రి రేపు రాత్రి వరకు మన్ను తిన్న పాములా కుదురుగా కూర్చోడు. పాలు తాగిన కోడెత్రాచులా లేచి మహంకాళిని ఈ రాత్రికే కాటు వేయడని ఏమిటి నమ్మకం. తర్వాత ఆ కేసుని తన మీదకే నెట్టివేయగల రాజకీయ చతురుడు అతడు.

సో... తను ఎలాగయినా సరే మహంకాళిని ఈ రాత్రికే రక్షించి తీరాలి.

తను ప్రాణాలతో చెలగాట మాడబోతోంది. కనుక తన ప్రాణంతో పాటు

అభిశాంత్ ప్రాణాన్ని కూడా అపాయంలో పెట్టడం సబబు కాదు. అందువల్ల ఈ విషయం అభితో చెప్పకూడదు అనుకుందామె.

మహంకాళిని దాచిన రహస్య బంగ్లా ఎలా కనుక్కోవాలా అని కొన్ని క్షణాలు తీవ్రంగా ఆలోచించిందామె.

మెరుపులా ఆమెకో మంచి ఆలోచన తట్టింది.

"ఏమిటాలోచిస్తున్నావ్?" ప్రశ్నించాడు అభిశాంత్.

"అబ్బే... ఏం లేదు" కాస్త తడబడి దాటవేసిందామె.

* * *

అతడికి శెల్యూట్ చేసి అటెన్షన్‌లో నిలబడ్డాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోగారావ్.

"మిస్టర్ జోగారావ్... నిన్ను పిలవడానికి కారణం ఒక్కటే. మనం అనుకున్న ప్లాన్‌లో కొద్దిగా మార్పు వచ్చింది" ఆగాడు హోం మంత్రి.

"చెప్పండి సార్, ఏమిటది?"

"మహంకాళిని చంపాల్సింది రేపు కాదు, ఈ రోజే. అతణ్ణి ఈ రాత్రికే ఫినిష్ చేసేయాలి. రాత్రి సిటీ టవర్ క్లాక్ పన్నెండు గంటలు కొట్టేలోగా..."

"టవర్ క్లాక్‌ని దాటుకుని అతడి ప్రాణాలు అనంత విశ్వంలో కలిసి పోతాయి" అతడి మాటను పూర్తి చేసాడు జోగారావ్.

"వెరీగుడ్. దటీజ్ ది స్పిరిట్. కాని.... మహంకాళిది ఆత్మహత్య"

"అయి తీరుతుంది"

"చెప్పేదదే. అతడిది ఆత్మహత్య కాకూడదు. ప్లాన్ రూపే మారిపోయింది" ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో వివరించి చెప్పాడు రాజరాజ నరేంద్రుడు. తర్వాత అన్నాడు. "బీ కేర్ ఫుల్. అనుకున్నది అనుకున్నట్టు జరగాలి. అందుకు భిన్నంగా జరగడానికి వీల్లేదు. ఆ డెవిల్ మేఘనకి నేను మరో అవకాశం ఇవ్వదలచుకోలేదు. భిన్నంగా జరిగితే మీకూ మరో అవకాశం ఇవ్వను"

అతడి ఆఖరి మాట జోగారావ్‌ని కాసేపు వణికించింది.

* * *

స్నానం చేసి ఫ్రెష్‌గా తయారైన తడి ఆరని కురులతో గదిలో అడుగు పెట్టిన శ్రీలేఖని చూసి డ్రస్సింగ్ మిర్రర్ ముందు కూర్చుని తల దువ్వుకుంటున్న ఇందువదన అంది "రాత్రి మీనాన్న ఫోన్ చేశాడే"

"ఏమంటాడు?" అడిగింది శ్రీలేఖ.

అలాంటి నికృష్టపు తండ్రికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం లేదు.

"పాత పాటే... నీమీద తనకున్న పుత్రికావాత్సల్యాన్ని ప్రేమగా ఫోన్లో ప్రవహింపజేశాడే"

"అవునూ... ఇంతకీ ఆమె ఎక్కడే!" సడెన్‌గా జ్ఞాపకం వచ్చి అడిగింది శ్రీలేఖ.

"ఏమే?"

"ఆమె... మేఘన"

"ఓహెూ అర్థమైంది. ఆమె బంజారాహిల్స్‌లో దిగేసింది"

"కొంప ముంచావ్ కదే ఫూల్. ఆమె దిగుతానంటే మాత్రం నువ్వెలా దిగనిచ్చావే!"

"మన ప్లానులో ఆ క్లాజ్ గురించి నువ్వసలు చర్చించలేదు"

"నిజమే తప్పునాదే. ఈ మార్ఫీన్ మత్తులో కొన్ని అంశాలు మరిచి పోతున్నాను"

"మార్ఫీన్‌ని మరిచిపోతే సరి"

"అదలా వుంచు. మేఘనకి ప్రమాదం పూర్తిగా తప్పలేదు. రక్షించినట్టు రక్షించి తిరిగి ఆమెను ప్రమాదంలో విడిచిపెట్టాం. ఆమెని నా తండ్రి చంపించడానికి ప్రయత్నిస్తున్న కారణాలు నాకు తెలీదు. అవి ఆమె నుంచి తెలుసుకుని ఆమెకి పూర్తి రక్షణ కల్పించాలనుకున్నాను. ఫూల్‌ని. నా ఆలోచన

నీకు అప్పుడే చెప్పి వుండవలసింది”

“బట్ ఇట్ వజ్ టూ లేట్. మీ నాన్న ఆమెనే కేసులో ఇరికించి చంపాలనుకున్నాడు”

“ఏదో ‘గ్రీన్ ఫైల్’ కేసు. ఆ.. మరో మాటకూడ విన్నాను. అది ‘మాఫియా’ అంటే మా నాన్న గురించి మేఘనకి పూర్తిగా తెలిసిపోయిందన్నమాట. ఓ గాడ్....ఆమె పీకల వరకు ప్రమాదంలో కూరుకుపోయింది. ఆమెనా దేవుడే రక్షించాలి. మనం చేసిందంతా బూడిదలో పోసిన పన్నీరైంది”

ఆమె మాటలు విని ఇందువదన అంది “ఆమెనంత తక్కువగా అంచనా వెయ్యకు. ఇటీజ్ మై ఫెయిత్ దట్ షి ఈజ్ ఎ వెరీ డేరింగ్ ఫెలో! రాత్రి అంత టెన్షన్‌లో వుండి కూడా నా మారుతి చాలా అద్భుతంగా డ్రయివ్ చేసింది. ఆమె డ్రయివింగ్ నువ్వు చూసి వుండవలసింది. ఆమె వేగం, సాహసం చూసి నువ్వు బెంబేలెత్తిపోయి బేర్‌మనటం నేను బైనాక్యులర్స్‌లోంచి చాలా చక్కగా వీక్షించి వుండేదాన్ని...ప్చ్” పెదవి విరిచిందామె. “అలా జరక్కపోవడమే నా దురదృష్టం”

“నువ్వు చెప్పిందే నిజమయితే ఆమె తనను తాను రక్షించుకోగలదు”

“అంటే... నేను చెప్పింది నిజం కాదని నీ ఉద్దేశమా?” సీరియస్‌గా అడిగింది ఇందువదన.

“అలవాట్లలో పొరపాటు. తప్పుగా అర్థం చేసుకోకే తల్లీ” గెడ్డం పట్టుకుని బ్రతిమాలాడింది శ్రీలేఖ.

ఆమె నవ్వేసి “ఇప్పుడు మన కర్తవ్యం ఏమిటి?” అని అడిగింది.

“మేఘన గురించి ఎంక్వయిరీ చెయ్యాలి. ప్రస్తుతం అదే మన కర్తవ్యం”

ఇందువదన ఏదో చెప్పబోతూండగా ఆమె తల్లి కమలాంబ వాళ్ళిద్దర్నీ బ్రేక్‌ఫాస్ట్‌కి పిలిచింది.

తన రీడింగ్ రూంలోంచి డైనింగ్ హాల్‌కి సరాసరి లా బుక్ చదువుతూనే వచ్చేశాడు యజ్ఞనారాయణ. పుస్తకంలోని తల బయటికి తియ్యకుండా

ఇండియన్ పీనల్‌కోడ్‌ని క్రోడీకరించి చూసుకుంటూ అడిగాడు ఆయన "ఏవోయ్ శ్రీమతి ఈరోజు టిఫిన్ ఏం చేశావ్?"

"ముందు మీరా పుస్తకంలోంచి తలకాయని బయటికి తీస్తారా!" అడిగిందతడి శ్రీమతి కమలాంబ.

"తలకాయ్ తీయటమెందుకు?" దృష్టిని లా మీదే వుంచి డైనింగ్ టేబుల్ ముందున్న ఓ కుర్చీలో కూర్చుంటూ అడిగాడు యజ్ఞనారాయణ.

"నూనెలో వేయించటానికి" వ్యంగ్యంగా అందా యిల్లాలు.

"ఆ..." తృళ్ళిపడి పుస్తకం వదిలేసినంత పని చేశాడాయన.

అది చూసి పకపకా నవ్వేశారు ఇందువదన, శ్రీలేఖ.

పుస్తకం మూసేసి ఒళ్ళో పెట్టుకుని ఇబ్బందిగా నవ్వేస్తూ అన్నాడు యజ్ఞనారాయణ. "పిల్లల ఎదురుగా ఏమిటోయ్ ఆ మాటలు. ఓ జడ్జీ ఎదురుగా మాట్లాడాల్సిన మాటలేనా అవి. నా పరువుని బయటే కాక ఇంట్లో కూడా నిలబెట్టినప్పుడే నువ్వు నిజమైన శ్రీమతివి"

"లేకపోతే ఏమిటండీ, దోశెలు చల్లారిపోతున్నాయని చెపుతున్నా వినకుండా టిఫిన్ ఏమిటి? అంటూ పాట పాడుతున్నారు"

"ఎప్పుడు చెప్పావ్?"

"చట్టంలో దూరినందువల్ల మీకు వినపడలేదు. అందుకే ఆ షాక్ ట్రీట్‌మెంట్"

"ఆ...! ఎప్పుడో ఒకప్పుడు నువ్ నాకొంప ముంచేలా వున్నావ్. ఇకముందు పుస్తకాలతో డైనింగ్ హాల్‌కి రానేరాను"

ఇందువదన నవ్వుతూ అంది "అమ్మా... నాన్నగారిని ఇలా బుట్టలో వేసే షాక్ ట్రీట్‌మెంట్స్ ఎక్కడ నేర్చుకున్నావే!"

"ఇంకెక్కడ, నా దగ్గరే. నా దగ్గర నేర్చుకుని నా మీదే ప్రయోగిస్తోందా ట్రిక్స్" అన్నాడు యజ్ఞనారాయణ.

అంతా పకపకా నవ్వుకున్నారు. టిఫిన్ చేస్తూ వాళ్ళతో గడిపినప్పుడు

శ్రీలేఖకి సమయమే తెలియదు. ఎంత సేపయినాసరే వాళ్ళతో అలా వుండి పోవాలనిపిస్తుంది ఆమెకు. వాళ్ళ మాటలు వింటూ వాళ్ళ ప్రేమనురాగాలు, మమతానురాగాలు తిలకిస్తూ ఊహించలేని మధురానుభూతితో పులకరించి పోతుందామె. తను కోల్పోయినవెన్నో వాళ్ళ మధ్య పొందటానికి ఆమె మనసు ఆరాటపడుతూ ఉంటుంది.

ఆ సమయంలో ఆమె తన దురదృష్టానికి చింతించదు. ఇందువదన చేసుకున్న అదృష్టానికి పొంగిపోతూ వుంటుంది. తను కూడా ఆ కుటుంబంలో పుట్టి వుంటే ఎంత బావుణ్ణు అనుకుంటుంది. వాళ్ళ ఆనందంలో తనూ పాలుపంచుకుంటుంది. ఆ సమయంలో ఆమె కళ్ళకి కన్నీటి పొరలు అడ్డు వస్తాయి. ఆ కుటుంబంలో తను కూడా ఓ సభ్యురాలు అని తన మనసుకి గాఢంగా చెప్పుకోవడం ఆమె ఆత్మకి సంతృప్తి! నిజం కాని ఓ రంగులకల నిజమని ఊహించుకుంటే అదెంత ఆనందదాయకం!

కన్నీటి పొరలు అడ్డువచ్చినప్పుడు ఆమె ఎవరూ చూడకుండా కళ్ళు తుడుచుకుంటుంది. కాని ఇందువదన మాత్రం ఆమెను గమనించి మౌనం వహిస్తుంది. కాని ఈ రోజు మాత్రం ఆమెతో పాటు యజ్ఞనారాయణ కూడా శ్రీలేఖ కంట్లో నీటి పొరల్ని చూశాడు, ఆమె తుడుచుకోవడమూ చూశాడు.

''ఎందుకమ్మా ఆ కన్నీరు?'' తన పక్కనే కూర్చున్న శ్రీలేఖను అడిగాడాయన.

“పచ్చడి చెయ్యి కంటికి తగిలింది అంకుల్”

“అయ్యో... త్వరగా కడుక్కో అమ్మా” కంగారుగా అంది కమలాంబ. భార్యని ఆగమని సైగచేసి అన్నాడు యజ్ఞనారాయణ “నీకు అబద్ధం ఆడటం కూడా తెలియదమ్మా”

“క్షమించండి అంకుల్”

“ఇట్సాల్‌రైట్. అడగకూడని విషయాలు అడగడం నా అభిమతం కాదు”

“అడగకూడని విషయాలేవీ లేవంకుల్. తల్లిదండ్రుల ప్రేమాభిమానాలకు

దూరమైన నేను మీ శాంతి నిలయంలో ఆత్మీయతానురాగాలు మీ మధ్య చవి చూస్తుండేసరికి ఆ ఆనంద పారవశ్యంలో హిమం కరిగి జలపాతమైంది”

నిముషం వరకు మాట్లాడలేదు యజ్ఞనారాయణ “మరి మీ నాన్న గారు...”

తండ్రి మాటకు అడ్డువచ్చింది ఇందువదన. ఆమె మాటలు నొక్కి నొక్కి పలికింది “నాన్నగారు!.... కూతురు మీద ప్రేమ ఆయన మనసులో భద్రంగా గూడు కట్టుకుని వుంటుంది డాడీ. తండ్రి బాధ్యతలు తెలిసినా పాటించని తండ్రి అతడు. మంచీలేదు, మానవత్వం అసలే లేదు. దానవత్వాన్ని ప్రేమించే మృగం. ఆటవిక న్యాయాన్ని జరిపించే మానవ మృగం అతడు” రాజరాజ నరేంద్రుడి గురించి అంతా వివరంగా చెప్పి, శ్రీలేఖ మానసిక రుగ్మతని వివరించిందామె.

“ఓ గాడ్, ఆయన వెనుక ఇంత పెద్ద కథ నడుస్తోందా!... ఈ విషయాల్లో కొన్ని కూడా తెలియవే! అసలు నాకు నమ్మశక్యం కాకుండా వుంది. సంఘంలో మంచి పేరు గడించిన రాజరాజ నరేంద్రుడేమిటి! మాఫియా చీకటి సామ్రాజ్యానికి చక్రవర్తి కావడమేమిటి!”

“దటీజ్ రాజరాజ నరేంద్రుడు డేడీ! అతడి గురించి ఎవ్వరికీ తెలీదు. తెలిసిన కొద్ది మందిలో కొందరు అతడి అనుచరులు, మరికొందరు చిన్న చిన్న మాఫియా గాంగ్ లీడర్స్, ఇంకొందరు అతడి డబ్బుకి లొంగి, పవర్‌కి బెదిరే ఉన్నత పోలీసు అధికార్లు. అలాంటప్పుడు సీక్రెట్ ఎలా బట్ట బయలవుతుంది. పత్రికల వరకు చేరి పబ్లిక్‌కి ఎలా తెలుస్తుంది. ఒక్క మాట చెప్పండి. ఆయనకి, మీకు కాస్తో కూస్తో స్నేహం వుంది కదా అతడి గురించి మీకేమైనా తెలుసా!”

“తెలీదు”

“ఒక మిత్రుడిగా అతడి గురించి మీకే తెలియనప్పుడు ఇక ప్రజలకెలా తెలుస్తుంది డాడీ! అతడి గురించి అందరికీ తెలిసింది నాణానికి ఒకవైపే డాడీ. రెండో వైపు భయంకరమైన చీకటి వుంది. బ్లాక్ హోల్‌లాంటి చీకటి

అది. వెలుగు పొరపాటున ఆ చీకట్లోకి వెళ్లిందా ఇక అంతే! వెలుగుని క్షణాల్లో మింగేస్తుందా చీకటి. బయట పడని వెలుగు ఆ చీకటిని వెలుగులోకి తేలేదు కదా!"

"ఓహ్ ఇదంతా ఫాంటసీలా వుంది" విభ్రమంగా చూశాడు యజ్ఞ నారాయణ.

"ఊహించని విషయం విన్నప్పుడు అది సహజం డాడీ. ఈ విషయాలు ఎప్పటికప్పుడు మీకు చెప్పి మీ సలహా అడుగుదామనుకుంటూనే అడగలేక పోతోంది శ్రీలేఖ"

ఆ క్షణంలోనే నోరు విప్పింది శ్రీలేఖ "దేశ సేవకుడిలా నటిస్తూ దేశ ద్రోహం చేస్తున్న నా తండ్రిని జైలుకి పంపలేరా అంకుల్"

"చట్టానికి కళ్ళు లేవు అంటూంటే ఏమిటో అనుకునేవాడిని. ఇప్పుడా మాట నిజమేననిపిస్తుంది. నీ తండ్రి సృష్ఠించిన చీకటి సామ్రాజ్యాన్ని చూడలేక పోయిన చట్టం నిజంగా గుడ్డిదే! పోలీసు వ్యవస్థలో పాతుకుపోయిన అవినీతి విషవృక్షాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించనంత వరకు చట్టం గుడ్డిదే. చట్టం తన కళ్ళతో తాను చూడలేదు. పోలీసు వ్యవస్థ కళ్ళతో చూస్తుంది. అదే చట్టానికి మార్గదర్శకం. గుడ్డివాడికి చేతికర్ర ఎలాంటిదో చట్టానికి పోలీసు వ్యవస్థ అలాంటిది! గుడ్డివాడి చేతికర్ర ఓ కౄరమృగాన్ని చూపించి ఇది సాధుజంతువు అంటే ఆ గుడ్డివాడు నమ్మి తీరతాడు. ఎందుకంటే అతడు తన కళ్ళతో తాను చూడలేడు. చట్టం కూడా అంతేనమ్మా. సాక్ష్యాధారాలు లేనిదే నీ తండ్రిని చట్టం కూడా ఏమీ చెయ్యలేదు" తండ్రి విశ్లేషణతో ఏకీభవిస్తూ అడిగింది ఇందువదన...

"సాక్ష్యాలు తెచ్చినా కూడా కోర్టులో లాయరు తమ బలమైన వాదనతో ఆ సాక్ష్యాలను తలక్రిందులు చెయ్యరని ఏమిటి నమ్మకం?"

"బలమైన సాక్ష్యాలు వుంటే వాటికి తిరుగులేదు. లాయర్లు ఎంత వాదించినా ఆ సాక్ష్యాన్ని తలక్రిందులు చెయ్యలేరు"

"బ్లాక్ హోల్‌ని చూపించడం అసాధ్యం" అంది ఇందువదన.

"నా తండ్రి తను చేసిన పాపాలకి శిక్ష అనుభవించి తీరాలి అంకుల్. బట్ ఇట్ ఈజ్ నాట్ ఏన్ ఈజీ టాస్క్" అంది శ్రీలేఖ.

"నీ బాధ నాకు అర్థమైందనమ్మా... ఒక్కమాట చెబుతాను. నీ తండ్రి మాయచేసి చట్టాన్ని మోసంగించవచ్చు. కాని న్యాయాన్ని, ధర్మాన్ని మోసగించడం అతడి తరంకాదు. వాటి నుంచి అతడు ఎప్పటికీ తప్పించుకోలేడు. ఏదో ఒకనాడు అతడు తప్పక శిక్ష అనుభవించి తీరతాడు. అది సత్యం"

అదే సమయంలో గోడగడియారం గంట కొట్టింది.

సడెన్‌గా అడిగింది శ్రీలేఖ "మీరేమన్నా అనుకుంటారా అంకుల్"

"దేనికమ్మా!"

"మిమ్మల్ని నాన్నా అని పిలుస్తాను" మెల్లగా అంది శ్రీలేఖ.

ఒక్కసారిగా థ్రిల్ అయ్యాడు యజ్ఞనారాయణ "పిలువమ్మా!"

"నాన్నా" అంటూ అతడి భుజం మీద తలవాల్చి ఏడవసాగిందామె. గుండె బరువు తగ్గేలా, మనసు బాధ తీరేలా ఏడుస్తోందామె.

ఆమె తల నిమురుతూ కూర్చున్నాడు యజ్ఞనారాయణ.

ఐదు నిముషాల తర్వాత తేరుకుని కళ్ళు తుడుచుకుంది శ్రీలేఖ. "థాంక్యూ అంకుల్"

"అంకుల్ కాదు, నాన్న అని పిలువు. కమలని అమ్మా అని పిలువు. ఇక నుంచి మాకున్నది ఇద్దరు కూతుళ్ళు. రెండో కూతురు శ్రీలేఖ"

అతడి మాటలకు ఆమె సంతోషంతో పొంగిపోయింది. ఇందువదన కళ్ళు మెరిశాయి. శ్రీలేఖ వంక కమలాంబ వాత్సల్యంగా చూసింది.

టీ తాగుతూ యజ్ఞనారాయణ హాల్లోకి వచ్చి టీ పాయ్ మీదున్న న్యూస్‌పేపర్ అందుకున్నాడు. మేఘనకి సంబంధించిన వార్తలు చదివి కేకేశాడు.

ఆ వెంటనే అక్కడికి ఇందువదన, శ్రీలేఖ వచ్చారు. ఆయన న్యూస్ పేపర్ అందించాడు. వాళ్ళా వార్తలు చదివి అదిరిపోయారు.

మేఘన చుట్టూ తన తండ్రి వల బిగించడానికి కారణం, ఆమె వూహించింది "మహంకాళిని పట్టించడమనేది కీర్తికాంక్ష కోసం మా నాన్న చేసిన కుట్ర అయి వుంటుంది. ఆ కుట్ర మేఘనకి తెలిసిపోయి వుంటుంది. అందుకే ఆమెను చంపించాలని చూశాడు. ఇప్పుడు ఆమెని తప్పుడు కేసుల్లో ఇరికించి డెత్ వారెంట్ ప్రకటించాడు" మహంకాళిని హత్య చేసే కుట్రగాని, మేఘన ఆశయాలు గాని ఆమెకు తెలీవు.

"సరేగాని, లేనిపోని సాహసాలు చేసి మీరు మాత్రం ప్రమాదాల్లో ఇరుక్కోకండి" అంది అప్పుడే వచ్చిన కమలాంబ భర్తకి కోటు అందిస్తూ. కోటు తొడుక్కుని కోర్టుకి వెళ్లడానికి రెడీ అయ్యాడు యజ్ఞనారాయణ.

మేఘన ఎక్కడుందో, ఎలా ఉందో తెలియని మిస్టరీ గురించే ఆ అమ్మాయిలు ఆలోచిస్తున్నారు.

* * *

"అభి... నీకు వెహికల్ ఏదైనా వుందా?" ప్రశ్నించింది మేఘన.

"బుల్లెట్ వుంది" చెప్పాడు అభిశాంత్.

"నువ్వో పని చెయ్యాలి"

"చెప్పు?"

చెప్పిందామె. తన వద్ద వున్న పన్నెండు వందల రూపాయల నోట్లు తీసి ఇచ్చింది.

"నా దగ్గర డబ్బుంది"

"ఉండనీ. మన పెళ్ళి అయిన తర్వాత కదా నీ డబ్బు ఖర్చు చేయడానికి నాకు అధికారం వచ్చేది" నవ్వింది మేఘన.

అతడూ నవ్వాడు. బుల్లెట్ మీద బయటికి వెళ్ళి ఓ గంట తర్వాత తిరిగి వచ్చాడు.

బట్టలున్న ఓ పాలిథిన్ సంచి, ఓ మేకప్ బాక్స్ ఆమెకు అందిస్తూ చెప్పాడు

అభిశాంత్. "బుల్లెట్ పెట్రోల్ టాంక్ ఫుల్ చేయించాను"

అతడికి థాంక్స్ చెప్పి, ఓ అరగంట కష్టపడి మొహానికి మేకప్ చేసుకుందామె. ప్రస్తుతానికి అభిశాంత్ దుస్తులు ధరించింది. తన పాత దుస్తులే వేసుకోవడం అవివేకమని ఆమెకు తెలుసు. అతడి దుస్తులు కాస్త లూజుగా సరిపోయాయి. అయినా తప్పదు. బెల్ట్ బిగించింది. తల దువ్వుకుని, రెండు జడలు వేసుకుని, కూలింగ్ గాగుల్స్ పెట్టుకుంది. ఇప్పుడామెను చూస్తే బాగా తెలిసినవాళ్ళు కూడా గుర్తించలేరు. అంత బాగా మారిపోయిందామె మొహం. తెలివైన కాలేజీ విద్యార్థినిలా వుందామె.

మేడ దిగుతున్న ఆమెను చూసి తృళ్లిపడి లేచి నిలబడ్డాడు అభిశాంత్. తన ఇంట్లోంచి రావటం వల్ల ఆమెను గుర్తించగలిగాడు.

"ఇంత అద్భుతంగా మేకప్ వేసుకోవడం ఎవరి దగ్గర నేర్చుకున్నావ్?"

"డిటెక్టివ్ యుగంధర్ దగ్గర!"

"ఆయన నీకు తెలుసా?"

"తెలీదు...విన్నానంతే. ప్రయత్నిస్తే సాధ్యంకానిదేముంది!"

"అది సరే...ఎక్కడికి ప్రయాణం?"

"పద...చెప్తాను"

"సర్పవ్యూహంలా జంట నగరాలు నిండా పోలీసులు మోహరించి వున్నారు. పట్టపగలు కూడా గస్తీ తిరుగుతున్నారు. మెయిన్ రోడ్ల కూడలిలో ఎక్కడికక్కడ చెక్‌పోస్టులు వున్నాయి. అనుమానం వచ్చిన మోటారు వెహికిల్స్‌ను అపి మరీ తనిఖీ చేస్తున్నారు. నీ ఈడు అమ్మాయిల్ని పటి పట్టి మరీ చూస్తున్నారు. అనుమానం వస్తే ప్రశ్నించిగాని వదలటం లేదు. ట్విన్ సిటీస్ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రజాస్వామ్యం పోయి సైనిక పాలనలా, పోలీసు పాలన వచ్చిందేమోనని నా అనుమానం. నిన్ను పట్టేసి, బహుమతి కొట్టేద్దామని వాళ్ళ ఆశ కావచ్చు. పోలీస్ స్టేషన్స్‌లో పేరుకు ఓ కానిస్టేబుల్, ఓ రైటర్ మాత్రమే వుంటున్నారు" గబగబా చెప్పేశాడు.

"అధికార దుర్వినియోగం అంటే ఇదే!"

"నిజమే! కాని పాపం ఆ విషయం వాళ్ళెవరికీ తెలీదు కదా! తామంతా మాఫియా మాయలాడిని పట్టుకోవడంలో దేశసేవ చేస్తున్నామనుకుంటున్నది పోలీసు వ్యవస్థ"

"అవును. కాని చాలా తక్కువ సమయంలో చాలా ఎక్కువ విషయాలే తెలుసుకున్నావు"

"ఎంతయినా జర్నలిస్ట్‌ని కదా!"

అదే సమయంలో బూట్ల చప్పుళ్ళు, జీపు శబ్దం వినిపించాయి.

కిటీకి దగ్గరికి వచ్చి చూశారు ఇద్దరూ!

వేగంగా పోయిన పోలీసు జీపు, అక్కడి వీధుల్లో సెర్చింగ్ చూస్తూ వెడుతున్న పదిమంది పోలీసులు కనిపించారు వాళ్ళకి.

వేగంగా అదురుతున్న గుండెల్ని ఆదుపు చేసుకున్నాడు అతడు.

"ప్రమాదం అనేది వస్తే అది ఎప్పుడయినా వస్తుంది. దానికి టైములుండవు. నేను వెడతాను" అందామె ధైర్యంగా.

"నేనూ వస్తాను"

ఆమె అడ్డు చెప్పలేదు.

అతడు బుల్లెట్ డ్రయివ్ చేస్తున్నాడు. ఆమె వెనక కూర్చుంది.

బంజారాహిల్స్‌లో వున్న తన స్నేహితురాలు సౌమిత్రిని కలుసుకుందామె. మేఘనని వెంటనే గుర్తించలేకపోయింది సౌమిత్రి. గుర్తు పట్టిన తర్వాత, ఆమె చిక్కుల్లో పడటం తనకు ప్రతికల ద్వారా తెలిసిందని చెప్పి బాధ పడిందామె. ఆమెకు తను రక్షణ ఇస్తానంది. వద్దని చెప్పి, అభిశాంత్‌ని ఆమెకి పరిచయం చేసి, తను అప్పుగా ఇచ్చిన ముప్పయివేలు వారం రోజుల్లో ఇవ్వగలవా అని అడిగింది. తన అవసరం తీరిందనీ, ఆ డబ్బు తన వద్ద రెడీగా వుందని చెప్పి, ముప్పయివేలు తెచ్చి ఆమెకి ఇచ్చింది సౌమిత్రి. వెంటనే వెళతామంటే వినకుండా భోజనం చేస్తేగాని కదలనివ్వలేదామె.

తిరిగి ఇంటికి వస్తుండగా దారిలో ఎదురయ్యారు పోలీసులు. అనుమానంగా చూసి బుల్లెట్‌ని ఆపమని సైగ చేశారు.

అభిశాంత్ గుండెలు గుబగుబలాడాయి.

ధీమాగా, స్టయిల్‌గా వాళ్ళ వైపు చూసింది మేఘన.

ఆమెను పరిశీలనగా చూశారువాళ్ళు.

"ఆమె కాదు" అన్నాడు ఒకడు. మిగిలిన వాళ్ళు తలూపారు.

"మీ పేరు, వృత్తి చెప్పండి" ఓ పోలీసు అడిగాడు. చెప్పాడు అభిశాంత్.

"వెళ్లండి" దారి వదిలారు వాళ్ళు.

* * *

మహంకాళిని దాచిన బంగ్లా రహస్యం తెలుసుకోవాలంటే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోగారావ్ ఇంటి దగ్గర తను కాపు కాయాలి. అసలే ఇప్పుడు తన గురించి సెర్చింగ్ ఎక్కువైంది. కాబట్టి ఒకే చోట ఎక్కువసేపు కాపు కాయవలసి వస్తే పోలీసులు తనను తప్పక అనుమానిస్తారు. అందువల్ల ఆ పని అభిశాంత్‌కే అప్పగించాలని నిశ్చయించుకుని అతనికి చెప్పింది. అతడు అంగీకరించి వెంటనే బయలుదేరాడు.

జోగారావ్‌తో కాస్త పరిచయం వుంది అతడికి. అతడి అడ్రస్ అభిశాంత్‌కి తెలుసు.

పావుగంటకల్లా జోగారావ్ ఇంటికి అరవై గజాల దూరంలో ఉన్న టీ బంక్ దగ్గరకి చేరుకున్నాడు అతడు. టీ బంక్ ముందు తాటాకుల పందిరి వుంది. పందిరి కింద కొన్ని చెక్కబల్లలు, తుప్పుపట్టిన గ్రాడేజ్ కుర్చీలు వున్నాయి.

ఓ కుర్చీ లాక్కుని జోగారావు ఇల్లు కనిపించేలా కూర్చున్నాడు అభిశాంత్.

సడెన్‌గా సిగ్నల్ ఇవ్వకుండా ప్రారంభమైన వర్షం కుండపోతగా కురువసాగింది.

రిస్ట్‌వాచ్ చూశాడు అతడు.

సమయం పన్నెండు గంటల పదిహేను నిముషాలు అయింది. కాని వర్షం వల్ల వాతావరణం క్షణాల్లో మారిపోయి సాయంత్రం సమయంలా అయిపోయింది మబ్బుల వల్ల.

వర్షం వల్ల తన బుల్లెట్ పూర్తిగా తడిచిపోయింది. మేఘన పేరు విని ఉలిక్కిపడి పక్కకు చూశాడు అతను.

అక్కడికి నాలుగడుగుల దూరంలో ఓ బల్ల ముందు కూర్చున్న ఇద్దరు కానిస్టేబుల్స్ టిఫిన్ ఓవైపు మింగుతూ మేఘనని పట్టుకోవడం విషయంలో ఒకరిని మించి ఒకరు ఛాలెంజ్‌లు చేసుకుంటున్నారు.

వాళ్ళ గొడవ వదిలేసి దృష్టి మరల్చాడు అభిశాంత్.

ఒంటిమీద చొక్కాకూడా లేని ఓ పదేళ్ళ కుర్రాడు జారిపోతున్న లాగుని పైకి లాక్కుంటూ అతన్ని అడిగాడు "క్యా సాబ్..."

"ఏక్ ఛాయ్ లావో"

టేబుల్ మీదవున్న గ్లాసు అందుకుని కొన్ని మంచినీళ్ళు తాగి, ఆ కుర్రాడు అందించిన టీ కప్పు తీసుకున్నాడు. వర్షపు జల్లు విసిరి కొడుతూండటం వల్ల నీటి తుంపరలు అభిశాంత్ వీపున తడిపేస్తున్నాయి.

ఆ చల్లని వాతావరణంలో టీ... పొగలు గక్కే టీ తాగుతుంటే శరీరంలో చాలా వెచ్చగా వుంది.

గంట గడిచింది. ఓపికగా కాచుకున్నాడు అతడు. మరో రెండు టీలు తాగాడు. మరో అరగంట గిర్రున తిరిగింది.

సరిగ్గా అదే సమయంలో వేగంగా దూసుకువచ్చిన ఓ జీపు జోగారావ్ ఇంటి ముందు ఆగింది. డ్రైవర్ లేకుండా తనే డ్రైవ్ చేసుకు వస్తున్నాడంటే ఆ బంగ్లా రహస్యం కాపాడటంలో అతడి శ్రద్ధ తెలుస్తూనేవుంది. కనుక తను మరింత జాగ్రత్తగా అతన్ని షాడో చెయ్యాలి!

పావుగంట తర్వాత బయటికి వచ్చాడు జోగారావ్.

చుట్టూవున్న పరిసరాలు కాజువల్‌గా చూశాడో నిముషం. అతడి దృష్టి

టీ బంక్ వైపు తిరిగే సరికి పక్కనేవున్న న్యూస్ పేపర్ తీసి తన మొహానికి అడ్డు పెట్టుకున్నాడు అతడు.

తల పంకించి జీప్‌ని రివర్స్ చేసాడు జోగారావ్.

జీప్ వెళ్ళిన క్షణం తర్వాత బుల్లెట్‌ని పరుగెత్తించాడు అభిశాంత్ వర్షంలో తడుస్తూ.

అతడికి ఎంతమాత్రం అనుమానం కలుగకుండా వెంటాడి మొత్తానికి మహంకాళిని బంధించిన బంగ్లా అడ్రస్ తెలుసుకుని ఆ అడ్రస్ మేఘన చెవిలో ఊదేశాడు. "ఇంతకీ నీ ప్లాన్ ఏమిటి?"

"రేపు ఉదయం చెబుతాను" అతడితో అబద్ధం చెప్పిందామె.

* * *

చీకటి పడింది.

కొన్ని గంటలు విశ్రాంతి తీసుకున్న వర్షం తిరిగి ప్రారంభమైంది. శరీరాన్ని చిల్లులు పొడిచేలా తీవ్రంగా కురవసాగింది.

గోడ గడియారం పది గంటలు కొట్టింది.

అప్పటి వరకు నిద్ర నటిస్తున్న మేఘన గడియారం కొట్టిన ఆఖరిగంట వింటూనే దిగ్గున లేచి కూర్చుంది!

బాత్రూంకి వెళ్లి మొహం కడుక్కుంది. ఫ్రష్‌గా అనిపించేసరికి చలాకీగా చకచక తన పనులు చేసుకుపోతోంది.

చిన్న చిన్న మార్పులతో మొహానికి మేకప్ చేసుకుంది. అభిశాంత్ తెచ్చిన పాలిథీన్ బేగ్‌లోంచి రెడీమేడ్ దుస్తులు బయటికి తీసింది. బ్లాక్ కలర్ ఫాంటులోకి షర్టు టక్ చేసింది. బెల్ట్ బిగించి, బ్లాక్ జర్కిన్ ధరించింది. దుస్తులు సరిగ్గా సరిపోయాయి. స్నేక్‌లాంటి మెత్తటి బ్లాక్ కలర్ పాయింట్ షూస్ తొడుక్కుంది. ఫెల్ట్‌హేట్ ధరించింది. నిలువుటద్దంలో ఒకసారి తనను తాను పరిశీలనగా చూసుకుంది.

తృప్తిగా నిట్టూర్చి తన రూం తలుపులు దగ్గరలాగి, రెండు రూంల అవతలవున్న అభిశాంత్ రూంలో కిటికీలోంచి చూసింది మేఘన.

ఫోంబెడ్ మీద హాయిగా నిద్రపోతున్నాడు అతడు.

'గుడ్ బై అభీ.... నేను క్షేమంగా తిరిగి రాలేకపోతే ఇదే నా చివరి వీడ్కోలు' అని మనసులో అనుకుని బయటికి నడిచింది చురుగ్గా.

సమయం పావు తక్కువ పదకొండు గంటలు అయింది.

ఆమె దగ్గర ఏ ఒక్క ఆయుధం లేదు. చేతుల్నే ఆయుధాలుగా భావించి నిర్భీతిగా వెడుతున్న ఆమె సాహసానికి మెచ్చుకోవచ్చు.

వర్షంలో తడుస్తూ బుల్లెట్‌ని బయటికి తీసింది మేఘన.

ఆమె హేట్‌మీదుగా, జర్కిన్ మీదుగా కురుస్తున్న వర్షపునీరు జర్రున జారి పాంటు మీదుగా కిందకి జారిపోతుంది.

బుల్లెట్‌ని అధిరోహించి ఒకే ఒక్క కిక్‌తో స్టార్ట్ చేసింది మేఘన. గేర్‌మార్చి క్లచ్ వదిలింది. రివ్వున ముందుకు దూకింది బుల్లెట్.

సాధ్యమైనంత వేగంగా నడుపుతోందామె బుల్లెట్‌ని.

అర్ధరాత్రి కావస్తూండటంవల్ల, వర్షంవల్ల ఎక్కడికక్కడ వీధులన్నీ నిర్మానుష్యంగా వున్నాయి.

అర్థగంటకల్లా ఓ నిర్జన ప్రదేశాన్ని చేరుకుందామె.

వర్షపు ఘోష తప్ప అంతటా నిశ్శబ్దంగా వుంది. ఉరుములు, మెరుపులు ఫెటెల్ ఫెటెల్‌మని భీకరంగా గర్జిస్తున్నాయి.

మెరుపుల వెలుగులో మేఘన కొన్ని క్షణాలు కనిపిస్తూ మాయ మౌతున్నట్టుగా వుంది.

చుట్టూ చూసిందామె. తనకి నూరు గజాల దూరంలో బంగ్లా తప్ప ఆ చుట్టుపక్కల మరో ఇల్లు అనేదే లేదు.

అక్కడ ఓ చెట్ట చాటున బుల్లెట్‌కి స్టాండ్‌వేసి, ఆ పక్కనే వున్న ఓ మెట్ట ప్రదేశం మీదకి ఎక్కి ఆ బంగ్లా లోపలి పరిసరాలను సునిశితంగా పరిశీలించ

సాగిందామె.

బంగ్లా చుట్టూ వున్న తోటనిండా మెర్క్యురీ దీపాలు కాంతివంతంగా వెలుగుతున్నాయి. కాస్త పాత బంగ్లా అయినప్పటికీ, చుట్టూ చెట్లతో అందంగానే కనిపిస్తున్నదా భవనం.

అసలా బంగ్లాలో మనుషులుంటున్నారంటే నమ్మశక్యం కానంత నిశ్శబ్దంగా వుందా భవనం.

మెట్ల దిగి తనకు కనిపించే బంగ్లా వెనుకభాగం వైపు నడుస్తున్నది ఆమె. మెరుపుల వెలుగులో కనిపిస్తూ ఆ నిర్మానుష్య ప్రదేశంలో, ఆ నిశీధి సమయంలో నిర్భీతిగా నడుస్తున్న ఆమెను చూస్తుంటే ఆశ్చర్యం కలగక మానదు.

ప్రహరీని చేరుకుందామె.

ఎనిమిది అడుగుల ఎత్తున్న ప్రహరీ అది. ఆ ప్రహరీ గోడ మీద గాజు పెంకులు గాని, వైర్ ఫెన్సింగ్‌గాని లేదు. అందువల్ల కొంతవరకు నయమనే చెప్పాలి.

పాంటు జేబులోంచి బలమైన గ్లోవ్స్ తీసి చేతులకు తొడుక్కుంది మేఘన. ఆ వెంటనే చేతులు పైకెత్తి ప్రహరీగోడ పైఅంచును బలంగా పట్టుకుని, వూపిరి తిత్తుల నిండా గాలి పీల్చుకుంది. మరుక్షణం చేతుల్లో సర్వశక్తుల్ని కేంద్రీకరించి హుప్‌మని వూపిరి విడుస్తూ బలంగా పైకి లేచిందామె.

ఆ వెంటనే ప్రహరీ గోడ మీదకి చేరి అవతలి వైపుకి నిశ్శబ్దంగా దూకి, ఆయాసం తీర్చుకుంటూ అలాగే నిలబడిపోయింది కొన్నిక్షణాలు.

ఈసారి నూట యిరవై గజాల దూరంలో ఉన్న బంగ్లా చాలా క్లియర్‌గా కనిపిస్తోంది. అక్కడక్కడ పెచ్చులు వూడిపోయి కనిపిస్తోందా భవనం.

మెర్క్యూరీ దీపాల కాంతిలో కురుస్తోన్న వర్షం ముత్యాల వానలా మెరుస్తోంది.

బంగ్లా బయట ఎక్కడా అలజడి లేదు.

బడ్ల్ హౌండ్స్ వున్న జాడా లేదు!

ఆ నిశ్శబ్ద వాతావరణం ఆమెను కాస్త భయపెట్టిందనే చెప్పాలి. మరుక్షణం అర్థం లేని ఆ భయాన్ని వదిలేసి ముందడుగు వేసిందామె.

సరిగ్గా అదే క్షణంలో తన వెనక అలికిడి అయ్యే సరికి గిరుక్కున వెనుతిరగబోయింది మేఘన.

"హేండ్సప్.. డోంట్ మూవ్" ఓ కరుకు కంఠం వినిపించింది గంభీరంగా.

తన ప్రయత్నాన్ని విరమించుకుని మెల్లగా చేతులు పైకెత్తిందామె.

వెనుకనుంచి కదిలి ఆమె ముందుకు వచ్చి నిలబడ్డాడో ముసుగు మనిషి. తలనుంచి కాళ్ళ వరకు ముసుగు వుంది. కళ్ళ దగ్గర, ముక్కు దగ్గర మాత్రం కంతలు వున్నాయి. ఆ ముసుగు మనిషి చేతిలో పిస్టల్ వుంది. కాని పిస్టల్‌ని నిర్లక్ష్యంగా పట్టుకున్నాడతడు. ఆ అవకాశం చాలామెకి.

అతడు ఏదో ప్రశ్నించబోతుండగా మెరుపులా కాలు విసిరింది మేఘన.

"మ్ మ్ మ్ మ్మ..." అంటూ పిస్టల్ వదిలేసి తోడల మధ్య పట్టుకుని కింద కూలిపోయాడా ముసుగు మనిషి.

ఆమె పిస్టల్ తన స్వాధీనం చేసుకున్న వెంటనే అతడి తలమీద ముసుగు తీసేసింది. "ఓ గాడ్! అభిశాంత్, నువ్వా!" ఆతృతగా అంది.

అతడి నోటివెంట మాటలు మూల్గుతున్నట్టు వస్తున్నాయి "నేనే... నీకు కొట్టడానికి మరోచోటు ఏదీ కనిపించలేదా?"

"సారీ అభీ, నువ్వనుకోలేదు. మగాణ్ణి నిరాయుధుణ్ణి, నిర్వీర్యుణ్ణి చెయ్యాలంటే అదే సరయినా స్పాట్"

"వీక్ పాయింట్ బాగానే కనిపెట్టావ్ గాని కాస్త ముందు వెనుక చూసుకోనక్కరలేదా?"

"అసలు తప్పంతా నీది. అలా దొంగలా ఎందుకు నాటకమాడావ్"

"బుద్ధి గడ్డితిని నీ చేతిలో చావు దెబ్బ తినడానికి"

"దెబ్బ గట్టిగా తగిలిందా?"

బలవంతపు నవ్వోటి నవ్వేశాడు "కాదు, పువ్వులా మెత్తగ తగిలింది"

ఐదు నిముషాల తర్వాత తేరుకున్నాడు అతడు.

"సారీ ప్లీజ్" చెయ్యి అందించిందామె.

"ఓకె ప్లీజ్" పైకి లేచి, మొహం మీదకి ముసుగు లాక్కున్నాడు.

"నేనీ రాత్రికే వస్తానని ఎలా అనుమానించావ్?!"

"ఈ బంగ్లా అడ్రస్ తెలుసుకుని నీకు చెప్పిన తర్వాత కూడ నువ్వు మౌనం వహించడంతో నన్నీ ప్రమాదంలోకి లాగడం నీకు ఇష్టం లేదని గ్రహించాను. నువ్వు రెడీ అయి వెళ్ళే వరకు నిద్ర నటించి, ఆ మరుక్షణం లేచి నేనూ రెడీ అయ్యాను. నా బుల్లెట్ ట్రబులిచ్చిందని ధర్మం గాడికి అబద్ధం చెప్పి వాడి స్కూటర్‌ని సాయంత్రమే ఎరువు పుచ్చుకుని ఇంటి వెనుక దాచాను. ఆ స్కూటర్ మీద యిక్కడికి వచ్చాను" చెప్పాడు అభిశాంత్.

ఆ వెంటనే ఇద్దరూ మౌనం వహించి బంగ్లావైపు చకచక నడవసాగారు.

అదే క్షణంలో ఎక్కడో పిడుగు పడింది. ఆ అదురుకి ముందుకి పడబోయి నిలద్రొక్కుకున్నాడతడు.

కాస్త చీకటిగా వున్న ఓ చోట మెరుపుల వెలుగులో యధాలాపంగా కిందకి చూసిన మేఘన ముందడుగు వేయబోయిన అభిశాంత్ చొక్కా కాలర్ పట్టుకుని మెరుపులా వెనక్కి లాగేసింది.

తను అడుగు వేయబోయిన ప్రదేశంలోకి చూసి అదిరిపడ్డాడు అతడు. అక్కడ నేలమీద స్ప్రింగ్ సహాయంతో పట్టుకునే ఐరన్ ట్రాప్ వుంది. అడవి జంతువుల్ని పట్టుకోడానికి వాటిని ఉపయోగిస్తారు. అడవి జంతువులు సంచరించే దారుల్లో ఐరన్ ట్రాప్స్ నేలమీద ఏర్పాటు చేస్తారు. వాటిని చూసుకోకుండా వచ్చిన జంతువుల కాళ్ళు ఏ ఒక్క ట్రాప్ మీద పడినా ఆ మరుక్షణం చక్‌మని పట్టేస్తాయా ఐరన్ ట్రాప్స్. జంతువు ఎంత గింజుకున్నా ఆ ట్రాప్‌లోంచి కాలు బయటికి రాదు. ఆ ఒరిపిడికి కాలు తెగి రక్తం మాత్రం మడుగు కడుతుంది!

తనకు ప్రమాదం తప్పిందని ఆమెవైపు ఆరాధనగా చూశాడతడు. తన

కాలు ఆ ట్రాప్‌లో పడివుంటే ఆ పాటికి నుజ్జునుజ్జు అయిపోయి వుండేదని అతడికి తెలుసు.

"బీ కేర్ ఫుల్" హెచ్చరిస్తూ నేలమీద పట్టిపట్టి చూడసాగిందామె. కొన్ని క్షణాల తర్వాత అందామె.

"ఏ ప్రమాదంలేదేమిటా! అనుకున్నాను. ప్రతి ఆరడుగులకి ఓ ట్రాప్ చొప్పున వున్నాయి చూడు"

కాస్త మొలిచిన గడ్డిలో రహస్యంగా దాగున్న ఆ ఐరన్ ట్రాప్స్‌ని చూసి గుండెల మీద చేతులు వేసుకున్నాడు అభిశాంత్ "వీళ్ళ తెలివి మండిపోను!"

అక్కడి నుంచి ప్రతి అడుగు చూసుకుంటూ మెలికలు తిరుగుతూ నడిచి బంగ్లా దగ్గరికి చేరుకున్నారు వాళ్ళు.

మార్గం కోసం అన్వేషిస్తున్న వాళ్ళకి ఊచలు లేని విరిగిపోయిన కిటికీ దివ్యంగా దర్శనం ఇచ్చింది. దానికో నమస్కారం పారేసి, మేఘన వెనుకగా కిటికీ ఎక్కి అవతలికి దిగాడు అతడు.

అదో స్టోర్ రూం. విరిగిపోయిన కుర్చీలు, పనికిరాని ఓ నవారు మంచం, శిథిలావస్థలో వున్న ఓ సోఫా పనికి రాని చెత్తంతా అక్కడే వుంది. దానికి తోడు మట్టి, బూజులు.

తలుపులు లాగి చూసింది మేఘన.

కిర్రుమని శబ్దం చేస్తూ తెరుచుకున్నాయవి.

ఆ చెత్త కారణంగా ఆ స్టోర్ రూంను పెద్దగా పట్టించుకుని వుండడు జోగారావ్. అదే ఇప్పుడు తమకి లాభించింది.

క్షణమాగి, ఎటువంటి అలికిడి లేకపోయేసరికి ఇద్దరూ బయటికి అడుగు పెట్టారు.

అదో వరండా, వంపులు తిరిగి వుందా వరండా, చివరి వంపుని చూసేసరికి ఆ భవనం షేప్‌ని గుర్తించింది మేఘన.

ఆ బంగ్లా ఇంగ్గీషు అక్షరం 'యస్' ఆకారంలో వుంది.

మలుపు తిరిగి వంపులోంచి నడిచారిద్దరూ. వరండాకి ఎడమ పక్కన వరుసగా వున్నాయి రూంలు.

నాలుగు రూంలు దాటేసరికి మాటలు వినిపించి ఆగిపోయారు వాళ్ళు. ఐదో రూం తలుపులు బార్లా తెరిచి వున్నాయి.

ఐదో రూం కిటికీ దగ్గరికి చేరి వోరగా లోపలికి తొంగిచూసింది మేఘన.

ఆ రూంలో తలుపులకి ఎదురుగా రౌండ్ టేబుల్ చుట్టూ వున్న కుర్చీల్లో కూర్చున్నారా ఆరుగురు పోలీసు అధికారులు. టేబుల్ మీద విస్కీ, షోడా సీసాలు, జీడిపప్పు, సాఫ్ట్ డ్రింక్స్, చిప్స్ ప్లేట్స్, వాళ్ళ చేతుల్లో విస్కీ గ్లాసులు, కళ్ళల్లో ఎరుపు జీరలు, మనసుల్లో దృఢ సంకల్పం. హోల్‌స్టెర్స్‌లో రివాల్వర్స్.

గోల్డ్ స్పాట్ సిప్ చేస్తూ అడిగాడు జోగారావ్

“అంతా చెప్పినట్లు సరిగ్గా ఎరేంజ్ చేశారా?” జోగారావ్ మత్తుపానీయాలు తాగడు!

“యస్ సార్... మీరు చెప్పినట్టే ఎరేంజ్ చేయించాను” మరో సి.ఐ. చెప్పాడు జీడిపప్పు నములుతూ.

మిగిలిన సబార్డినేట్స్ తలలు వూపారు.

“తేడా వస్తే హోం మంత్రి మన తలకాయలు లేపేస్తాడు” ప్లేట్లోని జీడిపప్పు తీసుకుంటూ అన్నాడు జోగారావ్.

“నో సర్. తేడావచ్చే ప్రసక్తే లేదు”

‘‘వెరీగుడ్...’’ అంటూ ‘‘గోడ గడియారం ఏమిటి ఇంత స్లోగా తిరుగుతోంది” తొమ్మిదిగంటల పదినిముషాలు చూపిస్తున్న వాల్ క్లాక్ గురించి కామెంట్ చేశాడు జోగారావ్.

“అదెప్పుడూ అంతే సార్... పదినిముషాలు ముందుకి తిరిగితే యిరవై నిముషాలు వెనక్కి తిరుగుతుంది” చెప్పాడో కానిస్టేబుల్. “దానికి రివర్స్ గేర్ అంటే బాగా ఇష్టం అనుకుంటాను సార్”

అంతా పగలబడి నవ్వారు.

గోల్ట్‌స్పాట్ సిప్ చేస్తుండగా నవ్వు వచ్చేసరికి పొలమారి 'తుఫ్' మంటూ మొత్తం డ్రింక్‌ని తమ సబార్డినేట్స్ మీదకి ఊదేశాడు జోగారావ్.

వికారంగా మొహాలు పెట్టిన ఆ సబార్డినేట్స్ కిక్కురుమనకుండా హేండ్ కర్చీఫ్‌లతో మొహాలు తుడుచుకున్నారు.

వాళ్ళకి సారీ చెప్పలేదు అదేమంత పెద్ద విషయం కాదు గనక! పైగా జోక్ వేసిన కానిస్టేబుల్‌ని పట్టుకుని తిట్టాడు జోగారావ్.

"డ్రింక్స్ తాగుతున్నప్పుడు జోక్స్‌వేయకూడదనే యింగితజ్ఞానం కూడా లేదు నీకు"

"సారీ సార్" అన్నాడా కానిస్టేబుల్.

"ఇట్సాల్ రైట్. మహంకాళి గురుడు ఏం చేస్తున్నాడు?"

"వాడికేం సార్. రాజకీయ నాయకుడిలా రూంలో కూర్చుని మనకి ఆర్డర్లు వేసి మరీ సర్వ సౌఖ్యాలు పొందుతున్నాడు. రాజభోగం అనుభవిస్తున్నాడు"

"ఇంకెంత సేపులే. వాడి ఆయుష్షు మరో పావుగంటే వుంది"

"వాడి మొహానికి ఇంగ్లీషు చిత్రం ఒకటా!"

"అదీ అడిగాను సార్. ఇంగ్లీషు రాకపోయినా ఫర్వాలేదట! బొమ్మలు చూస్తే భలేగా అర్థమైపోతుందట!"

"సరే సరే, ఓ సారి చూసిరా వాణ్ణి"

ఆ కానిస్టేబుల్ లేచాడు.

బయట వున్న మేఘన, అభిశాంత్‌లు కిటికీ ఎదురుగా వున్న ఆ స్థంభం చాటుకి తప్పుకున్నారు. వరండా వెంబడి లావుపాటి స్థంభాలు చివరి వరకు చాలా వున్నాయి.

ఐదో రూంలోంచి వచ్చిన కానిస్టేబుల్ పదో రూం దగ్గర ఆగాడు. ఆ రూంకి వేసిన తాటికాయ సైజులోని తాళంకప్ప తెరిచి తలుపులు ఇవతలికి లాగి, లోపల వున్న స్ప్రింగ్ డోర్ తోసి, చూసి తిరిగి ఆ రూం లాక్ చేసి వచ్చేశాడు. స్తంభం చాటునుంచి మహంకాళి వున్న రూం, కానిస్టేబుల్ చేతిలోని

తాళం వాళ్ళకి క్లియర్‌గా కనిపించాయి.

"ఇంగ్లీషు చిత్రం యింకా పూర్తికాలేదు సార్" చెప్పాడు కానిస్టేబుల్.

"అయితే పూర్తిగా చూసే అదృష్టం వాడికిక లేదు" అంటున్నాడు జోగారావ్.

అదే క్షణంలో అభిశాంత్ పిస్టల్‌తో వాళ్ళున్న గది గుమ్మంలో ప్రత్యక్షమైంది మేఘన. "హేండ్సప్..."

అదిరిపడి విస్కీగ్లాసులు వదిలేశారు ముగ్గురూ. జోగారావ్ తన డ్రింక్ గ్లాసుని టేబుల్ మీద పెట్టి ఆ చేతిని మెల్లగా హెూల్‌స్టర్ మీదకి జరపబోయాడు.

సింహంలా గర్జించింది మేఘన. "డోంట్ ప్లే ట్రిక్స్. కదిలితే ప్రాణాలు తీస్తాను" ఆమెది కేవలం బెదిరింపు మాత్రమేనని వాళ్ళకి తెలీదు. ప్రాణాల మీద తీపివల్ల వాళ్ళు కదలలేదు.

"ప్లీజ్ రిమూవ్ యువర్ హెూల్‌స్టర్స్" ఆజ్ఞ జారీ చేసింది.

ఆమె చెప్పినట్టు బెల్ట్స్ విప్పి హెూల్‌స్టర్స్‌ని ఓ కుర్చీలో పెట్టారు.

"గో బ్యాక్" అరిచింది మేఘన.

ఆమె అరుపు మేఘ ఘర్జనలా వుంది.

వెనకడుగులు వేసి గోడ వరకు వెళ్ళి ఆ వెనక్కి యిక జాగా లేక ఎత్తి పెట్టిన చేతులతో గోడకి శిలల్లా అతుక్కుపోయారు వాళ్ళు.

అదే సమయంలో గదిలోకి ప్రవేశించిన అభిశాంత్ కుర్చీలో వున్న హెూల్‌స్టర్స్ తీసి పరుగున వెళ్ళి వాటిని స్టోర్ రూంలో శిథిలావస్థలో ఉన్న సోఫా వెనక పారేసి వచ్చాడు. ఆ వెంటనే కానిస్టేబుల్ చేతిలో వున్న పెద్ద తాళాన్ని లాక్కుని బయటికి పరుగు తీశాడు.

ఏమాత్రం అవకాశం వచ్చినా ప్రతిఘటించడానికి తయారుగా వున్నాడు జోగారావ్. కాని ఏ చిన్న అవకాశం కూడ వాళ్లెవరికీ ఇవ్వదలచుకోలేదు.

ఆమె పిస్టల్ పట్టుకున్న తీరు వాళ్ళకి భయం కలిగించింది. సూటిగా వాళ్ళ గుండెలకు గురిపెట్టి హేమర్‌ని వెనక్కి లాగింది. ఆమె చూపుడు వేలు ట్రిగ్గర్ మీద తయారుగా వుంది.

పిస్టల్ గురి తన వేపే వుందని గ్రహించిన ఓ కానిస్టేబుల్ భయంగా అన్నాడు. “తల్లీ... హేమర్‌ని వెనక్కి లాగేశావ్. పొరపాటున ట్రిగ్గర్ నొక్కావంటే నా పిట్టకి రెక్కలొచ్చి ఎగిరిపోతుంది. ఆ ట్రిగ్గర్ మీద కాస్త ఆ వేలు తీసేయమ్మా!”

“డోంటాక్. పిస్టల్ హేండ్లింగ్ నాకు బాగా తెలుసు. చెప్పినట్టు వింటే నా వేలు ట్రిగ్గర్ నొక్కదు.”

తాళం తీసి తలుపులు లాగి స్ప్రింగ్ డోర్ తోసుకుని లోనికి ప్రవేశించాడు అభిశాంత్.

ఎయిర్ కండిషన్డ్ రూం అది. ఎటాచ్డ్ బాత్రూంతో సహా అన్ని సౌకర్యాలు వున్న పెద్దహాలులాంటి గది అది!

సోఫాచైర్‌లో కాళ్ళు పైకి పెట్టి కూర్చుని చుట్టముట్టించి రైల్ ఇంజన్‌లా పొగలు వదిలేస్తున్నాడు మహంకాళి. వీడియో చిత్రంలో ఆకాశంలో వెడుతున్న విమానంలో హీరోకి, విలన్‌కి జరుగుతున్న ఫైటింగ్ సీన్ మహాయింట్రస్ట్‌గా చూస్తూ “చల్. ఏందివయ్యా నువ్వు. సిన్మా మంచిగున్న టైమ్‌లో వచ్చి పరేషాన్ చేస్తున్నావే” అని, తలతిప్పి ముసుగు వేషంలో వున్న అతణ్ణి చూసి తృళ్ళిపడి పైకి లేచాడు. తలమీద ముసుగు తీసేశాడు అతడు.

“ఎవరు బిడ్డా నువ్వు? ఈడకి ఎట్లా వచ్చావు మల్లా! నేనెవరో సమజ్ అవుతుందా మాల్లా!” తొడ చరచి వంకీలు తిరిగిన పెద్ద మీషాన్ని మెలిపెడుతూ అన్నాడు మహంకాళి. “వీడి పేరు మహంకాళి. మహంకాళి అంటే ఏందనుకున్నావ్... అదేందివయ్యా రగతం కక్కే పెద్ద కళ్ళు, వీరభద్రస్వామి పూనితే విరగబోస్కునేంత జుట్టు, ఎత్తయిన శాల్తీ, ఓ చేతిలో కత్తి, ఇంకో చేతిలో మడిసి తల్‌కాయ్, మెళ్ళో పుర్రెల దండ, కాళ్ళ కింద మడిసి మొండెం... ఆ... కనకదుర్గ అన్నట్టు. వీడు కూడ ఆ దుర్గకి ఏమీ తీస్కుపోడు. నాతో యుద్ధమ్ చేయ్‌టాన్కి వచ్చినావ్?”

“నీతో యుద్ధం చేయటానికి రాలేదయ్యా బాబూ. నేను నీ శ్రేయోభిలాషిని”

“ఏందది. శే....శే....”

ఇలా లాభం లేదని తనుకూడ అతని యాసలోకి దిగాడు అభిశాంత్. "అంటే... నేను నీకు దోస్తనన్న మాట"

"అట్టనా!"

"అట్టనే!" హమ్మయ్య చచ్చాం. ఇప్పటికి అర్థమైందన్నమాట అనుకున్నాడు అతడు.

"ఏంది కత, ఈ వేషమ్ ఏంది"

"కతల్ చెప్పుకుంటూపోతే మన కతల్ ఖతమ్ అవుతాయ్ మల్లా!"

"ఏంది బిడ్డా నువ్వనేది? సమజ్ అయ్యేట్టు చెప్పగూడదా ఏంది" రాగం తీశాడు మహంకాళి.

"హోం మంత్రి బిడ్డా రాజ్ రాజ్ నరేంద్రసామి" అభిశాంత్ మాట పూర్తికాకుండా అన్నాడు మహంకాళి. "దొరనా!... చల్లగుండాలె దొర!"

"వాడు చల్లగానే వున్నాడు. నిన్ను మాత్రం "పైకి" పంపే ఏర్పాట్లు చేసాడు మల్లా"

"అట్టనా!" తబ్బిబ్బవుతూ మహాసంతోష పడిపోతూ చేతులు నలిపేసుకో సాగాడు మహంకాళి. దీర్ఘం తీస్తూ అన్నాడు "దొర మంచిపని చేసిండు బిడ్డా!... జర నాకు కూడ పోరగాడిగా వున్న కాలమ్ నుండీ ఒమెరికా, అదేంది వయ్యా ఒమెరికాకి దుష్మన్ దేశమ్... ఆ... రుష్యాకదూ! అట్టాంటి విదేశమ్‌లన్నీ జర చుట్టిరావాలనే ఇచ్చా వుంది బిడ్డా.."

"అచ్చా" అనేసి, గతుక్కుమన్నాడు అభిశాంత్ "నీ అమ్మా కడుపుమాడ. పైకి అంటే ఆ పైకి కాదు మల్లా. స్వర్గమ్, నరకమ్ అని కతల్ చెప్తారే అడకి. సిన్మాల్లో యముడి వేషాల్ వేస్తాడే యస్.వి.ఆర్... యమలోకం సీన్ సమజ్ అయిందా మల్లా. అదేదో సిన్మాలో యమలోకం పోయిన రేలంగి మాదిరి యమకింకరుల్ వెంట నరకానికి పోతావ్. నిన్ను ఖతమ్ చెయ్యటాన్కి హోం మంత్రి బిడ్డ ప్లాన్ వేసి యమకింకరుల్ మాదిరి పోలీసు మనుషుల్ని నీకు కాపలా పెట్టిండు. ఓ తుమ్‌హారాదుష్మన్ హై" గబగబా చెప్పాడు అతడు.

"దొర అట్టాంటి మడిసి కాదు. నేన్నమ్మను"

"తెలుగు న్యూస్ పేపర్ చదవగలవా?" వెంటనే అడిగాడు.

"టీవీలో వార్తల్ చదివే మడిసి మాదిరిగా చదువుతా"

"బ్రతికించావ్" అంటూ పాంటు జేబులోంచి ఓ దినపత్రిక తీసి మడతలు విప్పి రెండు వార్తలు చూపించాడు అభిశాంత్. ఆ వార్తలు చదివాడు మహంకాళి.

మహంకాళిని దేశద్రోహిగా, మాఫియా గాంగ్ లీడర్గా చిత్రీకరిస్తూ అతడికి కోర్టు ఉరిశిక్ష విధించాలంటూ రాయబడ్డ వార్తలవి. అతడికి ఉరిశిక్ష పడటంలో హోం మంత్రి ఆశాభావం వ్యక్తం చేసిన వార్త చదివి అదిరిపడ్డాడు మహంకాళి. కాని ఇంకా ఏదో అపనమ్మకంతో అడిగాడు.

"నువ్వు చెప్పేదంతా నిజమేనా బిడ్డా!"

"నీ ఇష్టం. చెప్పాల్సింది చెప్పాను. నమ్మితే నాతో రా. లేకపోతే ఇక్కడే వుండు. నా దారిన నేను పోతాను" తల ముసుగు తొడుక్కుని వెనుతిరిగాడతడు.

"అదేదో సిన్మాలో రాజేంద్ర ప్రసాద్కి మల్లే అమాయకంగా, రాజశేఖర్ మాదిరి మంచాడిలా వున్నావ్ నిన్ను నమ్ముతాన్ బిడ్డా"

"వర్ణనలు తర్వాత, ముందు తొందరగా పద. వెనకటికి నీలాంటివాడే ఒకడు రోమ్ నగరం తగలడుతుంటే ఫిడేలు వాయిస్తూ కూర్చున్నాడట. అలా వుంది నీ వ్యవహారం"

"ఏ.ఎన్.ఆర్ మాదిరి అందంగా, కృష్ణకి మల్లే చలాకీ రాజాలా వున్నావ్ బేటా!"

"అట్టనా! పద పద"

ఆ యిద్దరూ మేఘన దగ్గరికి చేరుకున్నారు.

ఆ వెంటనే గుమ్మం బయటికి వచ్చిందామె. మెరుపులా ఆ గది తలుపులు దగ్గరికి లాగి బయట గెడ పెట్టేశాడు అభిశాంత్.

మరుక్షణం ముందుకు పరుగు తీశారు ముగ్గురూ బంగ్లా ఎంట్రన్స్వైపుగా.

ముందు మహంకాళి, వెనక మేఘన, ఆమె వెనుగ్గా అభిశాంత్ ఆ

వరండాలో పరుగు తీస్తున్నారు. ముగ్గురు బంగ్లా ముఖద్వారం దగ్గరికి వచ్చేశారు. ముఖ ద్వారం బయట పదిమెట్లు దిగాల్సి వుంది.

ముందు మహంకాళి గబగబా మెట్లు దిగిపోతున్నాడు. ఆ వెనుక మేఘన మెట్లు దిగబోతోంది.

అప్పటికి వర్షం వెలిసింది.

వరండా చివరికి వచ్చిన అభిశాంత్ ఆఖరి క్షణంలో చూశాడు తమకి పన్నెండడుగుల దూరంలో క్రీనీడలో స్టెన్ మెషిన్ కార్బయిన్ పట్టుకుని పాశవికంగా నిలబడి చూస్తున్న జోగారావ్‌ని.

అతడి చేతిలోని యమపాశం నిప్పుల వర్షం కురిపించడానికి క్షణాల వ్యవధి కూడ లేదని అరక్షణంలో గ్రహించాడు అతడు.

అప్పటికే మరణ సరిహద్దును చేరుకున్న మహంకాళిని రక్షించడం అసంభవమని గ్రహించి, మేఘన చచ్చిపోతుందనే ఆరాటంతో ఊహించని వేగంతో గాలిలోకి లేచి మేఘన ముందున్న మెట్టుమీదకి దూకాడు అభిశాంత్.

ఆ క్షణంలో స్టెన్ మెషీన్‌గన్ ట్రిగ్గర్ నొక్కాడు జోగారావ్.

'గజ్..జ్...' మని పిడుగుపాటులా ధ్వనిస్తూ బుల్లెట్‌ల వర్షం కురిపించసాగింది అది.

అక్కడికీ మేఘనని ముఖద్వారం లోపలికి బలంగా తోసేస్తూ బిగ్గరగా అదిచాడు అతడు. తన అరుపు వల్ల ప్రయోజనం వుండదని తెలిసి "మహంకాళీ వెనక్కి వచ్చేయ్" అంటూ.

స్టెన్ మెషీన్‌గన్ బుల్లెట్లు మహంకాళి శరీరాన్ని తూట్లు తూట్లు పొడిచేశాయి.

తను కూడ వరండాలోకి దూకుతుండగా మేఘన శరీరాన్ని తూట్లు పొడవాల్సిన కొన్ని బుల్లెట్లు అతడి వైపుకి దూసుకొచ్చాయి.

ఒక బుల్లెట్ అభిశాంత్ ఎడమ భుజాన్ని చీల్చింది. మరో బుల్లెట్ అతడి కుడికాలు తొడలో దూరింది.

కెవ్వున అరచి ముందుకి తూలి మేఘన పక్కన పడి పోయాడు అతడు.

మరికొన్ని బుల్లెట్లు మిస్ అయి ముఖద్వారంకి తగిలి పెచ్చులు లేపాయి.

సిటీ టవర్ క్లాక్ 12 గంటలు కొట్టసాగింది.

తూట్లు పడిన మహంకాళి నిర్జీవ శరీరం ముందుకు విరుచుకు పడిపోయింది.

ఇదంతా క్షణాల్లో జరిగిపోయింది.

బుల్లెట్ల వర్షం ఆగేసరికి గభాలున ముందుకి దూకి ముఖద్వారం గడియ పెట్టేసింది మేఘన.

బయట భీతావహంగా నవ్వుతున్న జోగారావ్ వికటాట్టహాసం మృత్యువు మోగించే మరణ భేరిలా వినిపిస్తోంది.

"అభీ... అభీ..." ఆందోళనగా పిలిచింది మేఘన.

"డోంట్ వర్రీ, అయామ్ ఆల్‌రైట్" బాధను నొక్కి బలవంతంగా నవ్వాడు అభిశాంత్.

తన ప్రాణాలను రక్షించడం కోసం ప్రాణాలకు తెగించిన అతడి సాహసాన్ని అబ్బురంగా చూస్తోందామె!

అతడికి తనపైన వున్న ఆకర్షణ పెరిగి ప్రేమగా మారిన క్షణాన్ని చూస్తోందామె!

ఒక వేళ తనను మృత్యువే వరిస్తే ఆనందంగా చావడానికి ఆ క్షణంలో పొందిన అతడి ప్రేమే చాలు!

'ఓ పవిత్ర మనసు సెలయేరులా గలగలా గోదావరిలా అమృత సరోవరంలాంటి సరస్సులా ఆహ్లాదభరితంగా ప్రవహిస్తూ మానస సరోవరం లాంటి మరో హృదయ సంగమంలో శాంతి విహంగంలా మౌన మృదంగాలతో ఐక్యం కావడమనే భావన పేరు ప్రేమ!'

ఆ భావన ఆ యిరువురిలో ఆ క్షణంలోనే పుట్టింది.

అదే నిజమైన ప్రేమ!

"ఈ క్షణంలో చెబుతున్నాను మేఘన, అనివార్యపరిస్థితుల్లో నువ్వు మరో

పురుషుడి భార్యవు అయితే నేను పిరికివాడిలా చావను. ఈ జన్మంతా బ్రహ్మచారిగా వుండిపోతాను.” ఆమె వైపు థ్రిల్లింగ్‌గా చూస్తూ అతడన్నాడు.

“నేనూ అంతే యు ఆర్ లవింగ్ మి అండ్ ఆల్సో ఐయామ్ లవింగ్ మి అండ్ ఆల్సో ఐయామ్ లవింగ్ యు” అందామె అతడిని ఆరాధనగా చూస్తూ.

అభిశాంత్ తల వూపాడు.

మగాడు ప్రేమిస్తాడు. ఆడది ప్రేమిస్తూనే ఆరాధిస్తుంది. ప్రేమకంటే ఆరాధన గొప్పది!

అదే సమయంలో బయట నిలుచున్న జోగారావ్ గొంతు గంభీరంగా వినిపించింది.

“నువ్వు మమ్మల్ని బెదిరించినప్పుడే నీ గొంతు గుర్తు పట్టాను మిస్ మేఘన. మహంకాళిని రక్షించాలని చేసిన నీ సాహసానికి నా జోహార్లు. కాని పాపం, నీ ఆలోచనఫలం కాలేదు. మమ్మల్ని గదిలో బంధిస్తే సరిపోయిందనుకున్నావు. ఆ గదిలోనే వున్న ఓ పెట్టెలో స్టెన్‌గన్ దాగుందనీ, ఆ గదిలోంచి బయటికి పోవడానికి రెండోవైపు మరో తలుపువుందనీ గ్రహించలేకపోయావు. అనుకున్న సమయానికి ఒక్క నిముషం కూడా ఎక్కువ కాకుండా మహంకాళిని అంతం చేశాను. మీరు బయటికి వస్తే అతడిగతే మీకూ పడుతుంది. లోపల వున్నా ప్రమాదమే. ఈ బంగ్లాలో ఎక్కడికక్కడ బాంబులు ఫిక్స్ చేసి వుంచాము. వాటి వైర్ల కనెక్షన్‌ని ఇప్పుడే అంటించారు మా వాళ్ళు. మరో ఐది నిముషాల్లో ఈ బంగ్లా మొత్తం పునాదులతో సహా లేచిపోతుంది. మీ ఇద్దరి సమాధి ఇక్కడే రాసి పెట్టి వుందనుకుంటాను”

“నడవగలవా అభీ” అడిగింది మేఘన.

తలవూపి మెల్లగా లేచి నిలబడ్డాడు అతడు. అభిశాంత్ చేతిని తన భుజం మీద వేసుకుని అతడికి తన భుజం ఆసరాగా ఇచ్చి నడిపించసాగిందామె. వచ్చిన దారినే వెనక్కి వరండాలో సాధ్యమైనంత వేగంగా నడుస్తున్నారు వాళ్లు.

బాధను పంటి బిగువున భరిస్తున్నాడు అభిశాంత్.

సరిగ్గా అదే సమయంలో వాళ్ళకి కాస్త వెనకగా వున్న ఓ రూమ్‌లో 'గుభిల్లు...' మనే పెద్ద శబ్దంతో మొదటి బాంబు పేలింది. ఆ బాంబు పేలుడుకి ఆ రూం తునాతునకలైంది. ఆ తాకిడి పక్క రూంలకి కూడా వ్యాపించింది. ఆ వెనుకే రెండో బాంబు బ్లాస్ట్ అయింది.

బంగ్లాకి దూరంగాపోయి నిలబడ్డారు జోగారావ్ బృందం. బంగ్లా స్మాషింగ్ పూర్తయ్యే వరకు వాళ్ళు అక్కడి నుంచి కదలదలచుకోలేదు.

భీకర శబ్దాలతో నిశీధిని హడలగొడుతూ ఒకదాని వెనుక ఒకటి వరుసగా పేలుతున్నాయా బాంబులు. కొండల్నికూడా పిండి చెయ్యగల ఆ బాంబుల తాకిడికి ఆ బంగ్లా పునాదులు భూకంపం వచ్చినట్లు కదిలిపోతున్నాయి.

తలుపు కొయ్యలు, కిటికీ భాగాలు, మరికొన్ని ఇతర పార్టులు గాలిలో అంతెత్తుకు లేచి తిరిగి అక్కడే పడిపోతున్నాయి.

దుమ్ము, ధూళి సుడిగుండంలా లేస్తుంది.

అన్ని వైపుల నుంచి మంటలు విజృంభిస్తున్నాయి.

బంగ్లా మొత్తం నేలమట్టం అయ్యేవరకు ఆగి ఆ శిథిలాలని తృప్తిగా చూస్తూ అక్కడి నుంచి కదిలింది జోగారావ్ బృందం.

ఆ బంగ్లా బ్లాసింగ్ జరిగిన మర్నాడు కాక, ఆ మరుసటి రోజు అన్ని ప్రముఖ దినపత్రికల్లోనూ ఓ వార్త ప్రముఖంగా ప్రచురింపబడింది.

'మాఫియా మాయలాడి మేఘన సృష్టించిన మారణ హోమం!'

ఈనాడు ప్రత్యేకం.. 'మొన్నటి దినం అర్థరాత్రి సమయంలో జంట నగరాలకు దూరంగా నిర్మానుష్య ప్రదేశంలో వున్న ఓ బంగ్లాలో మాఫియారాణి మేఘన మారణహోమం సృష్టించి హోం మంత్రి శ్రీరాజరాజ నరేంద్రుడు అరెస్టు చేయించిన మాఫియా గాంగ్ లీడర్ మహంకాళిని హత్య చేసింది! లెక్క ప్రకారం మహంకాళిని ఈరోజు కోర్టులో ప్రవేశపెట్టవలసి వుంది. కాని అతణ్ణి కోర్టులో హాజరు పరిస్తే నిజానిజాలు వెల్లడయ్యి తన రహస్యాలు (తన మాఫియా

సంబంధ బాంధవ్యాలు) బయటపడి తమ మనుగడకి ముప్పు వాటిల్లుతుందని గ్రహించి, అతణ్ణి రక్షించడానికి వీలుపడకుండా పోలీసులు అష్టదిగ్బంధనం చేశారన్న భయం వల్ల మహంకాళిని చంపటానికే నిశ్చయించుకుని ఈ ఘోరకృత్యానికి పాల్పడింది మేఘన.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోగారావ్‌నీ, అతడి సబార్డినేట్స్ అయిన మరో ఐదుగుర్ని మహంకాళిని రహస్యంగా దాచిన బంగ్లాకి కాపలాగా ఏర్పాటు చేసింది పోలీస్ డిపార్ట్‌మెంట్.

సి.ఐ. జోగారావ్ కథనం ప్రకారం ఇద్దరు కానిస్టేబుల్స్, ఒక ఎస్సై నైట్ డ్యూటీలో వున్నారు. మిగిలిన ముగ్గురు తమ గదుల్లో పడుకున్నారు. అర్ధరాత్రి పావుతక్కువ పన్నెండు గంటలు కావస్తుండగా హెలికాప్టర్ శబ్దం వినిపించి పైకి చూశారు నైట్ డ్యూటీలో వున్న ముగ్గురూ. ఏకబిగిన కురుస్తున్న వర్షం అప్పటికే ఆగిపోయింది.

ఆ హెలికాప్టర్ తమ బంగ్లా దగ్గరే గిరికీలు కొడుతుండే సరికి దాన్ని అనుమానించిన ఆ ముగ్గురు పోలీసు ఉద్యోగులు గదుల్లో పడుకున్న మిగిలిన ముగ్గుర్నీ నిద్రలేపారు.

ఈలోగా దక్షిణం వైపున్న భాగం మీద ఓ బాంబు పేలి రెండు గదులు దగ్ధం కాసాగాయి. క్షణంలో తమ పరిస్థితిని గ్రహించిన శ్రీ జోగారావ్ పరిస్థితి విషమించకముందే మహంకాళిని అక్కడ నుంచి తరలించమని ఇద్దరు కానిస్టేబుల్స్‌ని ఆదేశించి, మిగిలిన వాళ్ళతో కలిసి హెలికాప్టర్ మీద ఫైరింగ్ ఓపెన్ చేశారు. అయినప్పటికి మరో రెండు బాంబులు హెలికాప్టర్‌లోంచి పడి ఉత్తరం వైపున్న రెండు గదులు తునాతునకలయ్యాయి. ఈ లోగా మహంకాళిని జైలు గదిలోంచి తీసుకువచ్చిన కానిస్టేబుల్స్ అతణ్ణి ముఖద్వారంలోంచి బయటకు తీసుకు పోయారు.

కలుగులోని ఎలుకను బయటకు లాగినట్టు మహంకాళిని బయటకు లాగడమే మేఘన మాస్టర్ ప్లాన్ అని చాలా ఆలస్యంగా గ్రహించారు పోలీసు

బృందం. హెలికాప్టర్ రివ్వున ముఖద్వారం వైపు పోవడంచూసి ఆ నిజాన్ని గ్రహించిన శ్రీ జోగారావ్ బృందం ముఖద్వారం వైపు పరుగు తీసింది. కానీ వాళ్లు ముఖద్వారం బయటికి చేరుకున్న సమయానికి కానిస్టేబుల్స్ మధ్యనున్న మహంకాళి శరీరం తూటాలతో తూట్లు తూట్లు పడిపోతూండటం, హెలికాప్టర్ లోంచి స్టెన్ మెషిన్‌గన్‌ని ఫైర్ చేస్తూన్న మేఘనను చూసి స్టన్ అయిపోయారు. అప్పటికే మహంకాళి చచ్చిపోయేసరికి వాళ్ళని నిస్పృహ ఆవరించింది.

ఆ మరుక్షణం హెలికాప్టర్ మరోవైపు రివ్వున ఎగిరి వరుసగా కొన్ని బాంబుల్ని ఆ బంగ్లామీద వదలి మరీ పోయింది. ఆ బాంబుల తాకిడికి, బ్లాస్టింగ్‌కి ఆ బంగ్లా మొత్తం పునాదులతో సహా లేచిపోయి రాళ్ళగుట్టగా మారింది. అంతా క్షణాల్లో జరిగిపోయింది. దీన్ని బట్టి చూస్తుంటే మేఘనకున్న మాఫియా రాకెట్ విస్తృతి ఎంతో అంచనా వేయడానికే భయంగా వుంది. ఈ సంఘటనలోంచి శ్రీ జోగారావ్ బృందం ప్రాణాలతో బయటపడడం ఆశ్చర్యమే కాక అదృష్టం!'

* * *

ప్లాన్ రూపు మారిందని తన తండ్రి జోగారావ్‌తో మాట్లాడిన మాటలు యాదృచ్ఛికంగా శ్రీలేఖ వినటం జరిగింది. దాంతో మేఘన కథకు రీజనింగ్ తెలిసింది. ఆమె మహంకాళిని రక్షించడానికి ప్రయత్నిస్తుందనీ గ్రహించింది. ఆ వెంటనే జోగారావ్‌ని మారుతీలో వెంటాడి మహంకాళిని దాచిన బంగ్లా అడ్రస్ తెలుసుకుంది. అక్కడ ఆ రాత్రి తను, ఇందువదన కాపు కాసి మేఘనకు తమ సహాయం అందించాలని అనుకుంది. యజ్ఞ నారాయణ, కమలాంబ నిద్రపోయిన తర్వాత రహస్యంగా బయలుదేరేసరికి చాలా ఆలస్యమైపోయింది. వాళ్ళు అక్కడికి చేరేసరికి నిలువెత్తున లేస్తున్న పొగలతో పెద్దరాళ్ళ గుట్ట ప్రత్యక్షమైంది!

మేఘన ఆ రాళ్ళ గుట్ట అడుగున సమాధి అయిపోయిందనే ఆలోచన

ఆమెనా రాత్రంతా పీడిస్తూనే వుంది. ఆ మర్నాటి నుంచి మార్ఫీన్ కావాలని నరాలు చేస్తున్న గోలను భరించలేక కాస్త ఎక్కువ డోస్ ఇంజెక్ట్ చేసుకుంది శ్రీలేఖ. ఆరోజు నుంచి ప్రతి రాత్రి మార్ఫీన్ తీసుకోకుండా వుండలేక పోతోందామె.

* * *

మేఘన, మరో ముసుగు మనిషి ఆ బంగ్లా శిథిలాల్లో సమాధి అయిపోయారనీ, కనుక ఆమె కోసం ప్రకటించిన రెండు లక్షలు తనకు బహుమతిగా ఇవ్వాలనీ రాజరాజ నరేంద్రుణ్ణి అడిగాడు జోగారావ్.

ఆ వెంటనే ఆ శిథిలాలని క్రేన్స్‌తో తీయించాడు రాజరాజనరేంద్రుడు. ఆ రాళ్ళ గుట్టకింద శవాలు దొరికితే అతడికి బహుమతి ఇద్దామనే అతడి ఉద్దేశ్యం. కాని ఏ ఒక్క శవం కూడ ఆ శిథిలాల్లో దొరకలేదు!

"అది మళ్ళీ తప్పించుకుంది. ఆ ముసుగు మనిషి ఎవరు?" ప్రశ్నించాడు రాజరాజనరేంద్రుడు.

"తెలీదు సార్, దానికి తెలిసినవాణ్ణి ఎవర్నో సహాయానికి వెంటబెట్టుకుని వచ్చింది" చెప్పాడు జోగారావ్.

"ఆ ఇద్దరి సంగతీ తెలుసుకుని ఫినిష్ చేస్తే నీకు మూడు లక్షల రూపాయలు ఇస్తాను"

"నా శాయశక్తులా ప్రయత్నిస్తాను సార్"

"నీ మీద నాకా నమ్మకం వుంది. మిగిలిన వారికంటే డైనమిక్‌గా వ్యవహరించి సకాలంలో మహంకాళిని అంతం చేసినందుకు చాలా సంతోషంగా వుంది. లేకపోతే లేనిపోని తలనొప్పులు ఎదురయ్యేవి. నీ క్విక్ యాక్షన్‌కి నేనిచ్చే ప్రత్యేక బహుమతి యిది" అంటూ లక్షరూపాయల కరెన్సీ కట్టల్ని అతడి చేతికి అందించాడు రాజరాజ నరేంద్రుడు.

"థాంక్యూ వెరీమచ్ సర్" ధనలక్ష్మిని చూసి కళ్ళు పెద్దవి చేసి

పొంగిపోయాడు జోగారావ్.

* * *

పునాదులతో సహా కూలిపోయిన బంగ్లా శిథిలాల్లో ప్రత్యేకంగా చెప్పుకోవలసినవి ఏవీ దొరకలేదనీ, ఆ రాళ్ళ గుట్టను క్రేన్స్‌తో తీయించారనీ ప్రచురితమైన పత్రికల్లోని వార్త చదివి మేఘన బ్రతికే వుందని చాలా సంతోషపడిపోయింది శ్రీలేఖ.

ఆ రోజు నుంచి రేడియోలో, టీవిలో వార్తల సమయంలో మేఘనను పట్టుకున్న సామాన్య ప్రజలకు, లేక ఆమెను చంపిన పోలీసు డిపార్టుమెంట్‌కి యిచ్చే బహుమతుల వివరాలతో ఎడతెరిపి లేకుండా వార్తలు వస్తూనే వున్నాయి!

ప్రతి రోజు ఆమెకు సంబంధించిన వార్తలతో, వ్యాసాలతో అన్ని ప్రముఖ దినపత్రికలు మారుమ్రోగిపోతున్నాయి.

ఎక్కడ చూసినా ప్రజల్లో ఆమె గురించి చర్చలు, సమావేశాలు, విమర్శలు, గొడవల గందరగోళం, పందాల హడావుడితో దేశం అట్టుడికినట్టు ఉడికి పోతోంది!

రాజరాజ నరేంద్రుడి రాజకీయాలు గురించి తెలిసిన కొద్దిమంది ఆమెను సమర్థిస్తే ఆ నిజాలేవీ తెలియని, గ్రహించలేని  చాలా మంది ఆమెను విమర్శిస్తున్నారు.

ఏది ఎలావున్నా మొత్తానికి మేఘన అదృశ్యం చర్చనీయాంశమై ఓ మిస్టరీగా తయారయింది!

మాఫియా బిగ్‌బాస్‌లు కొంతకాలం పాటు ఆమెని అండర్‌గ్రౌండ్‌కి పంపేశారనే పుకారుని ప్రజల్లో పుట్టించాడు రాజరాజ నరేంద్రుడు!

* * *

ఆ బంగ్లాలోంచి వచ్చిన దారినే అతికష్టం మీద అభిశాంత్‌ని బయటికి

చేర్చింది మేఘన. వాళ్ళిద్దరూ ప్రాణాలతో బ్రతికి బయట పడ్డారు.

అతడు స్కూటర్ డ్రైవ్ చెయ్యగలననేసరికి ఆ ఇద్దరు తాము తెచ్చిన రెండు వెహికల్స్ మీద తమ ఇంటికి చేరుకున్నారు. జోగారావ్ బృందం కంటపడకుండా వాళ్ళు అడ్డదోవల్లో ప్రయాణించారు. స్కూటర్ ఎలా డ్రైవ్ చెయ్యగలిగాడో అతడికే తెలీదు.

స్కూటర్ని ఇంటి దగ్గర వదిలేసి అభిశాంత్కి బాగా తెలిసిన ఓ డాక్టర్ దగ్గరికి ఆ రాత్రికి రాత్రే బుల్లెట్మీద తీసుకు వెళ్ళింది మేఘన.

బుల్లెట్ చీల్చిన అతడి ఎడమ భుజానికి కుట్లువేసి, కుడితొడలో దూరిన బుల్లెట్ని జాగ్రత్తగా తీసి, నొప్పి తెలియనంత సున్నితంగా ట్రీట్ చేసి ఆ రెండు చోట్ల చక్కగా డ్రెస్సింగ్ చేశాడా డాక్టర్.

తెల్లవారుఝామున పడుకున్న అభిశాంత్కి మధ్యాహ్నం వరకు మెలుకువ రాలేదు. అతడికి మెలుకువ రావడానికి ముఖ్య కారకుడు ధర్మం.

తను తలుపులు తీయకూడదు కనుక ఎవరో వచ్చారని అభిశాంత్ని లేపేసింది మేఘన. తల స్నానం చేసిన ఆమె ఇప్పుడు బచ్చలిపండు రంగు చీరలో వనకన్యలా వుంది. ఆమె ఒంటి మెరుపు ఆమె ధరించిన బట్టలకు అందాన్ని ఇచ్చింది.

ఆమెకు గుడ్ మార్నింగ్ చెప్పి, ధర్మం వచ్చి వుంటాడని ఊహించి, ఎడమచేతి కట్టు తెలియకుండా పొడవు చేతుల చొక్కా ధరించి తలుపు తీశాడు.

ధర్మం లోనికి వచ్చాడు.

వాడు అనుమానపు ప్రశ్నలు వెయ్యకుండా రాత్రి సెకెండ్ షో సినిమాకి వెళ్ళానని చెప్పి, వాడి చేతిలో స్కూటర్ కీస్ పెట్టి, వాడి మొహాన ఓ థాంక్స్ పారేశాడు అతడు.

"అదేంటి కుంటి నడక నడుస్తున్నావ్?"

అనుమానపు ప్రశ్న వెయ్యనే వేశాడు ధర్మంగాడు.

"సినిమా నుంచి వచ్చిన తర్వాత బాత్రూంలో జారిపడ్డాను" నవ్వాడు

అభిశాంత్.

"ఓహో.. బాత్రూంలో జారిపడటమనేది చాలా బేడ్ హేబిట్" పెదవి విరిచాడు ధర్మం "అదృష్టం కొద్దీ ఆ హేబిట్ నాకు లేకపోవడం నా అదృష్టమనే చెప్పాలి."

"నిన్ను చంపినా పాపం లేదురా ధర్మం" మనసులో మంటగా అనుకున్నాడతడు. పైకి మాత్రం "నొప్పి వల్ల రాత్రంతా నిద్రలేదు. నేను పడుకోవాలి, నువ్విక వెళ్ళు" అన్నాడు.

"కొత్త న్యూస్ ఐటమ్స్ ఏవైనా తయారు చేశావా?"

"లేదు, కలెక్ట్ చేసిన కొన్ని ఐటమ్స్‌ని ఎడిటర్‌కి ఇవ్వాల్సి వుంది. వాటి సంగతి రేపే చూడాలి."

అతడు వెళ్ళిపోయాడు.

బాత్రూంలో జారి పడటమనేది బాడ్ హేబిట్ అన్న ధర్మం – తనకా హేబిట్ లేదన్న ధర్మం కొద్ది నిముషాల తేడాలోనే బాత్రూంలో జారిపడ్డాడు. అది వేరే విషయం!

జారి పడటంతోనే ఆర్తనాదాలు, పొలికేకలు, ఆపసోపాలు పడిపోయాడు అతడు.

ముళ్ళ కంపను ఈడ్చినట్టు ఈడ్చి అతణ్ణి అతికష్టం మీద మంచంమీదకి చేర్చింది అతడి భార్య అమృతం.

అదృష్టం కొద్దీ అతడి నడుం విరగలేదు.

ఒకవైపు ఆమె అతడి నడుంకి జండుబామ్ రాసి వేడి నీళ్ళ కాపడం పెడుతున్నా సరే భయంకరంగా మూల్గుతూ ఆపసోపాలు పడిపోసాగాడు ధర్మం.

* * *

అతడు నీరసంగా వుండటం వలన అభిశాంత్ స్ట్రెయిన్ కావడం ఇష్టం లేని మేఘన అతడు చెబుతూ పోతుంటే, తను రాసుకుంటూ పోతోంది. ఆ

న్యూస్ ఐటమ్స్ రాయటానికి ఆమెకి రెండుగంటలు పట్టింది. వాటిని సర్ది పిన్ చేసి, టేబుల్ డెస్క్‌లో పెట్టి వచ్చింది.

అతడికి మాత్రలు, మంచినీళ్ళగ్లాసు అందిస్తూ అంది, "నువ్వు సంపాదించినవి చాల సామాన్యమైన వార్తలు. వాటిలో నువ్వనుకునే ఇన్‌వెస్టిగేటివ్ అనే పదానికి అర్థమే కనబడదు"

"అంటే నీ ఉద్దేశ్యంలో ఇన్‌వెస్టిగేషన్ అంటే చావు తప్పి కన్ను లొట్టపోవడమా!" మాత్రలు వేసుకుని, మంచినీళ్ళు తాగాడు అభిశాంత్.

బత్తాయి కాయలు చాకుతో కోస్తూ అందామె "చావంటే భయమా?"

"బ్రతకడం కోసమేగా ఈ ఉద్యోగం చేసేది"

అతడివైపు చురుగ్గా చూసింది మేఘన. "జర్నలిజం అంటే నీకంత చులకనభావం దేనికీ అభీ. బ్రతకడం కోసమే అయితే ఈ ఉద్యోగం చెయ్యనవసరం లేదు. రిస్క్ లేని ఏ చిన్న ఉద్యోగమయినా చెయ్యొచ్చు. జర్నలిస్ట్‌గా ఉండనవసరం లేదు. జర్నలిజం అనేది ఒక శక్తి... మహాశక్తి. ఈ జనారణ్యంలో జరుగుతున్న కుట్రలు, కుతంత్రాలు, అన్యాయాలు, అక్రమాలు, రాజకీయ అవినీతి చర్యల అమానుషాలు, మారణహోమాలను అద్దంపట్టి చూపించడానికి జర్నలిజం అనే శక్తిని మించిన ఆయుధం ఈ ప్రపంచంలో మరేదీ లేదు. అలాంటి జర్నలిజాన్ని గురించి నువ్వంత చులకనచేసి మాట్లాడుతుంటే నాకు బాధగా వుంది అభీ"

జర్నలిజం గురించి ఆమె అంత చక్కగా మాట్లాడుతుంటే అబ్బురంగా విన్నాడు అభిశాంత్. జర్నలిజం ఆమెకి అభిమాన సబ్జెక్ట్ అని గ్రహించి మరింత ఆశ్చర్యపోయాడు.

"నువ్వు చెప్పిందంతా నిజమే మేఘనా! కాని జర్నలిస్టుల్ని అంత ప్రేమగా చూసేదెవరు? నువ్వు చెప్పావే అన్యాయాలు, అక్రమాలు చేసేవాళ్ళని గురించి. వాళ్ళందరికి మాలాటి వాళ్ళు ఆగర్భశత్రువులు. మమ్మల్ని చంపడానికి వాళ్ళ కళ్ళు అనునిత్యం అన్వేషిస్తూనే వుంటాయి. అనుక్షణం భయపడుతూ ప్రాణాలు

గుప్పెట్లో పెట్టుకుని నిశాచరుల్లా సంచరించాలి మేము. ఖర్మకాలి వాళ్ళ కళ్ళల్లో పడితే... పట్టపగలు మా శవాలు నడిరోడ్డుమీద దర్శనం ఇస్తాయి. నువ్వు చెప్పినట్టు జర్నలిజాన్ని వజ్రాయుధంగా భావించిన నీతి, నిజాయితీ, మంచి, మానవత్వం గల జర్నలిస్టులు ఎంతమంది చనిపోయారో నీకు తెలుసా మేఘనా.... అలాంటి పరిస్థితుల్లో జర్నలిజానికి అర్థమేముంది. జరిగిన ఘోరహత్యల కారణంగా రక్షణ లేని జర్నలిస్టుల ఊహల్లో జర్నలిజానికి అర్థమే మారిపోతుంది" అతడి గుండెల్లో ఎంత కాలంగానో దాగిన బాధ అతికష్టం మీద మాటల రూపుదాల్చింది.

తన తోటి జర్నలిస్టు, తన ప్రాణమిత్రుడు అయిన అవినాష్ ఎవరో రాజకీయ కిరాతకుల తుపాకీ గుళ్ళకు బలయిపోయి, పట్టపగలు నడిరోడ్డుమీద కొన్ని నిముషాల పాటు నరకాన్ని అనుభవించి తన ఒడిలో ప్రాణాలు విడిచిన దయనీయమైన సంఘటన అతడి కళ్ళముందు మెదిలేసరికి తన గుండెనెవరో మెలిపెట్టినట్టుయి అతడి గొంతు గద్గదంగా మారిపోయింది.

"నీ వాదనతో కొంతవరకు నేను ఏకీభవిస్తాను. కాని అది ఆత్మవంచన అవుతుంది అభీ" బత్తాయిరసం తీస్తూ అంది మేఘన.

ఆమె మాటలకు ఒక్కసారిగా కదిలిపోయాడు అభిశాంత్ "అవును మేఘనా... నాది ఆత్మవంచన! తను నమ్మిన సిద్ధాంతంకోసం నీతిగా, నిజాయితీగా ప్రజల కష్టనష్టాలు తనవిగా భావించి, వాళ్ళని అన్యాయం, అక్రమాలపాలు చేస్తున్న మానవ మృగాలపై ప్రతిఘటన సాగించి వాళ్ళ కుట్రల్నీ, కుతంత్రాల్నీ ప్రపంచానికి చాటిచెప్పి, ఆ కుట్రదారుల తుపాకీ గుళ్ళకు బలై ఆత్మత్యాగం చేసిన నా మిత్రుడు జర్నలిస్ట్ అవినాష్‌ది ఆత్మవంచన! పట్టపగలు, నడి రోడ్డుమీద మానవత్వం మూర్తీభవించిన ఓ నిజాయితీపరుణ్ణి కిరాతకంగా హత్య చేస్తూంటే చోద్యం చూసిన ఈ లోకానిది ఆత్మవంచన!..." అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. "లేనిపోని గొడవలు మనకెందుకు లెమ్మని.... మరణ వేదన అనుభవిస్తూ మెలికలు తిరుగుతున్న నా మిత్రుణ్ణి అమానుషంగా వదిలిపోయిన

ఈ పిరికి లోకానిది ఆత్మవంచన!...” అతడి కళ్ళు వర్షిస్తున్నాయి. “నడిరోడ్డుమీద ఎవరయినా యాక్సిడెంట్‌కి గురయితే అయ్యో పాపమని దయతో హాస్పిటల్‌కి తరలిస్తామే! ఆ అదృష్టానికి కూడ నోచుకోలేదా నా మిత్రుడు. అంత ఘోరపాపం ఏం చేశాడు వాడు.

నిజాయితీ, నిజాయితీయని గొంతుచించుకు అరిచిన ఆ మానవతావాదిని చంపిన ఈ లోకానిది వంచన! జాలి, దయ, కరుణలను వంచించిన ఈ లోకానిది నేరం...” చివరి మాటలు అతడి నోటి వెంట అరుపులుగా వెలువడ్డాయి... “అప్పుడేమైందీ లోకం! అప్పుడేమైందీ వంచన! అప్పుడేమైందీ చైతన్యం!”

అతడి మనసులో గూడుకట్టుకుని జ్వలిస్తోన్న హృదయాగ్ని పర్వతం ఒక్కసారిగా బ్రద్దలై బాధాగ్నికీలలు లావాలా ప్రచండ వేగంతో ముందుకు దూకి అలలు అలలుగా ప్రవహించి ఆవేదనాగ్ని కెరటాలుగా మారి ఫెటిల్లున ఆమె హృదయాన్ని తాకి మనసును కదిలించాయి.

“సారీ అభీ... నీ మనసులో ఇంత బడభాగ్ని దాగివుందని నేననుకోలేదు. ఇంతటి హృదయావేదన అనుభవిస్తూ పైకి నవ్వుతూ ఎలా వుండగలుగుతున్నావు? గతాన్ని గుర్తుచేసి గాయాన్ని రేపినందుకు క్షమించు”

ఆమె అందించిన బత్తాయి రసాన్ని టేబుల్‌మీద పెట్టేశాడు అభిశాంత్. “ఇట్సాల్ రైట్... మనసులో బాధ ఆత్మీయులకి చెప్పుకుంటే తీరుతుందంటారు. నీకంటే ఆత్మీయులు నాకు మరెవరూ లేరు”

కొన్ని క్షణాల తర్వాత అతడి స్వరం మంద్రంగా మారిపోయింది. “నీకో విషయం తెలుసా మేఘనా. నేనూ ఒకప్పుడు అవినాష్ ఆశయాలను పుణికిపుచ్చుకున్న జర్నలిస్టునే! పరిశోధన చేసి సంచలన వార్తలను ప్రకటించి ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌గా పేరు తెచ్చుకున్నవాడినే. కాని...నా మిత్రుడి చావు నాలోని చైతన్యాన్ని చంపేసింది. నాలో అసలయిన జర్నలిస్ట్‌ని సమాధి చేసేసింది. ఆ జర్నలిస్ట్ ఎప్పుడో చచ్చిపోయాడు”

మెల్లగా అందామె “ఆ జర్నలిస్టుని తిరిగి బ్రతికించు అభీ...”

ఆమెవైపు చురుగ్గా చూశాడు అభిశాంత్. “ఏమిటి నువ్వనేది?”

“సమాధిని పెళ్ళగించు అభీ! నీలోని జర్నలిస్ట్‌కి జీవం పొయ్యి. చైతన్యం దానికదే వస్తుంది. నీలోని జర్నలిస్టుని పునరుజ్జీవితుణ్ణి చేయటానికి పనికి వచ్చే మృతసంజీవినిలాంటి అస్త్రం నీ మనసు. ఇంతకంటే నేనేం చెప్పలేను”

“నో... ఇటీజ్ ఇంపాజిబుల్ మేఘన. నా మిత్రుడి ప్రాణాన్ని రక్షించడానికి ప్రయత్నించని ఈ లోకంపై నేనెందుకు సానుభూతి చూపించాలి. వాళ్ళ కష్టనష్టాల్లో నేనెందుకు పాలుపంచుకోవాలి. ఈ లోకులు కాకులు. అవసరం తీరిన వెంటనే పొడుచుకు తినే రాబందులు. వాళ్ళ కోసం నేనెందుకు ఆలోచించాలి. అలాంటి రాబందుల్ని నాశనమయిపోనీ, కృంగి కృశించిపోనీ. రాజరాజ నరేంద్రుడిలాంటి రాజకీయ నాయకుల పదఘట్టనల కిందపడి నలిగిపోనీ! కనీసం అప్పుడయినా ఈ జనంలో నవచైతన్యం పుట్టుకొస్తుందేమో! నేనెందుకు వాళ్ళ కోసం ప్రాణాపాయం కొని తెచ్చుకోవాలి. వై షుడ్ ఐ ఫేస్ రిస్క్... ఐ కాంట్ హెల్ప్ యిట్” బాధగా తలవిదిలించాడు అతడు.

“యుకెన్ హెల్ప్ యిట్” బలంగా చెప్పింది మేఘన.

“ఎందుకు... ఎందుకు?” రెట్టించి అడిగాడు అతడు.

“ఎందుకంటే నువ్వు రాబందువి కాదు. శాంతి కపోతానివి, అభిశాంత్‌వి. అవును అభీ... నువ్వన్నట్టు లోకులు కాకులే, పొడుచుకు తినే రాబందులే. సమస్యల వలయం నుంచి తప్పించుకోలేని పిరికివాళ్ళు... ఎస్కేపిస్టులు. ఎస్కేపిజం వాళ్ళకి బాగా తెలుసు. అందుకే నీ మిత్రుణ్ణి వాళ్ళు రక్షించటానికి ప్రయత్నించలేదు. వాళ్ళలాగే నువ్వు ప్రవర్తిస్తే ఇక వాళ్ళకి, నీకు తేడా ఏముంటుంది?” ఆమె అన్న ఆఖరి మాట అతడి గుండెలమీద భేరీలా మారుమ్రోగి, చెవుల్లో ప్రతిధ్వనించింది!

‘అవును, నిజమే. వాళ్ళకీ, నాకూ తేడా ఏముంది?!.... నేను రాబందుని కాను. అభిశాంత్‌ని’

అదే మాటని పదే పదే అనుకున్నాడతడు.

ఆమె అన్న ఆఖరి మాట అతణ్ణి ఆలోచింపచేసింది. ఆ ఒక్క మాట ప్రళయకాల ఝంఝా మారుతంలా అతడిలో సంచలనాన్ని కలిగించి నిర్జీవంగా పడివున్న అతడిలోని అసలైన జర్నలిస్టుకి జీవం పోసి మృతసంజీవినిలా పనిచేసి అతణ్ణి చైతన్యవంతుణ్ణి చేసింది!

"ఆపదలో వున్నప్పుడు శత్రువునయినా రక్షించమన్నారు పెద్దలు. కాని అన్యాయాల పాలయ్యే జనం నీకు శత్రువులు కారు. వాళ్ళమీద నీకు ఏ పగా లేదని నాకు తెల్సు. నీ మిత్రుడి చావు నీలోని అహాన్ని రెచ్చగొట్టి, నిన్ను ఆవేశపరుణ్ణి చేసి నిన్ను ఇంతకాలం ఆలోచనా రహితుణ్ణి చేసినది!"

"అవును. అవినాష్ చావు నాలోని మనిషిని చంపేసింది. తిరిగి ఆ మనిషికి జీవం పోసిన ఘనత నీదే మేఘనా. థ్యాంక్యూ వెరీమచ్... మూసుకుపోయిన నా కళ్ళు ఇంత కాలం తర్వాత ఇప్పుడే... ఈ క్షణంలోనే తెరుచుకున్నాయి... నీ కారణంగా!.. ఈ క్షణం నుంచి నాలో మరో కొత్త మనిషిని చూస్తావు... అవినాష్‌కి ప్రతిరూపాన్ని నాలో చూస్తావు" దృఢ నిశ్చయంతో గంభీరంగా చెప్పాడు అతడు.

"వెరీగుడ్, ఈ క్షణంలో నాకు చాలా ఆనందంగా వుంది అభీ. రెక్కలొచ్చి స్వేఛ్ఛా విహంగంలా ఆకాశంలో ఎగిరితే బావుండుననిపిస్తూంది"

"నాకూ అలాగే వుంది"

"ఆ... ఓ విషయం చెప్పటం మరిచాను. జర్నలిస్టుగా నీకు ప్రాణాపాయం లేకుండా నీ సెక్యూరిటీ నువ్వే చూసుకోవచ్చు"

"ఎలా?!"

చెప్పిందామె.

"నీ ఆలోచన చాలా బావుంది. అలాగే చేస్తాను"

క్షణం తర్వాత అతడన్నాడు "ఇంతకీ నువ్వేం చెయ్యదలచుకున్నావ్?"

"నేనో నిశ్చయానికి వచ్చాను. నువ్వేమనుకుంటావోననే సంశయంతో

చెప్పలేదు."

"నీ నిశ్చయం ఆలోచనా సహితంగా వుంటుందని నాకు తెలుసు. అదేమిటో చెప్పు మేఘనా?"

"ఏది ఏమైనా రాజరాజ నరేంద్రుడి మీద విజయం సాధించాలనే తపన నాలో జీర్ణించుకుంది అభీ... నేననుకున్నది సాధించేవరకు నా ప్రాణం అపాయంలో ఉండకూడదు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అది సాధ్యం కాదు. అందుకే... అందుకే... ప్లాస్టిక్ సర్జరీ ద్వారా నా రూపురేఖల్ని మార్పించుకోదలచు కున్నాను. అప్పుడీ లోకానికి మేఘన కనిపించదు ప్రభుత్వం ప్రకటించిన బహుమతి కోసం వేట సాగిస్తూన్న మానవ మృగాలకూ మేఘన అనబడే లేడి కనిపించదు. అప్పుడు నా మార్గం సుగమం అవుతుంది. నా ఆలోచన సరయినది కాదంటావా?"

"నీ ఆలోచన అద్భుతంగా వుంది మేఘన! అలా చేస్తే మనకు విజయం తథ్యం. ఈ విషయంలో నేనెందుకు తప్పుగా అనుకుంటాను. నేను నీ ఆత్మ సౌందర్యాన్ని ప్రేమించాను గాని బాహ్య సౌందర్యాన్ని కాదు"

అభిశాంత్ అన్న ఆఖరి మాటకు పులకరించిపోతూ అతడివైపు ప్రేమగా చూసింది మేఘన.

రెండు నిముషాలు గడిచాయి.

"నా గాయాలకు కట్టు కట్టాడే, అతడు చాలా మంచి సర్జన్. ప్లాస్టిక్ సర్జరీలోనే కాక, డ్రగ్స్ బానిసలకి శస్త్ర చికిత్సలులు చేయటంలో కూడ మంచి ప్రావీణ్యత, అనుభవంగలవాడు. ఆ రాత్రి బాధలో వుండటం వల్ల నీకు పరిచయం చెయ్యలేకపోయాను. ఇంతకీ అతడు నీకు తెలిసిన మనిషే సుమా" చెప్పాడతడు.

"నాకు తెలిసిన మనిషా!"

"అవును"

కొన్ని క్షణాలు తీవ్రంగా ఆలోచించిందామె "ఏమో! అతడెవరో గుర్తులేదు"

" ఆ డాక్టర్ మన చిన్ననాటి నేస్తం సూర్యతేజ"

"సూర్యతేజ" జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తోందామె.

జ్ఞాపకాల అరలలో మంచికంటే చెడు ప్రభావమే ఎక్కువగా గుర్తుంటుందనేది నిజం! ఆ విధంగానే ఆమెకి అతడు గుర్తొచ్చాడు.

తన చిన్నతనంలో అతడు తనను భుజంమీద ఎక్కించుకుని మేకపిల్ల ఆట ఆడుతూ తనను పావలాకి అమ్మేస్తానన్నాడు. కాదు, తనను రూపాయికి అమ్మమని తను వాదించింది. అతడు తన మాట ఖాతరు చెయ్యటం లేదు. ఆ కోపంలో తను అతడి వీపుమీద బలంగా కొట్టింది. దాంతో కోపావేశంలో అతడు తనను కింద ఎత్తేశాడు. తన తల ద్వారబంధం మీద పడటంతో నుదురుపైన, తల వెంట్రుకల మధ్య బలమైన గాయం తగిలి రక్తం వచ్చింది. నాలుగయిదు కుట్లు కూడా పడ్డాయి.

"సూర్యతేజ గుర్తువచ్చాడు అభీ"

"అతడ్ని ఈ రాత్రే కలుద్దాం"

* * *

డాక్టర్ సూర్యతేజ, ఎం.డి.

అతడు డాక్టర్ కావడానికి ముఖ్య కారణం మేఘన అనే చెప్పాలి!

ఆమె తలకు అతడు చేసిన గాయం అతడి మనసును గాయపరిచింది.

ఆమె తలమీద మానిన గాయం అతణ్ణి ఆలోచనాపరుణ్ణి చేసింది.

అతడి ఆలోచన అతడికో ఆశయాన్ని ఇచ్చింది.

అతడి ఆశయం అతడికి దృఢనిశ్చయాన్ని ఇచ్చింది.

అతడి పట్టుదల అతడికి స్వయంకృషి ఇచ్చింది.

అతడి స్వయంకృషి అతడిని డాక్టర్‌ని చేసింది.

అతడి చిన్నతనంలో మరో సంఘటన జరిగింది. అది మరపురాని, మరువలేని సంఘటన.

తనకంటే బాగా పెద్దవాడైన ఓ పోకిరీ కుర్రాడు మేఘనని పెళ్ళాడతావా? అన్నాడు. తను సరే నన్నాడు.

మేఘన కూడ అంగీకరించింది తనను పెళ్ళాడటానికి. ఓ వైపు రామాలయ మంటపంలో సీతారాముల కళ్యాణం జరుగుతున్న సమయానికి ఆ గుడి వెనుక ప్రాంగణంలో తనచేత మేఘన మెడలో తాళి కట్టించబోయాడా పోకిరీ కుర్రాడు. అదే సమయంలో అక్కడికి వచ్చిన మేఘన తల్లి, జరుగుతున్న దారుణం చూసి ఆ కుర్రాణ్ణి, తనను చావగొట్టి తన చేతుల్లోంచి లాక్కొన్న పసుపుతాడుని తన మొహం మీదే విసిరికొట్టి, మేఘనను అక్కడి నుంచి లాక్కుపోయింది.

ఈ సంఘటన మాత్రం మేఘనకి గుర్తులేదు.

తన మొహం మీద విసిరికొట్టబడ్డ పసుపుతాడుని అప్పటి నుంచి తన దగ్గరే భద్రంగా దాచుకున్నాడు అతడు. దాన్ని చూసినప్పుడల్లా అతడికి మేఘనే గుర్తుకు వచ్చేది. మేఘన గుర్తుకు వచ్చినప్పుడల్లా అతడిలో రెండో ఆశయం జీవం పోసుకోసాగింది. అది... మేఘనని తన భార్యగా చేసుకోవాలనే ఆశయం.

ఆ తర్వాత అతడి తండ్రికి హైదరాబాద్ ట్రాన్స్‌ఫర్ అయింది.

మేఘనని పెళ్ళి చేసుకోవాలనే ఆలోచన అతడికి ఆత్మవిశ్వాసాన్ని యిచ్చింది.

అతడి ఆత్మ విశ్వాసం అతడికి ఆత్మస్థయిర్యాన్ని యిచ్చింది.

అతడి ఆత్మస్థయిర్యం అతడిని ఆకర్షణాశక్తికి లోనుచేసింది.

అతడి ఆకర్షణాశక్తి అతడికి మేఘన మీద ప్రేమ పుట్టించింది.

ఆ ప్రేమ అతడి మనసులో స్థిరంగా నిలిచిపోయింది.

మొదటి ఆశయం నెరవేర్చుకుని డాక్టర్ అయిన తర్వాత మేఘన గురించి ఎంతో ఎంక్వయిరీ చేశాడు. మరెంతగానో గాలించాడు. కాని అతడి దురదృష్టం కొద్దీ ఆమె జాడ తెలియలేదు.

తర్వాత తల్లిదండ్రుల మాటను పాటించి డాక్టర్‌గా ప్రాక్టీసు ప్రారంభించాడు. కాని ఆమెను మాత్రం మరచిపోలేదు. ఆమె అతడి

హృదయంలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుంది.

అతడి తండ్రి హౌసింగ్ బోర్డులో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్. ఇంతకాలం హైదరాబాద్‌లోనే వుండిపోయిన అతడు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయి వెళ్ళిపోతూ భార్యని, కూతుర్ని తీసుకుపోయి సూర్యతేజకు సాయంగా తన తల్లి నిర్మలని వుంచేశాడు. సూర్యతేజ చెల్లెలు బి.యస్.సి ఫైనల్ ఇయర్ చదువుతోంది.

ఒక ట్రిప్ హైదరాబాద్ వచ్చిన అతడి తండ్రి సూర్యతేజ ఒంటరిననే భావనతో బాధపడుతున్నాడని గ్రహించి వైజాగ్ వచ్చేయమని సలహా ఇచ్చాడు. కాని ఎందుకో వైజాగ్ వెళ్ళాలనిపించక రానన్నాడు. తను ఇక్కడే వుంటానన్నాడు.

పెళ్లి చేసేస్తానన్నాడు అతడి తండ్రి. పెళ్ళి చేస్తే ఒంటరిననే భావన పోతుందనే ఉద్దేశంతో.

అప్పుడు చెప్పాడు సూర్యతేజ తను మేఘనని ప్రేమించిన విషయం. ఆమెను తప్ప మరెవర్నీ పెళ్ళి చేసుకోనని ఖచ్చితంగా చెప్పేశాడు. ఆమె కనిపించకపోతేననే తండ్రి అనుమానానికి జవాబుగా బ్రహ్మచారిగా వుండిపోతానన్నాడు. ఆమె మరెవర్నో పెళ్ళి చేసుకుని వుంటే అనే తండ్రి ప్రశ్నకి కదిలిపోతూ ఈ జన్మకింతేనన్నాడు బాధగా.

సూర్యతేజకి పత్రికలు చదివే అలవాటు లేదు. ఆ అలవాటే వుంటే మొట్టమొదట పోలీసులు మేఘనని అరెస్టు చేసిన వార్తను చదివి, ఆమెని ఫోటోలో గుర్తుపట్టి వుండేవాడు. అతడిది ఫోటోగ్రాఫిక్ మెమరీ అయినా అలా జరగకపోవడం అతడి దురదృష్టం.

కాస్త విశ్రాంతి సమయం దొరికినా అతడు చేసే పని మేఘనని గురించి ఆలోచించడం.

అభిశాంత్, సూర్యతేజలలో మేఘనని ఎవరు అధికంగా ప్రేమిస్తున్నారనే ప్రశ్న జనిస్తే, నిజాయితీకే విలువనిస్తే ఆమెని ఆ ఇద్దరూ ప్రాణప్రదంగానే ప్రేమిస్తున్నారు.

ఆమెపై ఆరాధనా భావం అభిశాంత్‌కి ఇప్పుడిప్పుడే జనిస్తోంది.

తన గుండెను గుడిగా చేసి, ఆ గుడిలో మేఘనని ప్రతిష్టించిన సూర్యతేజ తను హైస్కూలు విద్యార్థిగా వున్న కాలం నుంచీ ఆమెను ఓ దేవతగా ఆరాధిస్తూనే వున్నాడు

ప్రేమ కంటే ఆరాధన గొప్పది.

* * *

బాగా చీకటి పడింది.

ఉన్న కొద్దిమంది పేషెంట్లు ట్రీట్‌మెంట్ తీసుకుని వెళ్ళిపోయారు. టైమ్ చూసుకుని చాలా లేటయిపోయిందనుకుంటూ రివాల్వింగ్ చైర్‌లోంచి నిలబడి స్వింగ్ డోర్స్ తోసుకుంటూ వచ్చిన ఆమెను చూసి అలాగే నిలబడిపోయాడు డాక్టర్ సూర్యతేజ.

ఆమె రూపురేఖలు అతడి మనసులో అట్టడుగున వున్న జ్ఞాపకాల అరల పొరలను తాకేసరికి అతడి మనోఫలకం మీద ఓ రూపం అస్పష్టంగా ప్రత్యక్షమై క్షణక్షణం ఆ రూపం స్పష్టతను ఆపాదించుకుంటూ, స్థిరత్వాన్ని సంపాదించుకుని అందమైన నవ్వుతో తనని పిలుస్తూ నిలబడింది.

ఆ రూపం!

ఆమె రూపం!!

తన దేవత ప్రతిరూపం!!!

అతడి మనసంతా ఒక్కసారిగా చైతన్యవంతమైపోయింది. ఆ క్షణంలో అతడి శరీరమంతా ఆనంద పారవశ్యంలో పులకరించి పోయింది. సంతోషాతిశయంతో అతడి నోరు మూగబోయింది.

తన ఆనందాతిశయాన్ని, పులకరింతను, పరవశాన్ని మూగసైగలతో మూగ వాడిలా అభినయించాడు అతడు. ఆమె వెనుకగా వచ్చిన అభిశాంత్‌ని చూసిన చాలాసేపటి తర్వాత గొంతు పెగిలి మాట్లాడగలిగాడు.

"నువ్వు... నువ్వు.. మేఘన కదూ!" అతడన్న మొదటి మాట అది.

"బాగానే గుర్తు పట్టావే" అంది మేఘన.

అతడి హృదయంలో కోటివీణల తీగెలు సప్తస్వరాలను ఆలపించాయి.

ఎంతకాలం నీ కోసం ఎదురు చూశానో తెలుసా నేస్తం!

ఎదురు చూపులో నా ఆవేదన ఏమని చెప్పను ఎంతని చెప్పను...

నా ఆవేదన, నీకెరుక పరచమని మేఘమాలికల్ని కోరాను

నా నివేదన విన్నవించమని ఆనంద సమీరాన్ని అర్థిచాను

నా ప్రేమను నీకందించమని పూల సౌరభాలను ప్రార్థించాను

నా ఆరాధన తెలుపమని శాంతి కపోతాలను బ్రతిమాలాను

నా విన్నపాలు వృధా కాలేదనే ఆనందపారవశ్యంలో నాకు మాటలే కరువయ్యాయి నేస్తం!

అభిశాంత్ మాటలతో అతడి ఆలోచనలు ఆగిపోయాయి.

"ఇక పరిచయాలవసరం లేదు కనుక ముందుగా ఓ గుడ్ న్యూస్. నేను మేఘనని త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాను రా సూర్యం."

ఒక పెద్ద సముద్ర కెరటం నిలువెత్తున ఎగసిపడి మొహాన చెళ్ళున కొట్టినట్లయింది.

కోటి వోల్ట్స్ విద్యుద్ఘాతం శరీరమంతా పాకి నిలువెల్లా దహించి వేస్తున్నంత బాధ నరనరాల్లో ప్రవహించింది.

రెక్కలు తెగిన పక్షి నేలకూలుతున్న భావన!

నడి సముద్రంలో పయనించే ఒంటరి నావ తుఫాను తాకిడికి గురై సముద్రగర్భంలో కలిసిపోతున్న భావన!

క్షణాల యుగాల నిరీక్షణలో నిర్మించుకున్న ఆశలసౌధం గాలిమేడలా కూలిపోతున్న భావన!

కాళ్ళు వణుకుతుండడంతో నిలుచోలేక రివాల్వింగ్ ఛైర్‌లో కూలబడి పోయాడు డాక్టర్ సూర్యతేజ.

"ఏమైంది సూర్యం" అభిశాంత్ మేఘనలిద్దరూ ఒకేసారి కంగారుగా

అడిగారు.

"డోంట్ వర్రీ కాళ్ళు తిమ్మిరెక్కి కూలబడ్డాను" రెండు నిముషాలాగి అతనన్నాడు. "ప్లీజ్ ఒన్ మినిట్. మొహం కడుక్కునివస్తాను"

అటాచ్డ్ బాత్రూంలో గోడ అద్దం ముందు నిలబడి ఆవేదనగా తల విదిలించాడు. ఎంత ఆపుకుందామని ప్రయత్నించినా దుఃఖం తన్నుకు వస్తోంది.

చంటిపిల్లాడిలా చేతుల్లో మొహం కప్పుకుని ఏడ్చేశాడు. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా రోదించాడు. మరుక్షణంలో తేరుకుని– గబగబా వాష్‌బేసిన్‌లో మొహం కడుక్కుని బయట పడ్డాడు.

"వాళ్ళిద్దరికీ పరిచయం అవ్వకుండా వుంటే ఎంత బావుణ్ణు" కొన్ని క్షణాలు ఆ ఆలోచన అతడ్ని పట్టి కుదిపేసింది.

తన పిచ్చి ఆలోచనకు తనలో తనే నవ్వుకున్నాడు. తన స్వార్థానికి తనను తనే తిట్టుకున్నాడు.

అభిశాంత్‌మీద తనకెందుకీ ఈర్ష్యభావం. తన దాక వస్తేగాని తనలోని స్వార్థం తనకు తెలియలేదు. ఛ....ఉన్నతమైన మనిషిలోకూడ యిలాటి అథమమైన భావలు చేరితే ఆ మనిషి మానవత్వం అధఃపాతాళానికి అణచి వెయ్యబడుతుంది.

అథమమైన తన భావాలకి తన మీద అసహ్యం కలిగింది.

తను దానవుడు కాడు.

ఎన్నటికీ కాడు.

తను మానవత్వం వున్న మనిషి.

ఎప్పటికీ మనిషే.

అథమమైన భావాలకు తావివ్వకుండా ఆ క్షణంలోనే వాటిని తన మనసులోనే బూడిద చేసేసాడు అతడు.

తన బాధంతా మరచిపోయి కొంతసేపటి వరకు వాళ్ళతో స్నేహ భావంతో చాలా సంతోషంగా మాట్లాడాడు సూర్యతేజ.

ఆ రోజు రాత్రి అభిశాంత్‌ని తీసుకువచ్చింది ఆమేనని వాళ్ళ మాటల వల్ల తెలిసి అతడన్నాడు "ఫెల్టుహేట్‌తో వుండటం వల్ల గుర్తించ లేక పోయాను. నువ్వేనా!"

"నేనే. మన చిన్నతనం గుర్తుచేసి అభిశాంత్ చెప్పేవరకు నువ్వే సూర్యతేజవని నాకు తెలియలేదు సుమా"

కొంతసేపటి వరకు తమ చిన్ననాటి ముచ్చట్లు ముచ్చటించుకున్నారు వాళ్ళు.

తర్వాత సడన్‌గా ఆమె అంది "నా మొహాన్ని ప్లాస్టిక్ సర్జరీ ద్వారా పూర్తిగా మార్చేయాలి సూర్యం"

"ఎందుకు?!"

ఆమె కథంతా క్లుప్తంగా వివరించి చెప్పాడు అభిశాంత్. అదంతా విని మేఘన వైపు విభ్రమంగా చూశాడు సూర్యతేజ. "వాడు జర్నలిస్ట్ కదా, ఎవరో దుండగులు షూట్ చేశారనుకున్నాను గాని మీరు ఇంతటి విషవలయం నుంచి బయటపడ్డారనుకోలేదు. హెూం మంత్రి దేశద్రోహన్నమాట!

ఒక జాతిని అది వున్న స్థితి నుంచి అది ఉండవలసిన స్థితికి మార్చగలిగిన వాడే నిజమైన రాజనీతిజ్ఞుడు. కాని దానికి భిన్నంగా రాక్షసనీతితో మానవజాతిని నేలమట్టం చేసే రాజరాజ నరేంద్రుడి లాంటి రాజకీయ రాబందులు రాజ్యమేలుతున్నాయన్నమాట!"

"అవును వాడు నిజంగా రాబందే. కాటికాడ నక్కలా చావు బ్రతుకుల్లో వున్న మనిషి దరిదాపుల్లో చేరి ఆ మనిషి ఎప్పుడు చస్తాడా ఎప్పుడు పీక్కుని తిందామా! అని ఓపిగ్గా ఎదురు చేసే రాబందు రాజరాజ నరేంద్రుడు!

తన మార్గాల్ని సుగమం చేసుకోవడానికి శవరాజకీయాలు నడిపి మనుషుల్ని శవాలుగా మార్చి తినే రాజకీయ రాబందు వాడు! ప్రాణాంతకమైన మాదక ద్రవ్యాలు సృష్టించి యువతను పట్టి పీడించి క్షీణించిన వారిని శవాలుగా చేసి తింటున్న మాఫియా రాబందు అతడు!" ఆవేశంగా చెప్పింది మేఘన.

"కాని, అలాంటి రాబందుతో నువ్వు తలపడగలవా మేఘనా!" తన అనుమానాన్ని వ్యక్తం చేశాడు సూర్యతేజ.

"తలపడటమే కాదు, వాడి మాఫియా రాకెట్‌ని పునాదులతో సహా కదిలించి, కూకటివేళ్ళతో పెకలించి, మాదకద్రవ్యాల విషవృక్షాన్ని భస్మీపటలం చేసి ఆ రాబందు మీద విజయం సాధిస్తాను" గంభీరంగా అందామె.

"నీ ఆత్మవిశ్వాసానికి, మనోధైర్యానికి నా జోహార్లు. నీ ఆశయం గొప్పది చాలా ఉన్నతమైనది, నీకు విజయం చేకూరాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. అసలు నీలో ఈ ఆశయం ఎలా పుట్టింది?"

"అసలు నా ఆశయమే వేరుగా వుండేది. ఇప్పుడు సమయం వచ్చింది కనుక చెబుతున్నాను. నా చిన్నతనంలో జరిగిన సంగతి అది. మా ఊళ్ళో రాజకీయంగా కాస్త పలుకుబడి ఉండి అవినీతి మార్గంలో ఎమ్మెల్యే అయిన కొండప్ప కొడుకు రామగోపాల్‌ని ప్రేమించింది మా అక్క సునంద. వాళ్ళ ప్రేమ సంగతి తెలిసిన కొండప్ప నిప్పులు కక్కాడు. మా అక్కని తన కోడలుగా చేసుకోవాలంటే లక్షరూపాయలు ఇమ్మన్నాడు నా తండ్రిని. అంత డబ్బు ఇవ్వలేని నా తండ్రి తన ఆలోచన విరమించుకుంటాడని కొండప్ప ఆశ. రామగోపాల్‌ని తప్ప మరెవర్నీ పెళ్లాడనని భీష్మించుకు కూర్చుంది మా అక్క. మరో మార్గం తోచక తన కిడ్నీని ఓ కోటేశ్వరుడికి లక్షరూపాయలకు అమ్మేసి తెచ్చిన డబ్బుని మా నాన్న కొండప్ప చేతిలో పెడితే మరో లక్ష యిస్తేనే పెళ్ళి అని గొంతెమ్మ కోరిక కోరాడు అతడు. విధిలేక ఉన్న ఇల్లు అమ్మేసి ఆ లక్ష కూడ వాడి చేతిలో పెట్టాడు నా తండ్రి. మింగలేక, కక్కలేక లోకానికి భయపడి మా అక్కను తన కోడలుగా చేసుకున్నాడు కొండప్ప, మేం అద్దె ఇంట్లోకి మారాం. ఆరునెలలు గడిచింది. తన అంతస్థుకి సరితూగలేని మా అక్కని కోడలుగా అంగీకరించలేని కొండప్ప కుట్ర చేసి సునందను చంపించేసి ఆత్మహత్యగా నిరూపించాడు. నిజం తెలిసి ప్రశ్నించిన నా తండ్రిని తన అనుచరులతో చాటుగా కొట్టించాడు. సునంద చావుతో బెంగపడిన నా తల్లి కొద్దిరోజుల

తర్వాత చనిపోయింది. మరో మాసానికి నా తండ్రీ చనిపోయాడు. ఓ మహానుభావుడు దిక్కులేని నన్ను ఇక్కడున్న ఓ అనాథాశ్రమంలో చేర్పించాడు.

కొండప్ప మొహం ఎలా వుంటుందో కూడ నాకు తెలీదు. నేను వాణ్ణి చూడలేదు. కాని నా కుటుంబ నాశనానికి కారకుడైన ఆ కొండప్ప అంతం చూడాలని నేను పగపట్టాను. పెద్దదాన్ని అయిన తర్వాత ఓసారి మా ఊరు వెళ్లాను. కాని పదేళ్ళ క్రితమే కొండప్ప అక్కడి నుంచి మకాం ఎత్తేశాడని తెలిసింది. ఎక్కడికి వెళ్ళాడో తెలియలేదు.

ఆ తర్వాత నేను హోం మంత్రి దగ్గర సెక్రెటరీగా సెలెక్ట్ అయి ఉద్యోగం చేస్తూనే కొండప్ప గురించి ఎంక్వయిరీ చేస్తూ వచ్చాను. కాని వాడి వివరం ఒక్కటి కూడ తెలియలేదు. కాలం గడిచిపోతోంది.

తర్వాత రాజరాజ నరేంద్రుడి దుర్మార్గం తెలిసి మహంకాళిని రక్షించాలనుకున్నాను. కాని రక్షించలేకపోయాను. అప్పటికే మాదకద్రవ్యాలకి బానిసలైన వాళ్ళని బాగు చెయ్యాలనే ఆశయం నా మదిలో రూపు దిద్దుకుంది. మహంకాళి సాక్ష్యంగా రాజరాజ నరేంద్రుడి మీద సత్యాగ్రహం చెయ్యాలనుకున్నాను. ఆ మార్గం మూసుకుపోయింది. ఇక రెండో మార్గం మాదకద్రవ్యాల బానిసల్ని రక్షిస్తూ మాఫియా రాకెట్‌ని కూల్చటానికి రాజరాజ నరేంద్రుడిపై ధర్మయుద్ధం చేయడం ఒక ఎత్తు, రాజరాజ నరేంద్రుడి మాఫియా సామ్రాజ్యాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించడం మరో ఎత్తు! ఈ క్షణం నుంచీ నేను డబుల్ గేమ్ ఆడాలి!

కొంత కాలం క్రితం వరకు అయితే కేవలం నా కుటుంబాన్ని సర్వనాశనం చేసిన కొండప్ప మీద వ్యక్తి గత కక్ష తీర్చుకోవడానికి ఒక ఆశయం ఏర్పరుచుకున్నాను. ఆ ఆశయంలో నా ఒక్కదాని స్వార్థమే ఇమిడి వుంది.

ఆ ఆశయం తుచ్ఛమైనది, హేయమైనది, క్షుద్రమైనది. అది గ్రహించిన తర్వాత దానికి ఫుల్‌స్టాఫ్ పెట్టేసాను.

దాని స్థానంలో మాఫియాను నిర్మూలించాలనే ఆశయం చోటు చేసుకుంది.

ఈ ఆశయంలో నా స్వార్థం ఏమీ లేదు. పరులకు సేవ చేయాలనే అభిలాష వుంది. పరోపకారమే పరమోధర్మః అన్నారు పెద్దలు. మానవతా దృక్పథంతో ఆలోచించిన నేను దేశశ్రేయస్సు దృష్ట్యా ఆ ఆశయాన్ని సాధించాలని నిశ్చయించు కున్నాను. పవిత్రమైన భారతదేశం ఓ తులసి వనం. ఆ వనంలో గంజాయి మొక్కలు పెరిగితే వనమెల్లా చెడుతుంది. వనం చెడితే భారత దేశానికి వున్న పవిత్రత గంగలో కలుస్తుంది. తులసి వనంలో గంజాయి పెరగడం తల్లిపాలు తాగుతూ ఆ తల్లి రొమ్ముని గుద్దడం వంటి చర్య. అలాంటి చర్యల్ని నేను అసహ్యించుకుంటాను. అందుకే.... అందుకే తులసి వనంలో గంజాయి మొక్కల్ని పీకి మనది పవిత్ర భారతం అని గర్వంతో చాటి చెప్పాలనుకున్నాను. ఆ కారణంగా మాఫియాకి మాస్టర్ అయిన రాజరాజ నరేంద్రుడి మీద ప్రతిఘటనకి నాందీ ప్రస్థావనలు పలికాను. భరత వాక్యంతో గెలుపో... ఓటమో తేల్చుకుంటాను”

ఆమెవైపు విభ్రమంగా చూశాడు సూర్యతేజ.

ఊహకి కూడ అందని ఒకశక్తి నవచైతన్యం అతడికి ఆమెలో కనిపించాయి. నక్షత్ర మండలంలో వెలుగొందుతున్న ఓ ధృవతార నవ భారతాన్ని సృష్టించడం కోసం ఈ భూమి మీద మేఘన రూపంలో అవతరించిందేమో! అనుకున్నాడతడు.

“నీ ఆశయం ఒక మహత్తర లక్ష్యం మేఘన. ఆ లక్ష్యాన్ని నువ్వు సాధిస్తావు” ఆమె యందు సూర్యతేజకి ఓ గౌరవభావం ఏర్పడింది.

“థాంక్యూ. నా లక్ష సాధనలో నీ సహకారం కావాలి”

“నా సహకారం నీకు ఎప్పుడూ వుంటుంది”

ఆమె కోరిక ప్రకారం డ్రగ్స్ బానిసలకి శస్త్రచికిత్సలు చేయడం కోసం నగరంలో ఓ మారుమూల ప్రాంతంలో వున్న భవనాన్ని అద్దెకు తీసుకుంటా నన్నాడు అతడు.

“అసలీ యువత ఆలోచనారహితంగా డ్రగ్స్‌కి బానిసలు కావడానికి

కారణం ఏమిటి సూర్యం" ప్రశ్నించాడు అభిశాంత్.

"పరిణామం చెందిన మానవుడిలో కోతి లక్షణాలకి చెందిన వాసనలు పోలేదు. ఎవరో కొందరు మందు కొడుతుంటే ఆ మందు కొట్టడంలో థ్రిల్ ఏముందో చూడాలనే కోతి లక్షణంతో ఆల్కాహాల్‌కి బానిసలవుతున్నారు నేటి యువతీ యువకులు. ఈ అంటు జాడ్యం ఆల్కహాల్ ఉత్పత్తి ప్రారంభకాలం నుంచీ మూడు పువ్వులు ఆరుకాయలుగా డెవలప్ అవుతూ వచ్చింది. ఈనాడిది ఓ ఫేషన్‌గా మారింది. డ్రగ్స్ విషయంలోను అంతే. డ్రగ్స్ తీసుకోవడంలో థ్రిల్ అన్వేషించడం కోసం అడుసులో కాలుపెట్టిన యువత తాము అడుగు పెట్టింది అడుసులో కాదనీ, భయంకరమైన ఓ ఊబిలోనని గ్రహించేసరికే ఆ విషవలయానికి బానిసై ప్రాణాలు పోగొట్టుకుంటోంది.

యువత డ్రగ్స్‌కి బానిసలు కావడానికి ఒకే ఒక్క కారణం క్రమశిక్షణా రాహిత్యం! తల్లిదండ్రులు పిల్లల్ని సరయిన క్రమశిక్షణలో పెంచకపోతే ఆ పిల్లలు చెడిపోవడానికి అనేక మార్గాలున్నాయి. డ్రగ్స్ మత్తులో పడినవాళ్ళకి ప్రతి ఒక్కరికి ఒక కథ వుంటుంది. ఆ కథకో రీజనింగ్ వుంటుంది. ఆ రీజనింగ్ నూటికి 90 శాతం వాళ్ళు సృష్టించుకున్నదే, దాన్ని రీజనింగ్ అనేకంటే ఆత్మవంచన అంటే బావుంటుంది! క్రమశిక్షణారాహిత్యం వల్ల మీరు చెడిపోయారంటే వాళ్ళకి చాలా కోపం వస్తుంది. అలా కాకుండా దారుణమైన మీ పరిస్థితుల కారణంగా విధి ఆడిన వింత నాటకంలో మీరు పావులయ్యారు అంటే వాళ్ళకెంత సంతోషమో! ఇది ఆత్మవంచన కాక మరేమిటి?....

క్రమశిక్షణా రాహిత్యం కాక పిల్లల విషయంలో మరో ముఖ్యకారణం వుంది. అది మైండ్ మెచ్యూరిటీ లేకపోవడం! మనసు వికసించని కారణంగా పదిహేనేళ్ళలోపు పిల్లలు విచక్షణాజ్ఞానం లేక డ్రగ్స్‌కి బానిసలవుతున్నారు. ఆ వయసు పిల్లల మనసులు వికసించాలంటే హైస్కూల్ స్టడీస్‌లో బ్రహ్మ రాక్షసుల వంటి మాదక ద్రవ్యాలు ఎంత ప్రాణాంతకమో! వివరించే ఒక స్పెషల్ సబ్జెక్టు ఏర్పాటు చేసి వాళ్ళను ఎడ్యుకేట్ చెయ్యాలి. అప్పుడుగాని మాదక ద్రవ్యాల

వినియోగం తగ్గదు.

డ్రగ్స్‌కి కేంద్రాలు మహానగరాలు, పట్టణాలు. మనదేశంలో లక్షల డ్రగ్స్ బానిసలు యిలాంటి చోట్ల కేంద్రీకృతమై ఉన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వాళ్ళ సంఖ్యలో మిలియన్స్‌గా మారతారు. డ్రగ్స్ వినియోగమే మానేస్తే మాఫియా గాంగ్‌లీడర్స్‌కి ఉనికే లేకుండా పోతుంది. కనుక ముమ్మాటికీ డ్రగ్స్‌కి బానిసలయిన యువతదే తప్పు" వివరంగా చెప్పాడు సూర్యతేజ.

"డ్రగ్స్‌కి బానిసలయిన వాళ్ళకి ఎంతమందికి చేసావ్ శస్త్ర చికిత్సలు?" మేఘన ప్రశ్నించింది.

"పన్నెండుగురికి!"

"అంత తక్కువ మందికా!" అభిశాంత్ అన్నాడు.

"ఆపరేషన్‌లు చెయ్యమని వాళ్ళకి వాళ్ళుగా ముందుకి రారు కదా! ఎవరయినా తీసుకు రావాలి. అంత శ్రద్ధ, సేవా దృక్పథం ఎవరికుంటాయి. సంఘసేవాసంస్కర్తలుగా పేరు తెచ్చుకున్న వాళ్ళంతా స్టేజీలమీద ఉపన్యాసాలు దంచడానికి, పత్రికలలో ఫోటోలు వేయించుకోడానికి మాత్రమే. వాళ్ళ సంఘ సేవ పేరు ప్రతిష్టలు నిలబెట్టుకోడానికి, కీర్తి కనకాలను ఆర్జించడం వరకు మాత్రమే పరిమితం. నేను ఆపరేషన్ చేసిన వాళ్ళని తీసుకువచ్చిన వాళ్ళు వాళ్ళ తల్లిదండ్రులే. శ్రద్ధ, ఓర్పు, సహనాలతో వ్యవహరించి వాళ్ళని తీసుకు వచ్చారు కనుకనే నేను వాళ్ళని బాగుచెయ్యగలిగారు. పనుల ఒత్తిడివల్లో, మరే కారణాల వల్లో నా అనే వాళ్ళే పట్టించుకోపోతే అలాంటి వాళ్ళని మరెవరు పట్టించుకుంటారు"

"ఇక ముందు అలాంటి వాళ్ళని నేను పట్టించుకుంటాను" అంది మేఘన.

రెండ్రోజుల్లో ఆమె ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేస్తానన్నాడతడు. అతడి దగ్గర శెలవు తీసుకున్నారు వాళ్ళు.

ఆ రాత్రంతా డాక్టర్ సూర్యతేజకి నిద్రపట్టలేదు. మంచంమీద దొర్లుతూ బాధపడుతూనే ఉన్నాడు. మానసిక వేదన అనుభవిస్తూనే ఉన్నాడు. ఆ రాత్రంతా

అతడి కళ్ళు నిశ్శబ్ధంగా వర్షిస్తూనే ఉన్నాయి.

హిమవత్పర్వతంలాంటి ఆమె అగ్ని పర్వతంలాంటి తన హృదయం మీద హిమవర్షం కురిపించి అగ్నిగుండంలా జ్వలిస్తున్న తన హృదయాగ్ని చల్లార్చి మేరు పర్వతంగా మలచుకుంటుందనే ఒయాసిస్సు లాంటి తన ఆశ ఎడారిలో ఎండమావే అయిందనే నిజాన్ని అతడు తట్టుకోలేకపోతున్నాడు.

చదువు – ప్రేమల సంఘర్షణా ఫలితంగా అగ్నిపర్వతంగా మారిన తన హృదయాన్ని చల్లార్చడం మరెవ్వరి తరమూ కాదని అతడికి మాత్రమే తెలుసు!

* * *

మేఘనకి ప్లాస్టిక్ సర్జరీ ద్వారా ఆమె మొహంలో రూపు రేఖలు పూర్తిగా మార్చేసాడు డాక్టర్ సూర్యతేజ.

ఇప్పుడామె మేఘన కాదు. సరికొత్త రూపంతో వున్న ఆమె మరో కొత్త అమ్మాయి. ఇంతక్రితం మేఘన మొహానికి, ఆమె కొత్త రూపానికీ! ఆమెను మేఘనగా గుర్తించడం ఆ ఫాలాక్షుడి తరం కూడ కాదు.

ఆమెను చూసిన అభిశాంత్ కూడ చాలా ఆశ్చర్యపోయాడు. ఆమె కొత్త అమ్మాయిలా కనిపించేసరికి మాట్లాడటానికే బిడియంగా వుందతడికి.

మూడు వారాల వరకు బయటికి కదలవద్దని సలహాయిచ్చాడు సూర్యతేజ. అతడి సలహా పాటించింది మేఘన. ఆమె ఎంత చెప్పినా వినకుండా ఆమె దగ్గర ఫీజు పుచ్చుకోలేదు అతడు.

హైదరాబాద్ నగరానికి ఓ మారుమూల ప్రాంతంలో ఒక పెద్ద భవనాన్ని అద్దెకు తీసుకున్నాడు సూర్య తేజ. డ్రగ్స్ బానిసలకి శస్త్రచికిత్సలు చేయటానికి పనికి వచ్చే వైద్య పరికరాల సరంజామానంతా అక్కడికి చేర్పించాడు. పన్నెండుమంది నర్సుల్నీ అక్కడ వుండే ఏర్పాట్లు చేశాడు. ప్రస్తుతానికి తన వైద్యవృత్తికి ఫుల్‌స్టాప్ పెట్టేసి, డ్రగ్స్ బానిసలకి శస్త్రచికిత్సలు ఫ్రీగా చేస్తానన్నాడతడు. తన దగ్గర వున్న డబ్బు మేఘన ఇవ్వబోతే ఎంతకీ

పుచ్చుకోలేదు అతడు. తను ఫ్రీ సర్వీస్ చేసేది పేదవాళ్ళకేనని, ధనవంతుల దగ్గర ఫీజు పీడించి మరీ వసూలు చేస్తాననీ, కనుక ఆ ఇబ్బంది లేదనీ చెప్పాడు అతడు.

మూడు వారాలలోగా తను ఏర్పాటు చేసిన భవనంలో అన్ని వసతులు ఉండేలా అరేంజ్‌మెంట్స్ చేశాడు డాక్టర్ సూర్యతేజ.

ఆ భవనానికి అతడు పెట్టిన పేరు 'యాంటీ డ్రగ్ సెంటర్'.

పురాతన వైభవంతో వెలుగొందుతున్న రెండంతస్తుల కట్టడం అది.

చుట్టూ చెట్లతో, ఆరోగ్యకరమైన గాలితో, ఆహ్లాదకరమైన ప్రాంతంలో వున్న బంగళా అది.

'యాంటీ డ్రగ్ సెంటర్.'

* * *

మేఘన యింట్లోంచి కదలని ఆ మూడు వారాల కాలంలో అగ్నివేష్ అనే ఓ జర్నలిస్టు ప్రళయకాల ప్రభంజనం వలె తీవ్ర సంచలనం సృష్టించాడు.

లోకంలో జరుగుతున్న కుట్రల్నీ, కుతంత్రాల్నీ, అన్యాయాల్నీ, అక్రమాల్నీ చీకట్లోంచి వెలుగులోకి సాక్ష్యాధారాలతో సహా తీసుకువచ్చి సమరశంఖం దిన పత్రికలో ప్రచురింపజేస్తూ దూర్తులపై, నీచులపై, దుర్మార్గులపై, పాపాత్ములపై సంకుల సమరం ప్రారంభించాడు ఇన్‌వెస్టిగేటివ్ జర్నలిస్టు అగ్నివేష్!

ఎక్కడ విన్నా అతడి పేరే!

ఏనోట విన్నా అతడి మాటే!

ఏ పత్రిక చూసినా అతడి వార్తే!!!

అతడి పేరు దేశంలోనే సంచలనాన్ని సృష్టించింది!

దేశం నలుమూలలా అతడి గురించి చర్చలు, సమావేశాలు!

అగ్నివేష్ ఎలా ఉంటాడో ఎవ్వరికీ తెలియదు.

అతడి రంగు గాని, అలవాట్లుగాని, రూపు రేఖా విలాసాలు గాని ఎవ్వరికీ

తెలీదు.

భారత ప్రజల ఊహల్లో అతడు హీ మాన్!

మాస్టర్ హీరో!!

స్టీల్ మాన్!!!

జేమ్స్‌బాండ్‌లపై చూపించే అభిమానాన్నంతా అతడి మీదకి మళ్ళించారు భారత ప్రజలు!

అతడు కనుగొన్న అన్యాయాలు పత్రికలకి ఎక్కేసరికి ప్రజల మెప్పు కోసమయితేనేమి, వాళ్ళ బాధ పడలేక అయితేనేమి, వాళ్ళకి భయపడి అయితేనేమి ఆ అన్యాయాలు చేసినవాళ్ళకి కఠిన శిక్షలు పడేలా చూసేవారు కొందరు రాజకీయ నాయకులు. పత్రికలకెక్కినా పట్టించుకోక ఆ కేసులు మాఫీ చేస్తే ఆ మాఫీ చేసిన వాళ్ళ పేర్లతో సహా వాళ్ళ చరిత్రల్ని మళ్ళీ పత్రికల కెక్కించేవాడు అగ్నివేష్.

అలాంటి సంఘటనలతో అగ్నివేష్ అంటే రాజకీయ నాయకులకి సింహస్వప్నం అయిపోయింది. అతడి పేరు చెబితే చాలు రాబందులు గజగజ వణుకుతాయి!

అతడు కేవలం ఒక్క పత్రిక తరపున ఎప్పుడూ పని చెయ్యడు. ప్రారంభంలో మాత్రం సమరశంఖం పత్రికకి వరుసగా కొన్ని రోజులపాటు వార్తలు అందించాడు. ఆ తరువాత మాత్రం అన్ని పత్రికలకీ అంచెలవారీగా అందించసాగాడు సంచలన వార్తలు.

అతడు అందించిన వార్తలు ప్రచురించిన పత్రికా కాపీలు లక్షలలో అమ్ముడవుతాయంటే అతిశయోక్తి కాదు.

అతడ్ని కేవలం తమ పత్రికలోనే పర్మనెంటు జర్నలిస్టుగా చేసుకోవాలనే ఉద్దేశ్యంతో దేశంలోని ప్రముఖ పత్రికలన్నీ ప్రయత్నం చేశాయి. కానీ వీలుపడలేదు. ఆ పత్రికలన్నీ అతడికోసం ప్రకటించిన ఆఫర్‌లన్నీ తిరస్కరించాడు అతడు. పత్రికలన్నింటి సెక్యూరిటీ దృష్ట్యా తాను ఒకే పత్రికలో

స్థిరంగా పనిచేయబోవడంలేదని అతడు చెప్పాడు. అదీ నిజమే. రాజకీయ రాబందులన్నీ కూడాగట్టుకుని అతడు పనిచేసే పత్రికని లేపేసే ప్రమాదముంది. అప్పటినుంచీ ఆ పత్రికలన్నింటికీ అతడంటే మరింత అభిమానం, గౌరవభావం పెరిగాయి.

అతడంటే అందరికీ తెలిసింది ఒక్కటే!

అది!....

యుక్తినీ, చైతన్యాన్ని ఆయుధాలుగా ధరించిన ఓ శక్తి అగ్నివేష్!

అగ్నివేష్ ఎవరో మీరీపాటికి ఊహించి వుంటారు...అతడు అభిశాంత్.

కానీ మీకు తెలీని నిజం మరోటి వుంది.

అది!

అగ్నివేష్ పేరున ప్రచురింపబడిన వార్తలలో సగానికి సగం సంచలన వార్తలు అత్యంత సాహసంతో సేకరించిన వనిత మేఘన అనే నిజం!

తామిద్దరూ సేకరించిన వార్తల ద్వారా వచ్చిన డబ్బుని, డ్రగ్స్ బానిసల్ని పోగుచేసి యాంటీ డ్రగ్ సెంటర్‌కి తరలించడంలో ఖర్చు చేసేవారు.

మూడు వారాల వరకు ఇల్లు కదలనని మాట ఇచ్చిన మేఘన ఆ మాటను రాత్రులందు (రెండు వారాల తరువాత నుంచీ) భద్రంగా దాచి పెట్టేసింది.

ఇప్పటి వరకు దాదాపు ఓ వంద మంది డ్రగ్స్ బానిసల్ని యాంటీడ్రగ్ సెంటర్‌కి తరలించారు మేఘన, అభిశాంత్‌లు. వాళ్ళల్లో చాలా మందిని మాదక ద్రవ్యాల మత్తు విషపు కుచ్చుల నుంచి శస్త్రచికిత్సల ద్వారా విముక్తుల్ని గావించాడు డాక్టర్ సూర్యతేజ.

ఒకవైపు అగ్నివేష్ అవతారంలో సంచలన వార్తలు సేకరిస్తూనే మరో వైపు ఓ సాధారణ జర్నలిస్టుగా తన సెక్యూరిటీ దృష్ట్యా అతి సాధారణమైన వార్తల్ని సేకరించి తమ పత్రిక సమరశంఖంలో అందివ్వసాగాడు అభిశాంత్.

దివ్యమైన ఆ ఆలోచన అతడికి చెప్పింది మేఘన.

* * *

"హోటల్ త్రీ కాజిల్స్‌కి కొత్త పిట్టలు వచ్చాయంట గురూ, వెళదామా?" ఆశగా అడిగాడు ధర్మం.

"హోం మినిస్టర్ ఓపెన్ చేశాడు ఆ హోటలేనా!" అడిగాడు అభిశాంత్. అప్పటికే ఆ స్టార్ హోటల్ మీద కాస్త అనుమానం వుంది అతడికి. ధర్మం మాటలతో ఆ అనుమానం బలపడింది.

"అదే. నీ జ్ఞాపకశక్తి అమోఘం గురూ! పోదామా మరి"

"నీకో నమస్కారం, నన్నొదిలేయ్"

"నువ్వీ జన్మలో బాగుపడవ్. కనీసం ఒక్క వ్యసనానికైనా అలవాటుపడి నా చేత శభాష్ అనిపించుకోవు కదా! ఏ వ్యసనం లేకపోవడమనేది చాలా చెడ్డ వ్యసనం! ఆ బేడ్ హేబిట్ నాకు లేకపోవడం నా అదృష్టమనే చెప్పాలి వాస్తవానికి" పైకి లేచాడు ధర్మం.

"టీ తాగి వెళ్లండి" ట్రేతో ప్రత్యక్షమైన మేఘన వాళ్ళిద్దరికీ టీలు అందించింది. అప్పటికే ఆమెను తన ప్రియురాలు, కాబోయే ఇల్లాలుగా పరిచయం చేశాడతడు ధర్మం దంపతులకి. ఆమె పేరు  చంద్రలేఖగా మార్చి చెప్పాడు.

అతడి రహస్య నామం అగ్నివేష్ అయినట్టే ఆమె ప్రత్యక్ష నామం చంద్రలేఖ.

టీ తాగి వెళ్ళిపోయాడు ధర్మం.

అగ్నివేష్ అవతారంలో త్రీ కాజిల్స్ చీకటి వ్యవహారాన్ని సాక్ష్యాలతో సంపాదించి, ఫోటోలతో సమర శంఖం పత్రికలో ప్రచురింపజేశాడు అతడు.

'హోం మంత్రి ఓపెన్ చేసిన త్రీకాజిల్స్ చీకటి వ్యాపారం'

'వ్యభిచారం విచ్చలవిడిగా సాగుతున్న త్రీ కాజిల్స్ గుట్టు'

అనే హెడ్డింగ్స్ కింద అతడు రాసిన వార్తలు సంచలనం సృష్టించాయి. కాని దానిమీద చర్య తీసుకోబడలేదు.

'ఫోన్ చేసి వార్త చెప్పినా' పోలీసులు త్రీ కాజిల్స్ మీద రైడ్ చెయ్యకపోయే

సరికి వాళ్ళ మీద వార్త రాసేశాడు అభిశాంత్.

అప్పుడు వచ్చింది పోలీసుల్లో చైతన్యం!

ఆ వార్త వచ్చిన మర్నాడే శ్రీ కాజిల్స్ మీద రైడ్ చేశారు పోలీసులు. ఆ రైడింగ్‌లో కొందరు ప్రముఖ వ్యాపారస్థులు, ఉన్నత ప్రభుత్వోద్యోగులు కూడ దొరికారు.

తన దురదృష్టం కొద్దీ అదే రైడింగ్‌లో ధర్మం కూడా దొరికాడు. ఆ వార్త తెలిసి అతడి భార్య అమృతం శోకదేవతలా మారేసరికి పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి అతడిని బెయిలు మీద విడిపించి తీసుకు వచ్చాడు అభిశాంత్.

ఆ రైడింగ్‌కి సంబంధించిన వార్తలు హెడ్‌లైన్స్‌లో మొదటి పేజీలో ఫోటోలతో సహా ప్రచురింపబడ్డాయి. రైడింగ్‌లో దొరికిన వాళ్ళందరి పేర్లను పెద్ద అక్షరాలతో ప్రచురింపజేశాడు అభిశాంత్. ఆ సంచలన వార్త మరే పత్రికలోనూ లేదు. సమరశంఖంలో తప్ప.

మహంకాళి సెక్యూరిటీ గ్రూప్‌లో ఉన్న ఓ సబ్ ఇన్‌స్పెక్టర్‌తో పాటు తనకు సన్నిహితుడైన ఓ ఉన్నత ప్రభుత్వాధికారి కూడ ఆ రైడింగ్‌లో దొరికి పోవడంతో పోలీస్ కమీషనర్ భట్టాచార్యకి ఓ ఫోన్ కొట్టి వాళ్ళిద్దర్నీ రహస్యంగా విడిపించి కేసు లేకుండా చేశాడు హెూం మంత్రి రాజరాజ నరేంద్రుడు.

మర్నాడు పేపర్‌లో ఆ వార్త ప్రముఖంగా వచ్చేసింది 'గోడమీద పిల్లి వాటంతో ఇద్దరి కేసు మాఫీ చేసిన హెూం మంత్రి' అనే హెడ్డింగ్‌తో.

ధర్మంతో సహా ఎంతమందికి బెయిలు ఇచ్చిందీ, ఎంతమంది ఎవరి రికమండేషన్‌లతో కేసుల నుంచి తప్పుకున్నదీ. ఆ రికమెండ్ చేసిన వాళ్ళెవరనేది వివరంగా ప్రచురింపబడింది.

ఆ దెబ్బతో అగ్నివేష్ మీద శత్రుత్వం కట్టిన వందలాది జనంలో మరి కొందరు చేరారు. ఆ కొందరిలో రాజరాజ నరేంద్రుడు ఒకడు. అప్పటి వరకు అంచెలంచెలుగా పెరుగుతూ వచ్చి తన పేరు ప్రతిష్టలకి ఇలాంటి చిన్న అవమానకరమైన వార్తలు కూడ గొడ్డలిపెట్టు కాగలవని అతడికి తెలుసు.

అందువల్ల ఆగ్రహావేశాలతో కంపించిపోతూ తన అనుచరులని హెచ్చరించి వాడెవడో తెలుసుకుని అగ్నివేష్‌ని సజీవ దహనం చెయ్యమని పురమాయించాడు రాజరాజ నరేంద్రుడు.

అప్పటికి మరో వార్త మరో పత్రికలో వచ్చేసింది.

'హోటల్ త్రీ కాజిల్స్‌ని వ్యభిచారం కేసులోంచి విడిపించి కేసు మాఫీ చేయించిన హోం మంత్రి. ఆ హోటల్ మీద రైడింగ్ చేసిన పోలీసు ఉన్నతాధికారుల్ని చీవాట్లు పెట్టిన రాజరాజ నరేంద్రుడు.'

ఆ వార్త సేకరించింది కూడ అగ్నివేష్!

* * *

డ్రగ్స్ అలవడిన యువతను చేరవెయ్యటానికి వీలుగా వుంటుందని సెకెండ్ హేండ్ అంబాసిడర్ కారు కొన్నారు మేఘన, అభిశాంత్‌లు. ఆ గ్రీన్ అంబాసిడర్ సరికొత్త కారులా వుంది.

సాయంత్రం సమయంలో చల్లని గాలి కోసం ఇందిరాపార్కుకి వెళ్ళారు మేఘన, అభిశాంత్‌లు.

తిరిగి వస్తూండగా ఓ పొద పక్కన వెల్లికిలా పడుకుని వుండి గాలికి ముద్దులు పెడుతున్న ఓ అమ్మాయి కనిపించేసరికి ఆమె డ్రగ్ తీసుకుందని గ్రహించిన అభిశాంత్ మేఘన జవాబుకై ఎదురు చూడకుండా ఆమెను పైకి లేవదీయ బోయాడు. కాని అతడినే తన మీదకు లాక్కుని బలంగా తన కౌగిట్లో బంధించి అభిశాంత్ ముఖం మీద అదేపనిగా ముద్దులు పెడుతూ, ముద్దులు పెట్టే గేప్‌లో నవ్వసాగింది.

ఆమె కౌగిలి నుంచి విడిపించుకుందామని ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదతడికి. అది ఉక్కు కౌగిలి. ముఖాన్ని వికారంగా పెట్టి ఇబ్బంది పడుతూ గింజుకోసాగాడు అతడు.

అప్పుడే వాళ్ళిదర్నీ గమనించిన మేఘన గబగబా వెనక్కి వచ్చింది.

"అలా చూస్తూ నిలుచోకపోతే ఈ దెయ్యం నుంచి నన్ను విడిపించవచ్చు కదా!" మాట్లాడలేక మాట్లాడాడు అతడు.

మేఘన చిరునవ్వు నవ్వింది "నో యుజ్ మిస్టర్ అభిశాంత్"

"ఆ... ఇప్పుడెలా!" కంగారు పడిపోయాడు అతడు. అతడి కిందున్న ఆమె మొహం మేఘనకి కనిపించడం లేదు.

కొన్ని క్షణాలు పకపకా నవ్వి, చెప్పింది మేఘన. "మెదడులో కేంద్ర నాడీ మండలంపై ఆమె తీసుకున్న డ్రగ్ ప్రభావం పడి శోషించబడే సమయానికి తను చేస్తున్న చేష్టల కీలకస్థానం ఉత్తేజపరచబడటం వల్ల చాలా సమయం వరకు చేస్తున్న చేష్టలే చేయడం జరుగుతుంది. అప్పటి వరకు గాలికి ముద్దులు పెడుతున్న ఆమెకి నువ్వు తగిలి ఉంటావు. దాంతో ఆ ముద్దులు నీకు పెట్టసాగింది. అదే విధంగా నవ్వు. చాలా సమయం వరకు ఆమె అలా నవ్వుతూ ముద్దులు పెడుతూనే వుంటుంది. కొంచెంసేపాగు..ఆమే నిన్ను వదిలేస్తుంది"

అభిశాంత్ బిగుసుకుపోయాడు. చాలాసేపటి తర్వాత ఆమె అతణ్ణి వదిలేసింది. 'చచ్చాంరా దేవుడా!' అనుకుంటూ పైకి లేచాడు అతడు. "ఇంకా నయం. ఆమె కేంద్ర నాడీమండలంపై డ్రగ్ శోషించబడే సమయానికి ఆమెకి మనుషుల్ని చంపేయాలనో, మేనీటర్‌లా తినేయాలనో అనిపించకపోవడం నా అదృష్టం. లేకపోతే నా పని ఈ రోజుతో అయిపోయేది"

ఆమెను చూసి ఆశ్చర్యపోయిన మేఘన కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"ఏమైంది మేఘనా!"

"ఆమె నా స్నేహితురాలు. చదువుకునే రోజుల్లో హాస్టల్లో ఆమె నా రూమ్ మేట్. చాలా మంచిది. కాని మనసు వికసించని అమాయకురాలు. డిగ్రీ చదువుతుండగా ఓ రోజు సడెన్‌గా అదృశ్యమయింది. ఎవరితోనో లేచి పోయిందనే పుకారు పుట్టింది. అది పుకారు కాదని, తను ప్రేమించిన వాడితో లేచిపోయిందని తర్వాత తెలిసింది. అది నాకు రాసిన ఒక్కే ఒక్క లేఖవల్ల. అప్పటి నుంచి అది నా కంటికి కనిపించలేదు. ఇప్పుడే మళ్ళీ చూస్తున్నాను"

ఆమె గొంతు గద్గదమైంది.

"తన అవసరం తీరిన తర్వాత ఆమె ప్రియుడు మోసం చేసి ఉంటాడు. ఆ తర్వాత ఎప్పుడో, ఎలాగో ఈ వ్యసనానికి బానిస అయినట్టుంది" అన్నాడతను. ఆమె తలవూపింది.

"దయచేసి మళ్ళీ పిచ్చి పిచ్చి పనులు చెయ్యకు తల్లీ" అంటూ ఆమెను భుజం మీదకి ఎత్తుకున్నాడు అభిశాంత్.

"ఈమె పేరేంటి?"

"పవిత్ర" చెప్పింది మేఘన.

"పేరును చెడగొట్టింది కదా?" ఆమెను మోస్తూ కామెంట్ చేసాడు.

"డోంట్ బీ సిల్లీ అభీ"

"నో నో, అయామ్ సీరియస్"

అంబాసిడర్‌ని చేరారు. బాక్ డోర్ తెరిచింది మేఘన. భుజంమీద ఉండి పవిత్ర "హీ... హీ... హీ..." అని నవ్వుతుండేసరికి నిజంగా భయపడ్డాడు అతడు. ఆ వెంటనే ఆమెని వెనుక సీట్లో పడుకోబెట్టాడు.

పవిత్రను సూర్యతేజకి అప్పగించారు వాళ్ళు. ఆమెను పరీక్షించి చెబుతానని చెప్పి వాళ్ళని మర్నాడు రమ్మన్నాడు డాక్టర్ సూర్యతేజ.

* * *

ధర్మం అందించిన పేపర్స్ తిరగేస్తూ వాటిలోని హెడ్‌లైన్స్ చదువుతూ, కామెంట్ చెయ్యసాగాడు సమరశంఖం పత్రికా ఎడిటర్.

"మనిషిని కాటేసిన వెంటనే చచ్చిన విషసర్పం! ఇదేమైనా చీమలా శివుడి దగ్గర నుంచి వరం తీసుకుందా!

ఏమిటి!... పిల్లిని భయపెట్టి పరుగెత్తించిన చిట్టెలుక...! దీనికి అంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది చెప్మా! ఎంతయినా వినాయకుడి వాహనం కదా! తన బాస్ నుంచి వరం కొట్టేసిందేమో!.... విమానం కూలి పోయినా బ్రతికిన

మృత్యుంజయులు...! అదేమయినా సైకిలా, రిక్షాయా... కిందకి దూకేసి పరుగెత్తి ప్రాణాలు కాపాడుకోడానికి! ఎంతయినా కలియుగం కదా! చిత్రాల యుగం!"

ఎడిటర్ తనను ఘోరంగా మెచ్చేసుకోబోతున్నాడని సంతోష పడిపోయాడు ధర్మం. రాబోయే అభినందనల కోసం ఆత్రంగా ఎదురు చూసాడు.

"నీకేమయినా మతిపోయిందా ధర్మం. ఇలాంటి పిచ్చి వార్తలు సేకరించవద్దని నీకెన్నిసార్లు చెప్పాను" ఎడిటర్ మాటలకి తృళ్ళిపడి అతడన్నాడు "ఆఖరి వార్త చూడండి సార్... మీకు నచ్చుతుంది"

చూశాడు ఎడిటర్.

"రోజుకి పదిహేను లీటర్ల పాలిచ్చే తన గోమాత లక్ష్మిని హెలికాప్టర్ అడుగున సేఫ్టీ బెల్టుతో కట్టి గగన విహారం చేయించాడు... ఆ గోవు యజమాని వేపకాయల పిచ్చయ్య! గగన విహారం చేస్తూ ఆనంద పారవశ్యంలో తేలిన గోమాత పేడవేయగా ఆ పేడ తన భవనం ఉద్యానవనంలో విశ్రాంతి తీసుకుంటున్న కోటీశ్వరుడి మొహం మీద పడగా ఆగ్రహావేశాలతో మండిపోయిన ఆ కోటీశ్వరుడు వేపకాయల పిచ్చయ్య మీద పది లక్షలకు పరువు నష్టం దావా వేసిన వైనం!"

ఆ వార్త చదివి శాంతంగా అన్నాడు ఎడిటర్ "ఈ వార్త చదివితే పాఠకులు మన పత్రిక మీద, మన మొహాల మీద కొడతారు పేడ"

"నిజంగా జరిగింది సార్. విదేశీ పత్రికల నుంచి ట్రాన్స్‌లేట్ చేసిన వింత వార్త కాదిది"

"అయినా వద్దు. సంచలన వార్తలు సేకరించమని ఎన్నిసార్లు చెప్పినా వినవు కదా! మన పత్రిక ఆశయమే వేరు. అసలు ఇలాంటి వార్తలు మన పత్రికలో ఎప్పుడూ ప్రచురించం. ఇకముందు ఇలాంటి వార్తలు వదిలేసి...నిత్య జీవితంలో ప్రజలు ఎదుర్కొనే సాధారణ సమస్యల మీద వార్తలు సేకరించి విమర్శనాత్మక వ్యాసాలు రాయి. కనీసం ఆపనయినా చెయ్యి. కనీసం అభిశాంత్‌లా రిస్క్ లేని సాధారణ వార్తలయినా సేకరించు. దేనికయినా స్పిరిట్

వుండాలి. మీ అందరితోపాటు ప్రతి పత్రికలలోని జర్నలిస్టులు అగ్నివేష్ లాంటి నెంబర్ వన్ జర్నలిస్టుని చూసి ఎంతో నేర్చుకోవలసి వుంది"

"అసలు వాడెవడో తెలిస్తే కదా!" అని అతడు అంటూండగానే టెలిఫోన్ గణగణమని మ్రోగింది.

రిసీవర్ ఎత్తి "యస్.. స్పీకింగ్" అన్నాడు ఎడిటర్.

"జర్నలిస్టు అగ్నివేష్ అడ్రస్ కావాలి సార్" ఓ గొంతు గరగరలాడుతూ వినిపించింది. ఆ ఫోన్ చేసినవాడు రాజరాజ నరేంద్రుడి అనుచరుడు.

"నువ్వెప్పుడయినా ముట్నూరి కృష్ణారావుగారి గురించి విన్నావా నాయనా!" ఓపిగ్గా అడిగాడు ఎడిటర్.

"విన్లేదు సార్"

"అలాంటి ప్రముఖుల గురించి తెలుసుకోవాలి నాయనా. ఆయన గాంధీగారి టైమ్‌లో మంచి పేరు ప్రఖ్యాతులున్న సంచలనాత్మక జర్నలిస్టు! ఆయన పేరు చెబితే రాజకీయ నాయకులు సైతం భయపడేవారు. ఆయన అంశతో జన్మించిన జర్నలిస్టు అగ్నివేష్ అనేది నా విశ్వాసం. అగ్నివేష్ పేరు చెబితే రాజకీయ నాయకులు గజగజ వణకడమే కాదు, దేశద్రోహుల గుండెల్లో రైళ్ళు పరుగెడతాయి. మన దేశంలో తిరుగులేని, ఎదురులేని జర్నలిస్టు అతడు. జర్నలిజాన్ని ఓ యజ్ఞంగా భావించే మనిషి. ముట్నూరి కృష్ణారావు గారి ఫేస్ మనందరికీ తెలుసు. కాని జర్నలిస్టు అగ్నివేష్ ఫేసే కాదు, అతడికి సంబంధించిన ఒక్క నిజాయితీ వార్త కూడా ఎవ్వరికీ తెలీదు. కృష్ణారావుగారికి అతడికీ మధ్య వున్న తేడా అదొక్కటే నాయనా!"

"అతడు మీ పత్రికకే ఎక్కువ వార్తలు అందివ్వటానికి కారణం ఏమిటంటారు?"

"నీకు పత్రికల మీద పెద్దగా అవగాహన లేదంటాను"

"నేనతడి అభిమానిని సార్, నా అభినందనలు ఎలా అందజేయాలి?"

"ఉత్తరాల శీర్షిక పేరున మా పత్రికకి పంపించు బాబూ ప్రచురిస్తాం.

ఎక్కడ వున్నా అతడు మా పత్రిక తప్పక చదువుతాడు. మీ అభినందన లేఖలు అందుకుంటాడు"

"అతడి గురించి చిన్న క్లూ అయినా చెప్పండి సార్"

"ఆ.. క్లూ అంటే జ్ఞాపకం వచ్చింది సుమా! అగ్నివేష్‌కి సంబంధించిన ఓ చిన్న క్లూ నాకు తెలుసు"

ఆత్రంగా అడిగాడతడు, మరింత ఆత్రంగా ముందుకి వంగాడు ధర్మం అస్థిపంజరంలా!

"అగ్నివేష్ పేరులో గల మొదటి అక్షరం 'అ'లోనే వుందయ్యా సంచలనం. 'అ' అంటే..." ఎడిటర్ మాటని పూర్తి చేశాడు హెూం మంత్రి అనుచరుడు "అమ్మ!"

"అ, అంటే చిన్నతనంలో అక్షరాలు దిద్దుకునేటప్పుడు అమ్మ అని రాసే వాళ్ళం. ఇప్పుడు లోకమంతా చెప్పుకునేది అ అంటే అమ్మతో పాటు మరోటి వుంది నాయనా! అది అగ్ని! జ్వలించే అగ్నిని చూస్తే కళ్ళు పోతాయ్. ముట్టుకుంటే బుడిద అవుతాం. నేనిచ్చే క్లూ అదే!"

"అగ్నివేష్ అందించే వార్తలకి మీరిచ్చే రెమ్యూనరేషన్ అతడికెలా అందిస్తారు?"

"నువ్వెవరో తెలియకపోయినా ఇప్పటివరకు చాలా గౌరవంగా మాట్లాడాను. రెమ్యూనరేషన్ వివరాలు నీకు సంబంధించినవి కావు. నన్ ఆఫ్ యువర్ బిజినెస్. ఇప్పటికే ఎక్కువగా మాట్లాడాను. ఇక ఫోన్ పెట్టేయ్" ఆఖరి మాట అరిచినట్టుగా చెప్పి ఫోన్ క్రెడిల్ చేశాడు ఎడిటర్. రోజుకి కనీసం పదిమందయినా ఫోన్ చేసి అగ్నివేష్ గురించి అడగటం అతడికి కొత్తేమీ కాదు. కాని హెూం మంత్రి అనుచరుడిలా అడ్డమైన ప్రశ్నలు ఎవరు వెయ్యలేదు.

"మీరు చెబుతుంటే 'అ' మీద నాకు కూడ అభిమానం పెరిగిపోతుంది సార్. అగ్నివేష్‌లాగే నేనూ ఓ సంచలనమైె పేరు పెట్టుకుంటాను సార్" థ్రిల్లింగ్‌గా అన్నాడు ధర్మం.

ఎడిటర్ అన్నాడు "నీ పేరు ముందు 'అ' పెట్టుకో సరిపోతుంది"

బాగా కంగారు పడిపోయాడు ధర్మం "వద్దు సార్, నా పేరు నాకే చాలు"

అదే సమయంలో మళ్ళీ రింగ్ అయింది టెలిఫోన్. ఇందాకటి వాడే మళ్ళీ ఫోన్ చేసి వుంటాడనే అనుమానంతో కోపంగా రిసీవర్ ఎత్తాడు అతడు. "హు ఆర్యూ?"

"అగ్నివేష్"

"ఓ నువ్వా మిస్టర్ అగ్నివేష్. ఏమైనా కొత్త వార్తలున్నాయా!"

"ఆ.. ఎం.ఎల్.ఏ, సదాశివం దొంగసారా బట్టీల చరిత్రలు, పారిశ్రామిక వేత్త పావనరావు తయారు చేస్తున్న కల్తీ మందుల కథలు ఈ రాత్రి తొమ్మిదిన్నర గంటలకి కోఠీ సెంటర్‌కి ఎవరినైనా పంపిస్తే సాక్ష్యాధారాలతో సహా అందిస్తాను"

"ఎవరో ఎందుకు, నేనే వస్తాను. నీకు బాకీ పడ్డ రెమ్యూనరేషన్‌తో సహా. నువ్వంటే నాకు చాలా అభిమానం కాని ఒక విషయంలో మాత్రం నీ మీద నాకు చాలా కోపం వస్తుంది. ప్రొప్రయిటర్స్ నీ కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇవ్వమని చెబుతున్నా నువ్వు తీసుకోనంటావు. అందరు జర్నలిస్టులకీ ఇచ్చేదే ఇమ్మంటావు"

"అవును, వాళ్ళలాగే నేనూ ఓ సాధారణ మనిషిని. వాళ్ళకంటే అధికంగా నాకేమీ రెండు కొమ్ములు లేవు"

"అందుకే నువ్వంటే నాకు అభిమానం"

ఆ వెనుకే ఫోన్ కట్ అయింది.

ఆ రాత్రి సరిగ్గా గం॥ 9:30కి కోఠీ సెంటర్‌లో నడుస్తున్నాడు సమరశంఖం ప్రతికా ఎడిటర్. ఒక జర్నలిస్ట్ కోసం ఎడిటర్ ప్రత్యేకంగా వచ్చాడంటే పత్రికా ప్రపంచంలో అగ్నివేష్‌కున్న ప్రతిష్ట ఎలా పాతుకుపోయిందో ఊహించవచ్చు.

ఒక మలుపు తిరిగి ఆబిడ్స్ రూట్‌లో నడవసాగాడు ఎడిటర్. ఎప్పుడూ ఒకలాకాక రకరకాల పద్ధతుల్లో వివిధ ప్రదేశాల్లో తాను కనిపించకుండానే పత్రికల వాళ్ళను కలుస్తూ వుంటాడు అగ్నివేష్.

పిలుపు వినిపించేసరికి పక్కకి చూశాడు ఎడిటర్.

దీపస్తంభం కింద చీకట్లో నిలుచుని కనిపించాడో మనిషి. నల్ల దుస్తుల్లో వున్న అతడు ఫెల్ట్‌హేట్ ధరించాడు. వెలుగులో వున్న తను కనీసం అతని ఎత్తుని కూడ అంచనా వేయలేకపోతున్నాడు. అతనికి రెండగులు దూరంలో ఆగాడు ఎడిటర్.

ఓ పేకెట్‌ని ఎడిటర్‌కి అందించాడు అతడు. ఎడిటర్ కూడ అతనికి మనీ పేకెట్ ఇచ్చాడు.

“నిన్ను చూడాలనుకుంటున్నాను మిస్టర్ అగ్నివేష్”

“ఎవరైనా సరే నా నీడను మాత్రమే చూడగలరు” కంచులా మోగింది అతడి గొంతు.

“నన్ను కూడ నమ్మవా!”

“క్షమించండి, నా నీడను కూడ నేను నమ్మను”

గుడ్‌బై చెప్పేసి వెనుదిరిగాడు ఎడిటర్. మరో క్షణమాగి కాజువల్‌గా వెనక్కి చూశాడతడు.

దీపస్తంభం కింద అగ్నివేష్ నీడ కూడా లేదు.

* * *

తమ కారులో యాంటీడ్రగ్ సెంటర్‌కి వెడుతుండగా రోడ్డు పక్కగా వున్న ఓ తోపులోంచి కేకలు వినిపించేసరికి సడెన్ బ్రేక్ వేశాడు అభిశాంత్.

కారులోంచి దూకి అటు పరుగెత్తింది మేఘన. ఎండుటాకులు ఆమె కాళ్ళకింది నలిగిపోతూ పెద్ద శబ్దాన్ని సృష్టిస్తున్నాయి.

ఒకచోట ఆగిపోయింది ఆమె.

ఆమెకు నాలుగడుగుల దూరంలో ఓ చెట్టుకింద పడివున్న ఇద్దరు యువతీ యువకులు బాధగా దొర్లుతున్నారు. వాళ్ళ నరాలు పీకేస్తున్నాయి. తమ శరీరంలోని రక్తాన్నంతా ఎవరో తోడేస్తున్నట్టు ఫీలవుతూ పెద్దగా కేకలు పెడు

తున్నారు.. వెలుగుని చూడలేనట్లు కళ్ళు మూసుకుని ముడుచుకుపోతున్నారు. కసిగా నేలను బాదుతూ అరుస్తున్నారు.

వాళ్ళ పరిస్థితిని గ్రహించిన మేఘన ఆ వెంటనే తన వేనిటీ బ్యాగులోంచి మార్ఫీన్ బాటిల్, సిరెంజీ తీసి 0.0015 మోతాదులో వాళ్ళిద్దరికీ మార్ఫిన్ ఇంజెక్ట్ చేసింది.

మరికొన్ని క్షణాలకి తాము చేస్తున్న చేష్టలు ఆపేసి వాళ్ళిద్దరూ గాఢనిద్రలో మునిగిపోయి ఊహాలోకాల్లో తేలిపోసాగారు.

ఆమె వెనుకే వచ్చిన అభిశాంత్ ఆ యువకుడ్ని ఎత్తి భుజంమీద వేసు కున్నాడు. ఆ యువతిని తన భుజం మీద ఎత్తుకుంది మేఘన.

వాళ్ళిద్దరి శరీరాలు కారు బ్యాక్ సీట్లోకి చేరాయి.

అంబాసిడర్ పచ్చని పైరుల మధ్యగా వున్న మట్టి బాటమీద స్మూత్‌గా దూసుకుపోతోంది.

చల్లని సాయంత్రం గాలులు సేదతీర్చేలా వీస్తున్నాయి.

డ్రగ్స్‌కి అలవాటు పడిన వాళ్ళని నయానో భయానో తన వెంట తీసుకు వచ్చి యాంటీ డ్రగ్ సెంటర్‌లో చేర్చటం ఆమె అలవాటు. తన మాట వినని వాళ్ళకి ఇంజెక్ట్ చేసి మరీ తీసుకుపోవడానికి ఆమె తన వద్ద ఓ మార్ఫిన్ బాటిల్‌నీ, సిరెంజ్‌ని ఎప్పుడూ తయారుగా పెట్టుకుంటుంది. అప్పుడప్పుడు ఆమె యాంటీ డ్రగ్ సెంటర్‌లో నర్సులు చేసే సేవను తనకు వీలైనప్పుడల్లా తాను కూడా చేస్తోంది.

రోజుకి ఆరుగంటలు మాత్రమే నిద్రపోతుంది మేఘన. మిగిలిన పద్దెనిమిది గంటలు కష్టపడుతుంది. ఓ వైపు ఇంట్లో తనకు, అభిశాంత్‌కి వంట చేయడం, మరో వైపు డ్రగ్స్‌కు అలవాటుపడిన యువతను యాంటీ డ్రగ్ సెంటర్‌కి తరలించడం, అప్పుడప్పుడు వాళ్ళకి నర్సులా సేవచేయడం, ఇంకోవైపు తన ఆశయం నెరవేర్చుకోడానికి రాజరాజ నరేంద్రుడి మాఫియా వ్యవహారాలను ఎప్పటికప్పుడు జర్నలిస్టులా రహస్యంగా సేకరించడం (ఈ

వార్తల్ని మాత్రం ఆమె పత్రికలకి ఇవ్వదలచుకోలేదు.)

జర్నలిస్ట్‌గా తన పనులు తాను చూసుకుంటూనే అప్పుడప్పుడు ఆమెకు సాయపడుతున్నాడు అభిశాంత్.

“ఈ మత్తుమందుల జాడ్యం దేశాన్ని ఎప్పుడు వదలిపోతుందో ఏమో!” ఆమె పక్కన చేతులు కట్టుకుని కూర్చున్న అభిశాంత్ అన్నాడు.

గేర్ మార్చి, స్టీరింగ్ తిప్పుతూ అందామె ‘‘అంత త్వరగా ఎలా వదులుతుంది. గత నాలుగు శతాబ్దాలుగా జీర్ణించుకుపోయింది కదా!” కారు మలుపు తిరిగి వేగం పుంజుకుంది.

“అంత కాలంగానా!”

“ఏం... వివరాలు వింటావా!”

“చేసేదేముంది, చెప్పు విందాం”

మేఘన చెప్పసాగింది - దృష్టిని డ్రయివింగ్ మీదే లగ్నం చేసి....

“16వ శతాబ్దంలో మొగలుల పరిపాలనలో నల్లమందుని ఎక్కువగా వినియోగించేవారు. ఆ కారణంగా దీని ఉత్పత్తి కూడ ఎక్కువగా ప్రోత్సహించ బడింది. ప్రపంచంలో నల్లమందుని ఎక్కువగా వాడే దేశం చైనా.

ప్రపంచమంతటిలో నల్లమందు ఉత్పత్తిలో భారతదేశానిదే అగ్రస్థానం. పెఫావర్ సోమ్నిఫీరమ్‌అనే గసగసాల చెట్టు కాయల నుంచి నల్లమందు తీస్తారు. సుమారు 500 టన్నుల నల్లమందు ఇక్కడ తయారై 90శాతం ఇతర దేశాలకు ఎగుమతి చెయ్యబడుతోంది. నల్లమందునుంచి కొన్ని ప్రత్యేక రహస్య పద్ధతుల ద్వారా తయారు చేసే చాలా డ్రగ్స్‌లో ముఖ్యమైనవీ కొకైన్, మార్ఫిన్, హెరాయిన్‌లు. ఇవి అతి ప్రమాదకరమైనవి కూడ.

విద్యార్థి లోకాన్ని పిశాచంలా పట్టి పీడిస్తున్న మాదకద్రవ్యం హెరాయిన్! ప్రపంచంలో తయారయ్యే మొత్తం హెరాయిన్‌లో 60 శాతం ఆసియాలోనే దీనిని వినియోగిస్తున్నట్లు సర్వేల వలన తేలింది. మనిషిని మత్తెక్కించడంలో ఇదెంత శక్తివంతమైందో ప్రాణాలు హరించడంలో కూడ అంత వినాశకరమైంది.

అందువల్ల సోవియట్ రష్యావాళ్ళు దీన్ని ఔషధంగా కూడ వాడటం లేదు మలేషియాలో దీనిని జాతీయ శత్రువుగా పరిగణించారు. హెరాయిన్ సరఫరా చెయ్యటం అక్కడ మరణ శిక్షార్హమైన నేరం.

అరబ్ కంట్రీస్ నుంచి 1960 నుంచి 1974 వరకు బంగారం దొంగచాటుగా బొంబాయి తీర ప్రాంతాల నుంచి మనదేశంలోకి ప్రవేశించేది. ఆ బంగారానికి బదులుగా వెండి, ప్రాచీన కళాఖండాల ఎగుమతి జరిగేది! 1980 నుంచి బంగారానికి బదులు వెండి, కళాఖండాలను ఇచ్చే ఆనవాయితీని వదిలేశారు స్మగ్లర్స్. బంగారం విలువను మత్తు మందుల విలువతో లెక్కించారు.

...పాపిఅనే మొక్క నుండి ఓపియమ్‌ని తయారు చేస్తారు. ఈ మొక్కల్ని ప్రభుత్వ పర్యవేక్షణలో రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్‌లలో పెంచుతున్నారు. మనదేశంలోకి దొంగచాటుగా వచ్చే బంగారానికి బదులుగా స్మగ్లర్స్ కోరిక ప్రకారం ఓపియమ్‌ని ఇస్తున్నారు. దిగుమతి అయిన దొంగ బంగారం బొంబాయి లోని ఆభరణాల దుకాణాలకు దిగుమతి చెయ్యబడుతోంది!

డ్రగ్స్ దాడులు మనదేశంలో 1981 నుంచి ప్రారంభమయ్యాయి. 1981లో మొదటి సారిగా నాలుగు కిలోల హెరాయిన్ పట్టుబడింది. 1982లో ఆరు కిలోల బ్రౌన్ షుగర్ పట్టుబడింది. 1988లో 27 నుంచి 30 టన్నుల హెరాయిన్ పట్టుబడింది. పట్టుబడిన డ్రగ్సుపై పాకిస్థాన్ లేక ఆఫ్ఘనిస్తాన్ ముద్రలున్నట్టు తెలిసింది. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దుల్లో ఈ స్మగ్లింగ్ జరుగుతోంది. రాజస్థాన్‌కి బొంబాయి, పంజాబ్‌కి ఢిల్లీ దగ్గర కావడంవల్ల స్మగ్లర్స్‌కి ఈ కేంద్రాలు అనుకూలిస్తున్నాయి. రాజస్థాన్ ఎడారుల్లో రాత్రి సమయాల్లో ఇసుక దిబ్బల్ని చాటు చేసుకునే స్మగ్లర్స్‌కి బర్మర్, జైసల్మేర్ జిల్లాల్లో చాలా అనుకూల వాతావరణం వుందని బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఓ అధికారి వల్ల తెలిసింది. పాకిస్థాన్ బార్డర్ దావులో రాజస్థాన్ వైపున్న సుందర గ్రామంలో 1985 జూలైలో బి.యస్.ఎఫ్. అధిక మొత్తంలో మొదటిసారిగా 329 కిలోల హెరాయిన్ పట్టుకుంది. కేవలం 1985లో పట్టుబడ్డ డ్రగ్స్ విలువ ఏడెనిమిది బిలియన్

డాలర్లు!

15000 మైళ్లకి పైగా వున్న మన భారత దేశం సరిహద్దు ప్రాంతం మాఫియా కార్యకలాపాలకు అనుకూలంగా వుండటం వల్ల మాదక ద్రవ్యాల రవాణాకి ఇది మూల కేంద్రమైంది. మాఫియాని భారతదేశ మాదక ద్రవ్యాల చట్టాలు కూడ ఏమీ చెయ్యలేకపోతున్నాయి. ప్రపంచంలో ఎక్కడికయినా సరే వెళ్ళే సౌకర్యం ఇండియాకి వుండటం వల్ల మాఫియా ఇక్కడ స్థావరం సంపాదించింది"

"చాలా విషయాలు తెలుసుకున్నావే" అన్నాడు

"ఇంకా చాలా వుంది. కాని మనం చేరాల్సిన చోటుకి చేరాం" అంటూ చెట్ల మధ్యగా వున్న బాటమీద కారుని ఒడుపుగా నడుపుతూ అంది మేఘన.

అంబాసిడర్‌ని ఓ బంగ్లా ముందు ఆపిందామె ఆ వెంటనే కారులో వున్న ఆ ఇద్దరు యువతీ యువకుల్ని బంగ్లాలోకి చేర్పించింది.

సూర్యతేజ విజిటింగ్ రూమ్‌లోకి వెళ్ళాడు అభిశాంత్. పేషెంట్లు ఉన్న సెల్స్‌వైపు కదిలింది మేఘన.

ఒక్కో గదిని చూసుకుంటూ వెడుతోంది ఆమె.

కొన్ని గదుల్లో ఉన్న పేషెంట్స్ ఆపరేషన్స్ చేయగా బాగుపడి రెస్టు తీసుకుంటున్నారు వాళ్ళు.

మరికొన్ని గదుల్లో ఉన్న వాళ్ళు ఇప్పుడిప్పుడే ఆపరేషన్స్‌కి మెంటల్‌గా ప్రిపేర్ అవుతున్నవాళ్ళు. చివరగా వున్న గదుల్లో వున్న వాళ్ళు కొత్తగా తను జాయిన్ చేసిన వాళ్ళు.

ఓ గదిలోకి అడుగు పెట్టిందామె.

ఆ గదిలో మంచంమీద కూర్చుని మోకాళ్ళ మీద తల ఆన్చి ఆలోచిస్తున్న లావుగా వున్న పదమూడేళ్ళ కుర్రాడిని గుర్తుపట్టి అతడి తల నిమిరింది మేఘన.

"హౌ ఆర్యూ మైబోయ్"

"ఫైన్ సిస్టర్"

స్కూలు ఎగ్గొట్టి ఓ పార్కులో రహస్యంగా హెరాయిన్ తీసుకోబోతున్న ఆ కుర్రాణ్ణి చూసిన ఆమె అతడి చెంప పగలగొట్టి అక్కడికి తెచ్చి పడేసింది. ప్రారంభంలోనే వున్న అతడికి ఆపరేషన్ అవసరం లేకుండా మంచి మందులు వాడి నయం చేశాడు సూర్యతేజ.

“ఏమిటాలోచిస్తున్నావ్?”

“మా మమ్మీ డాడీలు నా గురించి వెతుక్కుంటూ వుంటారు. ఇప్పుడు కనిపిస్తే ఏం చేస్తారోనని భయంగా వుంది”

“అలాంటి భయాలు వున్నవాడివే అయితే అసలు హెరాయిన్ జోలికే వెళ్ళి వుండేవాడివి కాదు”

ఆ కుర్రాడు తల దించుకున్నాడు. మెల్లగా చెప్పాడు “నా స్నేహితుడు తీసుకుంటుంటే చూశాను. చాలా బావుంటుందని చెప్పి, వాడు నాకో డోస్ ఇచ్చాడు. నాలుగో డోస్ తీసుకునే రోజు మీకు పట్టుబడ్డాను”

అతడి వివరాలన్నీ అడిగి చివరగా ప్రశ్నించింది “మీ స్కూల్లో ఈ అలవాటున్న వాళ్ళు ఎంతమంది వుంటారు”

“కనీసం పన్నెండుమందయినా వుంటారు సిస్టర్”

“వాళ్ళని నువ్వు నాకు పట్టివ్వాలి”

“ఓ... తప్పకుండా!” హుషారుగా అన్నాడా కుర్రాడు.

“వెరీగుడ్... నీకేం భయం లేదు. మీ మమ్మీ డాడీలు నిన్నేమీ అనకుండా వాళ్ళ దగ్గరకి నిన్ను చేర్చే ఏర్పాటు చేస్తాను. బీ హేపీ...” అతడి జుట్టును చెరిపేసింది.

“థాంక్యూ సిస్టర్” ఆ కుర్రాడి కళ్లు మెరిశాయి.

మరికొన్ని గదులు దాటి ఓ గదిలో అడుగు పెట్టిందామె.

ఆ గదిలో బెడ్ మీద ఉన్న పద్దెనిమిదేళ్ళ అమ్మాయికి సిలైన్ బాటిల్ ఎక్కిస్తోందో నర్సు.

“ఆపరేషన్ అంటే నాకు చాలా భయంగా వుంది మేడమ్” తన పక్కన

నిలుచున్న మేఘనతో అందా అమ్మాయి.

"ఏం భయం లేదు. అది చాలా చిన్న ఆపరేషన్. చాలా సులభం. గాయానికి మందు రాయడం ఎంత సులభమో అంత సులభం" ఆమెకి ధైర్యం చెప్పి అక్కడి నుంచి కదిలిందామె.

చివరిగా వున్న గదుల్లోని ఓ గదిలోంచి అరుపులు వినిపించే సరికి అటు కదిలి ఆ గదిలోకి అడుగుపెట్టింది మేఘన.

శవంలా వున్న పాతికేళ్ళ ఓ యువకుడు తనకు సిలైన్ ఎక్కించనివ్వకుండా అరుస్తూ గింజుకుంటున్నాడు. నలుగురు నర్సులు అతడితో కుస్తీ పడుతున్నారు.

ఆమెను చూసిన ఓ నర్సు ఏడుపు మొహం పెట్టేసింది. "చూడండి మేడమ్... సెలైన్ ఎక్కించనివ్వకుండా ఎలా గొడవ చేస్తున్నాడో! వీడ్ని రక్షించాలని మేం చూస్తుంటే మా ప్రాణాలు తోడేస్తున్నాడు"

ఆ నర్సుని వారించి, వాళ్ళని పక్కకి తప్పుకోమని, అతడిని ప్రశ్నించింది మేఘన "నీకేం కావాలి?"

బాధగా అన్నాడతడు. బలం లేక అతడి గొంతు నీరసించిపోయింది "నరాలు పీక్కుపోతున్నాయి మేడమ్... నాకు చచ్చిపోవాలని వుంది. ప్లీజ్ నాకు డ్రగ్ ఇవ్వండి"

అతడి మాటలకి ఆమె గొంతును ఎవరో పట్టి నులిపి వేస్తున్నట్టు ఫీలయింది. అతడి మీద జాలితో ఆమె కనుకొనల్లో నీళ్ళు నిలిచాయి.

"ఈ ఫూల్.. రెండు సిలైన్ బాటిల్స్ పగలగొట్టాడు మేడమ్" ఓ నర్స్ రిపోర్టు చేసింది.

కోపంతో నర్సుమీద అరిచింది మేఘన "డోంట్ టాక్ రబ్బిష్. మాదక ద్రవ్యాల మత్తుకి అలవాటు పడినవాళ్ళు పసిపిల్లలతో సమానం. వాళ్ళని ఎలా అనునయించాలో, ఎలా నచ్చజెప్పాలో, ఎలా ప్రేమించాలో నేర్చుకోండి. వాళ్ళ మీద జాలి, దయ చూపించటం అలవరుచుకోండి. మీకు మంచి జీతాలిచ్చి ఇక్కడ నర్సులుగా పెట్టింది అందుకే"

"సారీ మేడమ్" ఆ నర్సు తల దించుకుంది.

అతడివైపు ప్రేమగా చూస్తూ సౌమ్యంగా అడిగింది మేఘన "నీకు డ్రగ్ కావాలా?"

ఆత్రంగా అరిచాడతడు "కావాలి మేడమ్"

ఆ వెంటనే సిరెంజిలోకి మార్ఫిన్ ఎక్కిస్తూ అందామె "నీ శరీరంలో బలం లేకపోతే ఈ డ్రగ్ నీ ప్రాణాలు తీసేస్తుంది. అందువల్ల నీకు బలం ఇవ్వడానికి సెలైన్ ఇవ్వాలన్నమాట అది ఎక్కిస్తే నువ్వీ డ్రగ్‌ని ఎన్నిసార్లయినా తీసుకోవచ్చు. కనుక ముందు సెలైన్ ఎక్కించి, ఆ తర్వాత ఈ డ్రగ్ ఇస్తాను. సరేనా?"

అతడు బుద్ధిగా తల ఊపాడు.

ఆ వెంటనే స్టాండ్‌కి సిలైన్ బాటిల్ తగిలించి, సూదిని అతడి నరంలోకి గుర్చి, ప్లాస్టర్ వేసింది మేఘన.

సిలైన్ పూర్తిగా అతడి శరీరంలోకి చేరేవరకు అతడికి మార్ఫిన్ వున్న సెరెంజీని చూపిస్తూనే వుంది. అతడు ఆశగా దానివంక చూస్తూనే వున్నాడు.

ఆ తర్వాత అతడికి మార్ఫిన్ ఇంజెక్ట్ చేసింది మేఘన.

కొన్ని క్షణాలకి అతడు మత్తులోకి జారిపోయాడు.

పై అంతస్తులో వున్న సెల్స్‌ని కూడ చూస్తూ తిరిగిందామె. కాని ఆమెకి పవిత్ర.... తన స్నేహితురాలు పవిత్ర కనిపించలేదు. ఆమెని ఆపరేషన్ థియేటర్‌కి మార్చి ఉంటారనుకుని, సూర్యతేజ రూమ్‌లోకి ప్రవేశించింది మేఘన.

అలా వెళుతూ మాట్లాడుకోవచ్చని, వాళ్ళిద్దర్నీ తోటలోకి తీసుకువచ్చాడు అతడు.

* * *

తోటలో చెట్ల మధ్యగా నడుస్తున్నారు వాళ్ళు ముగ్గురూ.

ఆనందగా వీస్తూన్న ఆహ్లాద సమీరం వాళ్ళని పులకరింపజేస్తోంది.

గాలికి ఆమె కురులు మొహంమీద పడి దోబూచులాడుతున్నాయి.

"దావానలంలా, ఓ అంటువ్యాధిలా పాకిపోతున్న ఈ మాదక ద్రవ్యాల మహమ్మారిని చూస్తూంటే... నా ఒళ్ళు జలదరిస్తోంది" అన్నాడు అభిశాంత్.

చేతులు వెనక్కి కట్టుకుని నడుస్తూ సూర్యతేజ చెప్పాడు "తమకున్న బలహీనతల వల్ల ఆత్మవంచనతో, సమస్యల ముసుగులోంచి తప్పించుకోవాలనే తపనతో నవనాగరీకులు మాదకద్రవ్యాల మత్తుకు బానిసలు అవుతున్నారు. వాళ్ళల్లో చాలామంది భవిష్యత్తుని నిరాశాజనకంగా భావించిన భీరువులు, ఎస్కేపిస్టులు, హీనమనస్కులు. మరికొందరు మనసు వికసించని పిల్లలు.... ఎవరినో చూసి ఏదో సాహసం చెయ్యాలని తప్ప అదెంత ప్రాణాంతకమో వారికి తెలీదు. రేపటి ఉత్తమ పౌరులు కావాల్సిన పిల్లలు కూడ ఈ డ్రగ్స్ కారణంగా మొక్కలోనే త్రుంచి వేయబడుతున్నారంటే ఇదెంత శోచనీయం. తమ చావును తామే కొని తెచ్చుకుంటోంది నేటి యువత. అందుకే ప్రాణాలు హరించే ఈ డ్రగ్స్ పట్టణాల్లోను, మహానగరాల్లోను స్వైరవిహారం చేస్తున్నాయి"

"అవును..ముఖ్యంగా ధనికవర్గాల్లో డ్రగ్స్‌కి అలవాటు పడినవాళ్ళ సంఖ్య ఎక్కువ. ప్రతి ఐదారుగురు డ్రగ్స్ వ్యసనపరుల్లో ఒకడు కార్మికవర్గం వాడై వుంటున్నాడు! ఢిల్లీలో రెండు హైస్కూల్స్‌లో 1/2 వంతు, మూడు కాలేజీల్లో 1/3 వంతు, కలకత్తాలో ఓ యూనివర్శిటీలో 1/3 వంతు మంది విద్యార్థులు డ్రగ్స్‌కి అలవాటుపడిన వాళ్ళని ఓ సర్వేలో తేలింది. ఢిల్లీలో ఆటో రిక్షా డ్రైవర్స్‌లో 60-70 శాతం వరకు బ్రౌన్ షుగర్‌కి దాసులు. ఇలాంటి వారికి రోజుకు కనీసం ఒక గ్రాము బ్రౌన్ షుగర్ అవసరమైతుంది. బ్రౌన్ షుగర్ నాసిరకమైతే ఒక గ్రాము 60 రూపాయలు, మేలురకం రూ.200కి దొరకడం కూడ కష్టమే" చెప్పింది మేఘన.

చెట్ల మీదున్న లకుముకి పిట్టలు చెట్ల బెరుడుని తొలుస్తున్నాయి.

పాలపిట్టలు, మైనగోరింకలు, కోకిలలు గాన కచేరీ చేస్తున్నాయి శ్రవణానందకరంగా.

"డ్రగ్స్ వ్యసనం నుంచి యువతకు విముక్తి కలిగించడానికి అనేక చికిత్సా విధానాలున్నాయి. వాటిలో హిప్నాటిజం ఒకటి. హిప్నాటిజం ద్వారా మాదక ద్రవ్యాల వాసన రుచి అంటేనే అసహ్యం కలిగిస్తారు. రష్యాలో ఓ రైల్వే ఆసుపత్రిలో ఈ పద్ధతి ద్వారా చాలామందికిం నయం చేశారు. రోజు రోజుకీ డ్రగ్ మోతాదు తగ్గిస్తూ నయం చేసే పద్ధతి మరొకటి వుంది. కాని దీనికి తట్టుకోలేని వాళ్ళు పిచ్చివాళ్ళయ్యే ప్రమాదం వుంది. మానసిక చికిత్సా విధానం వేరొకటి వుంది. అది దీర్ఘకాల వైద్యమే కాక సక్సస్ కావడానికి అవకాశం తక్కువ. ఎందుకంటే లోకంలో మానసిక దుర్బలులు ఎక్కువ కదా!... శస్త్ర చికిత్సా విధానం అన్నింటికంటే ప్రత్యేకమైనదీ, ప్రమాదం లేనిదీ, తక్కువ సమయంలో నయం చేసేది. అందువల్ల ఆపరేషన్స్ ద్వారానే నేను డ్రగ్స్ వ్యసనపరుల్ని బాగుచేస్తున్నాను"

"ఆపరేషన్ ఎలా చేస్తారు?" ప్రశ్నించింది మేఘన.

మాదకద్రావ్యాల వ్యసనం నుంచి తప్పించడానికి ఆపరేషన్ ఎలా చేసేదీ వివరించసాగాడు న్యూరో సర్జన్ డాక్టర్ సూర్యతేజ.

"మెదడులో వున్న ఫైబర్ల వుంజాన్ని సింగులం అంటారు మనిషిలో అలవాటుకి మార్గం చూపే కేంద్రమే ఈ ఫైబర్ల పుంజం. మొదట మామూలుగా ప్రారంభమైన డ్రగ్స్ అలవాటు చివరికి అవి లేకపోతే బ్రతకలేనంత అధమ స్థితికి చేరుస్తాయి. సింగులంలో కొన్ని ప్రత్యేక ఫైబర్లు తొలగించి మాదక ద్రవ్యాల వ్యసనానికి మూల కేంద్రాన్ని పోగొట్టి తద్వారా ఆ వ్యసనాన్ని పూర్తిగా విడిచిపెట్టేట్టు చికిత్స చేస్తాను. ఈ ఆపరేషన్ విధానాన్ని సింగిలు మొటోమి అంటారు. ఆపరేషన్ చేసిన కొద్ది రోజుల వరకు పేషెంట్‌ని మాదకద్రవ్యాల పరిసరాలకు దూరంగా వుంచాలి. ఆ తర్వాత డ్రగ్స్ పేరు చెబితేనే అసహ్యించుకుంటాడా మనిషి"

అభిశాంత్ అడిగాడు "డ్రగ్స్ ప్రభావం శరీరం మీద ఎలా వుంటుంది"

"గంజాయి, హెరాయిన్, మార్ఫిన్ వంటి డ్రగ్స్ మత్తు పదార్థాలే కాకుండా

మనిషి జీవన ప్రమాణాన్ని తగ్గించే విషపదార్థాల సమ్మేళనం. ఒకసారి వీటి మత్తుకు అలవాటు పడిన వాళ్ళు వీటినుంచి తప్పించుకోవడం కష్టతరం. మాదకద్రవ్యం తీసుకున్న వెంటనే ఉద్వేగాన్ని కల్గించి మస్తిష్కం చురుగ్గా పనిచేసేటట్టు చేస్తుంది. ఉత్సాహాన్ని పెంచి అతిగా మాట్లాడేలా చేస్తుంది. ఈ పరిస్థితిలో హృదయస్పందన రేటు ఎక్కువ అవుతుంది. మరికొంతసేపటికి నిద్రమత్తు కలిగి మస్తిష్కం పూర్తిగా మొద్దుబారి మధ్య నాడీమండలం అణచి వేయబడుతుంది. అలవాటు లేనివారికి తల తిరుగుతున్నట్లు, వికారంగా వున్నట్లు, వామిటింగ్ సెన్సేషన్, వున్నట్టుండి కలత నిద్రలోకి పోవడం జరుగుతుంది. ఆ తరువాత చైతన్యరహితమయిన గాఢనిద్రలోకి జారుకుంటారు. మోతాదు ఎక్కువయితే శరీర అవయవాలన్నీ స్థంభించి, శరీరం చల్లబడి, ముఖం నీలపు రంగును  పొంది పేలవంగా అవుతుంది. రక్త ప్రసారం, నాడీ వేగం, ఉఛ్వాస నిశ్వాసాల వేగాలు తగ్గి గుండె ఆగిపోవడానికి కూడా అవకాశముంది. డ్రగ్స్ మత్తు ఆకలిని పోగొడుతుంది. భ్రమల్లో, ఊహాలోకాల్లో తేలియాడినట్లు అనుభూతి కలుగుతుంది. ఎక్కువ మోతాదుల వల్ల కాలేయం, ఊపిరి తిత్తులు బాగా దెబ్బతింటాయి"

మొహం మీద పడిన కురుల్ని వెనక్కి తోసుకుంటూ ప్రశ్నించిందామె "ఇంతకీ పవిత్ర విషయం చెప్పలేదే!... అది లోపల ఎక్కడా కనిపించలేదేమిటి?"

కొన్ని క్షణాలు ఆగాడతడు. వాళ్ళు బంగ్లా చుట్టూరా వున్న తోటను చుట్టి ముఖద్వారం దగ్గరికి చేరారు. తన వెంట రమ్మని వాళ్ళని మేడమెట్ల మీదుగా పైఅంతస్తుకి తీసుకు వెళ్లసాగాడు సూర్యతేజ.

"బహుశా డ్రగ్స్ కొనుక్కోవడం కోసం నీ స్నేహితురాలు పవిత్ర వ్యభిచారం చేసేది అనుకుంటాను"

చెప్పాడు సూర్యతేజ "ఆమెకి సుఖవ్యాధులు సోకాయి"

ఒక్కోమాట ఆగి ఆగి చెబుతున్నాడు అతడు.

"గంజాయి, హెరాయిన్‌లను ఆమె బాగా తీసుకునేది. పవిత్ర కాలేయం,

ఊపిరితిత్తులు బాగా దెబ్బతిన్నాయి”

అతడు ఒక్కో మాట చెబుతున్న ప్రతిసారి మేఘన తన మనసుకు విద్యుద్ఘాతం తగిలినట్లు చలించిపోతోంది.

“మాదక ద్రవ్యాలు తీసుకున్నవాళ్ళకి నాలుగు దశల్లో మరణం సంభవిస్తుంది. నిస్సత్తువ, నిస్తేజత కలిగించే మొదటి దశ యుఫోరియా. చిరాకు, నిద్రలేమి కలిగించే రెండో దశ పారోనియా. భ్రమలు, తన మనసు ఆధీనంలో లేని స్థితి స్కిజో ఫ్రినియా. నాలుగో దశలో మెదడులో న్యూరో ట్రాన్స్‌మీటర్స్ నాశనం కావటం ద్వారా మెదడు పనిచేసే శక్తిని కోల్పోవడం ద్వారా గుండె కండరాల్ని బలహీన పరుస్తుంది”

“ఇదంతా నాకెందుకు చెబుతున్నావు” అప్పటికే ఏదో అనుమానంతో ప్రశ్నించింది మేఘన.

ఓ గది ముందు ఆగి తాళం తెరుస్తూ అన్నాడతడు “నాలుగో దశలో వున్న పవిత్ర ఎక్కువ మోతాదులో డ్రగ్ తీసుకోవడం వల్ల మధ్య నాడీమండలం అణచివేయబడింది”

కీడు శంకించేసరికి ఆమె వెన్ను జలదరించింది.

“అయామ్ సారీ” అంటూ తలుపులు తోసి, గది మధ్య బెడ్‌మీద శాశ్వత నిద్రలో వున్న పవిత్రను చూపించాడు సూర్యతేజ. “షి ఈజ్ డెడ్”

“నో...” బిగ్గరగా అరిచి, ఒక్కదుటున లోనికి పరుగెత్తి పవిత్ర శవం మీద పడి గుండెలు ద్రవించేలా ఏడ్వసాగింది మేఘన. తన ప్రాణస్నేహితురాలు పోయిందనే బాధ ఆమె మనసును గాయపరచి గుండెల్ని పిండేస్తోంది.

* * *

యాంటీ డ్రగ్ సెంటర్ బంగ్లా వెనుక విశాలమైన మైదానం. చితి మీద వున్న పవిత్రను ఆఖరిసారిగా చూసి ఆమె చితికి నిప్పు పెట్టింది మేఘన.

ఆమె మొహంలో నిర్లిప్తతాభావం చోటు చేసుకుంది.

నిప్పుకి గాలి తోడయ్యేసరికి క్షణంలో అంటుకుని మంట చరచరమని పాకి చితి చుట్టు వ్యాపించింది. జ్వాలలు నాల్కలు చాస్తూ పైకి లేచాయి.

చితికి కాస్త దూరంగా మౌనంగా నిలబడ్డారు మేఘన, అభిశాంత్, సూర్యతేజలు.

చితిమీద శాశ్వత నిద్రలో వున్న ఆమె పెదవుల మీద చెదరని చిరునవ్వు లాస్యం చేస్తోంది.

ఈ పవిత్ర లోకాన్ని విడిచి చిరునవ్వుతో వెళ్ళిపోయిన తన నేస్తం పవిత్రని కడసారిగా చూస్తోంది మేఘన.

వీస్తూన్న ప్రచండ గాలులు ప్రళయాగ్ని జ్వాలలు రేపి పవిత్ర మృతదేహాన్ని అగ్నికి ఆహుతి చేస్తున్నాయి.

ఆ జ్వాలలు చూసి ఆమె హృదయాగ్ని పర్వతం బ్రద్ధలై ఆవేదనాగ్ని కెరటాలు ఎగసి ఆమె మనసు భగ్గున మండుతోంది.

వర్షిస్తున్న ఆమె కళ్ళు అరుణ వర్ణం దాల్చాయి.

గాలి ఎక్కువయ్యే సరికి మంటలు ఆగిపోతుండేసరికి చితి మీద పెట్రోల్ పోశాడు అభిశాంత్.

అగ్నికి ఆజ్యంలా పెట్రోలు తోడయ్యేసరికి మంటలు తిరిగి విజృంభించాయి.

ఆ క్షణంలో మేఘనని చూస్తూంటే ప్రాణాల భైరవి అయిన రుద్రకాళి జ్ఞాపకం వస్తోంది.

ఆ క్షణంలో ఆమెలో చైతన్య స్రవంతి పుట్టుకొచ్చింది. వజ్రసంకల్పంతో ఆమె మనసులో స్థిరంగా అనుకుంది.

'మిస్టర్ రాజరాజ నరేంద్రుడూ!... నీ రాజకీయ రాక్షస ఇంద్రజాల మాయా మహేంద్రజాలాన్ని మించిన మహామాయాజాలాన్ని ఇక ముందు నేను సృష్టిస్తాను. నువ్వు నాకిచ్చిన మాయలాడి అనే బిరుదును సార్థకం చేసుకుని నీ మాఫియా విష సామ్రాజ్యాన్ని అతి త్వరలో పునాదులతో సహా పెకిలిస్తాను. ఇప్పటికే

ఆలస్యమైంది. ఇంకా ఆలస్యమైతే పవిత్రలాంటి ఎందరో అభాగినుల జీవితాలు నువ్వు తయారు చేసే మాదకద్రవ్యాల మత్తులో, చీకటి స్మశానాల్లో చితా భస్మాలుగా మిగులుతాయి. అలా జరగనివ్వను. నువ్వు స్థాపించిన విషవృక్షానికి అంతిమయాత్ర జరిపే రోజు దగ్గరపడింది.

* * *

రెండు రోజులు గడిచాయి.

ఆ రోజు ఉదయం వచ్చిన సమరశంఖం పత్రికలోని ఓ వార్తను చదివి మేఘనకి అందించాడా పత్రికని అభిశాంత్.

'గంజాయి మత్తులో ఆంధ్రా రైతులు'

ఈ నాడు ప్రత్యేకం. కేవలం ఒకే ఒక్క నెలలో ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల్లో ప్రతిరోజు దాడులు నిర్వహించిన రాష్ట్ర, జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్సైజ్ పోలీసు విభాగాలు 75 కోట్లు విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని అక్కడికక్కడే ధ్వంసం చేశాయి. గంజాయి పండించబడే ప్రాంతాలను తమకు తెలియజేసింది ప్రముఖ జర్నలిస్ట్ అగ్నివేష్ అని తెలియచేస్తూ అతడికి తమ అభినందనలు పత్రికాముఖంగా తెలియజేశారు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్.

మిరప పంటతో గంజాయిని పండించిన రైతులు లక్షల మొత్తాలు చేతికందేసరికి ధనాపేక్షతో మిరప పంటను వదిలి, గంజాయిని మారుమూల ప్రాంతాల్లో, కాలి బాటలు సహితం సరిగా లేని దుర్గమ ప్రాంతాల్లో లక్షల ఎకరాల్లో పండిస్తున్నారు. అధికారులు దాడులు చేస్తున్నారు గాని గంజాయిని పండించేవాళ్ళని అరెస్టు చేయడం లేదు. దానికి కారణం గంజాయి పంట సాగు వెనుక డబ్బు, పలుకుబడి వున్న రాజకీయ నాయకుల హస్తాలు వున్నట్లు పలువురు భావిస్తున్నారు. పంటలో కొంత భాగాన్ని వాళ్ళకి సమర్పిస్తూ దాడి జరిగితే వారి అండతో బయటపడి నిర్భయంగా తిరిగి గంజాయిని పండిస్తున్నారు రైతులు. మా ప్రత్యేక విలేఖరి.)

ఆ వార్త చదివి పేలవంగా నవ్వింది మేఘన.

"చూశావా అభి... నీ ద్వారా ఇంత చేసినా రాజకీయ రాబందుల అండ దండలతో గంజాయి పండించే రైతులు ఎలా తప్పించుకున్నారో చూశావా!... ఇంకెలా బాగుపడుతుందీ దేశం.." ఆమె గొంతులో ఆవేదన తొంగిచూస్తోంది.

"డోంట్ వర్రీ... ఆ రాజకీయ నాయకుల చరిత్రలు నా గుప్పెట్లో వున్నాయి. పత్రికాముఖంగా వాళ్ళను రచ్చకీడ్చి, గంజాయి పండించిన రైతులకు అండ దండలు లేకుండా చేస్తాను. దాంతో భవిష్యత్తులో వాళ్ళు గంజాయిని పండించరు" తన ప్లాన్ చెప్పాడు అభిశాంత్.

"దటీజ్ గుడ్ జాబ్" తనో టీకప్పు అతడితో పాటు అందుకుంటూ హుషారుగా అందామె.

"చిన్న పాముల కోరలు దాదాపుగా పీకేసినట్లే... అవి యిక విషం కక్కలేవు. ఇక రాజరాజ నరేంద్రుడి మాటేమిటి?" టీ తాగుతూ అడిగాడతను.

ఖాళీ అయిన టీ కప్పు టీపాయ్ మీద పెడుతూ చెప్పిందామె.

"అది పెద్దపాము కూడ కాదు, తిమింగలం! దాని సంగతి అతి రహస్యంగా నేను కనిపెడుతూనే వున్నాను. బాంబేలోని నగల వ్యాపారస్థులు స్మగ్లర్స్‌కి ఇవ్వటం కోసం రాజరాజ నరేంద్రుడి అనుచరుల నుంచి ఓపియమ్‌ని రహస్యంగా కొనుగోలు చేస్తున్నారు. బాంబే నుంచి అరబ్ కంట్రీస్‌కి ఓపియమ్ చేరుతోంది. పాపి మొక్కల్ని అతడు పెంచే ప్రాంతం కనిపెట్టాను. ఎన్నో రకాల డ్రగ్స్ తయారు చేస్తూ దేశం నలుమూలలకు తన ఉత్పత్తుల్ని రవాణా చేయిస్తున్నాడు హోం మంత్రి అతి రహస్యంగా.

బినామీ పేర్లతో తాను సేద్యం చేయిస్తున్న వందల ఎకరాల్లోని ముడి సరుకు అయిన పాపి మొక్కలు, గంజాయి మొక్కలు పెఫావర్ సోమ్ని ఫీరమ్ మొక్కల్ని తన అనుచరుల ద్వారా తన రహస్య మాదకద్రవ్యాల కర్మాగారానికి చేర్పిస్తున్నాడు అతడు. పట్టణాల్లో 200 రూపాయలు విలువచేసే కిలో గంజాయి 20 నుంచి 50 రూపాయల చొప్పున తన అనుచరుల ద్వారా కొనుగోలు

చేయించేవాడు ఇతర ప్రాంతాల్లోని రైతుల దగ్గర. ఆ రైతుల పంటలన్నీ హుష్‌కాకి అయ్యాయి కనుక ఇక తన పంటల మీదే ఆధారపడాలి అతడు. అతడి రహస్య స్థావరానికి సంబంధించిన కర్మాగారాన్ని పట్టుకోవడానికి రెండుసార్లు ప్రయత్నించి తెలుసుకోలేకపోయాను. ఈసారి తప్పక తెలుసుకుంటాను. ఇలాంటి మాఫియా చక్రవర్తిని చట్టాలు కూడ ఏమీ చెయ్యలేవు. చాపకింద నీరులా ప్రవేశించి అతడి మాఫియా సామ్రాజ్యాన్ని భస్మీపటలం చేస్తాను. అదొక్కటే మార్గం"

* * *

టాపులేని కూలిపోయిన ఓ ఇంట్లో మొండి గోడల మధ్య గుంపుగా గంజాయి దమ్ములు కొట్టి ఊహాలోకాల్లో తేలిపోయిన పదిమంది యువకుల్ని యాంటీ డ్రగ్ సెంటర్‌లో చేర్చి వచ్చేస్తున్న మేఘనకి కోఠీ సెంటర్‌లో యాధృచ్ఛికంగా తారసపడింది ఇందువదన. ఆమెని ఆత్మీయంగా పలకరించింది మేఘన.

"బావున్నారా ఇందువదనా?"

"ఎవరు మీరు?!"

ఆమె ప్రశ్నకి ముందు బిత్తరపోయి, తర్వాత తన మొహం పూర్తిగా మారిపోయిందనే విషయం జ్ఞాపకం వచ్చి ఇందువదనకి తన విషయం, ప్లాస్టిక్ సర్జరీ విషయం చెప్పింది ఆమె.

"ఓ గాడ్! మీరా మేఘన. మీ గురించి నేను, శ్రీలేఖ ఎంతో ఎంక్వయిరీ చేశాము. కాని మిమ్మల్ని కనుక్కోలేకపోయాము"

"శ్రీలేఖ ఎలా వుంది" ఆతృతగా అడిగింది మేఘన.

"మార్ఫిన్ మత్తుకి పూర్తిగా బానిస అయింది. వారం రోజులుగా పగలు కూడ ఇంజెక్షన్ తీసుకుంటోంది. తను తయారు చేసే డ్రగ్స్‌కి తన కూతురే బానిస అయిందని తెలిసిన రాజరాజ నరేంద్రుడు గుండెలు బాదుకుని తన

కూతురు మీద ప్రత్యక్షంగా ఇప్పుడు చూపిస్తున్నాడు తన ప్రేమని. మార్ఫీన్ అలవాటు మానేయమని దానికి ఎంతో నచ్చజెప్పాడు. కాని అది వినడం లేదు. ఆపరేషన్‌కి ఒప్పుకోవటం లేదు. అది నా మాటను కూడా లెక్క చేయడం లేదు. కాదంటే ఏదైనా అఘాయిత్యం చేస్తుందేమో అనే భయంతో నేనేమీ అనటం లేదు. అది ప్రస్తుతం మా యింట్లోనే వుంది"

అప్పటికప్పుడే మేఘన మాట మీద శ్రీలేఖను యాంటీ డ్రగ్ సెంటర్‌కి మేఘన, ఇందువదన చేర్చారు.

రెండు గంటల తర్వాత శ్రీలేఖని స్పృహలోకి రప్పించాడు సూర్యతేజ.

మేఘన జరిగినదంతా శ్రీలేఖకి పూసగుచ్చినట్టు చెప్పింది.

నిద్రలేమి వల్ల మొహాన్ని చికాకుగా పెట్టి "నువ్వు క్షేమంగా వున్నందుకు నాకు చాలా ఆనందంగా వుంది మేఘనా!" అంది శ్రీలేఖ.

"నువ్వు మార్ఫీన్ మత్తులో వున్నందుకు నాకు చాలా బాధగా వుంది లేఖా!" అంది మేఘన.

మొహం మీద పడిన జుట్టుని వెనక్కి తోసుకుని మత్తుగా నవ్వింది శ్రీలేఖ.

"ఎందుకిలా మారావు లేఖా"

"నా తండ్రికి ఓ గుణపాఠం నేర్పాలనుకుంటున్నాను మేఘనా!"

"ఎలా?"

"ఈ డ్రగ్స్ మత్తులో నేను చావడం ద్వారా!"

"నీ చావు నీ తండ్రిలో మార్పు తీసుకొస్తుందనుకుంటున్నావా నీ పిచ్చి గాని, అతడిది రాక్షసజన్మ. ఆ జన్మ అంతం కావడానికి రాక్షస సంహారం జరగాలి. లేదా సర్వ ఆస్తుల్ని కోల్పోయి నీ తండ్రి రోడ్డున పడాలి. మరో మార్గం లేదు. అందుకే చెబుతున్నాను, నువ్వు మారి నీ తండ్రి ఇంజెక్ట్ చేస్తున్న మాఫియా మత్తునుంచి యువతను కాపాడు, వాళ్ళకి సేవ చేయడం ద్వారా"

"అలాగే, నువ్వు చెప్పినట్టే చెస్తాను. ముందు నాకో ఇంజెక్షన్ ఇవ్వు, నరాలు లాగుతున్నాయి"

* * *

ధర్మంగాడు శతకోటి దేవుళ్ళకు భయంకరంగా మొక్కుతున్నాడు.

"ఈశ్వరా...పరమేశ్వరా...విఘ్నేశ్వరా...వెంకటేశ్వరా...లక్ష్మి..పార్వతి... దుర్గా దేవీ... మీ అందరికి ప్రతిదినం అపరభక్తుడిలా పూజలు చేస్తున్నాను. నా పూజలు బెల్లంకొట్టిన రాళ్ళలా మీరు స్వీకరిస్తున్నారు తప్ప నా కోరికలు తీరుస్తున్నారా!.... అభిశాంత్‌ని స్త్రీలోలుడిగా చెయ్యమని వేడుకున్నానే.. కనీసం మందుదాసుగా చెయ్యమని కోరానే.... తద్వారా అతడు నాతో సమానుడయ్యేలా చెయ్యమని వేడుకున్నానే... కాని చేశారా, చెయ్యలేదు. నాకు అన్ని వ్యసనాలూ వుండి అతడికి ఒక్క వ్యసనం కూడ లేకపోయేసరికి నాకు చాలా బాధగా వుంది. కాని నా బాధ మీరు తీర్చరు. ఎందుకు తీరుస్తారు?... బుద్ధి లేక నే చేసిన పూజలన్నీ అందుకుని, సిగ్గు లేక నేను పెట్టిన ఫలహారాలన్నీ బుక్కి విశ్వాస ఘాతకులుగా మారిపోయారు మీరంతా!"

"ఆపండి మీ వ్యర్థ ప్రేలాపనలు" అప్పుడే పూజ గదిలోకి వచ్చిన అమృతం భర్త మీద ఎగిరి పడింది "దేవతల్ని దూషించడం బ్రహ్మహత్యతో సమానం, కళ్ళు పేలిపోతాయ్. మీ కుళ్ళుబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు. మీకు బెయిల్ ఇచ్చి విడిపించిన అభిశాంత్ అన్నయ్య మీద మీకెందుకంత ఈర్ష్యాద్వేషాలు. అతడితో సమానులు కావాలంటే మీకున్న వెధవ వ్యసనాలన్నీ విడిచి పెట్టేస్తే సరిపోతుంది కదా"

"నాకీ ఆలోచనే రాలేదు సుమా!" ఆమె తిట్లు భరించలేక ఇబ్బంది పడిపోతూ అన్నాడు.

"బుద్ధి వక్రంగా వున్నప్పుడు అలాంటి మంచి ఆలోచనలు ఎందుకొస్తాయి"

"అలాంటి మాటల్తో నన్ను చిత్రవధ చెయ్యకే అమృతం. నా బుద్ధి వక్రమే. అది నేనే ఒప్పుకుంటాను. అతణ్ని తిట్టినప్పుడల్లా నాకే చెడు ఎదురైంది తప్ప

అతడికి కాదు. అది నేనూ గమనించాను, నీ మాట ప్రకారం ఈ రోజు నుంచే నేను మారడానికి ప్రయత్నిస్తాను"

"అదే జరిగితే తిరపతి వెంకటేశ్వరస్వామికి మీ తల వెంట్రుకలు సమర్పిస్తాను"

చేతులు పైకెత్తాడు ధర్మం "ఓరి భగవంతుడా!.... భర్తల తల వెంట్రుకలంటే ఈ భార్యలకి ఎంత చులకనైపోయాయి"

అతడి మాటలకి అమృతం తియ్యగా నవ్వేసింది కిల కిలమంటూ.

# మూడవ అధ్యాయం

అభిశాంత్, మేఘనలను తన ఇంటికి భోజనానికి పిలిచాడు డాక్టర్ సూర్యతేజ. వాళ్ళని తన మిత్రులుగా తన నాయనమ్మ నిర్మలకి పరిచయం చేశాడు అతడు. నాయనమ్మకి కూడా ఆమె పేరు చంద్రలేఖ అనే చెప్పాడు.

వాళ్ళని ఆప్యాయంగా పలకరించి, ఆదరాభిమానాలతో చూసింది నిర్మల.

భోజనాలైన తరువాత అన్ని రూములు చూస్తూ అతడి బెడ్ రూంలోకి వెళ్లింది మేఘన. చాలా డీసెంట్‌గా వుందా బెడ్ రూం.

తైలవర్ణ చిత్రాలతో ప్రకృతి దృశ్యాలను చూస్తున్న ఆమె దృష్టి ఓ చోట ఆగిపోయింది.

అక్కడ గోడలోకి చిన్న షోకేస్ ఏర్పాటు చేసి వుంది. ఆ షోకేస్‌లో వేలాడుతూ కనిపించింది పసుపుతాడు.

అతడు చిన్నతనం నుంచీ ప్రేమించే పసుపుతాడు. తన ఆరాధ్య దేవత మేఘన మెడలో కట్టాలనే అభిలాషతో గుండె గదిలాంటి ఆ షోకేస్‌లో భద్రంగా దాచిన అతడి ఆరాధనకి సాక్ష్యంగా నిలిచిన పసుపుతాడు అది!

"ఈ పసుపు తాడేమిటి?"

ఆశ్చర్యంగా ప్రశ్నించింది మేఘన.

నిర్మల నిజం చెప్పబోయే క్షణంలో అక్కడికి వచ్చేశాడు సూర్యతేజ "అబ్బే ఏం లేదు. పసుపు శుభానికి సూచన. పసుపు కొమ్ము కట్టిన తాడు మూడు ముళ్ళ బంధానికి తిరుగులేని సాక్ష్యం. అందుకే పసుపు తాడంటే నాకు చాలా ఇష్టం"

"ఆడవాళ్ళు కోరుకునే పసుపుతాడుని నువ్వు ఇష్టపడుతున్నావంటే చాలా చిత్రంగా వుంది!" అంది మేఘన.

మనసులో అనుకున్నాడతడు "అవును మేఘనా!.. నేను నిజంగా చిత్రమైన మనిషిని, విధి ఆడిన వింత నాటకంలో దురదృష్టాన్ని వరంగా పొందిన విచిత్రమైన మనిషిని"

"పెళ్ళెప్పుడు చేసుకుంటావ్ సూర్యం?"

"నీకు చెప్పకుండా మాత్రం చేసుకోను" నవ్వాడతడు.

మరో గంట వుండి వాళ్ళు వెళ్ళిపోయారు.

* * *

చీకటి పడింది.

సూర్యతేజది విశాలమైన భవంతి.

ఫైర్ ప్లేస్ దగ్గర రాకింగ్ చైర్‌లో ఊగుతూ కూర్చున్నాడు అతడు. కళ్ళు మూసుకుని వెనక్కి వాలినా అతడి మనో నేత్రానికి పసుపు తాడే కనిపిస్తోంది.

ఫైర్ ప్లేస్‌లో ఎగసిపడే అగ్నిలా అతడి మనసు జ్వలిస్తోంది.

"ఏమిటి బాబూ ఈ రోజు అదోలా వున్నావ్"

అప్పుడే అక్కడికొచ్చిన నిర్మల ప్రశ్నించింది.

"ఏమీ లేదు నాయనమ్మా....ఒంట్లో కాస్త నలతగా వుందంతే" కళ్ళు తెరిచి, మొహంలో ఫీలింగ్స్ మార్చేశాడు అతడు.

"నువ్వు అబద్ధం చెప్పావని నీ మొహమే చెబుతోందిరా సూర్యం. ఈ నాయనమ్మ దగ్గర నీకు దాపరికాలేవిట్రా బాబూ...." సౌమ్యంగా అడిగింది నిర్మల.

"క్షమించు నాయనమ్మా, నీకు అబద్ధమే చెప్పాను. నా బాధ మేఘన కోసం"

ఆమె హృదయం ఆవేదనతో, అతడి మీద ప్రేమతో నిండిపోయింది.

"నిన్ను చూస్తుంటే నా గుండె తరుక్కుపోతోందిరా బాబూ...ఏళ్ళ తరబడి ఆమెయందున్న నీ ఆరాధనా భావం నా మనసుని ద్రవింపచేస్తోంది...కాని ఆ దేవుడికి మాత్రం నీ మీద దయ కలగడం లేదు. ఆమెను నీకు చూపించని ఆ దేవుడు పాషాణంగా మారిపోయాడురా తండ్రీ" నిర్మల కళ్ళల్లో నీటిపొరలు కదిలాయి.

"ఆమె కనిపించింది నాయనమ్మా" మెల్లగా అన్నాడు అతడు.

"మేఘన కనిపించిందా!" ఆనందాశ్చర్యాలతో ఆతృతగా ప్రశించిందామె. "మరింకేమిటి సమస్య!"

"అప్పటికే చాలా ఆలస్యమైంది నాయనమ్మా... ఆమెకి పెళ్ళి నిశ్చయ మైంది"

ఓ శీతల పవనం ఆమె మొహాన్ని చెళ్ళున చరిచింది.

కుర్చీలోంచి లేచి ఫైర్ ప్లేస్ దగ్గరికి వెళ్ళి అటువైపు మొహం పెట్టి అన్నాడతడు "నా ఒంటరి బ్రతుకును నా నుదిటి మీదే రాశాడా బ్రహ్మ, బ్రహ్మ రాతను మార్చడం ఎవరికీ సాధ్యం కాదు కదా నాయనమ్మా"

అతడి మాటలకి ఆమె చలించిపోయింది. "నేను మారుస్తాను. ఆ బ్రహ్మరాతను నేను మారుస్తాను. ఆమెకు నీ ఆరాధనని వివరించి ఆమె నిన్ను పెళ్ళి చేసుకోవటానికి అంగీకరించేలా చేసి మీ పెళ్ళి నేను నిశ్చయం చేస్తాను. మేఘన ఎక్కడుంటుందో చెప్పు బాబూ!"

"క్షమించు నాయనమ్మా నా కోసం నువ్వంతటి సాహసం చేస్తావని నాకు తెలుసు. అందుకే మేఘన ఎక్కడుండేదీ నీకు చెప్పను. ఓ పెళ్ళికి విఘ్నం కల్పించి ఓ ప్రేమికుడి మనసు భగ్నం చేసి అతడి హృదయాన్ని సమాధి చేసి ఆ సమాధి మీద పునాది వేసుకునే అమానుషానికి పాల్పడటానికి నేను హృదయం లేని రాక్షసుణ్ణి కాదు నాయనమ్మా... మనిషిని... నేను మనిషిని" అతడి హృదయం ఆక్రోశించింది.

"మరెలా బాబూ" బాధను ఓర్చుకోలేక ఆమె ఏడ్చేసింది.

వెనక్కి తిరిగాడు అతడు. "ఎలా ఏముంది నాయనమ్మా! చెల్లికి పెళ్ళి చేసెయ్యటానికి మంచి సంబంధం చూడమని నాన్నకి ఫోన్ చేసి చెప్తాను. నేనిక వైద్యవృత్తిలో నా జీవితం సాఫీగా గడిపేస్తాను"

"అదంతా నాకు తెలీదు. నీకు కూడా సంబంధాలు చూడమని మీ నాన్నకి లెటర్ రాస్తాను"

"ప్రయోజనం లేదు. నేను పెళ్ళి చేసుకోను నాయనమ్మా"

"ఏం...ఎందుకు...ఎందుకు చేసుకోవురా...?" కాస్త కోపంగా అడిగిందామె.

"ఎందుకంటే...నేనామెను ప్రేమించాను. నాది కేవలం ఆకర్షణే అయితే నువ్వు చెప్పినట్టు వినేవాడిని నాయనమ్మా. కాని నాది ఆకర్షణ కాదు. ప్రేమ... నేనామెను ఆరాధించాను"

"నువ్వెన్నయినా చెప్పుగాని నామాట వినరా సూర్యం" క్షణమాగి చెప్పిందామె. "నువ్వామెను మర్చిపోవాలి"

ఓ అగ్ని కెరటం శతాగ్ని కీలలా అతడి హృదయంలో ఎగిసిపడింది. అతడి గొంతు మార్ధవంగా మారిపోయింది.

"ఏవింటి నాయనమ్మా నువ్వనేది. మర్చిపొమ్మంటావా? ఏమిటి మరిచి పొమ్మంటావ్"

అతడి ఫీలింగ్స్ మారిపోయాయి. అతడి హృదయావేదన గొంతులో మార్ధవంగా ధ్వనిస్తూ మొహంలో ప్రతిబింబించసాగింది.

"కాలి అందెల శబ్దం విన్నప్పుడల్లా ఉలిక్కిపడేవాడిని... మేఘనేమో! అని ఆశగా చూసేవాడిని. ఆశ నిరాశయై నిస్పృహ ఆవరించేది...ఆమె తన కాళ్ళకి వెండి పట్టీలు ధరించేదనే విషయాన్ని మరచి పొమ్మంటావా?...వసంత ఋతువులో కోకిల గానం విన్నప్పుడల్లా నేను పరవశించిపోయేవాడిని. కోకిల గానం అంటే మేఘన చెవి కోసుకునేదన్న నిజాన్ని మరచిపొమ్మంటావా? వర్ష ఋతువులో వర్షంలో తడుస్తూ నీరెండలో మెరిసిన ఇంద్రధనస్సును చూసి పులకరించిపోయేవాడిని. వర్షంలో తడుస్తూ ఇంద్రధనస్సును చూసే అలవాటు

మేఘనకి ఉందనే సత్యాన్ని మరచిపొమ్మంటావా? నేను నిర్మించుకున్న ఆశల సౌధం నా మనసులో చెలరేగిన పెనుతుఫాను తాకిడికి పేకమేడలా కూలిపోయిందనే యధార్థాన్ని గ్రహించినప్పుడు నేననుభవించిన నరకాన్ని మరిచిపొమ్మంటావా? ఏం మరచి పొమ్మంటావ్ నాయనమ్మా...ఏం మరచి పొమ్మంటావ్"

"నీ బాధ నేను చూడలేను బాబూ... అది చూసి భరించడానికా నేనింకా బ్రతికున్నది" బోరున ఏడ్చేసింది నిర్మల.

"నువ్వు అదృష్టవంతురాలివి నాయనమ్మా. ఆవేదన తీరేలా ఏడవటానికి నీ కళ్ళు కన్నీళ్ళు వర్షించగలవు. ఆ కన్నీళ్ళకు కూడ నోచుకోని దురదృష్టవంతుణ్ణి నేను. కరువుతీరా, మనసారా ఏడ్వలేను. నేను దిగమింగే ప్రతి కన్నీటి బొట్టు నా ఆవేదనాగ్ని పర్వతానికి ఆజ్యం పోస్తూ నా హృదయాగ్ని పర్వతాన్ని జ్వలింప జేస్తోంది నాయనమ్మా. అదిక చల్లారదు, జ్వలించి జ్వలించి ఏదో ఒకనాడు బ్రద్ధలై పోతుంది. ఈ జన్మకింతే నాయనమ్మా ఇంతే"

"బాబూ సూర్యం" అంటూ ఒక్క సారిగా అతణ్ణి చుట్టేసి బాధ తీరేలా ఏడ్చేసిందామె "నువ్వేమైపోతావోనని భయంగా వుందిరా తండ్రీ"

"ఏమైపోతాననుకున్నావు నాయనమ్మా చచ్చిపోతాననుకున్నావా?"

ఆ వెంటనే అతడి నోరు నొక్కేసిందామె "ఎప్పుడూ అలాంటి మాట మాట్లాడకు బాబూ"

"చావడానికి నేను పిరికి వాణ్ణి కాదు నాయనమ్మా అలాంటి పని నేనెన్నడు చెయ్యను"

"ఒట్టు వెయ్"

ఒట్టు వేశాడు.

"మేఘన నా భార్య కాకపోయినా నేను బ్రతకగలను నాయనమ్మా. నా మనసును పూర్తిగా వృత్తిధర్మం మీదకి మళ్ళించి ఆనందంగా జీవించడానికి ప్రయత్నిస్తాను"

"ఆ మాట చాలు బాబూ, ఆ ఒక్కమాట చాలు" నిర్మల కళ్ళల్లో ఆనంద బాష్పాలు నిలిచాయి.

* * *

స్టోర్ రూంలో చాలా చెత్త పోగుపడేసరికి, ఆ చెత్తనంతా రోడ్డుమీదకి తరలించి ఆ రూం శుభ్రం చేసింది మేఘన. ఆ శుభ్రం చేయడంతో ఆమెకో బ్రీఫ్ కేస్ కనిపించింది. ఆ బ్రీఫ్‌కేస్ మీద ఇంగ్లీషులో అవినాష్ అనే పేరు కొట్టొచ్చినట్లు కనిపించేసరికి బ్రీఫ్‌కేస్ ఓపెన్ చేసిందామె. అందులో ఒకే ఒక్క డైరీ తప్ప మరేమీ లేవు.

ఆ డైరీ అవినాష్‌దని గ్రహించిన మేఘన గబగబా పేజీలు తిప్పుతూ ముఖ్యమైన ప్రతి అంశాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తూ చదవసాగింది.

ఆ డైరీ పూర్తి చెయ్యటానికి ఆమెకి రెండు గంటలు పట్టింది.

అందులో కొందరు రాజకీయ నాయకుల చరిత్రలు వివరంగా రాసి వున్నాయి. వాళ్ళల్లో ఒక చరిత్ర రాజరాజ నరేంద్రుడిది!

తన కుటుంబం సర్వనాశనం కావడానికి ముఖ్యకారకుడైన కొండప్ప ఎవరో కాదు, అతడు స్వయాన రాజరాజ నరేంద్రుడని ఆ డైరీ వల్ల ఆమెకు తెలిసింది. చాలామంది రాజకీయ నాయకులకు తెలియని అతడి పూర్వ చరిత్రని తెలుసుకున్న అవినాష్ తెలివితేటల్ని అంచనా కట్టలేకపోయిందామె. ఆఖరికి మూడేళ్ళపాటు అతడి దగ్గర ఉద్యోగం చేసిన తాను కూడ ఆ రహస్యాన్ని కనుక్కోలేకపోయింది! పక్కలో వున్న శత్రువునే గుర్తించలేకపోయింది. అసాధ్యుడైన అవినాష్‌కి మనసులోనే జోహార్లు అర్పించకుండా వుండలేక పోయింది ఆమె.

ఇప్పుడు రాజరాజ నరేంద్రుడు తన శత్రువని తెలిసినా తనకతడి మీద పగ, ప్రతీకార వాంఛలు ప్రజ్వరిల్లటం లేదు! తన కుటుంబ నాశనానికి కారకుడైన వాడి మీద కక్ష తీర్చుకోవాలనే కాంక్ష ప్రబలటం లేదు! అవును.

నాది...నా కుటుంబం అనే స్వార్థంకంటే మన సమాజం అనే సమాజ సమస్యను రూపుమాపాలనే దృఢసంకల్పం, ఉన్నతాశయం తనలోని పగను, ప్రతీకార వాంఛను చంపేసింది. అందుకే రాజరాజ నరేంద్రుడి మీద తనకు పగలేదు. మాఫియా రాకెట్‌ను నిర్మూలించడంలో తనకతడు ప్రత్యర్థి అంతే.

స్వార్థంతో కూడుకున్న పగ క్షుద్రమైనది.

సమాజసేవకోసం ధర్మయుద్ధం పవిత్రమైన ఓ ఆశయం.

తను సేకరించిన రాజరాజ నరేంద్రుడి గంజాయి, పాపి పంట పొలాల వివరాలే ఆ డైరీలో కొన్ని పేజీల్లో పొందుపరచబడ్డాయి. అవి చదివి ఆశ్చర్య పోయిందామె. తనను రాజరాజ నరేంద్రుడు గుర్తించేశాడనీ, తనను చంపించే ప్రయత్నాలు చేస్తున్నాడని కూడా అవినాష్ తన డైరీలో రాశాడు.

కనుక ఈ విషయాలేవీ తన మిత్రుడు అభిశాంత్‌తో చెప్పే వీలులేక అతడు ఆ బ్రీఫ్‌కేస్‌లో డైరీపెట్టి ఈ స్టోర్ రూంలోకి చేర్చాడన్న మాట.

అప్పటికే అతడు ప్రమాదంలో వుండి వుంటాడు. ఈ బ్రీఫ్‌కేస్ అభిశాంత్ కంటపడి వుండదు. ఆ తర్వాత నడిరోడ్డుమీద అవినాష్‌ను హత్య చేయించాడన్న మాట రాజరాజ నరేంద్రుడు!

అసలీ శవ రాజకీయాలకి అంతం ఎప్పుడు? తోటిమనిషిని అమానుషంగా చంపే రాక్షస ప్రవృత్తి మనిషిలో ఎప్పుడు నశిస్తుంది? సమాజంలో కుష్టువ్యాధిలా పేరుకుపోయిన ఈ కుత్సిత, కుతంత్ర, కుళ్ళు రాజకీయాలకి అంతం ఎప్పుడు?

మనిషి నేర్చిన విజ్ఞానం క్షద్రమైన రాజకీయాల కాష్టంలో కాలడానికేనా?

ఆమె హృదయం ఆవేదనతో ఆక్రోశిస్తోంది.

ఆ డైరీని అభిశాంత్‌కి చూపించదలచుకోలేదామె.

మాఫియాని నిర్మూలించడంలో తన ప్రాణాలేపోవచ్చు. సమాజసేవకోసం ఒక మంచి పని చేయడంలో తన ప్రాణాలు పోయినా తనకు బాధ లేదు. కాని అభిశాంత్ ప్రాణాన్ని కూడా అపాయంలో పెట్టే అధికారం తనకు లేదు. అందువల్ల తను చేయబోయే సాహసం ఆ ముక్కంటికి కూడా తను

తెలియనివ్వలేదు.

మాఫియా సామ్రాజ్యంలోకి తను చాపకింద నీరులా చొచ్చుకుపోతుంది. ఆ వెంటనే చెయ్యాల్సింది అతి రహస్యంగా చేసుకుపోతుంది తద్వారా మాఫియాకి మహా ప్రస్థానం జరుగుతుంది.

* * *

కాకులు దూరని కారడవిలా, చీమలు దూరని చిట్టడవిలా దుర్గమ ప్రాంతంలో రహస్యంగా వున్న వంద ఎకరాల పొలం అది. గంజాయి పండించే ఆ పొలం అంతా రాజరాజ నరేంద్రుడి స్వంతం. ఇంకా అలాంటివి అతడికి ఐదారు రహస్య ప్రదేశాల్లో వున్నాయి. ఆ పంట పొలాల మీద తన కళ్ళు వేసిన మేఘన గత రెండు వారాలుగా నీడలా అన్వేషిస్తోంది మాఫియా కీలక స్థావరం కోసం.

ఈ రోజు కూడా అలాగే వచ్చి ఆమె పొలానికి వందగజాల దూరంలో వున్న ఓ చెట్లతోపులో ఓ చెట్టు చాటున పొంచి చూడసాగింది.

పదిహేనుమంది రాజరాజ నరేంద్రుడి అనుచరులు గంజాయి పంటను వంద మంది వ్యవసాయ కూలీల చేత దగ్గరుండి కోయించసాగారు. మధ్య మధ్యలో వాళ్ళని గదమాయిస్తూ పని తొందరగా అయ్యేలా చూడసాగారు.

ఆ పొలం పక్కన విశాలమైన మైదానంలో వున్నాయి పదిహేను జెయింట్ సైజ్ లారీలు.

ఒకవైపు పొలంలోని కూలీలు పంట కోస్తుంటే మరో వైపు మైదానంలో వున్న పాతిక మంది మనుషులు కోసిన గంజాయి మొక్కల్ని సంచుల్లోకి ఎక్కించి, కుట్లువేసి ఆ బస్తాలని లారీల్లోకి చేరవెయ్యసాగారు. ఆ పాతికమంది మనుషులు కూడా రాజరాజ నరేంద్రుడి అనుచరులే.

అక్కడ పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి.

"చీకటి పడుతంది. ఇక ఆపండి, పక్కానికి వచ్చిన మిగిలిన పాతిక

ఎకరాల గంజాయిని రెండు రోజుల్లో పూర్తిగా కోసెయ్యాలి" యముడిలా వున్న ఓ పెద్ద శాల్తీ అరచి చెప్పి, ఆ కూలీలందరికీ కూలీ డబ్బులు ఇచ్చేశాడు.

ఈలోగా గంజాయి తాలూకు మిగిలిన బస్తాలన్నీ చివరగా మిగిలిన రెండు లారీలకు ఎత్తబడ్డాయి.

వ్యవసాయ కూలీలు తమ దారిన తాము వెళ్ళిపోయారు.

పంట కోయించిన పదిహేను మంది లారీల డ్రైవింగ్ సీట్స్‌లో కూర్చున్నారు.

బస్తాలు కుట్టిన పాతికమంది లారీకి ఇద్దరు చొప్పున చొప్పున డ్రైవర్స్ పక్కన కూర్చున్నారు.

యముడి శాల్తీ ఓ డ్రైవర్ పక్కకి చేరింది సిగరెట్ వెలిగించి ఆ లారీ ముందు కదిలింది. మిగిలిన లారీలు దాన్ని అనుసరించాయి.

ఆ వెంటనే చెట్లమధ్య వంద గజాల వెనక్కి పరుగెత్తింది మేఘన. ఆమె కోసం అక్కడ సిద్ధంగా వుంది బుల్లెట్.

బుల్లెట్‌నధిరోహించి ఒక్క కిక్‌తో స్టార్ట్ చేసిందామె. మరుక్షణం గేర్ మార్చి ముందుకు దూకించింది.

వరుస తప్పని సైనికుల్లా లైనుగా వెడుతున్న ఆ లారీల్లోని మనుషులకు కనబడకుండా రియర్‌వ్యూ మిర్రర్‌లకి అందకుండా వుండేలా అతి రహస్యంగా వెంటాడుతోందామె.

గతుకుల్లో, ఎగుడు దిగుళ్లలో పడిలేస్తూ మట్టిదారుల్లో, రాళ్ళ మార్గాల్లో అడ్డదోవల వెంబటి నింపాదిగా ప్రయాణిస్తున్నాయా లారీలు.

ఆఖరి దమ్ములాగి, సిగరెట్ పీకను విసిరికొట్టి రిలాక్సింగ్‌గా కూర్చుంది యముడి శాల్తీ.

గంజాయి పుట్టిల్లు మధ్య ఆసియా, చైనీయులు 40 సంవత్సరాల క్రితం నుంచి దీన్ని సేద్యం చేస్తున్నట్టు గ్రంథాలవల్ల తెలుస్తోంది. దీని ఉనికి గ్రీకులకి కూడ తెలుసు. కెన్నబినేషియా కుంటుంబానికి చెందిన కెన్నబిస్ సటీవా

(ఇండికా) అనే మొక్క వివిధ భాగాల నుంచి భంగు, గంజాయి, హషీష్ (చరస్) అనే డ్రగ్స్ లభ్యమౌతాయి. గంజాయి మొక్క 8 నుంచి 16 అడుగుల ఎత్తు వరకు పెరుగుతుంది. ఇది క్రీ॥ పూ॥ 1500లో పశ్చిమ యూరప్‌కు వ్యాపించింది. డిమాండ్ దృష్ట్యా ఇప్పుడిది వైద్య అవసరాల నిమిత్తం ప్రపంచ వ్యాపారానికై చట్టబద్ధంగా అమెరికా, రష్యా, జపాన్, ఆఫ్రికా, నేపాల్, చైనా, ఇటలీ, పోలెండ్, పాకిస్తాన్, ఇండియా దేశాలలో ఎక్కువగా పెంచబడుతూంది. ప్రపంచమంతటిలో మేలు రకానికి చెందిన మొక్క ఇటలీ దేశానిది.

కవోష్ణ, సమశీతోష్ణ, శీతల ప్రదేశాలలో పెరిగే మొక్కల్లో భంగు, గంజాయిల గాఢత్వం ఎక్కువగా వుంటుంది. ఆడమొక్కకున్న ఎండిన పువ్వుల్ని గంజాయి అనీ, ఎండిన ఆకుల్ని మొక్కల్ని భంగు అనీ, మరికొంత భాగాన్ని హషీష్ అని అంటారు.

ప్రపంచం నలుమూలలా పాకిపోయిన మాఫియా విషవృక్షం వేర్ల తాలూకు గాంగ్స్ అతి రహస్యంగా డ్రగ్స్ తయారీకి ముడి పదార్థాలయిన మొక్కలు పెంచుతూనో, కొంటూనో చేసి వాటి నుంచి అనేక రకాల డ్రగ్స్ ఉత్పత్తి చేసి, స్మగ్లింగ్ చేస్తూనే ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మాఫియా నల్లబజారుకి నల్లమనుషుల (దేశద్రోహుల) అండదండలు ఎప్పుడూ వుంటాయి.

గంట తర్వాత ఓ పాడుబడిన విఘ్నేశ్వరాలయం ముందు ఆగాయి ఆ పదిహేను లారీలు.

చాలా పెద్ద ఆలయం అది. శిథిలావస్థలో వున్న ఆ ఆలయం చాలా పురాతనమైనదని చూడగానే తెలుస్తోంది. తలుపులంటూ లేవుగాని ఆలయ స్థంభాలు, గోడలు ఉక్కులా పటిష్టంగా వున్నాయి.

ఆలయ ప్రాంగణం నిర్మానుష్యంగా వుంది.

డ్రైవర్లు లారీలు దిగి సిగరెట్లు వెలిగించుకుని ఆ మంటతోనే నాలుగు కాగడాలు వెలిగించారు. ఆలయ ప్రాంగణంలో రెండు, ఆలయంలో రెండు కాగడాలు ఏర్పాటు చేసారు.

అర్ధచంద్రుడు ఆకాశంలో ప్రకాశిస్తున్నాడు.

బుల్లెట్‌ని దూరంగా ఓ బండ చాటున ఆపి, ఆలయం వెనక్కి చేరుకుంది మేఘన. రాతి చప్టా ఎక్కి, నక్కి నక్కి నడుస్తూ చీకటిగా వున్న ఓ గదిలోకి వెళ్లిందామె. ఆ గది ద్వారంలోంచి పక్క గదిలో ప్రతిష్టించబడిన విఘ్నేశ్వరుడి విగ్రహం పక్క భాగం ఆమెకి చాలా క్లియర్‌గా కనిపిస్తోంది... కాగడా వెలుతురులో.

పెద్ద శాల్తీలా వున్న ఆ యముడు రాక్షసుడిలా ఆ గదిలోకి... గర్భగుడిలోకి ప్రవేశించి విఘ్నేశ్వరుడి ముందు ఆగాడు

కిందకి వాలి వున్న విఘ్నేశ్వరుడి తొండాన్ని మెల్లగా పైకెత్తాడు అతడు. ఆ వెంటనే విఘ్ననాయకుడి పొట్ట రెండు వైపులకి రెండు తలుపుల్లా తెరుచుకుంది. ఆ పొట్టలో వున్న చిన్న చక్రాన్ని గుండ్రంగా తిప్పాడా యముడు. ఆ చక్రం కంప్యూటర్‌కి సిగ్నల్ యిచ్చింది.

ఆ మరుక్షణంలోనే విఘ్నేశ్వరుడి వెనుక వున్న రాతి గోడ పూర్తిగా పక్కగదిలోకి శబ్దం చేస్తూ పోయి రహస్య మార్గాన్ని తెరిచింది.

యముడు బయటికి వెళ్ళిన వెంటనే బస్తాలు మోసుకువస్తున్న మనుషులు రహస్య మార్గంలోకి వెళ్లసాగారు.

నమ్మకస్థులైన తన అనుచరుల చేత మాత్రమే ఈ మొత్తం వ్యవహారాలన్నీ అతి రహస్యంగా జరిపిస్తున్నాడన్నమాట రాజరాజ నరేంద్రుడు. నోరు విప్పడు కదా అని ఆ దేవుణ్ణి కూడ తన పాపకార్యంలో పావులా ఉపయోగించుకుంటున్న అతడి తెలివికి మెచ్చుకోవాలా... కళ్ళుండి చూడలేని ఈ లోకాన్ని విమర్శించాలా!

పాతికమంది మనుషులు రహస్య మార్గంలోకి వెళ్లారు. మరెవరు రావటం లేదు.

అదే అదునుగా భావించిన మేఘన రహస్యమార్గం వైపు కదిలింది.

కిందకి మెట్లు కనిపించాయి. అక్కడంతా దేదీప్యమానంగా వెలుగుతున్న విద్యుద్దీపాలతో పట్టపగలులా వుంది. ఎరుపు, నీలవర్ణపు కాంతులీనుతున్న

విద్యుద్దీపాలతో అదో ప్రపంచంలా వుంది.

నలభై మెట్లు వున్నాయి... అండర్‌గ్రౌండ్‌లోకి ఆ మెట్లు దిగగానే... మలుపులో పొడవుగా వున్న వరండాలాంటి దారి కనిపించింది. ఆ దారిలో బస్తాలు మోసుకు వెడుతున్న మనుషుల వెనక మెల్లగా నడవసాగింది మేఘన. ఆమె చురుకుగా పరిసరాలను ఓకంట కనిపెడుతూనే వుంది.

కొంత దూరం పోయిన తర్వాత మొట్టమొదట వున్న వాడు గోడమీద ఓ మీట నొక్కాడు. పెద్ద ఉక్కు తలుపు సర్రున గోడలోకి తెరుచుకుంది. అంతా లోనికి వెళ్లారు. ఆ వెనుకే మేఘన.

అదో విశాలమైన గోడౌన్‌లా వుంది. వాళ్ళ కళ్ళ పడకుండా ఆమె ఓ స్తంభం చాటుకు తప్పుకుంది.

ఆ గోడౌన్‌లో సగం స్థలాన్ని మెషీన్స్ ఆవరించి వున్నాయి.

పాతిక మంది బస్తాలు దింపి వెళ్ళిపోయారు. పదిహేను లారీల సరుకు అక్కడికి చేరేలోగా తను అండర్‌గ్రౌండ్ మొత్తం చుట్టేసి వచ్చేయాలని నిశ్చయించుకుంది ఆమె.

గ్రీన్ దుస్తుల్లో అక్కడ వున్న పదిమంది మనుషులు హెూం మంత్రి అనుచరులు. గ్రీన్ పాంట్‌ల మీద వైట్ కోటులు ధరించిన నలుగురు సైంటిస్టులు.

బస్తాలు విప్పి వాటిలో వున్న గంజాయి మొక్కల్ని ఓ పెద్ద మెషీన్‌లో వెయ్యసాగారు ఆ పదిమంది మనుషులు. మెషీన్స్ గంజాయిని శుద్ధి చేసి మరో మెషీన్‌లోకి చేరవేస్తున్నాయి. ఆ మెషీన్స్ వాటిని వివిధ భాగాలుగా విడగొట్టి డ్రగ్స్ తయారీకి అనువైన ముడిసరుకుని మూడు మార్గాల్లో స్టీలు తొట్టెల్లోకి చేరుస్తోంది.

ఆ మెషీన్సుని పర్యవేక్షిస్తున్నారు ఆ నలుగురు సైంటిస్టులు.

అప్పుడే ఆ ప్రదేశంలోకి వచ్చిన మరో పదిమంది అనుచరులు ఆ స్టీల్ తొట్టెలలోకి చేరిన ముడిసరుకుని పది పాలిథిన్ సంచుల్లో నింపి... వాటిని

మోసుకు వెళ్ళసాగారు.

అప్పటి వరకు తదేకదీక్షతో చూస్తున్న మేఘన ఆ పదిమందిని అనుసరించింది. వాళ్ళు రెండు మలుపులు తిరిగి, ఓ కారిడార్ దాటి, గోడలలోని రహస్య తలుపు తెరిచి ఓ పెద్ద ఫాక్టరీలోకి ప్రవేశించారు.

చాలా పెద్ద ఫ్యాక్టరీ అది. సువిశాలంగా వుంది. దాని వైశాల్యాన్ని అంచనా కట్టడం కూడ కష్టమే.

తాము తెచ్చిన పాలిథిన్ సంచుల్ని నాలుగడుగుల ఎత్తులో వున్న రోలింగ్ బెల్ట్స్ మీద వదిలి వెనక్కి తిరిగి వెళ్ళిపోయారా పదిమంది.

స్తంభం చాటున నక్కిన మేఘన విభ్రమంగా చూడసాగిందా ఫాక్టరీని.

అక్కడ ఏభై అరవై మంది గ్రీన్ డ్రస్ మనుషులు, పదిమంది వైట్ కోట్ మనుషులు వున్నారు. వాళ్ళ కళ్ళ కింద నుంచి గెడ్డం వరకు వేలాడుతూ తెల్లటి మాస్కులున్నాయి.

పాలిథిన్ సంచుల్లోని ముడిసరుకును ఆకుపచ్చ దుస్తులు ధరించిన మనుషులు ఓ మెషీన్‌లోకి చేరవేస్తున్నారు. ఆ మెషీన్ పువ్వుల్ని ఒక మార్గంలోకి, ఆకుల్ని మరో మార్గంలోకి, మిగిలిన భాగాల్ని మరోవైపు పంపి వివిధ మెషీన్స్‌కి అందజేస్తోంది. ఆ వెంటనే ముడిసరుకులు అనేక ప్రాసెస్‌లు చెయ్యబడుతూ భంగు, గంజాయి, చరస్, మార్జువానాలుగా మారి చిన్న చిన్న ప్లాస్టిక్ పాకింగ్స్‌లో నాలుగు మార్గాల్లో బయట పడుతున్నాయి. వెంట వెంటనే ఆ ప్లాస్టిక్ పేకెట్స్‌ని రోల్‌బెల్ట్స్ మీదకి పంపిస్తున్నారు. ఆ రోల్ బెల్ట్స్ వాటిని వేరే మెషీన్స్‌కి అందిస్తున్నాయి. ఆ మెషీన్స్ దొంగ పేర్ల మీద వున్న పిల్లల ఖాళీ పాలపొడి డబ్బాల్లో ఆ పేకెట్స్‌ని నింపుతూ సీల్స్ వేస్తున్నాయి!...

డబ్బాల్ని పాకేజీ పెట్టెల్లో సర్ది పాకింగ్ చేసి, ట్రేడ్ మార్కులు అతికిస్తున్నారు కొంత మంది యమకింకరులు.

డ్రగ్స్ తయారీలో కలపాల్సిన కెమికల్స్ పాళ్ళని సరి చూస్తూ ఆ పనుల్లో బిజీగా వున్నారా పదిమంది సైంటిస్టులు.

ఆ మెషీన్స్ కూడ పెద్దగా శబ్ధాలు చేయడం లేదు. ఝంఝామారుతంలా సన్నటి శబ్ధాల్ని మాత్రమే సృష్టిస్తున్నాయి.

అత్యాధునికమైన పరికరాలతో మరో ప్రపంచపు మాదకద్రవ్యాల మాయా సామ్రాజ్యాన్ని చూస్తున్న ఆమె దవడ కండరం ఆ వెంటనే బిగుసుకుంది. ఆమె కళ్ళల్లో ఎర్రని జీరలు. పిడికిలి బిగించి స్తంభాన్ని కొట్టి తనను తాను నిగ్రహించుకుందామె.

ముడి సరుకును దింపి ఆ లారీలన్నీ ఎప్పుడో వెళ్ళిపోయి వుంటాయని ఆమె గ్రహించింది.

సమయం రాత్రి పది గంటలైంది. ఆ మాఫియా సామ్రాజ్యం మొత్తాన్ని చూసేవరకూ తను అక్కడి నుంచి కదలకూడదని నిశ్చయించుకుందామె.

మారణాయుధాలతో ఆ సామ్రాజ్యానికి కాపలాగా ఒక్క మనిషి కూడ లేకపోవడం ఆమెకి ఆశ్చర్యాన్ని కలిగించింది. బహుశా రాజరాజ నరేంద్రుడికి తన రహస్య సామ్రాజ్యంలోకి ఎవ్వరు ప్రవేశించలేరన్న ధీమా కావచ్చు.

కాని తర్వాత గుర్తించిందామె, ఆ అండర్‌గ్రౌండ్‌లో ఉన్న ప్రతి ఒక్కడి దగ్గర రివాల్వర్స్, పిస్టల్స్ వున్న విషయం.

ఒకవైపు కార్మికుల్లా మారణాయుధాలకి మించిన మాదక ద్రవ్యాలు ఉత్పత్తి చేస్తూనే అవసరం అయితే కిరాతకులుగా మారి ఘోరహత్యలు చెయ్యగల ఆ యమకింకరుల్ని చూసేసరికి ఇక ఆ సామ్రాజ్యానికి కాపలా అవసరం లేదనుకుందామె.

మరో గంటకల్లా ఎవరి కంటా పడకుండా ఆ మొత్తం సామ్రాజ్యాన్ని... రాబందుల రాజ్యాన్ని చుట్టేసింది మేఘన.

మొత్తం పది పన్నెండు రకాల డ్రగ్స్ ఉత్పత్తి అక్కడ జరిగి చిన్న పిల్లల పాలడబ్బాల రూపంలో, చాక్‌లెట్ బాక్సుల్లా, బిస్కెట్ పేకెట్‌ల ముసుగులో బయటికి పోయి దేశం నలుమూలలకి పంపిణీ చేయబడుతున్నాయని గ్రహించిందామె.

యమకింకరులు దుస్తులు మార్చుకునే రూమ్‌లు, పిస్టల్స్, హేండ్ గ్రైనేడ్స్, టైం బాంబ్స్ లాంటి మారణాయుధాలు వున్న గది, రాజరాజ నరేంద్రుడి స్పెషల్ రూమ్స్ అన్నీ చూసిందామె. ఆ మాఫియా రాకెట్ ప్లాన్ అంతా తన మదిలో పొందు పరుచుకుంది మేఘన.

ఆమె తిరిగి వచ్చేస్తూండగా భుజాల మీద పాకేజీ పెట్టెలు మోస్తున్న ఇరవై మంది యమకింకరులు ఆమెకి ఎదురయ్యారు. వాళ్ళామెను చూస్తే కొంప మునిగిపోయేది.

అలాంటి పరిస్థితి ఎదురవ్వకుండా మెరుపులా మలుపులోకి దూకేసిందామె.

వాళ్ళంతా మరో మలుపులోకి పోయాక వాళ్ళ వెనుకే వెళ్ళి అండర్‌గ్రౌండ్ మెట్ల మీదుగా పైకి చేరి విఘ్నేశ్వరుడి గది పక్కనున్న చీకటి గదిలోకి, అక్కడి నుంచి ముందువైపు వున్న చిన్న గదిలోకి చేరింది.

అక్కడున్న గబ్బుకంపు ముక్కుపుటాల్ని అదరగొడుతోంది. కాళ్ళకి పిచ్చిమొక్కలు తగులుతున్నాయి.

పురుగు పుట్రా వుంటాయనే భయంకూడ లేదామెకు. అన్ని భయాల్ని ఎప్పుడో గాలికి వదిలేసింది.

జేబురుమాలుతో ముక్కు మూసుకుని అక్కడున్న కిటికీలోంచి బయటికి చూసింది మేఘన.

తాము తెచ్చిన పాకేజీ పెట్టెల్ని రెండు లారీల్లోకి లోడ్ చేస్తున్నారు ఆ యమకింకరులు.

ఆ లారీల్లోని డ్రగ్స్ ఎక్కడికో రవాణా చెయ్యబోతున్నారని గ్రహించిందామె.

లోడింగ్ పూర్తయి ఆ రెండు లారీలు అక్కడి నుంచి కదిలాయి.

ఒంటినిండా చెమట్లు పట్టినా సరే ఆ చీకటి గదిలో అలా ఒంటరిగా నిలబడిపోయిందామె. బయట ఎవ్వరూ లేరని గ్రహించిన తర్వాత ఆమె అక్కడి నుంచి కదిలింది.

ఆ కదలడంలో ఆమె పాదం కుళ్ళుపొడగా పిలవబడే చుట్టలు చుట్టుకుని

వున్న పొడపాము మీద పడింది.

అయినా ఆమె ఏమీ గుర్తించే స్థితిలో లేదు. ఆ క్షణంలో ఆమె ఆలోచనలన్నీ మాఫియా చుట్టూరా తిరుగుతున్నాయి. ప్రాణాంతకమైన మాదకద్రవ్యాలు తయారుచేస్తూ, మారణహోమాలు సృష్టించి, ఎందరో తల్లుల్ని కడుపుకోతకు గురిచేసి, గుండెల్ని రగిల్చే మాఫియా రాబందుల రాజ్యాన్ని అంతం చేయడం గురించి తీవ్రంగా ఆలోచిస్తోందామె.

ఆమె ఆలోచన ఆ క్షణంలో స్పర్శ జ్ఞానాన్ని విస్మరించేటట్టు చేసింది.

'కుళ్ళుపొడ' కాటువేస్తే అది కాటువేసిన భాగమంతా వాచిపోయి కుళ్ళిపోతుంది. వెరీ డేంజరస్!

చిత్రం ఏమిటంటే కుళ్ళుపొడ మహాబద్ధకిస్ట్! మనిషి అతి చేరువలో వున్నా సరే కాటు వేయటానికి దానికి మహా బద్ధకం. అంత బద్ధకంగల పాము మరే జాతిలోను వుండదేమో!

దాని శరీరం కూడ దానికి తగ్గట్టు బలంగా వుంటుంది. మూడ్ బాగోపోతే చెప్పలేంగాని ఎవరయినా తన తోక తొక్కి వెళ్లిపోయినా పట్టించుకోదు కుళ్లుపొడ.

అందువల్ల ఆక్షణంలో ప్రమాదాన్ని దాటేసింది ఆమె.

మేఘన బుల్లెట్ని అధిరోహించేసరికి అర్థరాత్రి కావస్తూంది.

* * *

"శ్రీలేఖకి ఇప్పుడెలా వుంది ఇందూ?" ప్రశ్నించాడు యజ్ఞనారాయణ.

"ఎలా ఉండడమేమిటి డాడీ! ఇప్పుడు దాన్ని చూస్తే నువ్వెంతో ఆశ్చర్యపోతావు. ఆపరేషన్ అయిన దగ్గరనుంచి మార్ఫిన్ పేరు చెబితేనే మండిపడుతోంది. పూర్తిగా కోలుకుంది. ఇప్పుడు యాంటీ డ్రగ్ సెంటర్లో నర్సుల మీద ఆజమాయిషీ చేస్తూ డ్రగ్స్ బానిసల్ని భయపెట్టి మరీ సేవలు చేసేస్తోంది" సంతోషంగా చెప్పింది ఇందువదన.

"గుడ్.... శ్రీలేఖ మారింది. అంతే చాలు"

"మధ్య మధ్యలో నేను కూడ అక్కడ అటెండయి సంఘసేవ చేసేస్తున్నాను డేడి"

"తప్పకుండా చెయ్యి"

"నాకు అర్థం కానిది ఒక్కటే డాడీ. ఇన్ని చట్టాలు వుండికూడ డ్రగ్స్ స్మగ్లర్స్‌ని ఏమీ చెయ్యలేకపోయిన్నాయి"

"అవునమ్మా, ఎన్ని చట్టాలున్నా ఏం ప్రయోజనం లేకపోతోంది. దానికి కారణం ఒక్కటే, అది రాజకీయం. 1985లో మాదకద్రవ్యాల చట్టాన్ని సవరించారు. దాని ప్రకారం మొదటిసారి పట్టుబడ్డ డ్రగ్స్ స్మగ్లర్స్‌కి 10 నుంచి 20 సంవత్సరాల జైలుశిక్ష గాని రెండు లక్షల జరిమానా గాని విధించాలి. డ్రగ్స్ వర్తకులుగా అనుమానం వస్తే ఓ సంవత్సరం వరకు జైలులో వుంచవచ్చుననే ప్రివెంటివ్ డిటెన్షన్ అనే కొత్త చట్టం వచ్చింది. ఎన్ని చట్టాలు వచ్చినా మాఫియా గాంగ్ లీడర్స్ పట్టుబడరు. చిల్లర వర్తకులే నేరస్తులుగా పట్టుబడతారు. శిక్షించబడుతున్న వాళ్ళు అసలు నేరస్థులు కాదు. సిసలయిన నేరస్తులు.. కీర్తి కనకాలు, పలుకుబడి గల పెద్ద మనుషులు. వాళ్ళు చట్టం పరిధిలోకి రారు"

* * *

సూర్యతేజకి బిల్ చెల్లించి, తనకే కొరుకుడు పడని తన కొడుకుకి ఆపరేషన్ చేసి డ్రగ్స్ నుంచి విముక్తుణ్ణి చేసినందుకు అతడికి కృతజ్ఞతలు చెప్పాడా కోటీశ్వరుడు.

"కృతజ్ఞతలు నాకు కాదు. ఆమెకి చెప్పండి. ఈ యాంటీ డ్రగ్ సెంటర్ స్థాపనకర్త ఆమె" అప్పుడే గుమ్మంలో ప్రత్యక్షమయిన మేఘనని చూపించాడు సూర్యతేజ.

"నాకు కాదు, అతడికే చెప్పండి. వైద్యం చేసిన వాడు, ప్రాణాల్ని రక్షించిన

వాడు దేవుడితో సమానం" సూర్యతేజనే చూపించింది మేఘన.

"వాళ్ళిద్దరికీ కాదు. ఆ కృతజ్ఞతలేవో నాకు చెప్పండి. నేను వాదించకుండా నవ్వుతూ స్వీకరిస్తాను" అన్నాడు అభిశాంత్.

వాళ్ళు ముగ్గురూ నవ్వేశారు. ఆ ముగ్గురికీ కృతజ్ఞతలు చెప్పి కోటీశ్వరుడు వెళ్ళిపోయాడు.

ఓ నర్సు ఆ గదిలోకి ఇద్దరు యువతీ యువకుల్ని వెంటబెట్టుకుని వచ్చింది. చెట్లతోపులో డ్రగ్స్‌కోసం అరుస్తూ దొర్లిన యువతీ యువకులే వాళ్ళిద్దరూ.

"వీళ్ళిద్దరూ పూర్తిగా మారారు డాక్టర్. డ్రగ్స్ అంటేనే అసహ్యించు కుంటున్నారు" చెప్పిందా నర్స్.

వాళ్ళు డ్రగ్స్ తీసుకున్న కారణం అడిగింది మేఘన.

"మా తల్లిదండ్రులు మా ప్రేమను అంగీకరించ లేదు"

"దాంతో పారిపోయి వచ్చి డ్రగ్స్‌కి బానిసలయ్యారన్న మాట" పూర్తిచేశాడు అభిశాంత్.

వాళ్ళు తలలూపారు.

"మీరిప్పుడేం చేస్తారు?" మేఘన ప్రశ్నించింది.

"ధైర్యంగా పెళ్ళి చేసుకుంటాం" ఇద్దరు ఒకేసారి అన్నారు.

"వెరీగుడ్.. .మీరిక వెళ్ళొచ్చు"

వాళ్ళు వెళ్లిపోయారు.

డ్రగ్స్ బానిసలకి శ్రీలేఖ సేవ ఎలా చేస్తోందో చూద్దామని అక్కడి నుంచి కదిలింది మేఘన.

* * *

ఏడుపు మొహం పెట్టేసిందా నర్స్ "మేడమ్... రూమ్ నెంబర్ 43లో పేషెంట్ మందు తాగమంటే వినకుండా నన్ను ఏడ్పించేస్తున్నాడు మేడమ్"

ఆమె రిపోర్టు విన్న వెంటనే "ముందు నువ్వు ఏడుపు ఆపు" గదమాయించింది శ్రీలేఖ.

ఏడ్వటం మానేసిందా నర్సు... అదిరిపడి.

"నవ్వు" ఆమె గర్జింపుకి ఏడవబోయి గభాలున బలవంతపు నవ్వు నవ్వేసిందా నర్స్.

"పద"

ఆ వెంటనే వాళ్ళిద్దరూ రూమ్ నెంబర్ 43లోకి ప్రవేశించారు.

"ఏమిటీ.. మందు తాగనన్నావట" బెడ్ మీద స్కెలిటెన్‌లా పడుకున్న పేషెంటుని ప్రశ్నించింది శ్రీలేఖ.

ఆమెను చూసేసరికే పై ప్రాణాలు పైనే పోయాయా పేషెంటుకి. గంజాయికి అలవాటు పడిన ఆ యువకుడు మొదటి దశలోనే వున్నాడు. "నేనలా అనలేదు మేడమ్"

"వాడి మాటలు నమ్మకండి మేడమ్. అబద్ధం ఆడుతున్నాడు" అంటూ కయ్యిమందా నర్స్. "ఏయ్! నువ్వు ఇందాక మందు తాగననలేదూ!"

"నేనెప్పుడన్నాను!" కీచుగా అన్నాడు పేషెంట్, కంగారుపడిపోయి.

"మందివ్వు, ఎలా తాగడో చూస్తాను" అంది శ్రీలేఖ. ఆమె ఎదురుగా అతడికి మందుగ్లాసు అందించిందా నర్స్.

ఆ వెంటనే కషాయంలా వున్న ఆ మందుని క్షణాల్లో గడగడా తాగేశాడు ఆ పేషెంట్!

మరో నర్స్ పరుగెత్తుకొచ్చింది. "రూమ్ నెంబర్ 36లో పేషెంట్ డ్రగ్స్ కావాలని గొడవ చేస్తోంది మేడమ్"

ఆ రూమ్‌లోకి ఆమె వెళ్ళేసరికి అప్పటి వరకు మంచం మీద కూర్చుని బెడ్ విరిగిపోయేలా రంకెలు వేస్తోన్న లావుపాటి శాల్తీ శ్రీలేఖను చూసేసరికి అదిరిపడి వెనక్కి వాలి పడుకుంది. ఆమె వయసు ముప్పయ్యేళ్ళు!

ఇంకా లావుగా వుండేదా శాల్తీ. డ్రగ్స్ మత్తులో సగానికి సగం

చిక్కిపోయింది.

"ఏమిటి సంగతి" అడిగింది శ్రీలేఖ. "చిందులు తొక్కుతున్నావ్!"

"డ్రగ్ అడిగావట"

"ఊహూ.... అడగలేదు.!" భయంగా అందామె శ్రీలేఖను పులిని చూసినట్టు చూస్తూ.

మాట మార్చేసి ప్రేమగా అడిగింది శ్రీలేఖ. "డ్రగ్ కావాలా?"

ఆశగా చూసిందా శాల్తీ. "హెరాయిన్ అయితే బాగుంటుందేమో!"

"గంజాయి అయితే?"

"అదయినా అద్భుతమే"

"చంపుతాను" అని శ్రీలేఖ అనేసరికి హుషారంతా ఎగిరిపోయి నిలువు గుడ్లేసుకుని భయంగా చూడసాగిందా శాల్తీ.

"తోలు వలుస్తాను, జాగ్రత్త. పిచ్చి ఊహల్లో తేలడం మానేసి భూమ్మీద నడవడం నేర్చుకో, నీకు రేపే ఆపరేషన్"

వణుకుతూ బుద్ధిగా తలవూపిందా గున్న ఏనుగు.

ఆమె ఇచ్చిన మాత్రలు వెంటనే మింగేసింది.

ఇదంతా గమనించిన మేఘన ఆశ్చర్యపోయి శ్రీలేఖ బయటకి వచ్చిన తర్వాత అంది. "నేను నయాన నచ్చ చెప్పి వాళ్ళు నా మాట వినేలా చేసేదాన్ని. నువ్వు భయాన హడలగొట్టి నీ మాట వినేలా చేస్తున్నావన్నమాట"

శ్రీలేఖ నవ్వింది. "నయాన నచ్చ చెప్పడం మనకి చాతకాదు మేడమ్ గారు. అదో పెద్ద న్యూసెన్స్. మనకి చాతనయిన విద్యే ప్రదర్శిస్తున్నాను. శ్రీలేఖ గొంతు వింటే ఈ వార్డుల్లో ఎవరైనా సరే గడగడలాడాల్సిందే"

"కొంచెం సౌమ్య స్వభావం కూడ చూపించు లేఖ"

"డోంట్ వర్రీ. మరీ వీక్ పేషెంట్ల దగ్గర సౌమ్య స్వభావమే చూపిస్తున్నాను"

* * *

మేఘన ఎక్కడుందో అంతుబట్టకుండా పోయిందనీ, అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయి వుంటుందనీ స్వంత ఐడియాలు కక్కిన తన అనుచరుల్ని ఘోరంగా తిట్టాడు రాజరాజ నరేంద్రుడు. జర్నలిస్ట్ అగ్నివేష్ ఎవరనేది తెలుసుకోలేక పోయినందుకు కూడ వాళ్ళని నిందించాడు.

అదే సమయంలో గూర్ఖా వచ్చి ఎవరో ఇచ్చి మీకిమ్మని చెప్పి వెళ్ళిపోయారని చెప్పి, ఓ పేకెట్‌ని హెూం మంత్రికి ఇచ్చాడు.

ఆ పేకెట్ విప్పితే టేప్ కేసెట్ బయటపడింది. అది విన్నాడు.

మహంకాళిని చంపించే ప్రయత్నంలో తన ప్లానింగ్ జోగారావ్ బృందంతో చెప్పడం, తను స్వగతంగా అనుకున్న మాటలు ఆ కేసెట్‌లో టేప్ చెయ్యబడ్డాయి.

ఆ క్షణంలోనే టెలిఫోన్ గణగణ మొగింది. రిసీవర్ ఎత్తాడు అతడు.

"నమస్తే హెూం మంత్రి సాబ్! ఆ కేసెట్ పంపింది నేను. ఆ రోజు మీరంతా మహంకాళిని చంపించే ప్లానింగ్‌లో వున్నప్పుడు వెనకవైపు వరండా కిటికీలోంచి టేప్ చేశా. అంతకంటే బలమైన సాక్ష్యాలు నా దగ్గరున్నాయి. ఓ పాతిక లక్షలు నా మొహాన కొడితే వాటిని పువ్వుల్లో పెట్టి మీ చేతుల్లో పెడతా!" చెప్పాడా అజ్ఞాత వ్యక్తి.

"బ్లాక్ మెయిలింగ్" అరిచాడు హెూం మంత్రి.

"బ్లాకో, వైటో…నాకు డబ్బు కావాలి"

"నా సంగతి తెలుసా?"

"తెలుసు. అందుకే నా జాగ్రత్తల్లో నేనుండి పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి మాట్లాడుతున్నాను"

"నీ సాక్ష్యాలు కోర్టు వరకు వెళ్ళవు. వెళ్ళినా ఎందుకూ పనికిరావు"

"తెలుసు. అందుకే వాటిని పత్రికలకి ఇస్తా. వాళ్ళకి అవి బాగా పనికొస్తాయి."

ఆలోచించి చెబుతాననీ, సాయంత్రం ఫోన్ చెయ్యమనీ చెప్పి, పది నిముషాలు ఆలోచించాడు రాజరాజ నరేంద్రుడు. మెరుపులా ఐడియా తట్టింది.

ఆ వెంటనే జోగారావ్ బృందం మీద ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్స్‌ని నిఘా ఏర్పాటు చేశాడు.

ఆ సాయంత్రం వచ్చిన అజ్ఞాత వ్యక్తి ఫోన్‌కి జవాబుగా పాతిక లక్షలు ఇస్తానన్నాడు. స్పాట్ ఎప్పుడో, ఎక్కడో వివరించాడు బ్లాక్ మెయిలర్.

మరో పది నిముషాలకి ఓ ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ నుంచి ఫోన్ వచ్చింది. బ్లాక్ మెయిలర్, అజ్ఞాత వ్యక్తి జోగారావేనని తెలిసింది!

"నీకు స్పాట్ నేను పెడతాను జోగారావ్... నీకు స్పాట్‌లో పెట్టేది పాతిక లక్షలు కాదు. చితికి నిప్పు అత్యాశకు పోయి నన్నే బ్లాక్‌మెయిల్ చేస్తావురా బాస్టర్డ్" కసిగా పళ్ళుకొరికాడు రాజరాజ నరేంద్రుడు.

* * *

మహంకాళిని చంపే ప్లానింగ్‌లో వున్నప్పుడు ముందుచూపుతో తమ మాటల్ని టేప్ చేశాడు జోగారావ్. తరువాత తన బృందాన్ని పంపేసి తాను మాత్రం ఆగిపోయి హెూం మంత్రి మాటల్ని టేప్ చేసాడు. అప్పుడే పుట్టిందతనిలో బ్లాక్ మెయిలింగ్ ఆలోచన.

ధన వ్యామోహం తలకెక్కేసరికి ఇప్పుడు పెట్టాడు బేరం పాతిక లక్షలకి.

హెూం మంత్రికి ఫోన్ చేసి పబ్లిక్ టెలిఫోన్ బూత్‌లోంచి అతడు బయటికి వచ్చే సమయానికి ఎదురయిన మేఘన జోగారావ్‌ని గుర్తుపట్టి, ఎవరో తెలియనట్లు నటిస్తూ "టైం ప్లీజ్" అంది.

"ఫైవ్ పార్టీ" చెప్పి, తన దారిన తాను వెళ్లిపోయాడు జోగారావ్.

* * *

"ఎప్పుడూ మందుకి పిలిచేవాడు, ఈ రోజు కాఫీకి పిలిచాడేమిటా! అని ఆశ్చర్యపోయాను" ఓ హెూటల్‌లో ధర్మం ఎదురుగా కూర్చుని కాఫీ తాగుతున్న అభిశాంత్ అన్నాడు.

"నేను పూర్తిగా మారిపోయాను గురూ... నిజం చెప్పాలంటే నన్ను మార్చింది నా పెళ్ళామేనని చెప్పాలి. మందు, గిందు అన్నీ వదిలేసాను. ఇంతకీ నీకో విషయం తెలుసా?"

"ఏమిటది?"

"ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్ అగ్నివేష్ ఎవరో నీకు తెలుసా?"

"తెలీదే..."

"నాకు తెలుసు"

"ఎవరతను?"

"నేనే..." గర్వంగా కాలర్ ఎగరరేసాడు ధర్మం. "నువ్వు నా మిత్రుడివి కాబట్టి నీకు చెబుతున్నానీ రహస్యం"

"నువ్వేనా?"

"అవును. నేనే!" గొప్పగా ఓ పోజుపెట్టాడు ధర్మం... ఆ పక్క టేబుల్ దగ్గరే టిఫిన్ చేస్తున్న హోం మంత్రి అనుచరులు అంతా విని.. ఆ పోజ్ని తమ మెదళ్ళలోకి ఎక్స్పోజ్ చేసుకున్నారు.

"ఆ సీక్రెట్ నా దగ్గర చెబితే చెప్పావు గాని ఇంకెవరి దగ్గర చెప్పకు. నీకు అభిమానులు ఎంతమంది వుంటారో, శత్రువులు అంతకి ఎక్కువమందే వుంటారు" చెప్పాడు అభిశాంత్.

మరో గంటకల్లా ధర్మంని కిడ్నాప్ చేసారా యమకింకరులు.

శరీరం గడ్డకట్టించే మంచు నీరున్న చెక్క పీపాలో అతణ్ణి చెరో రెక్కా పట్టుకుని ముంచి తేలుస్తున్నారు... ఇద్దరు యమకింకరులు.

"అయ్యబాబోయ్. నాకేం తెలీదు. నన్ను వదిలేయండి బాబోయ్. యమకింకరులారా! నన్ను హింస పెట్టకండి నాయనోయ్" నిలువెల్లా వణికిపోతూ గగ్గోలు పెడుతున్నాడు ధర్మం.

"ఇదేం హింస. అబద్ధం చెబితే ఇంతకంటే నరకాన్ని చూపిస్తాం" వస్తాదులా వున్న ఓ గుండుగాడు అన్నాడు.

"నేను అబద్ధమే చెప్పానురా గుండు"

"ఆయ్..." కయ్యిమన్నాడు గుండుగాడు.

"క్షమించు, గొప్పలకి పోయి బుద్ధి లేక అలా చెప్పాను.. మీ చేతుల్లో తన్నులు తినడానికి. నేను నిజంగా అగ్నివేష్‌ని కాదు"

"ఇంకా తన్నండే!... తన్నండ్రా" అరిచాడు గుండుగాడు.

పీపాలోంచి బయటికి తీసి అతణ్ణి దూది ఏకినట్టు ఏకేసి వదిలారు. పీలికలైన బట్టలతో, కవుకు దెబ్బలతో కింద కూర్చుండిపోయాడు ధర్మం.

"ఇప్పటికయినా నిజం చెబుతావా? చెప్పవా?"

"ఇదెక్కడి బేవార్స్ బేరంరా బాబూ..."

"మాటలు తిన్నగా రానియ్... నిజం చెప్పు"

"చావు దెబ్బలు తినేసి కూడ అబద్ధం చెప్పగలగడానికి నాదేమైనా నెల్లూరి కాంతారావులాంటి శాల్తీయా ఏమన్నానా. నా మాట నమ్మండ్రా బాబూ" అంటూ ఇంకా తంతారేమోనని స్పృహ కోల్పోయినట్లు నటించి పక్కకి పడిపోయాడు ధర్మం.

"వీడు అగ్నివేష్ కాదనుకుంటాను" అని గుండుగాడు అంటున్న సమయానికి అక్కడికి మరొకడు వచ్చాడు "బాస్ ఇప్పుడే ఫోన్ చేసారు. గతంలో అవినాష్ అనే జర్నలిస్ట్‌ని చంపాం కదా! వాడికి ప్రాణమిత్రుడు అభిశాంత్ అనే జర్నలిస్ట్ అని తెలిసి వాణ్ణి బాస్ అనుమానిస్తున్నారట. ఆ అభిశాంత్‌ని కిడ్నాప్ చేసి, వేరే ఇంట్లో బంధించి వుంచమన్నారు బాస్. వారం రోజుల్లో అగ్నివేష్ పేరు మీద వార్తా పత్రికల్లో కొత్త వార్తలు వస్తే అతడ్ని విడిచి పెట్టేయమన్నారు. అలా రాని పక్షంలో వాడ్ని అగ్నివేష్‌గా భావించి చంపేయ మన్నారు.. మన బాస్"

అదంతా వినేసాడు ధర్మం.

ఆ వెంటనే వాళ్ళంతా ఓ జీపులో బయలుదేరారు. ధర్మాన్ని ఓ కుప్పతొట్టి పక్కన పారవేసి ముందుకు దూసుకుపోయింది జీపు.

ఒళ్లంతా నొప్పులుగా వున్నాసరే అతికష్టం మీద లేచి నిలబడి ఆటోలో ఇంటికి చేరి ఆ వెంటనే ఆ రహస్యాన్ని మేఘన చెవిలో వూదేశాడు.

కాని అప్పటికే ప్రతికాఫీసు నుంచి వస్తున్న అభిశాంత్‌ని వాళ్ళు కిడ్నాప్ చేశారు. అతడా రాత్రికి రాకపోయేసరికి ఆ విషయాన్ని గ్రహించిన మేఘన వాళ్ళతణ్ణి ఎక్కడ బంధిస్తారో తెలియదు కనుక ఆ రోజే కొత్త వార్తలు సేకరించడం ద్వారా అతణ్ణి రక్షించాలని నిశ్చయించుకుంది.

అనుకున్నది అనుకున్నట్టు జరిగి వుంటే ఆ రాత్రికే ఆమె మాఫియా పునాదులు లేపేసేది!

* * *

ఆ రాత్రి కొత్త వార్తలు సేకరించాలని బుల్లెట్ మీద బయలుదేరిన ఆమెకి చార్మినార్ చౌరస్తా దగ్గర తనను దాటి దూసుకుపోతున్న ఓ కారులోంచి కేకలు వినిపించేసరికి బుల్లెట్‌ని రివర్స్ చేసి ఆ కారుని నీడలా వెంబడించింది మేఘన.

అరగంట తర్వాత ఓ అరటి తోపు వెనకున్న గెస్ట్‌హౌస్ దగ్గర ఆగిందా కారు. ఆ కారులోంచి ఓ పడుచుపిల్లని బయటికీడ్చి గెస్ట్‌హౌస్‌లోకి లాక్కు పోతున్నారు ఇద్దరు దున్నపోతుల్లాంటి మనుషులు.

ఆ క్షణంలోనే ఆమె దవడ కండరం పొంగింది. పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

బుల్లెట్ స్టాండ్ వేసి అక్కడ వున్న దుంగల్లో ఓ లావుపాటి దుంగనందుకుని గుమ్మం బయట గోడ చాటున నిలబడిందామె.

పడుచుపిల్లని లోపల అప్పగించి బయటికి వచ్చారా ఇద్దరు దున్నపోతులు.

ఊహాతీతమైన వేగంతో కదిలిందామె.

ఆ దుంగతో ఒకడి తలమీద బలంగా మోదింది. వాడు కింద పడేలోగా రెండోవాడు ప్రతిఘటించకుండా కాలు విసిరింది. కెవ్వున అరచి తొడల దగ్గర నొక్కుకున్నాడు రెండోవాడు.

మరుక్షణం దుంగతో రెండోవాడి చెంప పగలగొట్టింది.

ఆ ఇద్దరు స్పృహ కోల్పోయారు.

ఆ వెనుకే లోపలికి పరుగెత్తింది ఆమె.

గింజుకుంటున్న ఆ పడుచుపిల్లని మంచంమీదకి తోసి బలవంతంగా ఆమెను చెరచాలని చూస్తున్నాడు ఎమ్మెల్యే వరాహరావు.

అప్పటికే తన మెళ్ళోని కెమెరాతో నాలుగైదు స్నేప్‌లు లాగేసిన మేఘన క్షణం ఆలస్యం చెయ్యకుండా బూటుకాలుతో అతడి నడుం మీద తన్నింది.

పందిలా అరుస్తూ మంచం మీంచి ఎగిరి కింద పడ్డాడు. వరాహరావు. ఆ వెంటనే దుంగతో అతడి ఒళ్ళు హూనం అయ్యేలా బాది, స్పృహ పోగొట్టిందామె.

మరుక్షణం ఆ పడుచుపిల్ల స్టేట్‌మెంట్‌ని తీసుకుని ఆమెని ఆమె ఇంటి దగ్గర దింపి, బుల్లెట్‌ని ముందుకు దూకించింది మేఘన. ఫెల్ట్‌హేట్‌తో మగ దుస్తుల్లో గొంతుమార్చి మాట్లాడిన ఆమెని మగాడనే అనుకుందా పడుచుపిల్ల.

* * *

జోగారావ్ చెప్పిన స్పాట్‌కి వచ్చారు ఓ అరడజను మంది యమకింకరులు ఓ ఖాళీ బ్రీఫ్‌కేస్‌తో.

నిర్మానుష్య ప్రదేశం అది.

సమయం రాత్రి తొమ్మిదిగంటలు కావస్తోంది.

చుట్టూ వెతికి ఓ చెట్టు వెనక దాగిన జోగారావ్‌ని ఇవతలకి లాగారు వాళ్ళు. ఆ వెంటనే తన సత్తా చూపిస్తూ వాళ్ళతో కలియబడ్డాడు అతడు. రివాల్వర్ తీసే వీలుకూడ లేదు.

కొంతసేపు తీవ్రంగా పోరాడి వాళ్ళకి చిక్కిపోయాడు జోగారావు. ఆరుగురి పిస్టల్స్ తన గుండెలకే గురి చూస్తుండేసరికి కదలకుండా అలాగే చూస్తూ నిలబడిపోయాడు అతడు.

"నువ్వు చెప్పిన స్పాట్‌లోనే నీ గుండెలకి మార్క్ పెట్టమని మా బాస్

చెప్పాడు” ఓ యమకింకరుడన్నాడు.

“సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ని చంపితే చాలా పెద్దకేసు అవుతుంది” అన్నాడు జోగారావ్.

పకపకా విరగబడి నవ్వారు వాళ్ళు.

“మా బాస్ హోం మంత్రిగా ఉన్నంత వరకు ఏ కేసులు, ఏ చట్టాలు మమ్మల్నేమీ చెయ్యలేవురా పిచ్చి సర్కిలూ. నిముషం టైమిస్తున్నాము. నీ ఇష్టదైవాన్ని తలచుకో”

తను వస్తున్న దారిలో బుల్లెట్ ఆగిపోయేసరికి పెట్రోలు అందించే రబ్బరు కనెక్షన్ సరిచేసి పైకి లేచిన మేఘనకు గాలి వాటున మాటలు వినిపించేసరికి అనుమానంతో అటు కదిలిందామె నిశ్శబ్దంగా.

ఆమె రావటం క్షణమాలస్యమైనా జోగారావ్‌ని వాళ్ళు చంపేసేవాళ్ళే!

వాళ్ళ వెనక వైపున్న మేఘన, ఆ వెంటనే పాంటు జేబులోంచి పిస్టల్ తీసి వాళ్ళకి గురి పెడుతూ ఉరుములా గర్జించింది “హేండ్సప్” అంటూ.

ఒక రౌండ్ గాలిలో పేల్చి మరీ హెచ్చరించింది.

దిగ్గున చేతులెత్తేశారంతా.

“డ్రాప్ యువర్ పిస్టల్స్...”

పిస్టల్స్ వదిలేశారు వాళ్ళు

“కనురెప్ప కదిలినా కాల్చి పారేస్తాను, జాగ్రత్త” మరోసారి హెచ్చరించి “మిస్టర్ జోగారావ్, కమాన్” అంది వెన్నెల వెలుగులో అతణ్ణి గుర్తించిన మేఘన.

“వాళ్ళని దేనితోనైనా కట్టి వచ్చేయ్”

వాళ్లు వచ్చిన కారు డిక్కీలో తాడు కనిపించేసరికి ఆ తాడుతో వాళ్ళందరినీ కట్టి పడేశాడు అతడు.

“నేను మీకు తెలుసా మిస్టర్” ఆమెను మిస్టర్‌గా భావించి ఆమెతో పాటు నడుస్తూ అన్నాడు జోగారావ్.

“తెలుసు, అసలేం జరిగింది”

"ప్రాణదాతతో అబద్ధం చెప్పకూడదంటారు" అంటూ నిజాన్ని నిజాయితీగా చెప్పేశాడు అతడు.

"అయితే మీరిప్పుడు చాలా ప్రమాదంలో వున్నారు. రాజరాజ నరేంద్రుడు మిమ్మల్ని కాటు వెయ్యాలనే శతవిధాల ప్రయత్నిస్తాడు"

"అవును! ఇప్పుడేం చెయ్యాలో నాకు పాలుపోవడం లేదు" చేతులు నలుపుకుంటూ గాబరాగా అన్నాడు జోగారావ్.

"మా ఇంటికి రండి. హెూం మంత్రి కళ్ళబడకుండా మిమ్మల్ని కాపాడే పూచీ నాది" ఆమె కొట్టిన ఒక్క కిక్‌కే స్టార్టయింది బుల్లెట్.

అతడు ఆశ్చర్యం నుంచి తేరుకోకముందే వెనుక ఎక్కించుకుని బుల్లెట్‌ని రాకెట్‌లా ముందుకి దూకించింది.

జోగారావ్ ఇంకా భోజనం చెయ్యలేదని గ్రహించిన మేఘన అతడికి భోజనం వడ్డించింది. ఆమె స్త్రీ అని గ్రహించిన జోగారావ్ అప్రతిభుడయ్యాడు.

భోం చేసి ఆమె తనకు కేటాయించిన గదిలో పడుకున్నాడు అతడు.

తను సంపాదించిన న్యూస్ ఐటమ్‌ని రాయటం పూర్తి చేసి, అభిశాంత్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డార్క్‌రూంలో తను వరాహరావుని తీసిన ఫోటోలు డెవలప్ చేసి చూసింది మేఘన. ఆ ఫోటోలు చాలా బాగా వచ్చాయి.

వెంటనే ఆ న్యూస్‌ని, ఆ ఫోటోలని పట్టుకుని బయలుదేరిందామె.

సమయం రాత్రి 10-30 గంటలు.

పబ్లిక్ టెలిఫోన్ బూత్ నుంచి ఫోన్ చేసి, నిద్రపోతున్న సమరశంఖం పత్రికా ఎడిటర్‌ని లేపేసి, తాజా వార్తలతో తను వస్తున్నట్లు చెప్పి గేట్ దగ్గర వెయిట్ చెయ్యమని చెప్పింది.

మరో రెండు నిముషాలకి బుల్లెట్ మీద దూసుకువచ్చిన మేఘన సడెన్ బ్రేక్ వేసి, తన ఇంటిగేటు దగ్గరున్న ఎడిటర్ చేతిలో ఓ పేకెట్ పెట్టి క్షణం ఆగక వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది.

ఆ వెంటనే ఆ న్యూస్‌ని తనే స్వయంగా పత్రికాఫీసుకి పట్టుకెళ్ళి ఫోటో

టైప్ మెషిన్ ద్వారా కంపోజింగ్ చేయించేశాడు ఎడిటర్.

* * *

'అబలపై అత్యాచారం చేయబోయిన 'ఎక్స్' పార్టీ ఎంఎల్ఎ వరాహరావు గుట్టు రట్టు' అనే హెడ్డింగుతో అగ్నివేష్ పేరుతో సమరశంఖం దినపత్రికలో వార్త వచ్చేసింది ఫోటోలతో సహా.

'అత్యాచారం జరగకముందే అత్యంత సాహసంతో రాజకీయ రాబందు వరాహరావు చేతుల్లోంచి అబలను రక్షించిన ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టు మిస్టర్ అగ్నివేష్' అనే హెడ్డింగుతో మరో వార్త కూడ ప్రచురింపబడింది. ఆ వార్త రాసింది ఎడిటర్ అని గ్రహించింది మేఘన.

మరో వార్త చదివి ఆ పత్రికని జోగారావ్‌కి అందించిందామె.

'ఇంటెలిజెన్స్ డిపార్టుమెంటుకి సంబంధించిన కొన్ని కీలకమయిన రహస్య పత్రాలతో పరారీలో వున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జోగారావ్ సస్పెండ్ చేయబడిన వైనం' అని వున్న వార్త చదివి పళ్ళు పటపట కొరికాడు అతడు. ఏమీ చెయ్యలేక ఆవేదనగా తలపట్టుకుని, నిస్పృహగా తల విదిల్చాడు.

చేసిన పాపాలకు అతడు పశ్చాత్తాపంతో బాధపడుతున్నాడని గ్రహించిన మేఘన తానెవరో, తన ఆశయం ఏమిటో వివరించింది.

విభ్రమంగా చాలాసేపటి వరకు ఆమెవైపే చూస్తూ వుండిపోయాడు అతడు.

"నువ్వా మేఘనా!..నిన్ను చంపాలని చూసిన నన్ను ఎలా రక్షించగలిగావు. మొన్నటివరకు కూడ డబ్బు కోసం నిన్ను చంపాలనే క్షుద్రమైన కోరికతో వున్న నన్నెలా రక్షించగలిగావు మేఘనా?...."

"ఆపదలో వున్న శత్రువునయినా సరే రక్షించాలనే నీతి సూత్రాన్ని ప్రేమించేదాన్ని కనుక మిమ్మల్ని రక్షించగలిగాను"

అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి "నా కళ్ళు తెరిపించావు మేఘనా!... నీ ఆశయ సాధనలో నా పూర్తి సహకారం నీకందిస్తాను"

హోం మంత్రి అనుచరులు విడిచిపెట్టడం వల్ల మధ్యాహ్నా సమయం కల్లా అభిశాంత్ రావడంతో జోగారావ్‌ని స్టోర్‌రూంలో దాచింది మేఘన.

ఆ రాత్రి తొమ్మిది గంటలకల్లా ఇన్‌వెస్టిగేషన్ కోసం బయటికి వెళ్లిపోయాడు అభిశాంత్. అతడు వచ్చేసరికి తెల్లవారుఝాము అవుతుంది. అప్పటికి మాఫియా మూలస్తంభం కదిలిపోతుందని గ్రహించి తానెక్కడికి వెళ్ళేదీ ఓ స్లిప్ రాసిపెట్టింది మేఘన.

# భరత వాక్యం

రహస్య మార్గం తెరచి మాఫియా రాబందుల రాజ్యంలోకి జోగారావ్‌ని తీసుకువెళ్లింది మేఘన.

అతడికి ప్లాన్ మొత్తం ముందే వివరించిందామె.

వాళ్ళు ధరించిన గ్రీన్ కలర్ దుస్తులు కొట్టొచ్చినట్టు కనిపించసాగాయి. గ్రీన్ హేట్‌లని మొహాలమీదకి లాక్కుని నిర్భయంగా ముందుకి కదిలారు వాళ్ళు.

ఎమ్యూనిషన్ రూమ్‌లోంచి టైంబాంబులున్న బేగ్‌ని తస్కరించి మాఫియా సామ్రాజ్యం పునాదులు కదలడానికి ఎక్కడెక్కడ పెట్టాలో అక్కడక్కడ టైమ్‌లు సెట్ చేసి, బాంబులు ఫిక్స్‌చేసింది మేఘన. తర్వాత డ్రగ్స్ తయారయ్యే కర్మాగారాన్ని, మాదక ద్రవ్యాలు స్టోర్ చెయ్యబడిన గోడౌన్స్‌ని మినీ కెమెరాతో ఫోటోలు తీసింది.

ఆమె చెప్పిన పనులు చేసుకువస్తున్న జోగారావ్ కుడికాలు పొరపాటున ఓ మెషీన్‌లో ఇరుక్కుంది. బలంగా లాగి చూశాడు. కాని రావడం లేదు. ఆ మెషీన్‌ని ఎలా ఆపరేట్ చేస్తే తన కాలు బయటపడుతుందో అతడికి తెలియడం లేదు.

తొందరలో వున్న మేఘన తన పని ముగించుకుని "పద వెళదాం" అంది.

తన కాలు ఓ మెషీన్‌లో ఇరుక్కునట్లు తెలియనివ్వకుండా జాగ్రత్త పడుతూ "నువ్వు పద. నీ వెనకే వస్తాను. చిన్న పని మిగిలిపోయింది" అన్నాడు జోగారావ్.

త్వరగా రమ్మని చెప్పి అక్కడి నుంచి కదిలింది మేఘన. తను ప్రమాదంలో ఇరుక్కున్నానని తెలిస్తే ఆమె అక్కడి నుంచి కదలదని అతడికి తెలుసు. అందుకే అలా అబద్ధం చెప్పాడు అతడు.

జోగారావ్ వున్న హాలులో ఆమె ఏర్పాటు చేసిన టైం బాంబు మరో పది నిముషాల్లో పేలిపోతుంది. బ్లాస్టింగ్‌కి నాంది పలికే టైం బాంబు అదే!

పారిపొమ్మని సిగ్నల్ ఇచ్చే డేంజర్ అలారం ఆన్ చేసి పరుగున వెళ్ళి రాజరాజ నరేంద్రుడి రూమ్‌లోకి దూరింది మేఘన.

మరుక్షణం నుంచే ఆ మాఫియా సామ్రాజ్యంలో అల్లకల్లోలం ప్రారంభమైంది. రణగొణ ధ్వనులు చేస్తూ భయాందోళనలతో బయటికి గుంపులుగా పారిపోసాగారు రాజరాజ నరేంద్రుడి అనుచరులు. అక్కడి వాతావరణం కొన్ని నిముషాల వరకు పూర్తిగా మారిపోయి అంతా గందరగోళం అయింది.

ఒక్క మనిషికి కూడ ప్రాణహాని జరగకూడదని మేఘన అభిప్రాయం. కాని అలాంటి కిరాతకుల్ని దయతలచి వదలకూడదని జోగారావ్ నమ్మకం. అందుకే ఆమెకు తెలియకుండా బయట వున్న పెట్రోలు వాహనాన్నింటిలో టైం బాబులు ఏర్పాటుచేశాడు అతడు. వాళ్ళు...ఆ యమకింకరులు పారిపోవడానికి తను డేంజర్ అలారం నొక్కినా ప్రయోజనం లేదని, వేనుల్లో, జీపుల్లో వాళ్ళు రెండు మూడు మైళ్ళ దూరం వెళ్ళే లోపులోనే వాహనాలతో పాటు తునాతునకలై పోతారనే నగ్నసత్యం ఆమెకి తెలీదు.

తన స్పెషల్ రూంలో కూర్చుని డ్రగ్స్ వల్ల తనకొచ్చే కోట్ల ఆదాయాన్ని తీరిగ్గా లెక్కలు వేస్తున్న రాజరాజ నరేంద్రుడు సడెన్‌గా తన రూంలోకి వచ్చిన ఆమెను చూసి తృళ్ళిపడ్డాడు.

తలమీద హేట్ తీసి గిరాటు వేసిందామె. జుట్టు అలల్లా రేగి వెనక్కి వాలింది. ఆమె మొహంలో రుధిర వర్ణం. కళ్ళల్లో ఎర్రని జీరలు.

పిస్టల్ తీసి తన గుండెలకి గురిపెట్టిన ఆమె ప్రళయకాల రుద్రకాళిలా కనిపించేసరికి అదిరిపడి రివాల్వింగ్ చైర్‌లోంచి దిగ్గున లేచాడు రాజరాజ నరేంద్రుడు.

"ఎవరు నువ్వు, ఎలా వచ్చావ్?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు అతడు.

"నువ్వెలా వచ్చావో నేనూ అలాగే వచ్చాను మిస్టర్ రాజరాజ నరేంద్రుడు... ఉరఫ్... కొండప్ప..."

ఉలిక్కిపడ్డాడు అతడు.

"నీ అసలు నామధేయం నాకెలా తెలిసిందా! అని ఆశ్చర్యపోతున్నావా కొండప్పా... గతంలోకి వెళ్ళు...నీ కొడుకు మొదటి భార్య సునంద మా అక్కయ్య. మా అక్కను చంపించి, నీ కొడుక్కి రెండో పెళ్ళి చేశావు. నువ్వు చేసిన పాపం యాక్సిడెంట్ రూపంలో నీ కొడుకుని, కోడల్ని బలి తీసుకుంది"

"సునంద మీ అక్కా! అయితే ఇప్పుడు నా మీద పగ తీర్చుకోవాలని వచ్చావా!"

"నీ మీద పగ తీర్చుకునేలా అయితే ఎప్పుడో నిన్ను చంపేసేదాన్ని మిస్టర్ రాజరాజ నరేంద్రుడు. నువ్వు నా శత్రువని తెలిసిన మరుక్షణం చంపేదాన్ని. క్షుద్రమైన పగ అంతరించి ఉన్నతమైన ఆశయం నాలో ఉద్భవించింది"

"ఏమిటా ఆశయం"

"నీ మాఫియా విషవృక్షాన్ని కూకటివేళ్ళతో సహా పెకిలించాలని"

పకపకా విరగబడి నవ్వాడు రాజరాజ నరేంద్రుడు "అది నీ తరం కాదు"

"దాని సంగతి తర్వాత. ముందు నేనెవరో తెలుసుకో"

"చెప్పావుగా!" వ్యంగ్యంగా నవ్వాడు.

"మరో ముఖ్యమైన విషయం, నువ్వు నమ్మలేని ఓ నిజం చెప్పలేదు. నేను మేఘనని"

ఏదో జ్ఞాపకం వచ్చి అన్నాడతడు "గొంతు అదే! కాని నువ్వు మేఘన కాదు"

"ప్లాస్టిక్ సర్జరీ ద్వారా గుర్తుపట్టలేనంతగా నా మొహాన్ని మార్చుకున్నాను"

"నిజమా!"

"పచ్చినిజం, నువ్వు పన్నిన విషవలయం నుంచి ఈ విధంగా తప్పించుకుని నువ్వు చేసే మారణహోమాలు ఆపడానికి పన్నాగాలు పన్నుతూ వచ్చాను"

"నువ్వేమీ చెయ్యలేవ్"

"నీ మాఫియా రాకెట్ వివరాలు సాక్ష్యాధారాలతో సంపాదించాను. వాటిని అన్ని దినపత్రికలకి పంచుతాను. పత్రికల్లో నీ చరిత్ర చదివి ప్రతిపక్షాలు చెవులు కొరుక్కుంటాయి. అసెంబ్లీలో దుమారం లేపుతాయి. దాంతో నీ కథంతా ముఖ్యమంత్రి వింటారు. చాలా మర్యాదగా ఆయన నీ చేత రాజీనామా చేయిస్తారు"

"నీ రాజకీయ పరిజ్ఞానం నా దగ్గర చూపిస్తావా మిస్ మేఘన, నా మాఫియా సామ్రాజ్యం క్షేమంగా వున్నంత వరకు నన్నెవరూ ఏమీ చెయ్యలేరు"

"పగటి కలలు మానేయ్ మిస్టర్! నువ్వు రోడ్డున పడే రోజు దగ్గర పడింది. నీ భూములన్నీ లేండ్ సీలింగ్ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. ఈ లోగా కేవలం కొద్ది నిముషాల్లో నువ్వు ప్రేమించి, ఆరాధించే మాఫియా సామ్రాజ్యం తునాతునకలు అయిపోతుంది" నవ్విందామె.

సరిగ్గా అదే సమయంలో మొదటి టైం బాంబ్ బ్లాస్ట్ అయింది. గుభిల్లుమనే పెద్ద శబ్ధంతో ఆ నేలమాళిగ కొద్దిగా కంపించింది.

"ఏం చేశావ్?" గాబరాగా అరిచాడు రాజరాజ నరేంద్రుడు.

చెప్పి, విజయగర్వంతో పకపకా నవ్విందామె.

"నిజానికి నిన్ను చంపినా పాపం లేదు. కాని చంపను, నాలోని మానవత్వం నా చేత ఆ అమానుష కార్యం చేయించదు. పారిపో.. పారిపోయి

ప్రాణాలు దక్కించుకో" అంటూ పిస్టల్‌ని వెనక్కి విసిరేసిందామె.

ఆ వెంటనే కోటు జేబులోంచి రివాల్వర్ తీసి, క్రూరంగా నవ్వుతూ ఆమెకి గురిపెట్టాడు అతడు "రాక్షసీ! నా సర్వస్వాన్ని నాశనం చేస్తున్న నిన్ను దయ తలచను. నా చేతుల్లోనే నీ చావు రాసిపెట్టి వుంది"

"నిన్ను చంపలేను కనుక నా ప్రాణం నిజంగానే నీ చేతుల్లో ఉందేమో! నా ఆశయం నెరవేరిందనే విజయ గర్వంతో మరణిస్తాను. చంపగలిగితే చంపు"

ఆమె ధైర్యానికి నివ్వెరపోయినా క్షణంలో తేరుకున్నాడు అతడు. ఉండి ఉండి అతడిలోని రాక్షస ప్రవృత్తి బుసలుకొట్టింది. "చావు' అంటూ ట్రిగ్గర్ నొక్కాడు రాజరాజ నరేంద్రుడు.

అదే క్షణంలో ఆ రూంలోకి దూసుకువచ్చిన శ్రీలేఖ జరగబోతున్న ఘోరాన్ని చూసి మేఘనకి అడ్డుగా దూకుతూ అరిచేసింది. "నో.. డోంట్ షూట్ హర్ డాడీ" అంటూ...

అప్పటికే ఆలస్యమైంది. దూసుకువచ్చిన రివాల్వర్ తూటా శ్రీలేఖ గుండెల్లోకి చేరిపోయింది. ఆ వెంటనే గుండెలు నొక్కుకుంటూ అరవలేక నోరు తెరిచేసి మేఘనతో ఏదో చెప్పాలని, చెప్పలేక ఆరాటపడుతూ ముందుకు వాలిపోయింది శ్రీలేఖ.

"లేఖా" అంటూ బాధగా అరుస్తూ ముందుకు దూకింది మేఘన. సరిగ్గా ఆమె ఒడిలో పడి ప్రాణాలు వదిలేసింది శ్రీలేఖ.

"అమ్మా లేఖా!" అంటూ ఘోరంగా ఏడవసాగాడు రాజరాజ నరేంద్రుడు. "ఎంత పనిచేశావు తల్లీ..."

తన గుండెల్ని ఎవరో పిండుతున్నట్టు విలవిలలాడిపోయింది మేఘన. తన నేస్తం శ్రీలేఖ తనకిక లేదనే భావం ఆమె నరనరాలనీ మెలిపెడుతోంది. ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

.......... ఆ రాత్రి సమయంలో మేఘన దగ్గరికి వచ్చిన శ్రీలేఖ... ఆమె, జోగారావ్ కలసి ఎక్కడికో వెళుతుండటం చూసి వాళ్ళని వెంబడించి అక్కడికి

వచ్చింది.

దురదృష్టం ఆమెని ఆ విధంగా బలి తీసుకుంది.

కళ్ళు తుడుచుకుంటూ పైకి లేచి బిగ్గరగా అరిచింది మేఘన. "ఏం సాధించావ్ మిష్టర్ రాజరాజ నరేంద్రుడు. మాఫియా సామ్రాజ్యాన్ని సృష్టించి వేల మంది ఉసురు పోసుకుని మిగిలి వున్న ఆ ఒక్క వంశవృక్షాన్ని కూల్చు కోవడం తప్ప నువ్వేం సాధించావ్" ఆమె అరుపు మేఘ గర్జనలా ఆ గదిలో ప్రతిధ్వనించింది.

'నే నెవరికోసం బ్రతకాలి' కూతురు చావుతో బాగా కృంగిపోయిన అతడిలో నిద్రావస్థలో వున్న నరరూప రాక్షసుడు నిద్ర మేల్కొన్నాడు. ఆ వెంటనే ఉగ్రనేత్రుడిలా చూసి భయంకరంగా అరిచాడు రాజరాజ నరేంద్రుడు.

"నా కూతురు చావుతో నేను చచ్చినవాడికిందే లెక్క. కాని... నా శ్రీలేఖ చావుకి కారణమైన నిన్ను చంపి, నేనూ చస్తాను" ట్రిగ్గర్ మీద వేలు బిగించాడు అతడు.

హేమర్ వెనక్కి వచ్చింది. ఆ క్షణంలోనే రివాల్వర్ సిలెండర్ క్లాక్ వైజ్ డైరెక్షన్‌లో తిరిగింది. చాంబర్‌లోని బుల్లెట్ మేఘన గుండెల్ని చీల్చడానికి తహతహలాడుతూ ఎదురు చూస్తోంది. రివాల్వర్‌లోని ఫైరింగ్ పిన్ కాస్త కదిలితే చాలు, బుల్లెట్ తన పని తాను చేసుకుపోతుంది. రాజరాజ నరేంద్రుడి వేలు ట్రిగ్గర్‌ని మరి కాస్త అదిమితే చాలు, ఫైరింగ్ పిన్ కదులుతుంది నిశ్శబ్దంగా.

చావు బ్రతుకుల మధ్య వ్యవధి కేవలం అర క్షణం మాత్రమే!

ఆఖరి క్షణాన్ని తలచుకుంటూ కళ్ళు మూసుకుంది మేఘన.

'ఢాం...' మని పేలింది రివాల్వర్.

క్షణాలు గడుస్తున్నా తనకేమీ కాకపోయేసరికి ఆశ్చర్యంగా కళ్ళు తెరిచింది మేఘన.

ఎదురుగా వెల్లకిలా పడి వున్న రాజరాజ నరేంద్రుడు. అతడి నుదుటి మీద, కనుపాపల మధ్య పావలా కాసంత రంధ్రం! ఆ రంధ్రంలోంచి మొహం

మీదకి కారుతున్న రక్తం!

తెరచి వున్న కనుగుడ్లతో హోం మంత్రి రాజరాజ నరేంద్రుడి మొహం భయవిహ్వలంగా వుంది.

పక్కకి తిరిగి దిగ్భ్రమగా చూసింది ఆమె.

ఆరడుగుల దూరంలో వంటినిండా గాయాలతో, పేలికలైన దుస్తులతో, మాంసపు ముద్దలా తయారైన శరీరంతో కిందకి వాలి వున్న జోగారావ్. అతడి కుడి కాలు సగానికి పైగా తెగిపోయి రక్తం ఓడుతోంది.

అతడి చేతిలో ఇంకా పొగలు కక్కుతున్న సర్వీస్ రివాల్వర్.

"ఏం జరిగింది?" ఆతృతగా ముందుకు వచ్చింది మేఘన.

"జరగవలసిందే జరిగింది మిస్ మేఘనా! నా చావు ఇక్కడే రాసిపెట్టి వుంది. నేను చేసిన పాపాలకు నా ప్రాణాల్ని పెనాల్టీగా చెల్లిస్తున్నాను. కాని నేను బాధపడటం లేదు. ఎందుకంటే పవిత్రమైన నీ ఆశయసాధనలో పాత్రధారిని కాగలిగననే దివ్యమైన ఆనందాన్ని నేను పొందగలగలడమే! ఆ ఆనందంలో వున్న ఆత్మసంతృప్తి మరెందులోనూ లేదు. సమాజ సేవకోసం పాటుపడే నీలాటి మంచిమనిషి చావకూడదు. అందుకే ఆ దేశద్రోహిని చంపేశాను. నన్ను క్షమించు. నిన్ను రక్షించుకోడానికి మరో మార్గం కనిపించలేదు. అందుకే వాణ్ని చంపేశాను. ఓ జాతిరత్నాన్ని రక్షించగలిగానన్న ఆనందం, ఆత్మ సంతృప్తి నాకీ జన్మకి చాలు"

ఆమె హృదయంలో నిండిన ఆవేదన ఆమె కళ్లకు నీటిపొరలు కప్పింది. మసక మసకగా కనిపిస్తున్నాడు అతడు.

అతడి పక్కన మోకాళ్ళమీద కూర్చుంది మేఘన. ఆరిపోయే దీపానికి ప్రతిరూపంలా ఉన్నాడతడు.

అదే క్షణంలో రెండో బాంబు బద్ధలైంది. మరోసారి ఆ అండర్‌గ్రౌండ్ మొత్తం చలిజ్వరం వచ్చినట్టు వణికిపోయింది.

"వెళ్ళు మేఘన వెళ్లు. నువ్వు చెప్పిన నాందీ ప్రస్థావనలు జరిగిపోయాయి.

మాఫియాకి భరతవాక్యం పలికే సమయం ఆసన్నమైంది. త్వరగా వెళ్ళి నీ ప్రాణాన్ని రక్షించుకో" మాట్లాడలేక మాట్లాడుతున్నాడు అతడు. అతడి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. మొహంలో బాధ ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

"ఈ పరిస్థితిలో మిమ్మల్ని వదిలి వెళ్ళడానికి నా మనసు అంగీకరించటం లేదు" ఆమె కళ్ళు వర్షిస్తున్నాయి.

"యూ ఫూల్...నేను బ్రతికేది కేవలం కొన్ని క్షణాలు... త్వరగా వెళ్ళు... నేను బ్రతకను... నీ ప్రాణం కాపాడుకో..."

ఆమె జవాబు చెప్పలేదు.

ఆమెవైపు క్షణం చూసి "ఆడదానివి... స్త్రీమూర్తివి...భరతమాతవి అనిపించుకున్నావ్ మేఘనా" అంటూన్న అతడికి ఏదో జ్ఞాపకం వచ్చి తన మెడలోని ఒంటిపేట బంగారు గొలుసు తీసి ఆమె చేతిలో పెట్టాడు జోగారావ్.

రాజరాజ నరేంద్రుడి గెస్ట్‌హౌస్‌లో మేఘనను మొట్టమొదటిసారిగా దెబ్బతీసినప్పుడు ఆమె మెడలోంచి అతడు తస్కరించిన గొలుసు అది.

అతడి మాటలు అతికష్టం మీద వస్తున్నాయి "నేను దొంగిలించిన నీ గొలుసు నీకు ఇవ్వడంలో కూడ ఎంతో ఆనందం, మరెంతో ఆత్మసంతృప్తి వుంది చెల్లీ"

అతడి నోరు అలాగే తెరుచుకుని వుండిపోయింది.

కళ్లు చూస్తూనే వున్నాయి ఆర్తిగా, కాని ఆ కళ్ళల్లో జీవం లేదు.

ఆమె కళ్ళు వర్షిస్తూనే వున్నాయి.

జోగారావ్‌ని చివరిసారిగా చూసి అతడి కనురెప్పలు మూసి మెల్లగా పైకి లేచింది మేఘన.

ఓ క్షణం శ్రీలేఖని చూసి దుఃఖభారంతో మౌనంగా అక్కడి నుంచి కదిలిందామె.

భూనభోంతరాలు దద్దరిల్లినట్లు ఒకదాని తర్వాత ఒకటిగా భయంకర విస్ఫోటనాలు చెలరేగుతున్నాయి.

మంటలు విజృంభిస్తున్నాయి.

మాదకద్రవ్యాలు తగలడుతున్నాయి.

అత్యాధునిక యంత్రాలు ఛిద్రం అవుతున్నాయి.

మాఫియా సామ్రాజ్యం పునాదులు కదులుతున్నాయి.

ప్రళయకాల ప్రభంజనమువలె భీకర భీషణ నాదాలతో మాదకద్రవ్యాల మత్తుఘోష ప్రజ్వరిల్లుతోంది.

భూకంపం వచ్చినట్టు ఒక్కసారిగా చలించిపోయింది మాఫియా సామ్రాజ్యం.

శిథిలమైన విఘ్నేశ్వర ఆలయం నేలమాళిగలోకి కూలిపోతుండటం దూరం నుంచి చూస్తూనే వుంది మేఘన.

కొంత సేపటికి విఘ్నేశ్వరాలయం మాయమై ఆ స్థానంలో విశాలమైన హోమగుండం తీవ్రంగా జ్వలిస్తోంది. మంటలు బయటికి దూకాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

ఆ అర్థరాత్రి సమయంలో ఆ ప్రాంతమంతా పట్టపగలులా మారిపోయింది.

విజృంభిస్తున్న ఆ మంటల్లో ఆమెకి మాదకద్రవ్యాల మత్తుకి బానిసలై... తెలిసి తెలిసీ ప్రాణాలు కోల్పోయిన అభాగ్యులైన యువతీ యువకులు కనిపిస్తున్నారు.

చితి మంటలకు ఆహుతి అయిన తన ప్రాణ స్నేహితురాలు పవిత్ర కూడ కనిపిస్తోంది.

మాఫియా విష వృక్షం కూకటివేళ్ళతో సహా పెకలించబడి భస్మీపటలం అయిపోయింది.

కొత్త వార్తలు సేకరించి ఇంటికి వచ్చిన అభిశాంత్. మేఘన పెట్టిన స్లిప్ చూసి ఆగమేఘాల మీద అక్కడికి వచ్చేశాడు.

వందగజాల దూరంలో ఒకవైపు జరుగుతున్న భస్మీపటలాన్ని, మరోవైపు లావానలంలా పొంగుతున్న జ్వాలల్ని చూస్తున్న ఆమెని విభ్రమంగా చూస్తున్నాడు

అతడు. కదలకుండా అలాగే నిలబడిపోయాడు. కొంతసేపటి తర్వాత అతణ్ని గమనించింది ఆమె.

ఆ వెంటనే ముందుకు కదలి విజయగర్వంతో అతడి వైపు అడుగులు వేసింది మేఘన.

సమరశంఖం పత్రికాఫీసులో అభిశాంత్ తన క్యాబిన్‌లో కూర్చుని సీరియస్‌గా పని చేసుకుంటున్నాడు.

సరిగ్గా అదే సమయంలో జీన్‌పాంటు, టీ షర్ట్ ధరించిన ఓ అందమైన అమ్మాయి అతడికి ఎదురుగా వచ్చి నిలిచింది.

చప్పుడుకి తలపైకెత్తి చూసి "ఎవరు మీరు?" అని ప్రశ్నించాడు అతడు.

"ఉద్యోగ ప్రయత్నంలో వచ్చానండి. ఎప్పటికైనా సరే జర్నలిస్టుని కావాలనేది నా కల!"

"మంచిది...దానికి నేనేం చేయగలను?" తన చేతిలోని పెన్నుని తమాషాగా తిప్పుతూ అన్నాడు అభిశాంత్.

"మీరు రికమెండ్ చేస్తే నాకు ఉద్యోగం తప్పక వస్తుంది సార్" నమ్రతగా అడిగిందా సుందరి.

"మీరు ఎవరో, ఏమిటో, ఎక్కడినుంచి వచ్చారో... అదేమీ తెలియకుండా నేనెలా రికమెండ్ చేయగలను?" ఎదురు ప్రశ్నించాడు అతడు.

"అంతమాట అనకండి సార్...నేనెవరో మీకు బాగా తెలుసు. నా ముఖం చూసి, గుర్తు చేసుకోవడానికి ప్రయత్నించండి...ప్లీజ్!"

"అంతగా ఏమీ గుర్తురావడంలేదే... ఇలాంటి మొహాలు ఎక్కడికక్కడ వందలకొద్దీ కనిపిస్తాయి" అన్నాడతడు వెటకారంగా.

ఆమెకి ఒళ్ళు మండిపోయింది. ఎంత కోపం వచ్చిందంటే, పేపర్ వెయిట్ తీసి అతడి బుర్రమీద కొట్టాలనిపించింది.

ఏదో అనుమానం వచ్చి అభిశాంత్ పేపర్ వెయిట్ తీసి దూరంగా పెట్టాడు.

అది చూసి ముత్యాలు రాలిపడ్డట్టు అందంగా నవ్విందామె.

"ఇంతకీ మీ పేరేమిటి?" చిరునవ్వు నవ్వుతూ అతడు అడిగాడు.

"నాపేరు చంద్రలేఖ!" అంటూ నవ్వింది మేఘన. "ఇప్పటినుంచి ఇదే నా కొత్త ఐడెంటిటీ..."

"చంద్రలేఖ...మీ పేరు బావుంది. పదండి మా బాస్‌ని కలుద్దాం...! ఆ తర్వాత మీ అదృష్టం!" అంటూ మర్యాదపూర్వకంగా సీట్లోంచి లేచి నిలబడిన అభిశాంత్ నవ్వుతూ ఆమెకి కన్నుగీటాడు.

**(అయిపోయింది)**


చీకటి సామ్రాజ్యానికి రారాజు అతడు
మానవత్వాన్ని మంటగలిపి
పైకెదిగిన రాజకీయ రాబందు
అతని లోగుట్టు
ఆ అమ్మాయికి తెలిసిపోయింది
ఆ క్షణం నుంచి
ఆమె ప్రమాదంలో పడింది
చావో బ్రతుకో తేల్చుకోవడానికి
మృత్యుగహ్వరంలోకి చొరబడింది!
తిరిగి ఆమె క్షేమంగా వచ్చిందా?
రాబందుల రాజ్యం
డ్రగ్స్ రాకెట్ మీద
సంధించి విడిచిన
అడపా చిరంజీవి నవలాస్త్రం!